ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2013 Q2 ఏప్రిల్ – జూన్ ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


‘అడ్డ’ంగా దోచి పెట్టడం యిదే కాబోలు....
జెండా పీకేయాలా..?
పాకిస్తాన్‌లో షియాల వ్యథ
ఒంటరి పోరాటం తెరాస ఒంటికి మంచిదేనా?
ఫ్లెక్సీలు – ఫ్లెక్సిబిలిటీలు
సహారా టౌన్‌షిప్స్ యిక ఎడారులేనా?
సి – ఓటరు సర్వే
పిబి శ్రీనివాస్
నితీశ్ రాజనీతి
ప్రాంతీయ పార్టీల పాట్లు
అలా వెనక్కి పోయాను...
ఎన్టీయార్ విగ్రహావిష్కరణ
కిరణ్‌కు కలిసి వచ్చిన కర్ణాటక
తృణమూలాలు కదిలిస్తున్న చిట్ ఫండ్స్
వరదలో కొట్టుకుపోయిన కడియం
2014లో చిరంజీవి సిఎం అభ్యర్థి..?
వందనము రఘునందనా..!
చైనావాళ్లు యిక విలన్లు కారు...
మూడో ఫ్రంటా? ఎన్‌డిఏనా?
చెరసాలలో ఒక ఏడు..
పంచపాండవులంటే మంచం కోళ్లల్లా...
మరో వెయ్యి ఏనుగుల బలం...
శల్యులకు శాల్యూట్ చెప్పేస్తున్నారు
నాగం ఎత్తుకున్న రాగం
కులాంతర వివాహాల బూచితో ఓట్లవేట
ఈ రకం ఆత్మహత్యలు అస్సలొద్దు...
నమో నామజపం
వయసుతో పని ఏముంది?
మంత్రాలయం చింతకాయలు రాల్చవచ్చు...
ఇద్దరూ చెరో మెట్టూ దిగారు...
సెల్ నుండి సెల్ ద్వారా ప్రచారం ...
అల్లుడా మజాకా అనిపించిన గురునాథ్
అజిత్ జోగికి నష్టం – కాంగ్రెసుకు లాభం
గురి తప్పుతూన్న సైన్యం
మమతాకు బిజెపి చేసిన సాయం

**మ్యారేజి రిజిస్టర్ చేసుకుంటే చాలా?**
**ఈస్ట్ ఆర్ వెస్ట్ – ఉమన్ ఈజ్ బెస్ట్**
**విదేశీ విద్యార్థులతో కాలేజీ కలహాలు**
**దేనికి సంకేతం?**
**అతని రక్తంలోనే వీరత్వం వుంది...**
**ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా విద్యాబాలన్ వేస్తున్నట్లా? లేదా?...**
**ఆర్థిక కష్టాల కడలి...**
**విస్తరిస్తున్న విదేశీ మార్కెట్**
**పాత వెర్సస్ కొత్త...**
**బెంగాల్‌లో దళిత కోణం**
**అదరగొట్టిన చంద్రబాబు**
**ఇదీ మన పార్టీల చిత్తశుద్ధి...**

**ఏప్రిల్ 01 వీక్లీకై** **ఎమ్బీయస్ : 'అడ్డ'ంగా దోచి పెట్టడం యిదే కాబోలు.....**

ఓ పేటలో పనీ పాటా లేని కుర్రాళ్లు ఓ చిన్న గదిలాటి చోట చేరి, టీలు తాగుతూ, సిగరెట్లు తాగుతూ, పేకో, కారమ్సో ఆడుతూ, టీవీలో క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ, అటువైపు వచ్చినవాళ్లని, తమకు నీతిబోధలు చేసేవాళ్లనీ ఆటపట్టిస్తూ వుండడం తరచుగా చూస్తూ వుంటాం. వీటిని 'అడ్డా' అంటూ వుంటారు. ఏ టెన్తో క్లాసో, ఇంటరో తప్పి, ఉద్యోగం దొరక్క, దొరికినది చేయడానికి యిష్టపడక, కష్టపడడానికి ఒళ్లు వంగక, యింట్లో వుంటే చివాట్లు తినాల్సి వస్తుందని, తిండికి మాత్రం యింటికి వెళుతూ, తక్కినవేళంతా యిక్కడే గడుపుతూ, రాత్రి బాగా పొద్దుపోయేక యింటికి చేరుతూ వుంటారు. వీళ్లు తమ అభిమాన హీరోల గురించో, రాజకీయాల గురించో, క్రికెట్ గురించో తమ స్నేహితులతోనే వాదోపవాదాలకు దిగుతూ, తన్నుకుంటూ, అంతలోనే కలిసిపోతూ, అదే పేటలో వుండే యింకో అడ్డాలో వాళ్లతో పేచీలకు దిగుతూ వుంటారు.

తిండి యింట్లో విదిలిస్తారు, మరి పై ఖర్చులకు ఎలా? ఏదైనా పండగ వస్తే చాలు వీళ్లు చందా సేకరణకు దిగుతారు. పదిపదిహేనుమంది ఒకేసారి కాలనీలో కొంపల మీద పడి, మొదట కాస్త మెత్తగా అడిగి, యిచ్చినది చాల్లేదంటూ కేకలు పెట్టి, గొడవ చేసి, విసిగించి, పెద్దమొత్తాల్లో పట్టుకుపోతారు. వచ్చిన చందాల్లో కొంత పందిళ్లకు ఖర్చుపెట్టి, మిగిలినదానితో మందు కొట్టేసి ఎంజాయ్ చేస్తారు. పండగేదీ లేకపోతే స్పోర్ట్స్ టూర్నమెంటు అంటూ చందాలకు తయారవుతారు. వీళ్లలో అసాంఘిక చర్యలకు పాల్పడేవాళ్లు కొద్దిమందే వుంటారు కానీ మొత్తం మీద ఒక రౌడీ యిమేజి మేన్‌టేన్ చేస్తారు. పెద్దమనుష్యు లన్నవాళ్లు వీళ్లకు దూరంగా మసలుకుంటారు. వీళ్లను చూస్తే ఫిర్యాదు చేయడానికి పెద్ద కారణమూ కనబడదు, ఒక్కోప్పుడు బయటివాళ్లు ఎవరైనా వచ్చి గోల చేస్తే 'మా పేట వాళ్లను అంటార్రా' అంటూ వీళ్లు రక్షణకై వస్తారు కూడా. వీళ్ల గురించి యింట్లో పెద్దవాళ్లు గర్వంగా చెప్పుకోవడానికి ఏమీ వుండదు. ఇటీవలి తెలుగు సినిమా హీరోలను చాలామంది యిలాటి అడ్డాల్లో పాత్రలుగా చూపిస్తున్నారు కాబట్టి యింతకంటె ఎక్కువగా వర్ణించనక్కరలేదు.

ఇలాటి 'అడ్డాబాజీ' బెంగాల్‌లో విపరీతం. ప్రతీ పేటలోనూ యిలాటివి వుంటాయి. వాళ్లను చూస్తూ వుంటే దేశయువత తన శక్తిని ఎలా వ్యర్థం చేస్తోందో అని బాధ వేస్తుంది. రాజకీయ నాయకులకు కూడా పాపం బాధ వేస్తూనే వుంటుంది – వీళ్లంతా మన పార్టీ కార్యకర్తలై వుంటే ఎంత బాగుండేది, ఎందుకూ పనికిరాకుండా పొద్దు పుచ్చుతున్నారే అని. లెఫ్ట్ ఫ్రంట్ వారు ఎన్నికల సమయంలో వారికి ఆ పేరు చెప్పి, యీ పేరు చెప్పి ప్రభుత్వపక్షాన సాయం చేసి, తమ వెనక్కాల తిప్పుకునేవారు. అంతకుమించి వాళ్లను దువ్వితే 'పోరంబోకు'లను చేరదీస్తున్నారనే పేరు బడి, మధ్యతరగతి ప్రజల దృష్టిలో చులకనై పోతామని భయపడ్డారు.

కానీ అలాటి భయాలు లేని వ్యక్తి మమతా బెనర్జీ. ప్రజాధనం వాళ్లకు దోచిపెట్టి తమ పార్టీవైపు తిప్పుకోవాలని నిర్ణయించుకుంది. వాళ్లు ఆడే కారమ్స్, పేకలకు స్పోర్ట్స్ అని పేరు పెట్టి ఒక్కో అడ్డాకు (క్లబ్) నిధులు అందజేయసాగింది. 2011–12 బజెట్‌లో క్రీడలకై రూ. 46.18 కోట్ల నిధులు కేటాయిస్తే 2012–13 బజెట్‌లో దాన్ని 90.01 కోట్లు చేసింది. క్రీడాభివృద్ధికై ఖర్చు అంటే స్టేడియంలు కట్టడం, వాటికి లైట్లు పెట్టించడం, గ్యాలరీలు కట్టించడం, జిమ్‌లు, స్విమ్మింగ్ పూల్సు ఏర్పాటు చేయడం.. యిలాటి వాటికి ఖఋ్చు పెట్టాలి. ఇక్కడ అలాటి పనులు పెట్టుకోలేదు. ఒక్కో తృణమూల్ ఎమ్మెల్యేను 'నీకు నచ్చిన పది క్లబ్బుల పేర్లు నామినేట్ చేయ'మని అడిగారు. కొంతమంది పది కంటె ఎక్కువ క్లబ్బుల పేర్లు యిచ్చారు. మొత్తం 2400 క్లబ్బులకు రాష్ట్ర క్రీడా, యువజన విభాగం ద్వారా చెక్కులు పంచిపెట్టారు. ఆ కార్యక్రమాన్ని టీవీల్లో చూపించి విస్తృత ప్రచారం కల్పించారు. ''ఇది ప్రారంభం మాత్రమే, యింకా కొన్ని క్లబ్బులను గుర్తించి వాటికీ యిస్తాం. ఈ క్లబ్బులన్నిటికీ నెలకు పదివేల రూపాయల చొప్పున ఐదేళ్లలో 6

లక్షల రూపాయలిస్తాం.'' అని మంత్రిగారు ప్రకటించారు.

''ఆనందబజార్ పత్రిక'' లెక్క ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 3700 క్లబ్బులు, గ్రామీణ ప్రాంతాల్లో 6700 క్లబ్బులు గుర్తింపబడుతున్నాయట. వీటికి గాను ఐదేళ్లలో ఖర్చయే మొత్తం 600 కోట్ల రూ.లు. ఇలా దోచి పెట్టడానికి బెంగాల్ ప్రభుత్వం దగ్గర డబ్బేమైనా మూలుగుతోందా అంటే అది 2.20 లక్షల కోట్ల రూపాయల అప్పులో మునిగివుంది. ''వాయిదాలు చెల్లించలేకుండా వున్నాం, కొంతకాలం పాటు వ్యవధి (మోరటోరియం) యివ్వండి'' అని కేంద్రాన్ని బతిమాలుతోంది. అర్బన్ డెవలప్‌మెంట్‌కు కేటాయించిన బజెట్‌ను కితం ఏడాది కంటె 297 కోట్ల రూ.లు తగ్గించింది. పంచాయితీ డెవలప్‌మెంట్ నిధుల్లో 255 కోట్ల రూ.ల కోత విధించింది. ఇప్పుడు యీ క్లబ్బులకు యివ్వబోయే 600 కోట్ల రూ.లు సరిగ్గా వినియోగం అవుతోందో లేదో ఎలా పర్యవేక్షిస్తారో ఏమీ తెలియదు. ఇది నిర్మాణాత్మకమైన వ్యయం కాదని అందరికీ తెలుసు. ఇది వాళ్లను బాగు చేయడానికైతే కాదు, తమ పార్టీకి సానుభూతిపరులుగా మార్చుకోవడానికి మమతా చేస్తున్న ప్రయత్నం. దీన్ని సహజంగానే మీడియా, మేధావులు, ప్రతిపక్షాలు ఖండించాయి.

వాళ్లకు సమాధానం చెప్పడానికి మమతా యీ క్లబ్బు కుర్రాళ్లకు ఓ ఉపన్యాసం దంచింది – ''మన బెంగాల్ జనాభా 10 కోట్లు. కానీ వున్న పోలీసులు 30 వేల మంది మాత్రమే. ఇంత తక్కువ సిబ్బందితో ప్రజలకు రక్షణ కల్పించడం ప్రభుత్వానికి కష్టంగా వుంది. అందువలన మీరు మీ పేటకు స్థానిక పోలీసులుగా వ్యవహరించాలి. శాంతిభద్రతలకు రక్షించాలి. ఆడవాళ్లకు భద్రత కల్పించాలి. నేరస్తులను పట్టుకోవాలి. మీడియా, ప్రతిపక్షాలు వ్యాప్తి చేసే అసత్యప్రచారాన్ని అడ్డుకోవాలి.'' అని. దీని అర్థం – ప్రభుత్వ సహాయంతో, ప్రభుత్వ నిధులతో స్థానిక 'దాదా'లను ప్రభుత్వమే తయారుచేస్తుందన్నమాట. 'ఇవాళ బెంగాల్ ఏం చేస్తే, రేపు దేశమంతా దాన్నే అనుసరిస్తుంది' అనేవారు ఒక కాలంలో. ఆ నానుడి యీ విషయంలో నిజం కాకూడదని ఆశిద్దాం. అప్పుడు దేశంలో ఎటు చూసినా 'పోకిరి'లు, 'పోరంబోకు'లు, 'జులాయి'లు వర్ధిల్లుతారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**ఏప్రిల్ 02, 03 వీక్లీకై** **ఎమ్బీయస్ : జండా పీకేయాలా..?**

ఈ సారీ నెగ్గకపోతే జండా పీకేసుకోవడమే అన్నారు చంద్రబాబు. గట్టిగా పని చేయకపోతే లాభం లేదని కార్యకర్తలను హెచ్చరించడానికి అని వుంటారనుకున్నా అలా అనడం ఏమీ బాగా లేదు. ఉంటే అధికారంలో వుండాలి, లేకపోతే ఉండనే వుండకూడదన్న అర్థం వస్తోంది. ప్రజాసేవ చేయడం కోసమే పుట్టామని చెప్పుకునే రాజకీయ పార్టీలు యిలా అధికారం ఒక్కటే పరమావధని నిర్లజ్జగా చెప్పుకుంటే ఎలా? నిజమే, అధికారం వుంటే పనులు చేసి చూపించవచ్చు. కానీ ప్రజలు అవకాశం యివ్వాలిగా! ఇచ్చేవరకు తమరు ఓపిక పట్టాలిగా! అయినా ఆ అవకాశం రాష్ట్రస్థాయిలోనే దక్కాలన్న అంత పట్టుదల ఎందుకు? పంచాయితీ స్థాయిలో నెగ్గి సేవ చేయవచ్చు. మునిసిపల్ స్థాయిలో చేయవచ్చు. కార్పోరేషన్ స్థాయిలో చేయవచ్చు. సహకార సంస్థల ద్వారా చేయవచ్చు. ఆట్టే మాట్లాడితే పార్లమెంటు స్థాయిలో కూడా చేయవచ్చు. నలుగురు ఎంపీలున్నా పార్లమెంటులో కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఆదుకునో, తిట్టి పోసో రాష్ట్రానికి నిధులు తెచ్చి, 'ఇదీ మా సత్తా, రాష్ట్రప్రభుత్వం చేయలేక పోయినది మేం చేసి చూపించాం' అని చాటుకోవచ్చు, ప్రజాభిమానాన్ని చూరగొని వచ్చే ఎసెంబ్లీ ఎన్నికల్లో గెలవవచ్చు.

ప్రతిపక్షంలో వుంటే తలకొట్టేసినట్టుగా ఫీలవడం చాలా వింతగా వుంది. టిడిపి వరకు అది పెట్టి 30 ఏళ్లు దాటినా, అయితే అధికారపక్షంగా వుంది, లేదా ప్రధాన ప్రతిపక్షంగా వుంది. చాలా పార్టీలకు ఆ మర్యాద కూడా దక్కలేదు. కమ్యూనిస్టు పార్టీలను చూడండి – ఒకప్పుడు కాంగ్రెస్ తర్వాతి స్థానం వారిదే. ఇప్పుడు.. సింగిల్ డిజిట్‌లోకి దిగిపోయారు. అయినా పార్టీ మూసేశారా? ప్రజా సమస్యలపై ఎప్పుడూ పోరాడుతూనే వున్నారు కదా. కార్మిక సంఘాల ద్వారా, రైతు సంఘాల ద్వారా ప్రజలను ఉత్తేజపరుస్తూ వారి మధ్యలోనే వున్నారు కదా. జండా పీకేసి ఎవరి యింటికి వాళ్లు వెళ్లిపోలేదు కదా. కమ్యూనిస్టులు ఒక్కరే కాదు, సోషలిస్టులు, రిపబ్లికన్లు, జనసంఘీయులు.. యిలా బోల్డుమందిని చెప్పవచ్చు. వాళ్లే కాదు, కాంగ్రెస్ వాళ్లూనూ !

1947 నుండి కమ్యూనిస్టులు ఒక్కసారైనా కేంద్రంలో అధికారంలో వున్నారా? ఒక్కసారి మాత్రం కొద్దికాలం – చతురానన్ మిశ్రా వంటి సిపిఐ వాళ్లు మంత్రులుగా వున్నారంతే! ఇక రాష్ట్రాలలో బెంగాల్, కేరళలలో లెఫ్ట్ ప్రభుత్వాలలో భాగస్వామ్యత్వం తప్ప వాళ్లకు అధికారం ఎప్పుడూ దూరమే. దానిలోనూ సిపిఎంకు దక్కిన భాగ్యం తక్కినవారికి దక్కలేదు. ఆ ఫ్రంట్‌లో ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ.. యిలా చిన్నా చితకా పార్టీలు చాలా వున్నాయి. ఓడిపోగానే అవేమీ నిరాశ పడటం లేదు. నాలుగైదు అసెంబ్లీ స్థానాల్లోనైనా గెలుద్దాం అనుకుని కొనసాగుతున్నారు తప్ప, రాజకీయాల్లో వుంటే టైము దండగ, వెళ్లి వేరే పని చూసుకుంటాం అని అనటం లేదు. జనసంఘం ఎప్పటి పార్టీ? ఏళ్ల తరబడి కొట్టుకుంటూనే వుండేది. చివరకు 1967లో ఉత్తర భారతంలో కొన్ని రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వామిగా అధికారం చవి చూసింది. అదీ మూణ్నాళ్ల ముచ్చటే. ఆర్నెల్లకూ, ఏడాదికీ ఆ ప్రభుత్వాలు పడిపోయాయి.

జనసంఘం, సోషలిస్టు పార్టీ, పాత కాంగ్రెస్, చరణ్ సింగ్ లోక్‌దళ్ కలిసి 1977లో జనతా పార్టీగా ఏర్పడి కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్నాయి. ఈ నాలుగు పార్టీలకు చాలాకాలంగా ఠికానా లేదు. ఇందిరా గాంధీ దెబ్బకి అప్పటికి పుష్కరకాలంగా పాత కాంగ్రెస్ నాయకులు విలవిలలాడుతూ వున్నారు. ఇక తక్కిన పార్టీలు 1967 నాటి సంకీర్ణ ప్రభుత్వాలలో కొద్దికాలం అధికారం

వెలగబెట్టి ఆరిపోయిన దీపాల్లా పడి వున్నారు. అంతలో ఇందిరా గాంధీ ఎమర్జన్సీ పెట్టి వీళ్లకు నూనె పోసింది. 1977 నుండి 1980 వరకు దేదీప్యమానంగా వెలిగారు. మళ్లీ అంధకారం అనుకోండి. ఆ చీకట్లో నుండి మళ్లీ వెలుగులోకి వచ్చినది బిజెపి ఒక్కటే. అది కూడా ఓ దశలో 2 పార్లమెంటు స్థానాలు మాత్రమే గెలుచుకుంది. ఎందుకీ వెధవ బతుకు అని తిట్టుకుని పార్టీ మూసేయలేదు. పోరాడి అధికారాన్ని సాధించింది. ఇప్పుడు కూడా 2004 నుండి అధికారం పోగొట్టుకుని వుంది. 2014లో మాదే అధికారం అంటోంది. అచ్చం బాబు లాగే! తేడా ఏమిటంటే 2014లో గెలవకపోతే జండా పీకేస్తాం, గొయ్యి తీసి పార్టీని పాతేస్తాం అని వాళ్లు అనటం లేదు, బాబు అంటున్నారు.

పార్టీ అంటూ పెట్టాక ఆటుపోట్లు వుంటాయి. నావను నదిలోకి దింపాక కాస్సేపటికే ముంచేయకూడదు. ఒడ్డునే తచ్చాడుతూ వాలుగాలి రాగానే తెరచాప ఎగరేసి ముందుకు సాగాలి. ఎమర్జన్సీ టైములో ఎమ్జీయార్ కేంద్రంలోని ఇందిరా గాంధీ సాయంతో కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేయించి అధికారంలోకి వచ్చాడు. కరుణానిధికి అప్పటినుండి ప్రతిపక్షస్థానం ఖరారై పోయింది. ఎమ్జీయార్ బతికున్నంతకాలం గద్దెవైపు చూడలేకపోయాడు. ఎమ్జీయార్ పోయిన తర్వాత వారసత్వం నాదంటే నాదంటూ జానకి, జయలలిత కొట్టుకుంటే ఆ చీలిక వలన లాభపడి సింహాసనం ఎక్కాడు. ఇవన్నీ అతను ముందే వూహించలేదు కదా. అంతెందుకు గుజరాత్‌లో మోదీ బాబు నిరసనలకు గురయ్యాడు. ఎన్‌డిఏ ప్రభుత్వంలో టిడిపి పదవులు వదలుకోవడానికి కారణమయ్యాడు. కానీ ఓపిగ్గా అలా పాలించుకుంటూ వెళ్లాడు, యీ రోజు బాబు మనకు గుజరాత్ తరహా ప్రభుత్వం అందిస్తానని వాగ్దానం చేసే లెవెల్‌కి ఆయన మెప్పు పొందాడు.

తమిళనాడులో 1967లో కాంగ్రెస్ గద్దె నుండి దిగిపోయింది. మళ్లీ ఎక్కలేదు. ఇంకో నాలుగేళ్లలో 'అధికారచ్యుతికి గోల్డెన్ జూబిలీ' అంటూ వాళ్లు సెలబ్రేట్ చేసుకోవచ్చన్నమాట. ఇంకెందుకు, యీ పార్టీ అని దుకాణం మూసేయలేదే! మూసేయలేదు కాబట్టే ఆ రాష్ట్రం నుండి కాంగ్రెస్ వాళ్లు కేంద్ర కాబినెట్‌లో మంత్రులవుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 1977లో దిగిపోయింది. ఇప్పటిదాకా యింకా ఎక్కలేదు. అక్కడా గుడారం ఎత్తేయలేదు. త్రిపురలో కూడా డిటో డిటో. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో ముచ్చటగా మూడోసారీ ఓడిపోయింది. పార్టీ మూసేసి, ఆఫీసు ఎవరికైనా అద్దె కిచ్చేశారా? యుపిలో అధికారం పోగొట్టుకుని పాతికేళ్లయి వుంటుంది. అయినా రాహుల్ గాంధీగారు రోడ్‌సైడ్ టీ స్టాళ్లలో టీలు తాగుతూ అవస్థలు పడుతున్నాడు తప్ప వెధవ గోల మూసేద్దాం పట్టండి అనటం లేదు.

ఇలా ఒక్కో పార్టీ చరిత్ర తీసుకుంటే అన్నీ ఒకే పాఠాన్ని చెప్తాయి – అధికారంలోకి రావడానికి ఏళ్లూ, పూళ్లూ పడతాయి. వచ్చాక ఎన్నేళ్లు వుంటారో ఎవరూ చెప్పలేరు. దిగిపోయాక మళ్లీ ఎప్పుడు ఎక్కుతారో అదీ చెప్పలేరు. గీతలో చెప్పినట్టు మన పని మనం చేసుకుంటూ పోవడమే, ఫలితం ఓటరు దేవుళ్లకు వదిలేయడమే. ఓటర్ల మీద అలిగి జీవితం మధ్యలోనే ఆత్మహత్య చేసుకుంటానంటే ఎలా? 'జాన్ (ప్రాణం) హై, జహాన్ (ప్రపంచం) హై' అంటారు. తెలుగులో 'ఊపిరుంటేనే ఊరుంటుంది' అనుకోవచ్చు. బతికుంటే బహువింతలు చూడవచ్చు, అందలం ఎక్కే ఛాన్సూ రావచ్చు. మనమే లేకపోయాక లోకం వుంటే ఎంత, ఊడితే ఎంత! కర్ణాటకలో కూడా కాంగ్రెస్ 2004లో ఓడిపోయింది. మళ్లీ అధికారంలోకి రాలేదు. పార్టీ మూసేద్దామనుకోకుండా మొన్న స్థానిక ఎన్నికలలో గట్టిగా పోరాడారు. చాలా స్థానాలు గెలిచి ఉత్సాహంగా వున్నారు.

రాజకీయాల్లోనే కాదు, మేనేజ్‌మెంట్ పాఠాల్లోనూ, వ్యక్తిత్వ వికాస పాఠాల్లోనూ యిలాటివి బోల్డు చెప్పి ఉత్సాహపరుస్తారు. ఇలాటి సందర్భాల్లో రాబర్ట్ బ్రూసు–సాలీడు కథ ఎవరెడిగా వుంటుంది. ఏడుసార్లు ఓడిపోయిన బ్రూసు ఆ కథలో సాలీడును చూసి బుద్ధి తెచ్చుకుంటాడు. మన కథానాయకుడికి ఓడిపోవడానికి యింకా ఐదుసార్లు ఛాన్సుంది. సాలీళ్లకు రాష్ట్రంలో కొదవలేదు. విద్యుత్ కొరత వలన మూలపడిన పరిశ్రమల నిండా సాలీళ్లే. అందరికీ మేనేజ్‌మెంట్ పాఠాలు చెప్పే చంద్రబాబు తనే యిలా డెస్పాండెంట్‌గా మాట్లాడడం చాలా వింతగా, విడ్డూరంగా లేదూ!? దీని వెనక్కాల కారణం వెతికితే ఒకటి తడుతుంది. అన్ని పార్టీలూ పెట్టిన చాలాకాలానికి కానీ అధికారంలోకి రావు. తొమ్మిదినెలల్లో వచ్చిన టిడిపిది రికార్డు. అసాం గణపరిషత్ పార్టీ యింతకంటె తక్కువ టైములో వచ్చిందంటారు కానీ పార్టీ పెట్టడానికి ముందు ఏళ్లపాటు ఉద్యమం నడిచింది. ఏ ఉద్యమమూ, ఏ చరిత్రా లేకుండా ఆకాశం నుంచి వూడిపడినట్టు ఊడిపడి డైరక్టుగా సింహాసనం ఎక్కిన ఘనత టిడిపిది.. కాదు కాదు.. ఎన్టీయార్‌ది. చంద్రబాబు ఆయనను మించిన మేధావి, రాజకీయ చతురుడు కావచ్చు, సొంతంగా పార్టీ పెట్టి వుంటే తొమ్మిది నెలలు కాదు కదా, తొమ్మిదేళ్లు తన్నుకున్నా అధికారంలోకి వచ్చేవాడు కాదు. ఎన్టీయార్ వెనుక 30 ఏళ్ల సినీనేపథ్యం వుంది. గ్లామర్ వుంది. ప్రజాకర్షణ వుంది. దాన్ని పెట్టుబడిగా పెట్టి టిడిపి అధికారంలోకి వచ్చింది. వచ్చిన ఆరేళ్లకు పోగొట్టుకున్నా మళ్లీ అయిదేళ్ల తర్వాత 1994లో థంపింగ్ మెజారిటీతో గుద్దుకుంటూ గద్దె నెక్కింది. దీనికి అలవాటు పడిన బాబు యిలాగే ఎల్లకాలం వుందనుకుంటున్నారు లాగుంది. 2004లో తనను దింపేసి తప్పు చేసిన ప్రజలు 2009 నాటికి నాలిక కరుచుకుంటారనే నమ్మకంతో చాలా అడావుడి చేశారు.

1994 నుండి పదేళ్లపాటు మీకు ఛాన్సు యిచ్చినట్టే 2004 నుండి యింకో పదేళ్లపాటు కాంగ్రెసుకు ఛాన్సిస్తాం అన్నారు ప్రజలు. ఈయన అతి కష్టం మీద నాలుగేళ్లు ఓపిక పట్టారు. ఈ సారి 2014లో కూడా దగా చేస్తే చెరువు మీద కోపం తెచ్చుకుంటానని బెదిరిస్తున్నారు. ఆ బెదిరింపుకి ఎవరు బెదురుతారు? ప్రజలా? ఈసప్ కథ ఒకటి వుంది. ఓ గొఱ్ఱెల కాపరి ఓ కొండ మీద గొఱ్ఱెలను కాచుకుంటున్నాడు. ఇంతలో శత్రువులు వచ్చిపడ్డారు. వాడు పారిపోతూ 'మీరూ పారిపోండి, వాళ్లు వచ్చేస్తున్నారు' అని గొఱ్ఱెలకు

కూడా చెప్పాడు. అవి నవ్వాయి – ''మేమెందుకు పారిపోవాలి? నువ్వేం చేస్తావో వాడూ మాకు అదే చేస్తాడు. గడ్డి వేస్తాడు, పాలు పితుక్కుంటాడు, మరీ ఆకలేస్తే కోసుకు తింటాడు. మా యజమాని పేరు మారుతుంది తప్ప మా బతుకులు మారవు.'' అని. మనం అలాగే వున్నాం. విద్యుత్ బిల్లులు బాబు హయాంలోనూ షాక్ కొట్టాయి, ఇప్పుడూ కొడుతున్నాయి, ఇవాళ బాబు పాదయాత్రలో కాళ్లకు డైనమోలు పెట్టుకున్నా కరంటు ఉత్పాదన ఏమీ పెరగదు కదా! రేపు ఆయన వచ్చినా షాకులు తప్పవు. అందువలన నేను రాజకీయాల్లోంచి విరమించుకుంటా అని ఎవరైనా అన్నా ప్రజలు ఉలిక్కిపడరు. ఈయనకు కాకపోతే మరొకరికి ఓటేస్తాం అనుకుంటారు.

కార్యకర్తలూ అంతే, యీయన పార్టీ ఎత్తేస్తే మరో పార్టీలో చేరతారు. 'నేనంటూ ఓ మనిషిని లేకపోతే మీరెవర్ని పెళ్లి చేసుకునేవారు?' అని ఓ భార్య భర్తను హేళనగా అడిగిందట. 'మీ అమ్మనే కట్టుకునేవాణ్ని' అన్నాట్ట భర్త. ఈమె భార్య అయింది కాబట్టి ఆవిడ అత్తగారయింది. ఈమె లేనప్పుడు ఆ బంధుత్వం లేదు. నచ్చితే శుబ్భరంగా జత కట్టవచ్చు. కార్యకర్తల పని ఏమిటి? జండాలు మోయడం, ఊరేగింపుల్లో నినాదాలు యివ్వడం, ఎన్నికల వేళ డబ్బు పంపిణీ చేయడం, ఓట్లు వేయించడం! ఈ పని యీ పార్టీ చేయించుకోకపోతే మరో పార్టీ చేయించుకుంటుంది. 'అబ్బే మీ సిద్ధాంతాలు నచ్చలేదు కాబట్టి మీకు చేయను' అంటాడా కార్యకర్త? ఏ పార్టీ అయినా ఒకే హోటల్‌నుండి బిర్యానీ తెప్పిస్తారు, ఒకే బ్రాండ్ పోస్తారు. అయితే బాబు జండా ఎత్తేస్తే మాత్రం మధ్యస్థాయి నాయకులు నష్టపోతారు. మునిసిపల్ చైర్మన్లు, కార్పోరేషన్ మేయర్లు కావలసిన వాళ్లు, జిల్లా పరిషత్ చైర్మన్‌లు కావలసినవాళ్లు .. వీళ్లందరికీ పదవులు దక్కకుండా పోతాయి. వారితో బాటు ఎంపీలు కూడా నష్టపోతారు. కనీసం ఓ ఏడెనిమిది చోట్ల టిడిపికి ఎంపీ సీట్లు గెలిచే అవకాశం వుందనుకుంటే వారిలో కొందరికి సంకీర్ణ ప్రభుత్వంలో కేంద్రమంత్రి అయ్యే ఛాన్సో, మరోటో వుండవచ్చు. పార్టీ ఎత్తేస్తే వాళ్లకు దిక్కులేకుండా పోతుంది. మరి వాళ్ల గురించి ఆలోచించవద్దా?

బాబు తన గురించే ఆలోచిస్తున్నారు. ఆయనకు కావలసినది 2014లో సిఎం పోస్టు. మళ్లీ ఒక్కసారి ముఖ్యమంత్రి అయిపోయి రాజ్యాన్ని కొడుక్కి కట్టబెట్టి దిగిపోదామని ఆలోచన వున్నట్టుంది. 2014 మిస్సయితే 2019 వరకు అంటే ఏం జరుగుతుందో చెప్పలేం. 2009, 2014 మధ్యలో జగన్ పార్టీ వస్తుందని ఎవరైనా అనుకున్నామా? అలాగే మరో ఫ్యాక్టర్ ఏదైనా రావచ్చు. అందువలన అర్జునుడిలా ఆయన ఏకైక దృష్టి 2014కి ముఖ్యమంత్రి పదవి మీదే వుంది. ఆయనకు అంతకంటె తక్కువా వద్దు, ఎక్కువా వద్దు. నన్ను సిఎం చేయగలిగితే పని చూడండి, లేకపోతే దుకాణం కట్టిపెట్టేయండి. అంటున్నాడు.

ఆయనకేం? టిడిపి దుకాణం కట్టిపెట్టేసినా ఆయనకు హెరిటేజి దుకాణం వుంది. ఆదాయానికీ, వ్యాపకానికీ లోటు లేదు. మరి కార్యకర్తలకు అలాటి వనరులు ఏమీ లేవు కదా. అందువలన పార్టీ మూసేయకండి అని బతిమాలతారు. 'మీరేం చెప్పినా, ఎవరికి టిక్కెట్టిచ్చినా ఫరవాలేదం'టారు. బాబుకి అదే కావాలి. తన మాట చెల్లుబాటు కావాలి. అవుతుంది. కానీ యీ క్రమంలో కార్యకర్తలు నీరసిస్తారు. ''డూ ఆర్ డై'' నినాదం ఏదో ఒక్కసారి పని చేస్తుంది. 2009లో దాన్ని ఫుల్‌గా వాడేసుకున్నారు. మళ్లీ ఐదేళ్లు విరామం యిచ్చి వాడితే కాస్త ప్రయోజనం వుంది. కానీ బాబు 2009 నుండే మొదలు పెట్టేశారు – 'నన్ను అధికారంలోకి తెచ్చేయండి, లేకపోతే రాష్ట్రం నాశనమై పోతోంది' అని. పదేపదే విని ఆ మాటలకు ప్రజలు చలించడం మానేశారు. దాంతో యిప్పుడు యిలా నిరాశాపూరితంగా మాట్లాడుతున్నారు. ఒక నాయకుడు యిలా మాట్లాడడం ఉక్రోషాన్ని చూపుతోంది కానీ ఉద్రేకాన్ని కలిగించడం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**ఏప్రిల్ 04 వీక్లీకై** **ఎమ్బీయస్ : పాకిస్తాన్‌లో షియాల వ్యథ**

పాకిస్తాన్‌లో మైనారిటీ లనగానే మనకు హిందువులే గుర్తుకు వస్తారు. విభజన నాటి నుండి వారి శాతం దారుణంగా తగ్గుతూ వచ్చిందని, అనేక హిందూ దేవాలయాలు నేలమట్టం అయ్యాయని వేదన చెందుతాం. పాకిస్తాన్‌లో మరో మైనారిటీ కూడా వుంది. సున్నీలు అత్యధికంగా వున్న పాకిస్తాన్‌లో హజరా షియాలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. గత సంవత్సరంలో 400 మంది హజరా షియాలను వర్గకలహాల్లో చంపివేశారు. ఈ ఏడాది మొదటి నెలన్నరలోనే 200 మంది హతమయ్యారు.

2013 జనవరి 10 న క్వెట్టాలో జరిగిన బాంబు పేలుళ్లలో 90 మంది హజరా షియాలు మరణిస్తే పాకిస్తాన్ మీడియా పెద్దగా పట్టించుకోలేదు. ఇది మామూలే అన్నట్టు వూరుకున్నారు. అప్పుడు హతుల బంధువులు తిరగబడ్డారు. ఎముకలు కొరికే చలిలో ఆ శవాలను తీసుకుని హైవేల మధ్య పెట్టుకుని వాహనాల రాకపోకలు ఆపివేసి, బాధ్యులను శిక్షించేదాకా అంత్యక్రియలు చేయమని చెప్పారు. అప్పుడు గాని ప్రభుత్వం దిగి రాలేదు. పాకిస్తాన్‌లో జనాభాలో 20% వున్న వీరి దీనావస్థ అందరికీ తెలియవచ్చేసరికి పాకిస్తాన్ ప్రజలు కూడా ఉలిక్కిపడ్డారు. అయినా షియాలపై దాడులు ఆగలేదు. ఫిబ్రవరి 16 నాడు మళ్లీ బాంబు పేలుళ్లు జరిగాయి. ఈసారి వందకు పై బడి షియాలు మరణించారు.

పాకిస్తాన్ అత్యధికులు సున్నీలు. వారి ప్రాధాన్యత ఎంత ఎక్కువగా వుంటుందంటే పాకిస్తాన్ ఆవిర్భవానికి కారకుడైన మహమ్మదాలీ జిన్నా షియా అయినా అతను చనిపోతే సున్నీ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు! ఈ 'సున్నీకరణ'ను అప్పుడే గుర్తించి ఆపి వుంటే బాగుండేది. కానీ ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 1950 తర్వాత క్రమేపీ సౌదీ అరేబియా మద్దతుతో, జియా వుల్ హక్ అధ్యక్షుడుగా వుండగా ఉధృతంగా సున్నీ ప్రాబల్యం హెచ్చింది. ఎస్ఎస్‌పి (సిపా ఎ సహాబా) ఎల్ఇజె (లష్కర్ ఎ జంగ్వి)

వంటి సున్నీ అతివాద సంస్థలు పుట్టుకుని వచ్చాయి. ''అహ్మదీయులను ముస్లిమేతరులుగా గుర్తిస్తున్నాం కదా, షియాలను కూడా అలాగే చేద్దాం" ఆ సంస్థలు వాదిస్తున్నాయి.

బెలూచిస్తాన్‌లో షియాలు అధిక సంఖ్యలో వున్న గిల్గిత్–బలిస్తాన్ ప్రాంత్‌లో కూడా వారిపై దాడులు జరుగుతున్నాయి. కారంకోరం హైవే పక్కనున్న గ్రామాల్లో ప్రతి వూళ్లో నోటీసు బోర్డులు పెట్టి యిలాటి దాడులలో మరణించిన వారి పేర్లు రాసి పెట్టారు. వీరందరూ సున్నీలతో పోరాటాలు చేసి మరణించలేదు. వీళ్ల పాటికి వీళ్లు బస్సుల్లో వెళుతూంటే ఈ సున్నీ అతివాద సంస్థల సభ్యులు వచ్చి ఆపి వారిని గుర్తించి బయటకు యీడ్చి 'షియా కాఫిర్' అని నినాదాలు యిస్తూ కాల్చి చంపారు. షియాలు మొహర్రం సందర్భంగా తమను తాము కొట్టుకుంటారు కాబట్టి ఆ గుర్తులు శరీరంపై కనబడతాయి. అలా వారిని గుర్తించవచ్చు. పైగా వారిలో మంగోలియా జాతినుండి వారసత్వంగా వచ్చిన పోలికలు కనబడతాయి. అవే కాకుండా పేర్ల బట్టి కూడా షియాలని కనుక్కోవచ్చు. ఈ గొడవలు చూశాక షియాలు వాళ్ల పిల్లలకు సాంప్రదాయకమైన పేర్లు పెట్టడం మానేస్తున్నారు.

ఫిబ్రవరి పేలుళ్లు నిర్వహించినది మేమే అని గొప్పగా చెప్పుకుంటున్న ఎల్ఇజె క్వెట్టా వాసులకు ఎస్ఎమ్ఎస్‌లు పంపుతోంది – "మీ కంటికి ఎవరైనా షియా కనబడితే ఫలానా నెంబరుకు ఫోన్ చేసి చెప్పండి. ఫిబ్రవరి దాడిలో వెయ్యి కిలోల మందుగుండు సామగ్రి వాడాం. అలాటివి 20 దాడులు నిర్వహించగల బాంబులు మా దగ్గర యింకా వున్నాయి." అని. ఇక షియాలకు భయం పట్టుకుంది. ఒకేచోట ఉండాలని నిశ్చయించుకున్నారు. వాళ్లందరూ నగరంలోని రెండు కాలనీలలో నివసించసాగారు. దానివలన అనర్థం ఏమిటంటే – వాళ్లను గుర్తుపట్టడం, టార్గెట్ చేయడం మరింత సులభం అయింది. ప్రాణభయంతో ఇలా కట్టకట్టుకుని వుండడం వలన బతికి వుంటారు కానీ పిల్లల్ని స్కూళ్లకు, కాలేజీలకు పంపించడానికి కుదరటంలేదు. ఇప్పటివరకు వారిలో అక్షరాస్యత 90% వుంది. ఇకపై అది తగ్గిపోతుంది.

ఎస్ఎస్‌పి, ఎల్ఇజె యిలా చెలరేగిపోతూ వుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది అన్న ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. వీళ్ల వెనుక పాకిస్తాన్ సైన్యం వుందని చాలామంది నమ్మకం. ఈ సారి నిరసన గట్టిగా రావడంతో "మాకే సంబంధమూ లేదు" అని సైన్యం ప్రకటించవలసి వచ్చింది. ఈ సంస్థలు పంజాబ్‌లో బాగా పాతుకుపోయి వున్నాయి. వాళ్లపై చర్యలు తీసుకుంటే పంజాబ్‌లో ఓట్లు రాలవేమోనని రాజకీయనేతల భయం. నవాజ్ షరీఫ్ పంజాబ్‌ను పాలించినప్పుడు వీళ్ల కార్యకలాపాలను చూసీచూడనట్టు వదిలేయడంతోనే యివి వృద్ధి చెందాయి. 40 నియోజకవర్గాల్లో వీళ్ల ఓట్లు అతని పార్టీ (పాకిస్తాన్ ముస్లిం లీగ్)కి పడ్డాయి. అంతేకాదు, యీ సంస్థలు భుట్టో తాలూకు పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నాయకుల్ని, అవామీ నేషనల్ పార్టీ నాయకుల్ని మట్టుపెట్టాయి కానీ నవాజ్ షరీఫ్ పార్టీ నాయకుల జోలికి వెళ్లలేదు. ఈ సంస్థ సభ్యులకు ప్రతీకారవాంఛ ఎక్కువని తెలిసి పోలీసులు కూడా భయపడుతున్నారు. తమపై కేసులు పెట్టిన పోలీసులను, విచారణ జరిపిన న్యాయాధికారులను నిర్దాక్షిణ్యంగా చంపేస్తూండడంతో కేసులు పెట్టడమూ అరుదే, పెట్టిన సందర్భాల్లో కూడా న్యాయాధీశులు శిక్ష వేయడమూ అరుదే.

పర్వేజ్ ముషారఫ్ అధ్యక్షుడిగా వుండే రోజుల్లో ఎల్ఇజెను నిషేధించాడు. అది వెంటనే ఎఎస్‌డబ్ల్యుజె (అహ్లే సున్నత్ వాల్ జమాత్) అనే పేర కొత్త సంస్థగా అవతారం ఎత్తింది. ఆ పేరుతోనూ దాడులు కొనసాగిస్తోంది. దాని నాయకుడు మాలిక్ ఇషాక్ ఒక హత్యానేరంపై జైల్లో వుండే రోజుల్లో పంజాబ్ ప్రభుత్వం అతనికి స్టయిపండ్ చెల్లించేదని చెప్పుకుంటారు. చివరకు 2011లో సుప్రీం కోర్టు తీర్పు ననుసరించి అతన్ని జైల్లోంచి వదిలేశారు. ఇటీవలే అతను మీడియా సమావేశం ఏర్పాటు చేశాడు కూడా. ఇతను జైల్లో వుండగా షియా వ్యతిరేక దాడులు తగ్గుముఖం పట్టాయి. అదే విధంగా ఉస్మాన్ కుర్ద్ అనే ఎల్ఇజె క్వెట్టా కంటోన్మెంట్ జైల్లో వున్న రోజుల్లో బెలూచిస్తాన్‌లోనూ తగ్గుముఖం పట్టాయి. కానీ 2008లో అతను జైల్లోంచి పారిపోయాడు. పారిపోవడానికి సైన్యం సహకరించిందని చెప్పుకుంటారు. ఇప్పుడు ఫిబ్రవరి దాడుల్లో అతని హస్తం వుందని తేటతెల్లమౌతోంది.

ఇలాటి పరిస్థితుల్లో పాకిస్తాన్ పాలకులు మేల్కొనకపోతే కష్టం. ఇప్పటికే హజారా షియాలు తమ నిరసన ఘాటుగా తెలుపుతున్నారు. తమపై ఏ క్షణంలోనైనా దాడులు జరగవచ్చనే భయాన్ని వ్యక్తపరుస్తూ "తర్వాత వాణ్ని నేనేనా?" అని రాసి వున్న టీ షర్టులు వేసుకుని తిరుగుతున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**ఏప్రిల్ 05** **ఎమ్బీయస్ : ఒంటరి పోరాటం తెరాస ఒంటికి మంచిదేనా?**

కెసియార్ మళ్లీ వార్తల్లో చురుగ్గా కనబడుతున్నారు. ఓ పక్క ఉద్యమం, మరో పక్క రాజకీయ ప్రక్రియ కొనసాగాలంటున్నారు. అదేమిటో ఆయనకు అక్టోబరు–డిసెంబర్లలో ఫా?మ్‌హౌస్ గుర్తుకు వస్తుంది. వేసవికాలంలోనే ఉద్యమం గుర్తుకు వస్తుంది. మే నెలలో పల్లెల్లో మండల యాత్ర చేస్తారట, పట్టణాల్లో బస్తీ బాట చేస్తారట. వేసవి మార్చినుండే దంచడం మొదలుపెట్టింది. పైగా కరంటు కోతలు. ఎసి గుడారాలలో, ఎసి వ్యాన్‌లలో రోజుకు మూడింట రెండు వంతుల సమయం విశ్రాంతి తీసుకుంటూ పాదయాత్రలు చేసేవాళ్లే ఆపసోపాలు పడుతూ సాయంత్రాలు నడుస్తున్నారు. మరి వీళ్లు ఎన్ని వూళ్లు తిరుగుతారో ఏమో. ఇప్పటిదాకా ఎనౌన్సుమెంటులే తప్ప గట్టిగా వూళ్లు తిరిగినవాళ్లు లేరు.

అయినా కెసియార్‌కు నమ్మకంగా వుంది – తెలంగాణాలో గల 17 ఎంపీ స్థానాల్లో 15 స్థానాలు కచ్చితంగా వస్తాయని. టైమ్స్

ఆఫ్ ఇండియావాళ్లు సర్వే చేసి 13 వస్తాయంటే యీయన దానికి రెండు కలిపి – ఖమ్మం, హైదరాబాదు తప్ప తక్కినవన్నీ మనవే అన్నారు. దాన్ని అసెంబ్లీ సీట్లగా తర్జుమా చేసి 80–90 సీట్లు యిక్కడ వస్తాయన్నారు. ఈ విధంగా ఆయన తమ కార్యకర్తలను ఉత్సాహ పరచారు. టైమ్స్ ఆఫ్ ఇండియా సర్వే శాంపుల్ ఏమిటో, పరిమితులేమిటో నాకు తెలియదు. 17లో 13 తెరాసకు వస్తాయనడం ప్రస్తుతానికి కాస్త అతిశయోక్తిగానే తోస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో (మహబూబ్ నగర్, పరకాల) తెరాస తెచ్చుకున్న ఓట్లు చూస్తే యింతటి ఆశాభావం కలగదు. ఈ కాలంలో ఏది అసలు న్యూసో, ఏది పెయిడ్ న్యూసో తెలియకుండా పోయింది.

ఏది ఏమైతేనేం, ఆ సర్వే కెసియార్‌కు మంచి ఉత్సాహాన్నిచ్చింది. జయం మనదే అని నినదిస్తున్నారు. ఇలా చెప్తూనే మన పార్టీలో అలసత్వం, నిర్లక్ష్యం పెరిగిపోయాయి అంటూ కార్యకర్తలను మందలించారు. ఏప్రిల్ 10 లోపున సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు పూర్తవకపోతే నియోజకవర్గ యిన్‌చార్జిలను మార్చేస్తాను జాగ్రత్త అంటూ హెచ్చరించారు. తెరాసకు 10 ఎంపీ సీట్లు వస్తే కేంద్రంలో, 50 అసెంబ్లీ సీట్లు వస్తే రాష్ట్రంలో – కీలకమైన పాత్ర పోషించగలదు. ప్రభుత్వాలు ఏర్పడడానికి, కూల్చడానికి ఆ బలం చక్కగా పనికివస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకి సమ్మతిస్తేనే మద్దతు అని బాగా బేరమాడుకోవచ్చు.

అయితే అన్ని సీట్లు రావాలంటే ఏం చేయాలి అన్నదే ప్రశ్న. ఎవరితోనైనా పొత్తు పెట్టుకోవాలా? లేక ఒంటరిగా పోటీ చేయాలా? తెరాస మొదట్లో జిల్లా పరిషత్ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేసి కొన్ని స్థానాలు గెలుచుకుంది. 2004లో అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, లెఫ్టలతో కలిసి టిడిపి–బిజెపి కూటమిని ఓడించింది. అయితే పోటీ చేసిన స్థానాల్లో సగం వాటినే గెలుచుకుంది. ఆ తర్వాత రాజీనామా చేసినప్పుడల్లా తెరాస సీట్లు మంగళగిరి పానకాల స్వామికి పోసిన పానకంలా సగం మిగిలేవి. 2009 అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి టిడిపి, లెఫ్టలతో కలిసి కాంగ్రెస్‌ను ఢీ కొంది. ఈ సారి పెర్‌ఫామెన్సు మరీ దెబ్బ తింది. కూటమిలో ఒకరికొకరు వెన్నుపోట్లు పొడుచుకున్నారు. అప్పుడు జరిగిన గొడవలు యిప్పటికి కూడా వీళ్లు మర్చిపోలేకుండా వున్నారు.

తెరాస తన పొత్తుదార్లను తిట్టిపోస్తూనే వుంది. ''కాంగ్రెస్, టిడిపి యిద్దరూ మమ్మల్ని వాడుకుని వదిలేసింది.'' అని. 'మాట యిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కో ఖత్మ్ కరో, తెలంగాణకో హాసిల్ కరో' అనే నినాదం యిప్పటిదాకా యిచ్చి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే ఎవరూ నమ్మరు. ఇక టిడిపిని తెరాస గతనాలుగేళ్లగా తిట్టని తిట్టు లేదు. వాళ్లతో పొత్తు పెట్టుకుంటే తెరాసకు ఒక్క ఓటు కూడా పడదు. మిగిలినది వైకాపా. కొంతకాలం క్రితం తెలంగాణలో వైకాపా–తెరాస చేతులు కలిపి కాంగ్రెస్, టిడిపిలను ఓడించాలని ప్రయత్నిస్తున్నాయని టిడిపివారు ప్రచారం చేశారు. కానీ పోనుపోను వైకాపా తెలంగాణలో బలం పెంచుకోవాలని చూడడంతో స్నేహం బెడిసి కొట్టింది. పరకాలలో ప్రధాన ప్రత్యర్థులు తెరాస, వైకాపాలే.

ఇక పొత్తు పెట్టుకోవడానికి తెరాసకు మిగిలినదెవరు? బిజెపి, సిపిఐ. కోస్తా, సీమల్లో టిడిపితో అంటకాగే సిపిఐని నమ్మం అని కెసియార్ చెప్పేశారు. ఇక బిజెపి. బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి అవకాశాలైతే వున్నాయి. బిజెపితో పొత్తు పెట్టుకుంటే వాళ్లు 'అసెంబ్లీ స్థానాల్లో మీరు మూడింట రెండు వంతులు తీసుకోండి, కానీ పార్లమెంటు స్థానాల్లో మూడింట రెండు వంతులు మాకు వదిలేయండి' అని బేరం పెడతారు. ఎందుకంటే వాళ్లకు రాష్ట్రంపై ఎటూ ఆశ లేదు, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పరచడమే వారి ధ్యేయం. తెరాస దానికి ఒడంబడితే బిజెపి ఎన్నికల నిధులు సమకూర్చగలుగుతుంది. ఎందుకంటే మోదీ ప్రధాని అవుతారనే ఆశతో కార్పోరేట్లు ఆయనకు, ఆయన పార్టీకి నిధులు తప్పక అందిస్తారు. ఈ విధంగా తెరాసకు నిధులు వెతుక్కోవలసిన బాధ తప్పుతుంది.

కానీ పార్లమెంటు స్థానాల్లో 11 వాళ్లకు వదిలేసి 6 మాత్రమే తీసుకోవాలంటే రిస్కే. ఆ ఆరులో మూడో నాలుగో మాత్రమే గెలవగలిగితే ఏం లాభం? ఒకవేళ బిజెపి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పరచలేకపోతే యీ మూడూ నాలుగూతో ఎవర్ని బెదిరించగలరు? ఓ పదైనా వుంటే తాము కోరినది సాధించగలరు. ఒకప్పుడు కెసియార్ బిజెపికి చాలా క్లోజ్‌గా మసలారు. కానీ బిజెపి కూడా తెలంగాణను పూర్తిగా తలకెత్తుకుని, స్వయంగా పోరాటాలు చేయడం మొదలుపెట్టడంతో కెసియార్‌కు మండిపోయింది. పైగా మహబూబ్‌నగర్‌లో వాళ్ల చేతుల్లో ఓటమిపాలవడం ఆయన మర్చిపోలేకపోతున్నారు. ఆ కారణంగా బిజెపితో పొత్తును నిరాకరించవచ్చు.

ఆ విధంగా కెసియార్‌కు ఒంటరి పోరాటం ఒక్కటే శరణ్యం. అదో పెద్ద ఘనతగా ఆయన చెప్పుకోవడానికి కారణం ఏమిటంటే – ఎన్నికలు దగ్గర పడిన కొద్దీ కాంగ్రెస్‌లోని తెలంగాణ నాయకులు కెసియార్‌తో పొత్తు పెట్టుకోవాలి, లేకపోతే మన పని తిరుక్షవరం అని ప్రచారం మొదలుపెడతారు. కోస్తా, సీమ నాయకులు వద్దంటారు. ఢిల్లీ వారు యిద్దరి వాదనలూ వింటూనే వుంటారు. 'తెలంగాణ యిస్తామని మ్యానిఫెస్టోలో స్పష్టంగా చెపితే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే విషయం ఆలోచిస్తాం' అని కెసియార్ మినహా తక్కిన తెరాస నాయకులు ప్రకటనలు యిస్తూ వుంటారు. 'కెసియార్‌ను కాంగ్రెస్‌లోకి తెచ్చే బాధ్యత మాది' అని టికాంగ్రెస్ నాయకులు హామీలు గుప్పిస్తూ వుంటారు. కెసియార్‌తో ఆజాద్ వంటి ఢిల్లీ పెద్దల బేరసారాలు ఎప్పటికీ తెగవు.

ఈ గందరగోళంలో అభ్యర్థులుగా నిలబడదలచినవారు ఎటు వుండాలో, ఏ పార్టీ కైనా టిక్కెట్లు తీసుకోవాలో వద్దో, వాటికై ఖర్చు పెట్టాలో వద్దో తెలియక కొట్టుమిట్టులాడతారు. అందువలన కెసియార్ యిప్పుడే తేల్చి చెప్పేశారు – 'తెరాసది ఒంటరి పోరే. అనగా 119 అసెంబ్లీ స్థానాలు, 17 పార్లమెంటు స్థానాలూ ఖాళీగా వున్నాయి. టిక్కెట్లు కావలసినవారు యిప్పణ్నుంచి ప్రయత్నించుకోవచ్చు. బుకింగ్ తెరవబడినది. వివరాలకు మమ్మల్ని సంప్రదించవచ్చు.' అని. గతంలో పొత్తులుండేవి కాబట్టి కొన్నే లభ్యంగా వుండేవి. అవి కూడా ఏ స్థానాలో చివరిదాకా తెలియదు. దానిలో విజయావకాశాలు వున్న అభ్యర్థిని అప్పటికప్పుడు అంచనా వేయవలసి వచ్చేది. ఇప్పుడైతే చాలా టైముంది. ఎవరైనా కాండిడేటు వస్తే అతని యోగ్యతను బేరీజు వేసుకుని అభ్యర్థిగా సెలక్టు చేసుకోవచ్చు.

దీనివలన తెరాసకు ఓట్లు, సీట్లు పెరుగుతాయా? తరుగుతాయా? ఇప్పుడున్న సీట్ల కంటె తప్పకుండా పెరుగుతాయి. అయితే ఏ మేరకు? దీనికి సమాధానం చెప్పాలంటే వారితో పోటీ పడేవారి బలాబలాలు లెక్కలోకి తీసుకోవాలి. ఓట్ల సందర్భంగా నాయకులు అనేక వాగ్దానాలు చేయవచ్చు. ఏ కండువా (మెడలో) పడితే ఆ కండువా కప్పుకోవచ్చు. 'మీ మనసులో ఏముందో మాకు తెలుసు' అని నర్మగర్భంగా మాట్లాడవచ్చు. ఇంగ్లీషు భాషాప్రావీణ్యం ఉపయోగించి 'నాట్ విత్‌స్టాండింగ్..'లు 'వేర్‌యాజ్'లు పది పడేసి, ప్రతీ వాక్యంలోనూ మూడు నాలుగు నెగటివ్‌లు పడేసి, భావం ఏమిటో తెలియకుండా మానిఫెస్టో తయారుచేయవచ్చు.

ఏది ఏమైనా తెలుగు ప్రజలందరికీ స్పష్టంగా తెలిసిన విషయం – సిపిఎం సమైక్యవాదినని ఒప్పేసుకునే పార్టీ. మజ్లిస్ కూడా. అలా ఒప్పుకోకుండా సమైక్యవాదాన్ని నిలుపుకుంటూ, పైకి వేర్పాటువాదాన్ని ప్రవచిస్తూ, కర్ర విరక్కుండా పాము చావకుండా ఎన్నేళ్లయినా నడుపుకోవచ్చుకునే పార్టీలు – కాంగ్రెస్, టిడిపి, వైకాపా. (మళ్లీ వీరిలో తెలంగాణవైపు కాస్తయినా మొగ్గు చూపినది టిడిపియే. అయినా తెలంగాణలో అది పుంజుకోకపోవటం విషాదం) విభజనకు సై అనే పార్టీలు – తెరాస, బిజెపి, సిపిఐ. ఈ మూడు మాత్రమే తెలంగాణ ఏర్పాటుకు చిత్తశుద్ధిగా కట్టుబడినవి.

2014 ఎన్నికల ఫలితాలు వచ్చాక యీ మూడు పార్టీలకు వచ్చిన ఓట్లు మాత్రమే విభజనకు అనుకూలంగా పడిన ఓట్లగా గుర్తించాలి. ఎన్నికల ఉపన్యాసాలు పరిగణనలోకి తీసుకుని తక్కిన పార్టీల ఓట్లను కూడా కలిపేసి యింత శాతం మంది విభజన కోరుతున్నారని చెప్పడం పొరబాటు. బిజెపి ప్రస్తుతానికి విభజన అనవచ్చు. కేంద్రంలోకి అధికారంలోకి వచ్చాక రామమందిరం విషయంలో చేసినట్టు 'భాగస్వామ్యపక్షాలు ఒప్పుకోలేదు' అనే మిషపై తెలంగాణను అటకెక్కించవచ్చు. సిపిఐ గుడ్డికన్ను లాటిది. దాని గురించి మాట్లాడుకోవడమే వేస్టు. ఇక తెరాస ఒక్కటే ఎటువంటి శషభిషలు లేకుండా విభజన జండా వదలకుండా పట్టుకునేది. విభజన కోరేవారందరూ తెరాసకు గుత్తగా ఓటేస్తేనే విభజనవాదం బలం అందరికీ తెలిసివస్తుంది.

అయితే యిలా జరుగుతుందా లేదా అన్నది సందేహం. ఎన్నికల వేళకి రాష్ట్రవిభజన అనేది ప్రధానాంశం కాకుండా, వేరే అంశం ఏదైనా ముందుకు వస్తే అప్పుడు తెరాసకు కష్టమే. ఈ విషయం తెలిసిన మూడు ప్రధానపార్టీలు అది అంశం కాకుండా వేరేదాన్ని అంశంగా చేద్దామని చూస్తాయి. ఆ అంశానికి తోడు తెలంగాణా కూడా సైడ్ డిష్‌గా కలిపి ఓటర్లను గందరగోళ పరుస్తాయి. పరకాలలో కొండా సురేఖ చేసినది అదే. తెరాస అభ్యర్థి ఓడిపోతూ పోతూ గెలిచాడు.

తెలంగాణలో ప్రతి నియోజకవర్గంలో కనీసం అయిదుగురు అభ్యర్థులు తేలతారు. కాంగ్రెస్, టిడిపి, వైకాపా, తెరాస.. యీ నలుగురు వుండితీరతారు కదా. వీరు కాక బిజెపి కనీసం 70, 80 అసెంబ్లీ సీట్లలోనైనా నిలబడదా? ఎవరితోనూ పొత్తు కుదరకపోతే సిపిఐ–సిపిఎం కూటమి 20, 30 స్థానాల్లోనైనా పోటీ పడతారు. మజ్లిస్ యీ సారి 25, 30 స్థానాల్లో పోటీ చేయవచ్చు. వీరందరితో బాటు టిక్కెట్లు రాక రెబెల్స్‌గా పోటీ చేసేవారుంటారు. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ టిక్కెట్లు దొరక్క, నాయకత్వంపై అలిగి వచ్చే పెద్దనాయకులు పెట్టే పార్టీలు కూడా వుండవచ్చు. గతంలో దేవేందర్ గౌడ్ పార్టీ పెట్టినట్టు!

వైకాపాలో టిక్కెట్లు దొరకనివారు 'జగన్ నియంతృత్వ పోకడలు నిరసిస్తున్నాం' అంటూ 'వైకాపా (డెమోక్రాటిక్)' అనే పేరుతో పెట్టే పార్టీ, టిడిపితో అంటకాగితే తెలంగాణలో ఓట్లు రాలవని భయపడే ఎర్రబెల్లి వంటి నాయకులు తెలంగాణ టిడిపి పేరుతో ఓ పార్టీ, ఉద్యమం బలంగా వున్న మూడు జిల్లాలలో కాంగ్రెస్ పేరుతో ప్రజల్లోకి వెళితే కొడతారేమోనన్న భయంతో వున్న నాయకులు తెరాసలో చేరలేక, చివరి నిమిషంలో 'తెలంగాణ ఎప్పటికీ యివ్వని కాంగ్రెస్‌ను మేం విడిచి వచ్చేశాం' అని చెప్పుకోవడానికి 'తెలంగాణ సాధన కాంగ్రెస్' పేరుతో ఓ పార్టీ – యిలా కనీసం ఏదో ఒక పార్టీ రావడానికే చాలా అవకాశం వుంది.

ఇలా అయిదారుగురు అభ్యర్థుల మధ్య ఓట్లు చీలిపోయినపుడు ఏ పార్టీ మాత్రం తెలంగాణలో 90 సీట్లు వస్తాయని ఆశ పెట్టుకోగలదు? దేనికైనా 50 సీట్లు వస్తే వాళ్లు కాలరెగరేసుకోవచ్చు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**ఏప్రిల్ 07 వీక్లీకై ఎమ్బీయస్ : ఫ్లెక్సీలు – ఫ్లెక్సిబిలిటీలు**

వైకాపాలో చేరిన నాయకుడు ఫ్లెక్సీలో ఎన్టీయార్ బొమ్మ వాడడం కొత్త వివాదానికి దారి తీసింది. కొందరు టిడిపి నాయకులు అది అంతర్జాతీయ అపరాధం అన్నట్టు మాట్లాడుతున్నారు. ఎన్టీయార్ బొమ్మను తాము తప్ప వేరెవరు వాడడానికి వీల్లేదంటున్నారు. దీనిపై బాలకృష్ణ ఒకలా, హరికృష్ణ మరోలా మాట్లాడారు. టిడిపిలో విభేదాలు బయటపడ్డాయి. బాలకృష్ణకు జూనియర్‌పై వున్న అసహనం వెల్లడైంది. గతంలో పురంధరేశ్వరి ఎన్టీయార్ బొమ్మ వాడుకున్నపుడు మాట్లాడని బాలకృష్ణ యిప్పుడు స్నేహితుడు చేసినదానికి జూనియర్‌ను బాధ్యుణ్ని చేసి సంజాయిషీ చెప్పకపోతే పరిణామాలు ఎదుర్కోవలసి వుంటుందన్నారు. ఏ పరిణామాలు? ఎలాటి పరిణామాలు? పార్టీలోంచి బహిష్కరిస్తారా? పార్టీ ప్రచారానికి పిలవకుండా శిక్షిస్తారా? అతని సినిమాలు చూడవద్దని పార్టీ కార్యకర్తలకు పిలుపు నిస్తారా? కాస్త ఫ్లెక్సిబిలిటీ వుంటే, సంయమనం పాటిస్తే యీ అవకతవక మాటలు వచ్చేవి కావు.

మొదటగా – ఒక పార్టీ వ్యవస్థాపకుడి బొమ్మ మరొక పార్టీవాళ్లు వాడవచ్చా? అన్న విషయం పరికిద్దాం. కాంగ్రెస్‌వారి మీటింగుల్లో కట్టే బ్యానర్లు చూడండి – సుభాష్ చంద్ర బోసు బొమ్మ పెడతారు. ఆయన కాంగ్రెస్ వదిలేసి ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీ పెట్టుకున్నాడు. బోస్‌మీద గౌరవం వున్నవాళ్లందరూ ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరాలి తప్ప వేరే పార్టీలో వుంటే బోసు బొమ్మ వాడకూడదని ఫార్వర్డ్ బ్లాక్ వాళు

_ గొడవ పెడితే వీళ్లేమవుతారు? ఆంధ్రప్రదేశ్‌లో అయితే కాంగ్రెస్‌వారు చాలాకాలం ప్రకాశంగారి బొమ్మ వాడుకునేవారు. ఆయన కూడా కాంగ్రెస్‌లోంచి బయటకు వెళ్లి ప్రజా పార్టీ అని పెట్టుకున్నాడు. తమిళనాడులో కామరాజ్ నాడార్ కాంగ్రెస్ విడిచి వెళ్లిపోయాడు. అయినా కాంగ్రెస్ వాళ్లు ఆయన బొమ్మనే యిప్పటికీ వాడతారు. తమని గెలిపిస్తే 'కామరాజ్ రాజ్యం' తిరిగి తెస్తామని వాగ్దానాలు చేస్తారు. మరి కామరాజ్ బతికున్నపుడు వీళ్లంతా ఆయన వైపు వెళ్లనే లేదు. ఇందిరా కాంగ్రెస్‌లో వున్నారు. మరి దానికేమంటారు? అలాగే రాజాజీ కాంగ్రెస్ పార్టీ వదిలిపెట్టి స్వతంత్ర పార్టీ పెట్టారు. దానిలో చేరని కాంగ్రెస్ వాళ్లు కూడా రాజాజీ పోయాక కాంగ్రెస్ పార్టీ బ్యానర్లలో ఆయన ఫోటో వాడేసుకున్నారు. అణ్ణాదురై పెట్టిన పార్టీ డిఎంకె. దాన్లోంచి ఎమ్జీయార్ చీలిపోయి అణ్ణా డిఎంకె పార్టీ పెట్టి అణ్ణా పేరును, బొమ్మనూ కూడా వాడేసుకున్నాడు. మరి డిఎంకె వాళ్లు అభ్యంతర పెడితే చెల్లుతుందా? కొన్నాళ్లు పోయాక ఎమ్జీయార్ పేర యింకో పార్టీ వెలిసింది. వాళ్లు ఎమ్జీయార్ బొమ్మను వాడుకుంటున్నారు. ఎమ్జీయార్ పెట్టిన ఎడిఎంకెకు మాత్రమే పేటెంటు వుందంటే చెల్లుతుందా?

అంబేడ్కర్ కేసు మరీ అన్యాయం. ఆయన స్థాపించిన రిపబ్లికన్ పార్టీలో ఎవరూ చేరలేదు. దానికి మహారాష్ట్రలో కొద్దిగా బలం వుందంతే. అది కూడా రెండు పార్టీలుగా విడిపోయింది. మన రాష్ట్రంలో ఒకే ఒక్క ఎమ్మెల్యే వుండేవారు. ఈశ్వరీబాయి. ఆవిడ కూతురు కూడా ఆ పార్టీలో చేరలేదు. కాంగ్రెస్‌లో చేరి యిప్పుడు మంత్రి అయింది. ఆవిడే డా॥ గీతా రెడ్డి. మరి అంబేడ్కర్ బొమ్మ వాడుకోని పార్టీ ఒక్కటైనా వుందా చెప్పండి. అన్ని పార్టీల వాళ్లూ భారతమాత బొమ్మతో బాటు ఆయన బొమ్మా పెట్టేసుకుంటున్నారు. రిపబ్లికన్ పార్టీ వాళ్లు వచ్చి మీరెవరూ వాడడానికి వీల్లేదు అని గొడవ పెడితే వీళ్లంతా ఏమై పోతారు పాపం! ఉత్తరాదిన సోషలిస్టు నాయకులైన రామ్ మనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్ చాలా పాప్యులర్. వీళ్ల ఫోటోలు అన్ని పార్టీల వాళ్లూ ఎడాపెడా వాడేసుకుంటారు. అసలు ఈ పార్టీల గురించి లోహియా, జెపి బతికుండగా వినే వుండరు కూడా. ఇలా చూస్తే ఏ పార్టీ వాళ్లయినా సరే ఎవరి ఫోటో కావలసి వస్తే వాళ్లది వాడేసుకుంటున్నారని అర్థమవుతుంది.

తెలుగుదేశం పార్టీయే వుంది. ఎన్టీయార్ బతికుండగానే ఆయన్ను బయటకు నెట్టేశారు. ఆయన వేరే పార్టీ పెట్టుకున్నాడు. అప్పుడు ఆయన బొమ్మ ఆయన వాడుకోవచ్చా లేదా? ఆ బొమ్మ పేటెంటు తెలుగుదేశం పార్టీ దగ్గరే వుండిపోయిందా? ఎంత చిత్రమైన పరిస్థితో చూడండి. అలా ఎక్కడైనా వుంటుందా? ఈ వాదన ఎక్కడా చెల్లదు. అందుకే ఆయనా తన బొమ్మ వాడుకున్నాడు, ఆయన తర్వాత వచ్చిన తెలుగుదేశం (లక్ష్మీపార్వతి) పార్టీ, హరికృష్ణ పెట్టిన 'అన్న తెలుగుదేశం' పార్టీ కూడా వాడుకున్నాయి. అప్పుడు తెలుగుదేశం వాళ్లు అభ్యంతర పెట్టలేదు. ఎందుకంటే అప్పుడు వాళ్లు 'సినిమా రాజకీయాలకు' స్వస్తి పలికి వున్నారు. ఎన్టీయార్ బొమ్మను ప్రజల మెదళ్లలోంచి తుడిపేసే ప్రయత్నంలో వున్నారు. 'సినిమా గ్లామర్ అనవసరం, మంచి పరిపాలన అందిస్తే చాలు, ప్రజలకు గుర్తుండిపోతాం' అనే ఆలోచనాధోరణిలో వున్నారు. అందుకే తమ పార్టీ సభ్యత్వ పుస్తకాల నుండి, ఆఫీసుల నుండి ఎన్టీయార్ బొమ్మను తీసి పడేశారు. తాము తీసి పడేసిన దాన్ని ఎవరు ఎలా వాడుకుంటే ఏం అనుకుని వూరుకున్నారు.

కొన్నాళ్లకు గ్రహించారు – చనిపోయి దశాబ్దాలైనా ఎన్టీయార్ బొమ్మ జనాల హృదయాల్లో చెరిగిపోకుండా నిలిచిపోయిందని. సిఇఓ యిమేజికి ఓట్లు పడవని అర్థమయ్యాక ఎన్టీయార్ లెగసీకి పాకులాడారు. నందమూరి వంశాన్ని చేరదీశారు. పార్లమెంటులో ఎన్టీయార్ విగ్రహం వుండాలన్నారు, ఎయిర్‌పోర్టుకి ఎన్టీయార్ పేరు పెట్టాలన్నారు. 1996 నుండి 2004 వరకు పాలించినప్పుడు యివేమీ గుర్తుకు రాలేదు. పార్కులకు కూడా కాంగ్రెస్ నాయకుల పేర్లే నాలిక చివర ఆడాయి. అన్ని పేర్ల మధ్య ఎన్టీయార్ పేరు మరుగున పడుతుందనుకున్నారు. పడకపోయేసరికి దాన్ని సొంతం చేసుకుని, దానిపై మోనోపలీ సాధిద్దామని చూస్తున్నారు. ఆయన స్థాపించిన పార్టీ కాబట్టి మాకే ఆ పేటెంటు అంటున్నారు. టిడిపి అనేది – ఎన్టీయార్ స్థాపించిన పార్టీ మాత్రమే కాదు, ఆయన్ని తరిమేసి, చెప్పుసు విసిరిన పార్టీ కూడా! వాళ్లకే అన్ని హక్కులుంటే ఆయనపై అభిమానం చెక్కు చెదరకుండా వున్న సాధారణ ప్రజలకు ఎన్ని హక్కులుండాలి! బావతో చేతులు కలిపి తండ్రిపై తిరుగుబాటు చేసి, ఆయనకు క్షోభ కలిగించి, అకాలమృతికి కారకులైన కొడుకులకు, కూతుళ్లకు పేటెంటు గురించి మాట్లాడే అధికారం వుందంటే నవ్వాలో, ఏడవాలో తెలియదు.

ఇవాళ కాంగ్రెస్ వైయస్సార్ బొమ్మను వాడుకుంటోంది, పోయే సమయానికి తమ పార్టీ సభ్యుడిగా వున్నాడు కాబట్టి. తమ పార్టీ అధ్యక్షుడి తండ్రి కాబట్టి, ఆయన సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ ఏర్పరచామని చెప్పుకుంటోంది కాబట్టి వైకాపా వాడుకుంటోంది. రేపు వైకాపా చీలిందనుకోండి. కొడుకో పార్టీ, కూతురో పార్టీ పెట్టారనుకోండి. అప్పుడు యిద్దరూ వైయస్సార్ బొమ్మ వాడుకుంటారు కదా. పి జనార్దనరెడ్డి కొడుకు కాంగ్రెస్‌లోనూ, కూతురు వైకాపాలోనూ చేరారు. ఎన్నికల్లో యిద్దరూ తండ్రి బొమ్మ వాడుకుంటారు. ఎవరైనా అడ్డగలరా? జగన్, షర్మిల ఒకే పార్టీలో వున్నారనే అనుకుందాం. వైకాపాలో కొందరు జగన్‌తో విభేదించి బయటకు వచ్చి పార్టీ పెడితే వాళ్లూ వైయస్సార్ బొమ్మ వాడవచ్చు. కాంగ్రెస్ పార్టీ లోని వైయస్సార్ మాజీ అనుచరులు కేసుల్లో యిరుక్కుంటూ, తమ పార్టీ తమ కోసం ఏమీ చేయడం లేదన్న కోపంతో విడిగా వచ్చేసి ఎన్నికల్లో వైయస్సార్ పేర ఓ పార్టీ పెట్టుకోవచ్చు. జగన్ పార్టీలో టిక్కెట్లు దొరకనివాళ్లు వాళ్లతో చేతులు కలపవచ్చు. వాళ్లందరూ కలిసి వైయస్సార్ బొమ్మ పెట్టుకోవచ్చు. వీళ్లందరినీ వైకాపా నియంత్రించ గలదా? హెచ్చరించగలదా? అసలు దానికి కాపీరైటు వుందా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొత్తా? వైకాపా సొత్తా?

ఇలా చూస్తే – ఎవరూ ఎవర్నీ అదుపు చేయలేరని అర్థమవుతుంది. ఎన్టీయార్, వైయస్సార్ బతికి వున్నా ఏం చేయగలిగేవారు కాదేమో! అంబేడ్కర్ బొమ్మ చూస్తే ఎస్సీ, ఎస్టీలు, జ్యోతిరావు ఫూలే బొమ్మ చూస్తే బిసిలు (మొదట ఆయనెవరో గుర్తు పట్టాలనుకోండి),

రంగా బొమ్మ చూస్తే కాపులు.. ఓట్లేసేస్తారని అనుకుని విగ్రహాలు పెట్టేస్తున్నారు, బ్యానర్లు కట్టేస్తున్నారు. తీరా చూస్తే వీరిలో కొందరే నెగ్గుతున్నారు. ఇప్పుడు ఎన్టీయార్ బొమ్మ ఫ్లెక్సీలో పెట్టినంత మాత్రాన కొడాలి నానికి ఎన్టీయార్ అభిమానులందరూ ఓట్లేసేస్తారన్న గ్యారంటీ లేదు. అలాటి గ్యారంటీ వుంటే ప్రతీ అభ్యర్థీ అన్ని పార్టీల నాయకుల బొమ్మలూ తమ ఫ్లెక్సీల్లో యిరికించేస్తారు. కొడాలి నాని అన్యాయమార్గంలో అప్పుడే నెగ్గేసినట్టు, ఈ ఫ్లెక్సీ వలన ఏదో అనర్థం జరిగిపోయినట్టు టిడిపి నాయకులు గగ్గోలు పెట్టడం అనవసరం. పైగా దీనికి జూనియర్ సంజాయిషీ చెప్పాలనడం వింతల్లో కల్లా వింత. సంజాయిషీ, గింజాయిషీ జాన్తానై అన్న అర్థం వచ్చేట్టు నేను ఎప్పటికీ టిడిపి వాణ్నే అని చెప్పేసి జూనియర్ సరిపెట్టాడు. అంతే కదా, స్నేహితులు చేసిన దానికి కూడా 'బాద్‌షా'ను నిలదీస్తే ఎలా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**ఏప్రిల్ 08, 09 వీక్లీకై ఎమ్బీయస్ : సహారా టౌన్‌షిప్స్ యిక ఎడారులేనా?**

ఎట్టకేలకు ఏప్రిల్ 10, 2013 బుధవారం నాడు సెబి వాళ్లు సహారా గ్రూపు చైర్మన్ సుబ్రతా రాయ్‌ను తమ ఆఫీసుకి రప్పించగలిగారు. అతను మరో ముగ్గురు ఉన్నతాధికారులతో కలిసి వస్తే గంటపాటు నానారకాల ప్రశ్నలతో కూపీ లాగబోయింది. బయటకు వచ్చిన సుబ్రతా "నా వ్యక్తిగత ఆస్తుల గురించి అడిగితే నాకున్నది 3 కోట్ల రూ.లే అని చెప్పాను. గతంలో మీరిచ్చిన వివరాలన్నీ తప్పు అంటోంది సెబి. కప్పు కాఫీ కూడా యివ్వకుండా వేధించారు." అని ఆరోపించాడు. ఉత్తర భారతంలో సహారా గ్రూపు చాలా పెద్ద గ్రూపు. వివాదాల్లో చిక్కుకోవడం దానికి కొత్త కాదు. ఈ సారి మాత్రం చాలా పెద్ద స్థాయిలోనే యిరుక్కుంది. అందుకే తెలుగు పత్రికల్లో కూడా ఫుల్ పేజి యాడ్స్ దంచుతోంది. సింహాలతో సహా భారతమాత బొమ్మ వేసుకుని తామెంత దేశభక్తులమో, సెబి తమను ఎలా కష్టపెడుతోందో రాసేస్తోంది. ఆ యాడ్స్‌లోని ఇంగ్లీషు చదివితే సమాచారం మాట ఎలా వున్నా వినోదం మాత్రం తప్పక కలుగుతుందని నాదీ హామీ! వివాదానికి మూలకారణం గురించి సింపుల్‌గా చెప్పాలంటే – ఇదీ మన మార్గదర్శి లాటి కేసే. అర్హత లేకున్నా డిపాజిటర్ల నుండి డిపాజిట్లు వసూలు చేయడం, యితర సంస్థలకు మళ్లించడం!

2010లో సహారా గ్రూపువారు సెబి (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా)కి ఒక ప్రాస్పెక్టస్ సమర్పించారు – 'మా రియల్ ఎస్టేటు విభాగమైన సహారా ప్రైమ్ సిటీ డెవలపర్స్ ద్వారా ఐపిఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్)కు వెళ్లదలిచాం, అనుమతి యివ్వండి' అని. ఏదైనా ఒక కంపెనీని ప్రారంభించినపుడు కొందరు వ్యక్తుల పెట్టుబడులతో ప్రారంభిస్తారు. పరిమితమైన వ్యక్తుల షేర్లతో నడుస్తుంది కాబట్టి దాన్ని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అంటారు. దాని కార్యకలాపాలు విస్తరించాక, పెద్దదిగా చేద్దామనుకున్నపుడు ఆ కంపెనీ షేర్లు పబ్లిక్‌కి అమ్మజూపుతారు. అంటే ఆ షేర్లను మీరూ, నేనూ ఎవరైనా కొనవచ్చు. అలా అమ్మేటప్పుడు కంపెనీకున్న ఆస్తిపాస్తులు, అప్పులు, విస్తరణకు అవకాశాలు, అనుకున్నది జరగకపోవడానికి వుండే రిస్కులు అన్నీ పబ్లిక్‌కి తెలియపరుస్తారు. అప్పటిదాకా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ కాబట్టి ప్రమోటర్లపై నమ్మకం వున్నవాళ్లే పెట్టుబడి పెడతారు. కానీ ఎప్పుడైతే పబ్లిక్‌లోకి వస్తున్నారో వారి విశ్వాసాన్ని చూరగొనడానికి అన్నీ విషయాలు బాహాటంగా చెప్పాలి. సరిగ్గా చెపుతున్నారా లేదా అన్నది సెబి పరిశీలించి అనుమతి యిస్తుంది.

అలా సహారా కాగితాలు పరిశీలిస్తున్న సెబి సభ్యుడు కెఎమ్ అబ్రహాం వాళ్లు అప్పటికే 2.3 కోట్ల మంది మదుపుదార్ల నుండి డబ్బుల వసూలు మొదలు పెట్టేశారని గమనించారు. 'హౌసింగ్ బాండ్స్ పేర ఓఎఫ్‌సిడి (ఆప్షనల్లీ ఫుల్లీ కన్వర్టబుల్ డెబించర్స్)లు కోట్లకు కోట్లు వసూలు చేశారేమిటి?' అని అడిగితే 'అబ్బే అది ప్రైవేట్ యిన్వెస్ట్‌మెంట్, ఏదో వాళ్ల తరఫున మేము యితర వెంచర్స్‌లో పెట్టుబడి పెడుతున్నాం' అంది సహారా. '49 మంది ఎక్కువ మంది దగ్గర వసూలు చేస్తే మాకు చెప్పి చేయాలి కదా, స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో నమోదు చేయాలి కదా' అంది సెబి. 'పైగా మీరు 2008 నుండి వసూలు చేస్తున్నారు, అది ఫలానా టైముకి క్లోజ్ చేస్తాం అని చెప్పటం లేదు. మీ కంపెనీ బేస్ చూస్తే 10 లక్షల రూ.లు, మీరు 20,000 కోట్ల రూ.ల నిధులు సేకరిద్దామని చూస్తున్నారు. ఇదేం బాగాలేదు. మీరు ఆ ఓఎఫ్‌సిడిల ద్వారా వసూలు చేసిన మొత్తం డబ్బుని వాపసు యిచ్చేసి అప్పుడు కలవండి' అంది సెబి.

ఇది సహారాకు నచ్చలేదు. ట్రైబ్యునల్ (సెక్యూరిటీస్ ఎపిలేట్ ట్రైబ్యునల్)కు అప్పీలుకి వెళ్లారు. వాళ్లు అక్టోబరు 2011లో తీర్పు చెపుతూ సెబి వాదననే సమర్థించారు. ఆ తీర్పు కూడా సహారాకు నచ్చలేదు. దాన్ని రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టుకి వెళ్లారు. సుప్రీం కోర్టు 'ఏదీ మీ యిన్వెస్టర్ల లిస్టు చూదాం పట్టుకురండి' అంది. మన మార్గదర్శి డిపాజిటర్ల లిస్టులో చాలామంది పేర్లు పొడి అక్షరాలలో చూపించినట్టు సహారావాళ్లూ తమ పెట్టుబడిదార్ల పేర్లు అలాగే చూపించారు. జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహర్‌గారు లిస్టు పరికిస్తూ వుంటే కళావతి అనే పేరు కనబడింది. ఊరు పేరు తప్ప అడ్రసు లేదు. తండ్రిపేరు కానీ భర్తపేరు కానీ లేవు. సహారా డిపాజిటరా అంటే ఆ వివరమూ లేదు. ఇక ఆమెను పరిచయం చేసిన ఏజంటు పేరేమిటి? అక్కడ 'హరిద్వార్' అని రాసిపడేశారు. అదేదో సినిమాలో హాస్యగాడికి 'వైజాగ్' అని పేరు పెట్టినట్టు!

ఇలాటి కేసుల్లో సాధారణంగా రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు తమ నల్లధనాన్ని యిటువంటి సంస్థల్లో దాచుకుంటారు. బ్యాంకుల్లో అయితే డిపాజిటర్ల పేర్లు పక్కాగా అడుగుతారు. ఇలాటి సంస్థలైతే ఎల్లయ్య, పుల్లయ్య అనే పేర్ల మీద డిపాజిట్లు

తీసేసుకుని ఎన్నికల వేళ వాళ్లు మళ్లీ అడిగినప్పుడు యిచ్చేస్తారు. ఈ డబ్బుతో కంపెనీని పెద్దదిగా చేసి, సామాన్య డిపాజిటర్లను ఆకర్షిస్తారు. అనేకమంది తాము కష్టపడి దాచుకున్న డబ్బును దానిలో దాచుకుంటారు. కంపెనీ పెట్టినవాడు ఆ డబ్బును యితర కంపెనీలకు మళ్లిస్తాడు. అవన్నీ వాడి పేరనే వుంటాయి. ఎప్పుడో ఒక శుభముహూర్తాన కంపెనీ ఎత్తేస్తాడు. అప్పుడు డబ్బున్నవాళ్ల నల్లధనం, అవినీతి ధనం పోతుంది, దానితో బాటు అనేకమంది శ్రామిక జీవుల కష్టార్జితమూ పోతుంది. అనేకమంది టిడిపి నాయకులు తమ నల్లధనాన్ని మార్గదర్శిలో దాచుకున్నారన్న అనుమానం చేతనే వైయస్సార్ ఆ కంపెనీ మీద పడ్డారు. పలు ప్రయివేటు బ్యాంకులు మునిగిపోతే ఏమీ చేయలేదు కానీ యీ విషయంలో మాత్రం డిపాజిటర్ల హక్కుల పరిరక్షణ అంటూ ఉధృతంగా ముందుకు వెళ్లారు. అనుకున్నట్టే మార్గదర్శిలో అనేకమంది డిపాజిటర్ల పేర్లు సరిగ్గా లేవు. వాళ్లు వెనక్కి వచ్చి డబ్బు తీసుకోలేదు. కష్టార్జితమైతే ఎవరైనా వదులుకుంటారా? ఇదే విధంగా సహారా గ్రూపు ఉత్తరాది రాజకీయనాయకులకు కొమ్ము కాస్తుంది. అందుకే 3 కోట్ల మంది మదుపుదారుల నుండి అక్రమంగా నిధులు సేకరించినా వాళ్లు చూసీచూడనట్టు వూరుకుంటారు.

సహారా వ్యవహారం చూసిన సుప్రీం కోర్టు 2012 ఆగస్టులో తీర్పు యిస్తూ ఆ గ్రూపును నియంత్రించాలని పట్టుబట్టింది. డెబెంచర్స్‌లో పెట్టుబడి పెట్టినవారందరికీ 15% వడ్డీతో సహా మూడు నెలల్లో వెంటనే డబ్బు వెనక్కి యిచ్చేయమంది. అలా చేసేట్లు చూడమని సెబికి గట్టిగా చెప్పింది. సహారాకు అది యిష్టం లేదు. అక్టోబరులో రివ్యూ పిటిషను దాఖలు చేసింది. సహారాకు వున్న రాజకీయపరమైన పలుకుబడి వలన సెబి ఏమీ చేయకుండా కూర్చుని, ఏదో ఒకటి నామ్‌కే వాస్తే చేసినట్టు కనబడాలని నవంబరులో 'మీరు చెప్పిన తీర్పు ప్రకారం సహారా నడుచుకోవడం లేదు, ధిక్కరిస్తోంది.' అంటూ కోర్టులో కంటెప్ట్ పిటిషన్ వేసింది. డిసెంబరులో కంపెనీకి నోటీసు పంపింది. వెంటనే 5120 కోట్ల రూ.లు, జనవరిలో 10000 కోట్ల రూ.లు, తక్కినది ఫిబ్రవరిలో కట్టేయాలని అడిగి చేతులు దులుపుకుంది. ఈ వ్యవహారం చూసి సుప్రీం కోర్టుకి ఒళ్లు మండింది. 2013 ఫిబ్రవరిలో రివ్యూ పిటిషన్‌పై తీర్పు చెపుతూ 'కోర్టు ధిక్కరణ జరుపుతున్నది సహారానా, సెబినా అన్నది మాకు అర్థం కావటం లేదు. మా తీర్పు ప్రకారం సహారాపై మీరు ఎందుకు ఒత్తిడి తేవటం లేదు?' అని సెబిని గట్టిగా మందలించింది. ఇక గత్యంతరం లేని పరిస్థితిలో సెబి రంగంలోకి దిగింది.

సహారా హౌసింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పోరేషన్ లి., 6380 కోట్ల రూ.లు, సహారా ఇండియా రియల్ ఎస్టేటు కార్పోరేషన్ లి. 19,400 కోట్ల రూ.లు వసూలు చేయడంలో అక్రమాలకు పాల్పడ్డాయి కాబట్టి వాళ్ల బ్యాంకు ఖాతాలు, గ్రూపు ఆస్తులు, చైర్మన్ సుబ్రతా రాయ్ ఆస్తులు స్తంభింపచేయాలని ఆదేశాలు యిచ్చింది. నిజానికి సహారా యిలా వసూలు చేసిన డబ్బును మళ్లించి అనేక రియల్ ఎస్టేటు వెంచర్లలో పెట్టేసింది. ఇటీవలే 470 మిలియన్ పౌండ్లు పెట్టి లండన్‌లో ఒక హోటల్ , 760 డాలర్లు పెట్టి న్యూయార్క్‌లో మరో హోటల్ కొంది. (ఈ కొనుగోళ్లలో అక్రమాల్కట ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేటు వాళ్లు వెంటపడ్డారు). ఇది కాకుండా ఆగస్టు 2012లో సహారా క్యూ షాప్ అని రిటైల్ సెక్టార్‌లోకి దిగింది. సహారా వన్ మీడియా లి. అంటూ టీవీ ఛానెల్ నిర్వహిస్తోంది. ఇవన్నీ చాలనట్టు క్రీడల్లో కూడా ఏడాదికి 1500 కోట్ల రూ.ల పెట్టుబడులు పెడుతోంది. అన్నిటిలోనూ అవకతవకలే. సహారా ఇండియా ఫైనాన్షియల్ కార్పోరేషన్ పేర ఏడేళ్లలో 20,000 కోట్ల రూ.ల డిపాజిట్లు వసూలు చేస్తే 2008లో రిజర్వ్ బ్యాంక్ నిషేధం విధించింది. సేకరించినదంతా వెనక్కి యిచ్చేయమంది.

ఇప్పుడు సెబి కఠినమైన ఆదేశాలు యిచ్చింది కానీ వాటిని అమలు చేయడం అసాధ్యం అంటున్నారు నిపుణులు. దేశంలో 217 నగరాల్లో సహారా 33,633 ఎకరాల భూమి కొంది. అనేక చోట్ల యితర కంపెనీలతో కలిసి జాయింట్ వెంచర్స్ ప్రారంభించింది. అన్నీ సగంసగంలో ఆపింది. వాటిపై బాంకుల నుండి ఋణాలు తీసుకుంది. ఇప్పుడు సెబి వాటిని అమ్మేసి డబ్బు తీర్చమంటే అమ్మడం సాధ్యమా? మొదట తనఖా పెట్టించుకున్న బాంకుల వాళ్లు, పెట్టుబడులు పెట్టిన భాగస్వాములు, అడ్వాన్సులు యిచ్చిన యిళ్ల కొనుగోలుదారులు వూరుకుంటారా? ఇది నిధుల సేకరణలో యిబ్బందులు కాగా యిక చెల్లింపుల విషయానికి వస్తే పొడిపొడి అక్షరాల్లో పేర్లు రాసిన మదుపుదారులను గుర్తించడం ఎలా?

ఇన్ని అక్రమాలు చేసినా సహారా చింతించటం లేదు. "మేం చెల్లించవలసిన 25781 కోట్ల రూ.ల్లో 22117 కోట్లు యిప్పటికే చెల్లించివేశాం. ఇక యివ్వాల్సింది 3663 కోట్ల రూ.లు. సెబికి మేం కట్టిన 5120 కోట్ల రూ.లు డిపాజిట్ చేశాం కదా, దానిలోంచి యివ్వవచ్చు. గతంలో సుప్రీం కోర్టు గోల్డెన్ ఫారెస్టు కంపెనీకి యిలాటి ఆర్డర్లే 2004లో యిచ్చింది. ఇప్పటిదాకా వాళ్లు ఒక్క పైసా వెనక్కి యివ్వలేదు." అంటోంది. చూడండి దాని ధీమా! రాజకీయాలు, ఆర్థిక అక్రమాలు పెనవేసుకుంటే యిలాగే వుంటుంది – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**ఏప్రిల్ 10 వీక్లీకై** **ఎమ్బీయస్ : సి – ఓటరు సర్వే**

సాధారణంగా సర్వే ఫలితాలను ఒక్క పార్టీ మాత్రమే మెచ్చుకుంటుంది – వాళ్ల అంచనా ప్రకారం అత్యధిక స్థానాలు వస్తాయని చెప్పిన పార్టీయే ఆ పార్టీ! సర్వే ప్రజాభిప్రాయాన్ని సరియైన సూచికగా వుందని ఆ పార్టీ వాళ్లు మెచ్చుకుంటారు. ఇక తక్కిన పార్టీల వాళ్లందరూ శాంపుల్ సరిగ్గా లేదని, ఎక్కువమందిని అడిగి వుండరని, నగరాల్లో తప్ప గ్రామాల వైపు వెళ్లి వుండరని, గతంలో వీళు చెప్పిన జోస్యాలు తప్పాయనీ.. యిలా అనేక వంకలు పెడతారు. ఇవాళ వచ్చిన సర్వే ఫలితాలు చూస్తే మెచ్చుకున్నవాళ్లు ఒక్కళ్లూ

లేరు. అందరూ తిట్టినవాళ్లే. మాకు వచ్చేదానిలో సగం కూడా చెప్పలేదు వీళ్లు అంటున్నారు. ఎందుకంటే వైకాపా, టిడిపి, తెరాస మూడూ అప్‌బీట్‌లో వున్నాయి. ఈ సారి గెలుపు మాదే అంటున్నాయి. కాంగ్రెస్‌వాళ్లు యింత ధీమాగా చెప్పటం లేదు – ముఖ్యమంత్రి తప్ప! తక్కిన నాయకులు గుంభనగా వుంటారు. నాయకత్వం మారిస్తే అవకాశాలు మెరుగుపడతాయి అని గొణుగుతారు. కిరణ్‌కుమార్ని దింపి వీళ్లను కూర్చోబెడితే చాలు – తక్షణం వీళ్ల అంచనాలో గెలిచే సీట్ల సంఖ్య నాలుగు రెట్లు పెరిగిపోతుంది.

పార్టీల అభిప్రాయాలు పక్కన పెట్టండి, యింతకీ యీ సర్వేను మనం ఎంత నమ్మవచ్చు? నా మట్టుకు నాకు చాలావరకు నమ్మవచ్చని అనుకుంటున్నాను. నేను గత కొద్దికాలంగా రాస్తూనే వున్నాను – వైకాపా, టిడిపి, కాంగ్రెస్‌లకు అటూయిటూగా సమాన సంఖ్యలో సీట్లు వస్తాయని. దేన్నీ తీసిపారేయలేం. ఈ అధికధరల కారణంగా, అసమర్థత కారణంగా కాంగ్రెస్ ఓడిపోవడం ఖచ్చితం అని పేపర్లలో విశ్లేషకులందరూ రాస్తారు. అదేమిటో మీడియా ఎప్పుడూ అధికార పార్టీకి వ్యతిరేకంగానే రాస్తుంది. టీవీ యాంకర్లు చర్చల్లో అధికార పార్టీ ప్రతినిధిపై సెటైర్లు వేస్తార్లు. కాలమిస్టులెప్పుడూ ప్రభుత్వం మీద విసుర్లు విసురుతూనే వుంటారు. అవి చదివి మనలాటి మధ్యతరగతి మేధావి జనాభా 'ఇంకేముంది, పార్టీ పని అయిపోయింది' అనుకుంటూ వుంటాం. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చేసరికి కంగు తింటాం. ఎందుకంటే ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి పనిచేసే అంశాలు వేరే వుంటాయి. పార్టీ నిర్మాణం, అభ్యర్థి బలాబలాలు, యితర అభ్యర్థులు, స్థానిక నాయకుల ఐక్యత... యిలా అనేకం వుంటాయి. పైగా అధికార పార్టీకి అనేక సౌకర్యాలుంటాయి. అందువలన ఏదైనా విపరీతపరిస్థితి వుంటే తప్ప అధికార పార్టీ దారుణంగా ఓడిపోదు. అది కూడా ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపై వుండి – క్రెడిబుల్ ఆల్టర్నేటివ్ (నమ్మదగిన ప్రత్యామ్నాయం)గా రూపొందితేనే!

నా ఉద్దేశం ప్రకారం కాంగ్రెస్ విషయంలో అటువంటి అసాధారణ పరిస్థితి ఏమీ లేదు. దానికి వ్యతిరేకంగా వున్న ఓటును టిడిపి, వైకాపా, తెరాస పంచుకోబోతున్నాయి. అందువలన కాంగ్రెస్ చెత్తబుట్టలో పడిపోతుందని అనుకోవడం పగటికల మాత్రమే. 2009లో చూడండి, మహాకూటమి పేర కొన్ని పార్టీలను చేరదీసినా, వాటిలో అవి కొట్టుకుని కాంగ్రెస్‌ను ఎదిరించలేకపోయాయి. మధ్యలో పీఆర్పీ కొన్ని కాంగ్రెస్ ఓట్లు, కొన్ని మహాకూటమి చీల్చేసింది. కొన్ని చోట్ల లోకసత్తా అపోజిషన్ ఓట్లు చీల్చేసింది. దాంతో పరిస్థితి గందరగోళం అయిపోయింది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు, మహా కూటమికి యిద్దరికీ అనుకున్నన్ని ఓట్లు రాలేదు. పార్లమెంటులో కాంగ్రెస్ ఒక్కటే ఖుష్. ఇప్పుడూ అలాగే జరుగుతుంది. కాంగ్రెస్‌పై అసంతృప్తి వుంది. కానీ ఎవరికి వేయాలి? టిడిపి హేండ్స్ డౌన్ నెగ్గగలదన్న నమ్మకం వుందా? చంద్రబాబుకి తప్ప రాష్ట్రంలో వేరెవ్వరికీ ఆ నమ్మకం లేదు! కారణం – ఇన్ని ఉపయెన్నికలలో ఒక్కదానిలోనూ నెగ్గకపోవడం! పాదయాత్ర అద్భుతం అని మీడియాలో ఓ పక్క వార్తలు వస్తూండగానే ఆ పార్టీలోంచి యితర పార్టీల్లోకి నాయకులు దూకేయడం!

బాబు తను తప్పుకుని యువకులకు అవకాశం యివ్వడం లేదు. తలపడుతున్న నాయకులందరిలోనూ ఎక్కువ వయసు ఆయనదే. అదెక్కడ మర్చిపోతామోనని పాదయాత్ర కవరేజిలో రోజూ 'ఈ వయసులో కూడా మనకోసం కుంటుకుంటూ నడుస్తున్న...' అని మాటిమాటికీ గుర్తు చేస్తున్నారు ఆ పార్టీ నాయకులు, వారి అనుకూల మీడియా. హీరో ముసలివాడైతే సైడ్ హీరోగా యంగ్‌మ్యాన్‌ను పెట్టనివ్వడు. అలాగే బాబు తనతో బాటు తిరిగే ముఖ్యనాయకుల సగటు వయసు 60 వుండేట్టు చూసుకుంటున్నారు. ఓటర్లలో యువత శాతం పెరగనీ, అవతల యువనాయకత్వం పేరున పార్టీ ఉరకలు వేస్తూ రానీ, యీయన ఏం ఫర్వాలేదని కూర్చున్నారు. ఆ పార్టీలో ఎక్స్‌పీరియన్స్‌డ్ అన్నా ఆయనే, యూత్‌ఫుల్ అన్నా ఆయనే. గట్టిగా అడిగితే యంగ్ ఎట్ హార్ట్ అంటారు. ఇవన్నీ చాలనట్టు గత కొన్నేళ్లగా తన యిమేజికి వ్యతిరేకంగా బాబు ఉచిత హామీలు గుప్పిస్తూ పోతున్నారు. అవి జనం నమ్మే పరిస్థితి లేదు. అందువలన యిప్పటి పరిస్థితుల్లో టిడిపి నెగ్గుతుందంటే ఎవరూ నమ్మలేరు. అలా అని అది తుడిచి పెట్టుకుని పోదు కూడా. ఎందుకంటే మధ్యతరగతి ఓటర్లలో బాబు పరిపాలనా సామర్థ్యంపై నమ్మకం పోలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో మనకు కావలసిన బాబు వంటి పరిపాలనాదక్షుడు మాత్రమే అనే నమ్మకం వుంది. దీనికి తోడు పార్టీకి సంస్థాగత నిర్మాణం, వనరులు, అనుకూలమైన మీడియా వున్నాయి. అందువలన వాళ్లకు కూడా తగు సంఖ్యలో సీట్లు రాక తప్పదు.

కాంగ్రెస్ వ్యతిరేకులకున్న యింకో ప్రత్యామ్నాయం – వైకాపా! మొన్నటిదాకా నేషనల్ మీడియా కూడా వైకాపా స్వీప్ చేసేస్తుందంటూ రాశారు. జగన్ జైల్లోనే వుండిపోవడం నాయకులపై ఎటువంటి ప్రభావం చూపుతుందో వాళ్లు అంచనా వేయలేదు. పైగా వైకాపా ఖచ్చితంగా నెగ్గుతుందని అన్నపుడు దాని టిక్కెట్లకోసం అందరూ ఎగబడి, దొరకనివారు తిరుగుబాటు అభ్యర్థులుగా నిలబడి పార్టీ అవకాశాలను చెడగొడతారన్న సంగతీ లెక్కలోకి తీసుకోలేదు. మొన్న జిల్లా యిన్‌చార్జీల విషయంలో చూశాంగా – ఎలా కొట్టేసుకున్నారో! టిక్కెట్ల పంపిణీ వేళ ఇలాటివి యింకా ఎన్ని చూడాలో మరి. 'తగవులు తీర్చడానికి జగన్ అందుబాటులో లేరు. ఆయనకు తెలియకుండా వీళ్లందరూ నాటకాలు ఆడుతున్నారు' అని స్టేటుమెంటు యిచ్చేసి పార్టీ వదిలేసి వెళ్లిపోతారు చాలామంది. తిరుగుబాటు అభ్యర్థులుగా నిలబడతారు. వాళ్లూ వైయస్ ఫోటోలు పెట్టుకుని ప్రచారంలోకి దిగుతారు. ఎవరాపగలరు? ఓటర్లు గందరగోళ పడతారు. ఆ విధంగా వైకాపాకు వచ్చేవి తగ్గుతాయి.

తెలంగాణలో తెరాస గురించి చెప్పాలన్నా యిదే కథ. తెరాస తెలంగాణను స్వీప్ చేసేస్తుంది అని కథనాలు వస్తున్న కొద్దీ టిక్కెట్ల వద్ద కుమ్ములాటలు పెరుగుతాయి. కెసియార్ యితర పార్టీల నుండి ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారు. వచ్చినవాళ్లలో ఒక్కొరిది ఒక్కో నేపథ్యం. తెలంగాణ ఏర్పడాలన్న కోరిక ఒక్కటే సామాన్యాంశం. వీరంతా ఒకే పార్టీలో యిమడగలరా? 2004 లేదా 2009

ఎన్నికలలో తెరాస అభ్యర్థిని ఓడించిన ఒక టిడిపి లేదా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధి యిప్పుడు తెరాసలోకి వస్తే అక్కడ నుండి మళ్లీ టిక్కెట్టు ఆశిస్తున్న తెరాస నాయకుడికి దిక్కేమిటి? ఎన్నో ఏళ్లగా పార్టీని అంటిపెట్టుకున్న అతని కడుపు రగలదా? అసమ్మతివాదిగా మారడా? పైగా తెలంగాణ కోసం పోరాడుతున్నామని చెప్పే బిజెపి, సిపిఐ, వైకాపాలో ఒక వర్గం, టిడిపిలో ఒక వర్గం, యిటువంటి అసమ్మతివాదులు తయారయినపుడు ఓటరు గందరగోళ పడడా? వాళ్లందరినీ కాదని తెరాసకు మాత్రమే ఓటేస్తాడా? ఇలా ఎన్నో అంశాలు వుంటాయి. వీటివలన తెరాసకూడా తెలంగాణను స్వీప్ చేయలేదు. వాళ్లూ యితరులతో పంచుకోవలసినదే.

ఈ విధంగా చూస్తే అందరూ తలా కాస్తా పంచుకుంటారనే అనిపిస్తుంది. ఇప్పుడీ సర్వే చెప్పిందీ అదే. నాలుగు ముఖ్యమైన పార్టీలకు 8,9,9,12.. అంటూ దగ్గర దగ్గరగా అంకెలు యిచ్చింది. అయితే బిజెపికి 3 యివ్వడమే నాకు ఆశ్చర్యంగా వుంది. వాళ్లకూ ఆశ్చర్యం వేసి వుంటుంది. ఒకటి కూడా వస్తుందో రాదో అని నా అనుమానం. 42లో ఒకటి మజ్లిస్‌కు, మరొకటి బిజెపి, లేదా యిండిపెండెంటుగా నిలబడే అసమ్మతివాదికి పోగా తక్కిన 40ను కాంగ్రెస్, టిడిపి, వైకాపా, తెరాస తలా 10 పంచుకుంటాయనుకోవచ్చు. ఎన్నికలు దగ్గర పడేసరికి స్పష్టత వచ్చి ప్లస్ ఆర్ మైనస్ 2 వేసుకోవచ్చు. అంటే ఎవరికైనా సరే – మినిమమ్ 8, మాగ్జిమమ్ 12 అన్నమాట! ఎన్నికల పాటికి ఏదైనా వేవ్ వస్తే చెప్పలేం కానీ ప్రస్తుతానికి యిదీ పరిస్థితి! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**ఏప్రిల్ 11**

## ఎమ్బీయస్ : పిబి శ్రీనివాస్

పిబి శ్రీనివాస్ వెళ్లిపోయారు. ఆయన పేరు వినగానే తెరమీద జగ్గయ్య, కాంతారావు, హరనాథ్ – వీళ్లంతా గుర్తుకు వస్తారు. మెయిన్ హీరోలైన నాగేశ్వరరావు, రామారావు గార్లకు ఘంటసాలగారు పాడితే, సెకండ్ రేంజ్ హీరోలకు పిబి శ్రీనివాస్‌గారు పాడేవారు. మనవాళ్లకు ప్రతీదానికీ హిందీవాళ్లతో పోలిక తేవడం అలవాటు కాబట్టి ఘంటసాలను రఫీతోనూ, పిబిను ముకేష్‌తోనూ పోల్చేవారు. కానీ ఆలోచిస్తే పిబిను ముకేష్‌తో పోల్చడం కంటె మన్నా దేతో పోల్చడం సబబు. ఎందుకంటే ముకేష్ అంటే కొన్నిరకాల (ఎక్కువగా విషాద) గీతాలే గుర్తుకు వస్తాయి. హాస్యగీతాలు, భక్తి గీతాలు, క్లాసికల్ సాంగ్స్ గుర్తుకు రావు. కానీ పిబి శ్రీనివాస్ అన్ని రకాల పాటలూ పాడారు. హీరోలకూ, కమెడియన్స్‌కు, ముసలిపాత్రలకు – అందరికీ పాడారు. అంటే యివన్నీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారు పైకి వచ్చేవరకే! తర్వాత అందరికీ బాలుగారే పాడడం మొదలెట్టారు.

పిబి శ్రీనివాస్ అనగానే మనం కాలరెగరేసేది మరోదానికి కూడా వుంది. ఆయన అరవపాటలు విని తమిళులు ఆయన్ని తమిళుడిగా పొరబడే అవకాశం వుంది. కన్నడపాటలు విని కన్నడిగులు వాళ్లవాడు అనుకునే అవకాశం వుంది. అంత పెర్‌ఫెక్ట్ డిక్షన్ సాధించాడంటే ఆయన ఏ బోర్డర్ డిస్ట్రిక్టు వాడో అనుకుంటాం. కానీ కాదు. ఆయనది ఆంధ్రా నడిబొడ్డులో వున్న కాకినాడ. పరభాషీయులు ఎవరూ తగిలే అవకాశం లేని వూరు. అక్కణ్నుంచి ఆయన మద్రాసుకు తరలివచ్చారు. స్వయంకృషితో పలుభాషలు నేర్చుకున్నారు. తమిళ, కన్నడ, మలయాళ రంగాల్లోకూడా బావుటా ఎగరేశారు.

శ్రీనివాస్ దక్షిణాది భాషల్లోనే కాదు, హిందీలోనూ పాడారు. తర్వాత ఎప్పుడో జేసుదాసు, ఆ తర్వాత ఎస్పీబాలుగారలు పాడినా శ్రీనివాస్ పాడేనాటికి దక్షిణాది వాళ్లకు హిందీ పాటలు పాడే అవకాశం యివ్వడం అబ్బురమే. వాళ్లకు సౌత్ ఇండియన్ మ్యూజిక్ డైరక్టర్లు పనికి వచ్చారు కానీ గాయకులు మాత్రం పనికి రాలేదు. మనవాళ్ల హిందీ ఉచ్చారణ బాగుండదని వాళ్ల భయం. ఉచ్చారణ మాటకొస్తే లతా మంగేష్కర్ కూడా హిందీ ఫీల్డులో ముందులో యాక్సెప్ట్ కాలేదు. దిలీప్ కుమార్ 'కిచిడీ తినే ఈ మరాఠీ అమ్మాయి ఉర్దూలో ఏం పాడుతుంది' అన్నాడు. లతా నౌషాద్ వద్ద కష్టపడి చక్కటి డిక్షన్ నేర్చుకుంది. మరి పిబి అలా ఎవరిదగ్గరా నేర్చుకున్నట్టు కనబడదు. స్వయంకృషితోనే హిందీ, ఉర్దూలలో చక్కటి ఉచ్చారణ సాధించారు.

అలాటి లతా, పిబి శ్రీనివాస్ కలిసి పాడే సందర్భం వచ్చింది. జరిగినదేమిటంటే తెలుగులో ''నాదీ ఆడజన్మే'' (ఎన్టీయార్, సావిత్రి) సినిమాని ఏవీ మెయ్యప్పన్ హిందీలో తీశారు. ''మై భీ లడ్కీ హూ'' అని 1964లో రిలీజయింది. 'చిన్నారి పొన్నారి పూవూ' అనే పాట వుంది కదా, దాన్ని హిందీ వెర్షన్ పాడాలి. చిత్రగుప్త సంగీతం. 'చందాసే హెూగా ప్యారా' అని లతా హీరోయిన్‌కి పాడుతుంది. హీరోకి ఎవరు పాడాలి? ధర్మేంద్ర హీరో కాబట్టి న్యాయప్రకారం రఫీ పాడాలి. కానీ రఫీకి, లతాకు అప్పట్లో రాయల్టీల గొడవ నడుస్తోంది. కలిసి పాడటం లేదు. అందువల్ల పిబి శ్రీనివాస్‌ను బుక్ చేసుకున్నారు. ఈ విషయం లతాకు తెలియదు. పాట పాడబోతూ 'ఇంతకీ ఎవరూ మేల్ సింగర్?' అంది. ఇలా పిబి శ్రీనివాస్ అనగానే ఆవిడ మండి పడింది. 'ఓ మద్రాసీ హిందీ పాటేం పాడతాడు? అతనితో కలిసి నేను పాడడమా?' అంది.

లతా అలా అనగానే 'ఏం చేయమంటావు తల్లీ, రఫీతో నువ్వు పాడటం లేదు కదా' అన్నారు వీళ్లు.

'రఫీ లేకపోతే ముకేష్ లేడా, మన్నా దే లేడా? ఎవరూ దొరకనట్టు ఈయనెందుకు?' అంది. మొత్తానికి బతిమాలి ఆవిణ్ని ఒప్పించారు. ఈ విషయం పిబియస్ చెప్పుకోలేదు, రాసుకోలేదు. ఇలా ఆవిడ అందన్న కోపమూ లేదాయనకు. (ఈ సంగతి నాకు వేరేవారు చెప్పారు) పాట పాడడం పూర్తయ్యేసరికి లతాకు పిబి శ్రీనివాస్ సత్తా తెలిసింది. తర్వాత ఆవిడ బొంబాయి వెళ్లి అనేకమంది నిర్మాతలకు, పదిమంది సంగీతదర్శకులకు ఈయన్ని సిఫారసు చేసింది. దానికి పిబియస్ కొండెక్కినంత ఆనందపడ్డారు. అవి పెద్దగా ఫ్రక్టిఫై అవ్వలేదనుకోండి. అయినా ఇక్కడ సౌత్‌లో ఆయనకు బోల్డంత మార్కెట్ వుండగా అక్కడకు పోయి నెలల తరబడి కూచోడమూ

కష్టం!

లతా మంగేష్కర్ అంటే పిబికి చాలా యిష్టం. వాళ్ల అమ్మాయికి స్వరలత అని పేరు పెట్టుకున్నారు. గాయనిగా లతా మంగేష్కర్ సిల్వర్‌జూబ్లీ జరిగినప్పుడు ఆయన 'సప్తస్వర సుందరీ' అనే శీర్షికతో ఓ ప్రశంసాగీతం రాసి, స్వరపరచి, టేప్‌లో రికార్డు చేసి ఆమె యింటికి వెళ్లి సమర్పించారు.

సంగీత్ గగన్‌కా ధ్రువ్ తారా, యే నామ్ లతాకా హై ప్యారా

బహ్‌తాహై బన్‌కర్ రస్‌ధారా, హర్‌గీత్ లతాకా హై న్యారా

హై సాత్ సురోం నే ఖుద్ మిల్‌కర్, ఇక్‌రూప్ లియా వర్ నారీకా

ఆరామ్‌హై దేతీ జోగమ్‌కో, దరియా బన్‌కర్ దిల్‌దారీకా..

అంటూ సాగుతుంది. పాట విని లతా పిబిని చాలా అభినందించారట. ముఖ్యంగా అందులో లతా గానాన్ని వర్ణిస్తూ ఓ మాట వుంది – 'కిత్‌నీ హై దవా యే హిత్‌కారీ' అని. 'మేలు చేసే ఔషధం ఆమె పాట' అనే అర్థంలో. అది ఆమెకు మరీ నచ్చిందట.

మేం "హాసం" పత్రిక నడిపే రోజుల్లో పిబి శ్రీనివాస్ గారిచేత లతా మంగేష్కర్‌పై సీరియల్ రాయించాం. ఈ కవిత్వం మకుటం వుందిగా 'సప్తస్వర సుందరీ' అని ఆ పేరుతోనే లతా జీవిత చరిత్ర 19 సంచికలపాటు రాశారు పిబి. ఆయనకు చక్కటి అబ్జర్వేషన్ వుంది, విశ్లేషణ వుంది. బ్రహ్మాండమైన భాషా పరిజ్ఞానం వుంది. అయినా సీరియల్ పాఠకులకు అంతగా రుచించలేదు.

దానికో కారణం వుంది. పిబి శ్రీనివాస్ రాసిన లతా సీరియల్ వేసేముందు మేము 'కిశోర్ జీవన ఝరి' అనే సీరియల్ వేశాం. నటగాయకుడు కిశోర్ కుమార్ జీవితం గురించి నేను రాసిన సీరియల్ అది. కిశోర్ కుమార్ లైఫ్ మోస్ట్ కలర్‌ఫుల్. క్రేజీ పెర్సనాలిటీ, నాలుగు పెళ్లిళ్లు, కాంట్రవర్సీలు, జీవితంలో ఎగుడు దిగుళ్లు, యాక్టర్‌గా ఫెయిలవ్వడం, సింగర్‌గా మళ్లీ పైకి రావడం – సీరియల్ మహా రంజుగా నడిచింది. దాని వెంటనే లతా సీరియల్. లతా జీవితంలో కూడా కాంట్రవర్సీలు వున్నాయి. సి రామచంద్రను పెళ్లి చేసుకుందా మనుకుందనీ, ఓపి నయ్యర్‌తో పడలేదనీ, రాయల్టీ విషయంలో రఫీతో పోట్లాడిందనీ, ఎస్‌డీ బర్మన్‌తో కొన్నాళ్లు పాడలేదనీ, మిగతా గాయనీ మణులను పైకి రానీయకుండా అణిచేసిందనీ – ఇలా చాలా వున్నాయి. అవన్నీ రాస్తారేమోనని పాఠకుల ఆశ.

ఈయన చూస్తే లతాను మెచ్చుకోవడమే తప్ప వ్యతిరేకంగా ఒక్కమాట అనకపోవడం చూసి పాఠకులు నొచ్చుకోవడం మొదలెట్టారు. మేనేజింగ్ ఎడిటర్‌గా పాఠకులను శాంతింప జేయడం నా బాధ్యత. అందువల్ల లతా గురించిన కాంట్రవర్సీలన్నిటిమీదా నేను బాక్స్ ఐటమ్స్ రాయడం మొదలెట్టాను. మెయిన్ బాడీ మేటర్‌తో కాన్‌ఫ్లిక్ట్ రాకుండా వేరే కలర్‌లో వేస్తూ, ఆయన పొగడ్తలను బ్యాలన్స్ చేస్తూ సీరియల్ నడిపాను.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే శ్రీనివాస్‌గారి తత్వం గురించి చెప్పడానికి చెపుతున్నాను. ఆయన 1963లో జ్యోతి మాసపత్రికలో, అంటే బాపు, రమణలు నడిపే రోజుల్లో గాయకుల గురించి, సంగీతదర్శకుల గురించి అనేక వ్యాసాలు రాశారు. ఎంతో సమాచారం, మంచి విశ్లేషణ. "హాసం"లో కూడా ఆయనచేత కొన్ని వ్యాసాలు రాయించాం. ఎఎమ్ రాజా, ఎస్.జానకి, జమునారాణి.. ఇలా కొంతమంది గురించి. ఎవరి గురించి రాసినా ఆయనది ఇదే ధోరణి. విమర్శ అస్సలు వుండదు. అందర్నీ మెచ్చుకోవడమే. అంటే దానివల్ల ఆయన లబ్ధి పొందుతారని కాదు. ఆయన మృదుస్వభావం, సహృదయం అలాటివి. మరి ఇలాటాయన నేను రాసిన బాక్స్ ఐటమ్స్ గురించి ఎలా ఫీలయ్యారు?

సీరియల్ నడిచే రోజుల్లోనే నేను పత్రిక మార్కెటింగ్, యాడ్స్ సేకరణ పనులపై మద్రాసు వెళ్లినపుడు పిబి శ్రీనివాస్‌గార్ని కలిశాను. కాస్త జంకుతూనే. ఎందుకంటే ఆయన మాన్యుస్క్రిప్ట్‌ను నేను చాలా మార్చేశాను. ఆయన వాక్యాలు చాలా పొడుగ్గా వుండేవి. వాక్యనిర్మాణంలో కూడా హిందీ స్టయిల్లో క్రియాపదం మధ్యలో వచ్చేసేది. కాస్త పాతకాలం భాష. వర్ణనలు ఎక్కువ. నేటి పాఠకుడికి అవి తలకెక్కవని, ఆయన రాసినదానిలో భావాన్ని అలాగే వుంచి నా భాషలో తిరగరాసేను. ఆయన లబ్ధప్రతిష్టుడైన వ్యాసకర్త, కవి. 'హత్తెరీ, నువ్వెవడవురా మార్చి పారేయడానికి..?' అని ఆయన తిడితే, కనీసం మందలిస్తే...? పత్రిక కాపీ ఆయనకు వెళ్లేది. ఆయన ఫోన్ చేసి ఏమీ తిట్టలేదు, విమర్శించలేదు. అలా అని 'నాది బాగా మార్చారే' అనీ అనలేదు. మౌనం అర్ధాంగీకారం కదా అనుకుని ప్రత్యక్షంగా కలిసే ధైర్యం చేశా.

ఆయన అడ్డా వుడ్‌లాండ్స్ డ్రైవ్ ఇన్ హొటల్. అక్కడ ఓ చోట కూచుంటారు. ఎవరైనా వచ్చి ఆయన్ని అక్కడ కలవవచ్చు. ఏ అడ్డంకులూ లేవు, ప్రయర్ అపాయింట్‌మెంట్స్ అక్కరలేదు. వెళ్లి ఫలానా అని నమస్కారం పెడితే చాలు, పక్కన కూచోబెట్టుకుని కాఫీ ఆర్డర్ చేస్తారు. అంత యాక్సెసబుల్ పర్సన్. ఆయన హైదరాబాదు వస్తే మినర్వా కాఫీ హౌస్‌లో దొరికేవారు. కలవగానే 'మా మిసెస్‌కు మీ పాటలు చాలా యిష్టమండీ' అన్నాను. 'షీ గాట్ ఏ గుడ్ టేస్ట్' అన్నారు ఆయన కొంటెగా. ఇది భానుమతి గారి జోక్. ఓ పత్రిక వారు ఆవిడ వద్దకు వెళ్లి గొప్పగా "మేం నిర్వహించిన బ్యాలట్‌లో మా పాఠకులు మిమ్మల్ని ఉత్తమ నటిగా ఎన్నుకున్నారు మేడమ్" అని చెప్పారు. ఆవిడ ఉబ్బి తబ్బిబ్బవకుండా 'మీ పాఠకులకు మంచి అభిరుచి వుంది' అంది. ఆ జోకే పిబియస్ నాపై వేశారు.

'అఫ్‌కోర్స్, అందుకే కదా నన్ను పెళ్లి చేసుకుంది' అన్నాను నేను నవ్వుతూ.

ఆయనా నవ్వుతూ భుజం తట్టి 'మీ కిశోర్ కుమార్ సీరియల్ చదివాను, చాలా బాగుంది.' అని మెచ్చుకుని, 'అవునూ, లతా సీరియల్‌లో బాక్స్ ఐటమ్స్ అలా వేస్తున్నారేమిటి?' అన్నారు.

'చచ్చాంరా బాబూ' అనుకుని, 'మీ దానికి బ్యాలన్స్ చేయాలని.. జర్నలిజంలో ఇవి తప్పవులెండి' అన్నాను ఆయన ఆ విషయం వదిలిపెట్టేస్తే బాగుండును అనుకుంటూ.

'అబ్బే, అవి వద్దు. ఎందుకొచ్చిన కాంట్రవర్సీలు. మనకు కావలసినది ఆవిడ పాట. మిగతా గొడవలు మనకు అనవసరం. మీరు అంతగా ఆ మేటర్ రాద్దామనుకుంటే వేరే పేజీల్లో వేసుకోండి. నేను రాసే మేటర్ పక్కనే వేయకండి. ఎవరైనా ఆవిడకు యీ విషయం మోసేస్తే ఆవిడకు కోపం వస్తుంది. లేనిపోని చిక్కులు..' అన్నారు.

ఏ పత్రికలోనైనా అలా విడివిడిగా వేయడం జరుగుతుందా? రెండు వెర్షన్లూ పక్కపక్కనే వేస్తారు. సరే, సరే అంటూ బుర్ర వూపాను కానీ నా పద్ధతిలోనే నేను వెళ్లాను. అయితే సుగుణం ఏమిటంటే ఆయన లతా పట్ల ఎంత ఉదారంగా వున్నారో మా పట్లా అంతే ఉదారంగా వున్నారు. 'నేను చెప్పినట్లు చేయకపోతే సీరియల్ ఆపేస్తాను' అని బెదిరించలేదు.

ఆ తర్వాత చాలాసేపు మాట్లాడుకున్నాం. సాటి కళాకారులందరి పట్లా ఆయనకు గౌరవభావమే. వ్యాసాల్లో రాసినదే మాటల్లోనూ ప్రతిఫలించింది. నిజానికి చిన్నమార్కెట్టయిన కన్నడంలో తప్పితే పెద్ద మార్కెట్లయిన తెలుగు, తమిళం రెండు రంగాల్లోనూ ఆయనది రెండో స్థానమే. అగ్రస్థానాలు ఇటు ఘంటసాల, అటు సౌందరరాజన్ తీసేసుకున్నారు. సాధారణంగా అటువంటి పరిస్థితుల్లో మామూలువాళ్లు 'నేను అసలు నెంబర్ వన్ కావలసినది, కానీ కుట్రలు పన్ని నేను పైకి రాకుండా చూశారు' లాటి ధోరణిలో మాట్లాడతారు. పిబిలో అటువంటి ఫీలింగ్స్ ఏ కోశానా కనబడవు.

శ్రీనివాస్ మెయిన్ ఎస్సెట్ ఆయన బేస్ వాయిస్. మార్దవం అంటే ఆయన గొంతే గుర్తుకు వస్తుంది. ముఖ్యంగా తమిళరంగంలో ఇది కొట్టవచ్చినట్టు కనబడుతుంది. అక్కడ శివాజీ, ఎంజీయార్ అగ్రహీరోలు. గొంతుచించుకుని సౌందరరాజన్ పాడే పాటలు వాళ్లకు నప్పాయి. జెమినీ గణేశ్ కూడా కొన్నిట్లో హీరో, కొన్నిట్లో పారలెల్ హీరో, మరి కొన్నిట్లో సెకండ్ హీరో. తమిళ హీరోల్లో కాస్త లాలిత్యం వున్నవాడు. ఆయనకు పిబియే ఎక్కువగా పాడారు.

అలాగే తెలుగుహీరోల్లో హరనాథ్. సౌకుమార్యం వున్న హీరో. చూడ్డానికి మంచి పెర్సనాలిటీ వుంటుంది. కానీ ఎందుకో గానీ ఎఫిమెనేట్ అనిపిస్తుంది. ఎక్కడో కనబడీ కనబడని ఆడంగితనం తొంగిచూస్తుంది. జెమినీ గణేశనూ అంతే! ఇలాటివాళ్లు మహిళా ప్రేక్షకులకు బాగా నచ్చుతారు. అటువంటి వాళ్లకు పిబి వాయిస్ చక్కగా నప్పుతుంది. అంతెందుకు, నాగేశ్వరరావు గారు "ప్రేమించిచూడు" సినిమాలో గెటప్ మార్చి టీషర్టు వేసి, నుదుటిమీద జుట్టుపడేలా హెయిర్‌స్టయిల్ మార్చి కాస్త హుషారుగా కనబడబోయేసరికి పిబి శ్రీనివాస్ వాయిస్ ఎరువు తెచ్చుకున్నారు. 'మీ అందాల చేతులు కందేను పాపం ఎందుకు ఈ బెడద' 'మేడమీద మేడ కట్టి కోట్లు కూడబెట్టినట్టి కామందూ' ఇలాటి వంటి అల్లరి పాటల్లోనే కాదు, 'అది ఒక ఇదిలే, ఆమెకు తగులే' 'వెన్నెల రేయి, ఎంతో చలి చలి' ఇలాటి రొమాంటిక్ గీతాల్లో కూడా పిబి చెలరేగిపోయారు.

ఈ మాటలు నేను ఆయనతో అంటే "మీ అబ్జర్వేషన్ బాగుంది. కానీ నేను జెమినీ గణేశన్‌కు చాలా పాటలు పాడానని మీకెలా తెలుసు?" అని అడిగారు. "నేను మద్రాసులో పదేళ్లు వున్నాను. వెస్ట్ మాంబళంలో, అశోక్‌నగర్‌లలో వుంటూ మీ సిఐటి నగర్ ద్వారానే మా ఆఫీసుకి స్కూటర్‌మీద వెళ్లేవాణ్ని" అని చెప్పాను. "మరి యింత అభిమానం వుండి, యీ పక్కనుండి వెళుతూ నన్ను కలవడానికి రాలేదేం?" అని వాత్సల్యంతోనే చివాట్లు వేశారు.

"ఇప్పుడేదో సందర్భం కుదిరింది కనుక వచ్చి కలిశాను. లేకపోతే వచ్చి సంభాషణ ఎలా ప్రారంభించాలో అవస్థ పడేవాణ్ని" అని చెప్పుకున్నాను. నిజానికి నా అభిమాన కళాకారులందరితోనూ నాది యిదే సమస్య. వెళ్లి 'మీరు బాగా నటిస్తారనో', 'బాగా రాస్తారనో', 'బాగా పాడతారనో' చెపితే 'ఆ విషయం మాకు ముందే తెలుసులే..' అంటారేమో. 'మీరు మామూలుగా బాగానే రాస్తారు కానీ ఫలానా కథ మాత్రం అదోలా వుందండి' అంటే వాళ్లు మొహం మాడ్చుకుని 'అది చాలామంది మెచ్చుకున్నారండీ, ఈ సారి కాస్త తాపీగా చదవండి, అర్థమవుతుందేమో..' అంటే!? అప్పుడు సంభాషణ ముందుకెలా సాగుతుంది అని జంకు. మనం సైలెంటు అయిపోవడం చూసి వాళ్లు "ఎక్కడుంటారు? పెళ్లయిందా? పిల్లలా?" వంటి ప్రశ్నలు అడుగుతారు. లేకపోతే "మీరు బ్యాంకులో పనిచేస్తున్నారని చెప్పారు కదా, మీ బ్యాంకుల వాళ్ల సర్వీసు యింత ఘోరంగా వుంటుందేమిటండీ, మా బ్యాంకు వాడు చెప్పా పెట్టకుండా మొన్న వెయ్యి రూపాయలు డెబిట్ చేశాడు, ఎందుకురా అంటే ఏమో అంటాడు.." అని వాపోతారు.

ఎదుట పడడం దేనికని ఫోన్ చేద్దామన్నా జంకే. చికాగ్గా వున్నపుడో, ఏదో ఎవార్డు ఎనౌన్సు చేసే కాల్ కోసం ఎదురుచూసేటప్పుడో మనం కాల్ చేస్తే వాళ్లకు ఒళ్లు మండిపోదూ! వాళ్లు పొడిపొడిగా మాట్లాడి ఫోన్ పెట్టేస్తే మన అహం దెబ్బతింటుంది. అనవసరంగా చేశాం, చేసి బావుకున్నదేమిటి అనిపిస్తుంది. ఇప్పుడయితే ఈ మెయిల్స్ వచ్చేశాయి. దీనిలో సౌలభ్యం – ఎంత కావాలంటే అంత మెచ్చుకోవచ్చు, లేకపోతే తిట్టేయవచ్చు. మొహం మాడ్చుకున్నా, విప్పార్చినా మనకేం వాసన తగలదు. కానీ నా అభిమాన కళాకారుల్లో చాలామంది ఈమెయిల్స్ చూసే తరహా కాదు. నాకు యిటీవల కొద్దికొద్దిగా అభిమానులు ఏర్పడుతున్నారు కాబట్టి నేను కంచెకు యిటువైపు జరుగుతున్నాను. ఒక అభిమానిగా సాటి అభిమానుల యిబ్బందులు నాకు తెలుసు. 'కావాలంటే ఓ మెయిల్ కొట్టండి' అని చెప్పేస్తున్నాను. ఈ కారణాల వలన పిబియస్‌గార్నే కాదు, ఎంతోమంది మహానుభావులను ప్రత్యక్షంగా కలవలేదు. సభలకు

వెళ్లినా దూరం నుండే నమస్కారం పెట్టుకున్నాను.

ఇక పిబియస్ గానకౌశలంలోకి మళ్లీ వస్తే – నాగేశ్వరరావు కాస్త ఎఫిమినేట్ కాబట్టి పిబి బాగానే సూటయ్యారని అనుకోవచ్చు. కానీ ఆయన ఎన్టీ రామారావుకు కూడా పాడారు. భానుమతిగారు తీసిన 'వివాహబంధం' సినిమాలో డ్యూయెట్ వుంది. 'నీటిలోనా, నింగిలోనా నీవే వున్నావులే' అని. అప్పట్లో ఘంటసాల భానుమతిగారితో డ్యూయెట్లు పాడటం లేదు. అందువల్ల ఆ ఛాన్సు పిబికి దక్కింది. ''రాము'' సినిమాలో 'మంటలు రేపే నెలరాజా' పాట వుంది కదా, దాని ఒరిజినల్ తమిళ్ వెర్షన్‌లో జెమినీ గణేశ్‌కు పిబియే పాడారు. 'నిలవే ఎన్నిడం' పాట చాలా, చాలా – గట్టిగా మాట్లాడితే తెలుగుపాట కంటె – బాగుంటుంది. ఆ ముక్కే ఘంటసాలా అనుకున్నారు. తెలుగు వెర్షన్‌కూడా పిబిచేతే పాడిస్తే మంచిది కదా అన్నారు. కానీ రామారావుగారు అనగానే ఘంటసాల వుండకపోతే బాగుండదని నిర్మాతల అభిప్రాయం. ఇక తప్పక ఘంటసాల గారే పాడాల్సి వచ్చింది. ఆ నిర్మాత అలా అనుకున్నారు కానీ రామారావుగారికి పిబి పాడిన హిట్ పాటలు లేకపోలేదు. ''ఆడబ్రతుకు''లో 'బుజ్జి బుజ్జి పాపాయి', ''దేవాంతకుడు''లో 'గో గో గోంగూర' , ''ఇంటికి దీపం ఇల్లాలే''లో 'ఎవరి ఎవరు కాపలా?' ఇవన్నీ ఈయనవేగా!

హరనాథ్ లాటి లేత వాయిస్‌వాళ్లకూ పిబి వాయిస్ నప్పింది, జగ్గయ్యవంటి గంభీరకంఠులకూ నప్పింది. అదీ తమాషా! 'ఓహో గులాబిబాలా' పాట ఎవరైనా మర్చిపోగలరా? 'గుడిగంటలు'లో 'నీలి కన్నుల నీడలలోనా' మాత్రం! హరనాథ్ కయితే 'నీలి మేఘమాలవో'– ''మదనకామరాజు కథ, 'అందాల ఓ చిలుకా' – ''లేత మనసులు'', 'నా మాట నమ్మితివేలా' – ''నాదీ ఆడజన్మే'', 'ఆనాటి చెలిమి ఒక కల' – ''పెళ్లిరోజు'' – యిలా ఎన్నయినా చెప్పవచ్చు.

''ఋణానుబంధం''లో నాగేశ్వరరావు గారికి 'అందమైన బావా, ఆవుపాల కోవా' లో అల్లరిగా పాడిన పిబియే ''మనసే మందిరం''లో 'తలచినదే జరిగినదా దైవం ఎందులకు' సీరియస్‌గా పాడారు.

విఠలాచార్య గారి సినిమాల్లో కాంతారావుగారికి కూడా ఎన్నో మంచిపాటలు పాడారు. ''చిక్కడు–దొరకడు''లో 'కనకపు సింహాసనమున' అనే పోటాపోటీ పాటలో రామారావుకి ఘంటసాల, కాంతారావుకు పిబి, విడిగా ''భీష్మ''లో 'మనసులోని కోరికా' లాటి మంచి పాటలున్నాయి. ''కానిస్టేబుల్ కూతురు''లో అయితే 'వెన్నెల కేలా నాపై కోపం' అని కాంతారావుకి, 'చిగురాకుల ఊయలలో' అని జగ్గయ్యకూ ఇద్దరికీ పాడారు పిబి.

తమిళంలో జెమినిగణేశ్‌కు ఆయన పాడిన పాటల్లో ''పావమన్నిప్పు''లో 'కాలంగళిల్ అవళ్ వసందం' చాలా బాగుంటుంది. ఇంకోటి ''పణితిరై''లో 'ఒరే కేళ్వి, ఒరే కేళ్వి' (తెలుగులో 'ఒకే మాట ఒకే మాట నాకు వేడుకా'). అలాగే ముత్తురామన్‌కు కూడా చాలా మంచి పాటలు పాడారు.

ఏమాట కా మాట చెప్పాలంటే ఆయన టాలెంట్ తమిళవాళ్లు, కన్నడవాళ్లు ఉపయోగించుకున్నట్టు మనం ఉపయోగించుకోలేదు. అదైనా 60ల వరకే! 70లకు వచ్చేసరికి మర్చేపోయాం. బాపురమణల సినిమాల్లో మాత్రమే ఆయన వాయిస్ వినబడుతుంది. ''సంపూర్ణ రామాయణం''లో అయితే థీమ్ సాంగ్ 'వెడలెను కోదండపాణి' ఆయనదే! ''గోరంతదీపం'' టైటిల్ సాంగ్ ఆయనదే. ''స్నేహం'' లో గేయాలూ ఆయనవే. ''సీతాకల్యాణం''లో గంగావతరణం పాటా, మిగతావీ అన్నీ ఆయన గొంతు కలిపివనే!

హిందీ సంగీతదర్శకుడు జయదేవ్ పేరు వినే వుంటారు. ''హమ్ దోనో'' లో 'అల్లా తేరో నామ్' పాట వినగానే ఆయన గుర్తుకు వచ్చి తీరాలి. ఆయనకు కన్నడంలో సంగీతం యిచ్చే ఛాన్సు వచ్చింది. పిబి శ్రీనివాస్, సుమన్ కళ్యాణ్‌పుర్ లచేత 'తళమళ' అనే ఓ హాంటింగ్ డ్యూయెట్ పాడించారు. పిబి అభిమాని అయిపోయారు. బొంబాయి వెళ్లినప్పుడల్లా పిబి ఆయన్ను కలుస్తూండేవారు. వెళ్లినప్పుడల్లా ఈయన జయదేవ్ సంగీతం సమకూర్చిన ఓ లతా పాట వినిపించమని కోరేవారు. ''సప్‌నా'' అనే సినిమాలో 'జానే కిత్‌నీ బార్ హృదయ్‌సే' అనే పాట అది. ఈయన అడగ్గానే ఆయన వినిపించేవాడు కానీ ఓ కండిషన్ పెట్టేవాడు. 'జగ్‌కీ తారన్‌హారీ' అనే పాట పాడి వినిపించాలని అడిగేవాడు. అది పాడి వినిపిస్తేనే ఇది వినిపిస్తాననేవాడు.

ఆ పాట కథేమిటంటే ''మహిషాసురమర్దని'' అనే ఓ సినిమాను బియస్ రంగా కన్నడంలో తీసి, దాన్ని హిందీలోకి డబ్ చేశారు. జికె వెంకటేశ్ సంగీతం సమకూర్చారు. దాన్లో టైటిల్ సాంగ్ అన్నమాట ఈ 'జగ్‌కీ తారన్‌హారీ'. అందులో పిబి 'మాతా' అనే మాటను మోల్డ్ చేసి బ్లెండ్ చేసిన విధానం జయదేవ్‌కు విపరీతంగా నచ్చేసింది. తమాషా ఏమిటంటే ఈ పాట మరో హిందీ సంగీతదర్శకుడు రవి గారికి కూడా యిష్టమైన పాట. ఓ సారి పిబి ఆయన వద్దకు వెళితే 'మై ఆప్‌కో ఏక్ ఖాస్ గీత్ సునావూంగా, వో మేరా ఫేవరేట్ హై' అంటూ తను ప్రత్యేకంగా రికార్డు చేసుకున్న పాట వినిపించారు. తీరా చూస్తే అది ఈ పాటే!

లతాతో కలిసి పాడినప్పుడు పిబి ఆవిణ్ని ఓ ప్రశ్న అడిగారు – 'మీరు ఎంత పొడుగాటి లైన్‌నయినా విఱగకొట్టకుండా సాగదీస్తూనే పాడతారు కదా, అది ఎలా సాధ్యం? వినేవారికి తెలియకుండా పాటల మధ్యలో ఊపిరి ఎలా తీసుకోవాలో, యెక్కడ వదలాలో మీకెలా తెలిసింది?' అని అడిగారు. ఆవిడ 'అనిల్ బిశ్వాస్ నాకు యివి నేర్పించారు. మీకూ నేర్పుతాను చూడండి.' అంటూ ప్రాక్టికల్‌గా కొన్ని పాడి వినిపించారు. అది ఓ విధంగా ప్రాణాయామం లాటిదే. రోజూ సాధకం చేస్తే తేలికగా పాడగలరని చెప్పారావిడ. పిబి అవిడ చెప్పినట్టే చేసి ఆ పద్ధతి ఫాలో అయ్యారు.

పిబి చేత మంచి పాటలు అనేకం పాడించిన సంగీతదర్శకుడు పెండ్యాల. కెబి తిలక్ గారి అనుపమ ఫిలింస్ అంటే – ఆరుద్ర, పెండ్యాల, జగ్గయ్య, పిబిశ్రీనివాస్ కాంబినేషన్ అన్నమాట. మార్వలెస్ కాంబినేషన్. పిబి చేత ఆయన అన్ని రకాల పాటలూ

పాడించారు. 'రమ్మంటే వచ్చారు అమ్మాయిగారు' 'పైలా పైలా పచ్చీసు' 'సూర్యుని చుట్టూ తిరుగుతుంది భూగోళం', ఇలా రకరకాల పాటలున్నాయి. పెండ్యాల, పిబి తొలిసారి కలిసింది – ఆత్రేయగారి 'తిరుపతి' నాటకంలో 'ఇదే కదా తొలిరేయీ' అనే పాటలో. అది పిబి, జానకి కలిసి పాడారు.

అనుపమ బ్యానరే కాక పెండ్యాల యితరత్రా కూడా పాడించిన వాటిల్లో ''భక్త శబరి''లో 'ఏమి రామకథ శబరీ శబరీ' మరువలేని పాట. నాగయ్యగారి మీద పిక్చరైజ్ అయిన ఈ పాట విని తీరాల్సిన పాట నాగయ్యగారికి పాడిన మరో మంచి పాట 'శ్రీ రఘురాం, జయరఘురాం' శాంతినివాసంలోది.

పిబి గజల్స్ కథ చెప్పాలంటే – ఓ సారి మద్రాసులో ఫిలింఫేరు అవార్డు జరిగింది. దానికై పిబి ఓ ఉర్దూ గజల్ రాశారు. అది విన్న కె.బాలచందర్‌కు విపరీతంగా నచ్చేసింది. ఆయన అప్పుడు ''ఆకలిరాజ్యం'' తెలుగు, తమిళ వెర్షన్లు తీస్తున్నాడు. పిబి చేత ఓ హిందీపాట రాయించి, జానకి చేత పాడించి శ్రీదేవి మీద చిత్రీకరించారు. 'తూహీ రాజా మై హూ రానీ' అని ఆ పాట. బాపురమణల ''గోరంతదీపం'' లో మోహన్‌బాబు మీద చిత్రీకరించిన కూనలమ్మ పదాలు షేర్ షాయిరీల మోడల్లో వుంటాయి. ఆయన ఉర్దూలో 'షాబాష్' అనే నామముద్రతో ఘజల్స్ రాస్తారు. ఉర్దూలోనే కాదు, సంస్కృతంలోనూ రాస్తారు, తెలుగు చెప్పనే అక్కరలేదు. మరి ఇంత నాలెడ్జ్ ఎక్కణ్నుంచి వచ్చిందాయనకు? ఆయన నేపథ్యం ఏమిటి?

పిబి శ్రీనివాస్ అంటే ప్రతివాది భయంకర శ్రీనివాసాచారి. వాళ్ల నాన్నగారు కోపరేటివ్ సబ్ రిజిస్ట్రార్. సంగీతం అంటే యిష్టం వుంది కానీ సినిమాపాటలంటే కాదు. తల్లి పేరు శేషగిరి. ఆవిడకు సంగీతం రాదు కానీ మంచిగొంతు వుంది. ఏవో జానపద గేయాలు, సినిమాపాటలూ పాడుకునేవారు. శ్రీనివాస్‌ను వాళ్ల నాన్నగారు బాగా చదువుకోమన్నారు కానీ సినిమాపాటలు పాడమని ప్రోత్సహించలేదు. శాస్త్రీయ సంగీతం నేర్పించలేదు. కానీ ఈయనకు సినిమాలన్నా, సినిమా పాటలన్నా మహాయిష్టం. ఈయనా, తమ్ముడూ కలిసి ఇంట్లో చెప్పకుండా సినిమాలకు చెక్కేసేవారు. పిబి హిందీపాటలన్నీ కంఠతా పట్టి తనలోతాను పాడుకునేవారు.

ఎస్సెల్సీ చదివేరోజుల్లో ప్రైవేటు మాష్టారింటికి రాత్రి వెళ్లాల్సి వచ్చినపుడు దారిలో తాటి చెట్టు మీదున్న దెయ్యం భయం పోగొట్టుకోవడానికి దుప్పటి కప్పుకుని గట్టిగా పాడుతూ వెళ్లేవారు. ఆయన గొంతు అప్పట్లో అమ్మాయి కంఠంలా, పీలగా వుండేది. ఆ పాట విన్న అల్లరి కుర్రాళ్లు కొందరు అమ్మాయనుకుని ఆటపట్టించబోయి, దుప్పటిలాగేసి చూస్తే ఈయన! 'వార్నీ నువ్వు పాడతావా?' అని ఆశ్చర్యపడి, 'అయితే మాకు పాటలు పాడి వినిపించు' అన్నారు. 'అందరిముందూ పాడాలంటే నాకు భయమండీ' అన్నా వినలేదు. అప్పుడే కాదు, ఆ తర్వాత కాలేజీ ఫంక్షన్లో కూడా తెరవెనుక వుండి పాడు, ఫర్వాలేదు అని నచ్చచెప్పి పాడుతూండగా తెర తీసేసిన ప్రబుద్ధులూ వాళ్లే. ఏమయితేనేం, పిబికి స్టేజి ఫియర్ పోయింది.

ఈయన బికామ్ పాసయ్యారు. తండ్రి ఉద్యోగంలో పెడదామనుకున్నారు. ఈయన మద్రాసు వెళ్లి పాటలు పాడతానన్నారు. తండ్రి జ్యోతిష్కుడి వద్దకు తీసుకెళ్లారు. ఆయన 'ఈ అబ్బాయి గాయకుడిగా రాణించడం కల్ల' అన్నాడు. పిబి ఆయన్ని ఓ ప్రశ్న అడిగారు. 'మీ జోస్యాలు తప్పిన సందర్భాలు వున్నాయా?' అని. 'కొందరి విషయంలో తప్పిన మాట వాస్తవమే' అని ఆయన నిజాయితీగా ఒప్పుకున్నాడు. 'అయితే ఆ కొందరిలో నేను ఒకణ్నవుతాను చూస్తూండండి' అని లేచి వచ్చేశారీయన.

ఈయన పట్టుదల చూసి తండ్రి కూడా మెత్తబడ్డారు. మద్రాసులో తనకు తెలిసిన ఈమని శంకరశాస్త్రిగారి వద్దకు తీసుకెళ్లారు. ఈమని అప్పుడు జెమినీ స్టూడియోలో ఆర్కెస్ట్రా చూస్తూవుండేవారు. ఈయన్ని పరీక్షించి 'మీవాడికి ఛాన్సు యిచ్చే బాధ్యత నాది.' అని చెప్పి తండ్రిని వెనక్కు పంపించేశారు. ఈమని మేనల్లుడు మండలీక రామశాస్త్రి గారు ఆలిండియా రేడియోలో పని చేసేవారు. ఎం.ఎస్.శ్రీరాం పేరుతో ''పెళ్లిరోజు'' ''మంచిరోజు'' సినిమాలు నిర్మించి, సంగీతదర్శకత్వం వహించారు. ఆయన పిబికి ఫ్రెండు. అందరికీ పరిచయం చేసేవారు.

జెమినీవాళ్లు ''మిస్టర్ సంపత్'' అనే హిందీ సినిమా తీస్తూ పిబి చేత కోరస్‌లో పాడించారు. ఆ తరువాత నాగేంద్రరావుగారు ''జాతకఫలం'' అనే సినిమా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నిర్మిస్తూ ఈయనకు మూడు భాషల్లోనూ ఛాన్సిచ్చారు. ఆ సినిమా సంగీత దర్శకుడు గోవర్ధనం. తెలుగులో ఆయన తొలిపాట 'ఏలా, దిగులేలా..' పాట. ''భలేరాముడు''లో 'భయమేలా..' అనే పాటతో ఆయనకు గుర్తింపు వచ్చింది. అంజలీ పిక్చర్స్‌వారు ''పక్కింటి అమ్మాయి'' సినిమాను తమిళంలో తీస్తూ ఈయనచేత సంగీతవిద్వాంసుడి కారక్టరుకు పాడించారు.

కన్నడానికి వస్తే అక్కడ మేటి హీరో, రేదర్ ఓన్లీ హీరో, రాజ్‌కుమార్‌కు పాడడంతో పిబి దశ తిరిగింది. జికె వెంకటేశ్ పిబిని రాజ్‌కుమార్‌కు పరిచయం చేశారు. రాజ్‌కుమార్ వేసిన ''భక్త కనకదాస''లో పిబి పాడిన పాటలు సూపర్‌హిట్. దాంతో తన పాటలు తనే పాడుకుంటున్న రాజ్‌కుమార్ అప్పణ్నుంచి తన పాటలన్నీ పిబియే పాడాలని నిర్ణయించుకున్నారు. ఇలా 20 యేళ్లు గడిచాక, ''నా నిన్న మలయలారే'' నుండి మళ్లీ ఆయన పాటలు ఆయనే పాడుకోసాగారు.

ఆయన ప్రైవేటు సాంగ్స్ కూడా ఎన్నో పాడారు. ఆకాశవాణికై పాడిన లలితగీతాలే కాదు, ప్రైవేట్ రికార్డులుగా స్తోత్రాలు, భక్తిగీతాలు ఎన్నో యిచ్చారు. ఉర్దూలో ఘజల్స్ పాడిన ఎల్.పి. విడుదలయింది. 1961లో రవీంద్రనాథ్ టాగూరు శతజయంతి సందర్భంగా ఇతరభాషల్లో తర్జుమా చేయబడ్డ రవీంద్రగీతాలతో ఆకాశవాణి కార్యక్రమాలు రూపొందించింది. దానిలో తెలుగు, తమిళ, హిందీ పాటలను పిబియే పాడారు. కొన్ని విడిగానూ, కొన్ని జానకి గారితో కలిసీ పాడారు.

పిబి గాయకుడు మాత్రమే కాదు, గీత రచయితా, సంగీత రచయితా కూడా. వేలకొద్దీ గీతాలు రాశారు. పాడారు, పాడించారు. భాషలు నేర్చుకోవడం ఆయనకు మహా పిచ్చి. 8 భాషలు వచ్చు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, తమిళం, కన్నడం, మలయాళం, సంస్కృతం. ''భాగ్యజ్యోతి" అనే కన్నడ సినిమాలో ఓ సంస్కృతగీతం రాశారు కూడా. న్యూమరాలజీ, జ్యోతిష్యం బాగా నేర్చుకున్నారు. శాస్త్రీయ సంగీతం నేర్చుకోలేదు కానీ రాగాలూ అవీ బాగా నేర్చుకుని కర్ణాటక, హిందూస్తానీ క్లాసికల్స్ పాడగలిగారు. సంగీతదర్శకత్వం ఇవ్వగలిగారు. మూడు, నాలుగు కన్నడ సినిమాల్లో వేషాలు కూడా వేశారు.

విదేశ పర్యటనలు, పొందిన బిరుదులు చెప్పుకుంటూ పోతే అంతే వుండదు. ప్రత్యేకించి చెప్పుకోదగ్గవి తమిళనాడు ప్రభుత్వం వాళ్లు యిచ్చిన 'కళైమామణి', కన్నడ ప్రభుత్వంవాళ్లు యిచ్చిన రాజ్యోత్సవ అవార్డు. తమిళనాడు సంగీత, నాట్య అకాడమీకి చైర్మన్ పదవి యిచ్చి తమిళులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇన్ని విద్యలు నేర్చిన ఆయన్ను జీనియస్ అనడంలో ఏమాత్రం సందేహించ నవసరం లేదు.

జీనియస్ అన్నవాళ్లు కాస్త వింతగా వుంటారు. పిబి కూడా చూడ్డానికి వింతగానే వుంటారు. ఎప్పుడు చూసినా చంకలో పది పన్నెండు పుస్తకాలుంటాయి. పెద్ద జేబు, అందులో ఓ పది పెన్నులు. స్టేజి ఎక్కినా వాటన్నిటితోనూ ఎక్కుతారు. అప్పటికప్పుడు ఆ పుస్తకాలు రిఫర్ చేసి పాడేసేది ఏముంటుందా అనిపిస్తుంది. అసలు రిఫర్ చేయవలసిన అవసరం ఏముందాయనకు? అన్నీ గుర్తే. 75 యేళ్లున్నాయి. అయినా అమోఘమైన జ్ఞాపకశక్తి. అయినా ఆ పుస్తకాలు వుంటాయి. చదివేవి కొన్నీ, నోట్సు రాసుకునేవి కొన్నీ. ఆయన డ్రస్సు కూడా తమాషాగానే వుంటుంది. చాలాకాలం తలపై బొచ్చుటోపీ పెట్టేవారు. తర్వాతి స్టేజిలో కన్నడ స్టయిల్‌లో తలపాగా పెట్టారు. భుజం మీద శాలువా ఎలాగూ వుండేది.

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిమీద కాలుమోపితే ఓహో అనుకున్నాం మనం. ఆయన అనుకుని ఊరుకోలేదు. 'మాన్ ఆన్ ది మూన్' అని ఓ పాట రాసి, ట్యూన్ కట్టి, జానకితో కలిసి పాడి ఆర్మ్‌స్ట్రాంగ్‌కు పంపాడు. అదీ ఆయన స్టయిల్! (

ఆయన తెలుగు రాసే స్టయిల్‌కూడా వింతగా వుంటుంది. పెద్దపెద్ద పదాలు వాడతారు. కొత్తపదాలు కాయిన్ చేస్తారు. మాటలు అలా అలా అల్లుకుపోతారు. సులభమైన భావాన్ని క్లిష్టంగా, కష్టంగా చేయగలరు. భాషాసౌందర్యం చూసి మురిసిపోతాం కానీ ఓ పట్టాన అర్థం కాదు. అర్థమవడం అంటే ఇంకో విషయం గుర్తుకు వస్తోంది.

1991 జూన్‌లో నేనూ, నా మిత్రుడు వరప్రసాదూ (దరిమిలా శాంతా బయోటెక్నిక్స్ ఎం.డీ., 'హాసం' పబ్లిషరు) మల్లాది రామక ృష్ణశాస్త్రిగారి సినిమాపాటల పుస్తకం వేద్దామనుకుని వివికె రంగారావుగారిని కలిసి హైదరాబాదుకి ఆహ్వానించాం. (నేను కలకత్తాలో వుండగా వివికెతో కలం స్నేహం చేసేవాణ్ని. మద్రాసు వచ్చాక ఆయనను ప్రత్యక్షంగా కలిసే సాహసం చేయలేదు. వచ్చిన ఆరేళ్లకు మల్లాది వారి పుస్తకం విషయంగా వెళ్లి కలిశాను. ఆయనా పిబియస్‌లాగానే అడిగారు – 'ఊళ్లో వుండి కూడా కలవలేదేం?' అని. ఓ వెర్రి నవ్వు నవ్వి వూరుకున్నాను. కారణాలు పైన చెప్పానుగా! )

వివికె 'ఎలాగూ వస్తున్నాను కదా, ఓల్డ్ సిటీలో పాత గ్రామఫోన్ రికార్డులు సేకరిస్తాను. నేను వెళ్లడానికి ముందే ఓ లోకల్ ఉర్దూ పత్రికలో యాడ్ ఇవ్వాలి.' అన్నారు. 'దానికేముంది, మా తమ్ముడు శ్రీధర్ హైదరాబాదులో వున్నాడు. (నేనప్పుడు మద్రాసులో వుండేవాణ్ని) మీరు ఇంగ్లీషులో యాడ్ యిస్తే వాడు వెళ్లి మున్సిఫ్‌లోనో, సియాసత్‌లోనో యిస్తాడు. వాళ్లు ఉర్దూలో తర్జుమా చేసి వేస్తారు.' అన్నాను.

'వాళ్లెందుకు తర్జుమా చేయడం? మన పిబి శ్రీనివాస్ వున్నాడుగా, అతనిచేత రాయిస్తాను' అన్నారు రంగారావుగారు.

అది మా తమ్ముడికి పంపాను. వాడు పేపరు వాళ్ల దగ్గరకి తీసుకెళితే అది చూసి వాడు దడుసుకున్నాట్ట. 'ఇంత హైక్లాసు ఉర్దూ రాస్తే పేపరు పాఠకులకు ఏం అర్థమవుతుందండీ, తేలిక భాషలో మార్చి రాసుకుంటాం లెండి' అన్నాట్ట. అంటే అన్ని భాషల్లోనూ శ్రీనివాస్‌గారి పద్ధతి యిదేనన్నమాట అనుకున్నాను. రంగారావు గారితో అన్నాను కూడా. ''అంత మేధావి ఎందుకండీ, వేరే ఎవరైనా నాబోటి సామాన్యుడి చేత రాయించుకోవచ్చుగా.." అన్నాను.

ఆయన చిరునవ్వుతో తర్జనితో బెదిరిస్తూ ''నా మీదే జోకులేస్తున్నారే! కోపం వస్తే పిబికి పరిచయం చేసేస్తా జాగ్రత్త" అన్నారు.

పిబి తికమక పెట్టేసే జీనియస్! బహుముఖ ప్రజ్ఞాశాలి. గబగబా ఎక్కణ్నుంచో ఎక్కడెక్కడికో వెళ్లిపోతారు. ఆయన్ని క్యాచ్ చేయడం చాలా కష్టం. 'మీ పేరులోని అక్షరాలను సంఖ్యాశాస్త్ర పరంగా చెపితే ఇదీ అర్థం అంటారు. ఈ వాక్యాన్ని ఇలా అనగ్రామ్ చేయవచ్చు అంటారు. అదే మాట యింకో భాషలో మరోలా అర్థం యిస్తుంది కదా' అంటారు. ఇలా గంటల తరబడి మాట్లాడగలరు. మనం ఉక్కిరిబిక్కిరి అయిపోతాం.

ఈ మాట ముళ్లపూడి రమణగారితో అంటే ''నాకూ పిబి అంటే యిలాటి భయమే. అతను వస్తే బాపూ, తనూ కలిసి రాత్రంతా కూర్చుని భాషాచమక్కులు, హిందూస్తానీ సంగీత 'సంగతులూ' మాట్లాడేసుకుంటారు. కాస్సేపటికి నాకు తల తిరుగుతుంది. నేను పారిపోయి వచ్చేస్తా.." అనేవారు. రమణగారి మేధావే అలా అంటే నా బోటి వాడు భయపడడంలో ఆశ్చర్యమేముంది?

బాపుగారికి పిబి అంటే చాలా గౌరవం. సంగీతంలో నాకో చిన్న సైజు గాడ్‌ఫాదర్ అంటూంటారు. బాపు కేవలం చిత్రకారుడిగా వుండే రోజుల్లో క్రోమోనికా అనే వాయిద్యంపై చక్కగా వాయించేస్తూ వుంటే సినిమా రికార్డింగ్‌లో ప్రవేశ పెట్టాలని పిబి రమేష్ నాయుడు గారి దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ ఆయన, హీరో, నిర్మాత కృష్ణవేణి వున్నారు.

రమేష్ నాయుడు ఓ ట్యూన్ వాయించి చూపిస్తే కృష్ణవేణి బాగుందన్నారు. హీరో యిది ఎక్కడో విన్నాను అంటున్నాడు కానీ ఎక్కడ విన్నాడో చెప్పలేక పోతున్నాడు. అలా అంటే ఎలా అని కృష్ణవేణి నిలదీస్తూ వుంటే లౌక్యం స్పెల్లింగ్ తెలియని బాపు 'నాకు తెలుసండి' అనేశారు. వెంటనే ఆవిడ 'ఏం తెలుసు మీకు?' అంది ధాటీగా.

బాపుని తీసుకెళ్లిన పిబి కంగారు పడి ''అబ్బే మా ఫ్రెండు, లాయరు, ఆర్టిస్టు.. ' అని ఏదో చెప్పబోయారు.

'అవన్నీ సరే, ట్యూన్ సంగతి చెప్పమనండి' అందావిడ. బాపుకి రోషం వచ్చి 'ఫలానా హిందీ సినిమాలో ఫలానా పాట ట్యూనే యిది' అనేశారు.

అందరూ సైలెంటయిపోయారు. 'కాలహరణమేలరా హరీ' అని హమ్ చేస్తూ పిబి లేచారు. బాపు అప్పటికే గల్లంతై పోయారు. కొన్నాళ్లయాక రమేష్ నాయుడు కూడా బాపుకి ఫ్రెండయ్యారు. అది వేరే విషయం.

పిబి గారి కెరియర్ హ్యాపీగా గడిచిపోయినా చెప్పుకోవడానికి రసవత్తరంగా వుండదు. ఆయన పేదవాడు కాదు. ఇంట్లోంచి పారిపోయి మద్రాసు చేరలేదు. ట్రాక్ సింగర్‌గా పాడి, నిరాశా నిస్పృహలకు లోనవలేదు. మధూకరం చేసుకోలేదు. సినిమాలు తీసి దిబ్బయిపోలేదు. హాయిగా చదువుకుని, వాళ్ల నాన్నగారి వెంట వచ్చి ఈమని వారి వద్దకు వచ్చారు. ఆయన ఛాన్సు యిస్తే పాడేశాడు. ఇక అప్పణ్నుంచి ఛాన్సులు వస్తూనే వున్నాయి.

ఆయన జీవితంలో స్ట్రగులే లేదు. స్ట్రగుల్ చేయలేదాయన. మిత్రుడైన ముళ్లపూడి రమణగారి ద్వారా పిబికు పుల్లయ్యగారి ''ప్రేమించిచూడు''లో నాగేశ్వరరావుకి పాడే ఛాన్సు వచ్చింది. సినిమా హిట్టయ్యాక నాగేశ్వరరావు దగ్గరకు వెళ్లి ''మీకు తక్కిన సినిమాల్లో కూడా హుషారు పాటలు పాడే ఛాన్సు యిప్పించండి'' అని పిబి అడిగినట్టు లేదు. ఘంటసాలగారు పోయాక అన్ని పాటలూ బాలూకి యిచ్చే బదులు విషాదగీతాలో, బ్యాక్‌గ్రౌండ్ సాంగ్సో ఏవైనా ఆయనకు యివ్వచ్చుగా! నిర్మాతలు యివ్వలేదు. ఈయన అడగలేదు. సరే అని వూరుకున్నాడు. అంతేగానీ ఘంటసాలలాగా, బాలూ లాగా పాటలు తగ్గినపుడు ఓ ట్రూపు తయారుచేసుకుని ఊరూరా తిరుగుతూ ప్రోగ్రాంలు యివ్వలేదు. నాగయ్యగారిలా సినిమాలు తీసి రిస్కు చేయలేదు. నో పెయిన్, నో గెయిన్. క్రమంగా ఫేడవుట్ అయిపోయారు.

ఆయనకు యివేమీ పట్టనట్టు చివరిదాకా హ్యేపీగా వున్నారు. రావలసినన్ని అవకాశాలు రాలేదని, తెలుగులో తక్కువ పాడారనీ మనం బాధపడడమే కానీ ఆయన బాధపడలేదు. మద్రాసులో డీసెంటు ఏరియాలో ఓ ఇండిపెండెంట్ హౌస్. పాతకాలందే! పిల్లలు బాగా చదువుకున్నారు. చార్టెర్డ్ ఎకౌంటెంట్స్. మనుమడు ఆనందవర్ధన్ బాలనటుడు. శ్రీనివాస్ ఈ మధ్య కాలంలో హైదరాబాదుకు తరచుగా వచ్చి వెళ్లారు. అభిమానులు వెళ్లి పలకరిస్తే పులకరించారు. నిగర్వి, నిరాడంబరుడు, ధన్యజీవిగా వెళ్లిపోయిన శ్రీనివాస్‌గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిద్దాం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2013)**

**మే 01, 02 గ్రేట్ ఆంధ్రా వీక్లీకై**

## ఎమ్బీయస్ : నితీశ్ రాజనీతి

ఓ పక్క చూస్తూంటే 'నరేంద్ర మోదీ, నమో నమో' నినాదాలతో ఆకాశం పిక్కటిల్లుతోంది. మోదీ అభిమానుల్లో యింటర్నెట్ వాడకం దార్లు ఎక్కువున్నారు కాబట్టి యిలా వర్ణించాల్సి వస్తోంది. ఆకాశంతో బాటు మీడియాలో... అని కూడా చేర్చాలి. ఎందుకంటే – కార్పోరేట్ రంగమంతా మోదీ వెనక్కాల నిలబడుతోంది. కార్పోరేట్లు నడిపే మీడియా మోదీని మానవాతీతుడిగా, దేశోద్ధారకుడిగా చిత్రీకరిస్తోంది. మోదీని నిలవరించాలని అతని పార్టీలోని శత్రువులు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. అద్వానీ, అనుచరగణం మూలపడ్డారు. పార్టీ మొత్తాన్ని మోదీ తన గుప్పిట్లో తీసుకోవడం జరుగుతోంది. తరువాతి అంకంగా తనకు పోటీగా వస్తాడేమో అనుకుంటున్న రాహుల్ గాంధీపై పడ్డారు మోదీ. 'నేను ప్రధాని పదవి పందెంలో లేను మహాప్రభో' అని రాహుల్ మొత్తుకుంటున్నా వినకుండా 'అతను ప్రధానిగా పనికిరాడని మీరు గ్రహించాలి' అంటూ మోదీ మనల్ని ఊదరగొడుతున్నారు. 2014 నాటికి దేశప్రధానిగా మోదీ రావడం ఖాయం అనే హైప్‌ను వండి వారుస్తూండగా ఆ ఎసట్లో చన్నీళ్లు పోస్తున్నారు నితీశ్ కుమార్.

నేటి సంకీర్ణ శకంలో మీ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్నది క్వశ్చన్ కాదు, నువ్వు ఎంతమందిని కలుపుకుని పోగలవన్నది పాయింటు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కానీ, బిజెపికి కానీ పార్టీపరంగా ఎక్కువలో ఎక్కువ 225 సీట్లు రావచ్చు. 150 దాటకపోయినా ఆశ్చర్యపడనక్కరలేదు కానీ ఏదైనా స్వింగ్ వచ్చి పడితే 50% ఎక్కువగా రావచ్చు అనే అంచనాపై ఆ అంకె చెప్పాను. ప్రభుత్వం నడపడానికి ఆ బలం సరిపోదు, అందర్నీ కలుపుకోవాలి. అలా కలుపుకోగల శక్తి కాంగ్రెస్ ప్రదర్శించి కాబట్టే 2004, 2009లలో ప్రభుత్వం ఏర్పరచగలిగింది. అంతకుముందు బిజెపి కూడా ఆ శక్తి చూపగలిగింది. కానీ అప్పుడు దాని నాయకుడు – ఉదారవాదిగా, పెద్దమనిషిగా పేరు బడిన వాజపేయి. ఇప్పుడాయన రంగంలో లేరు. అప్పట్లో నెంబర్ టూగా వున్న అద్వానీని సమర్థుడిగా అందరూ మెచ్చుకుంటారు కానీ ఉదారవాదిగా వాజపేయి ముందు ఆయన నిలవలేదు. ఎందుకంటే రామమందిరం అంటూ రథయాత్ర మొదలుపెట్టినది ఆయనే. బాబ్రీ మసీదు కూల్చివేత ఆయన సమక్షంలో జరిగింది. గోధ్రా అల్లర్ల తర్వాత మోదీని వాజపేయి విమర్శించగా, అద్వానీ బలపరిచారు. మధ్యలో కాస్త బాలన్స్‌డ్‌గా మాట్లాడినా యిప్పటికీ ఆయన రామమందిరం, ఆర్టికల్ 370 లాటి

వాటిని వదిలిపెట్టలేదు.

మోదీని చూపించి గుజరాత్ నుండి, తదితర ప్రాంతాల నుండి బిజెపి ఓ 175-200 మధ్య సీట్లు సంపాదించిందనుకుందాం. ప్రభుత్వం ఏర్పరచాలంటే పైన ఇంకో వంద పోగేయాలి. పది పార్టీలు కలిస్తే తప్ప ఆ వంద చేతికందదు. మోదీని చూస్తే వాళ్లు దగ్గరకు రారు. అతను ప్రధాని కాదంటేనే ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడుతుంది. అంటే ఏమిటన్నమాట? గెలిచేదాకా మోదీ ఒక ఎసెట్, ఒక నికరాస్తి. గెలిచాక ప్రభుత్వం కూర్చడానికి అతను ఒక లయబిలిటీ. పెనుభారం. ఎన్నికలు గెలిచేవరకు 'మోదీ వంటి ముందుచూపు కలిగిన నాయకుడు మా తరఫు ప్రధాని అభ్యర్థి' అని చెప్పుకోవాలి. ఆ తర్వాత 'దిగు దిగు నాగన్నా' అని అతన్ని దింపేయాలి. దింపితే ఎవర్ని ఎక్కించాలి? అనేది బిజెపి ఎదుట వున్న ప్రశ్న. ఆ బలహీనతను ఆసరాగా చేసుకుని ఎన్‌డిఏ భాగస్వామ్యపక్షాలు వాళ్లతో ఆడుకుంటున్నాయి. వారిలో ప్రధానమైనది జెడి (యు). జెడి(యు)కు చేతిలో వున్న ఏకైక రాష్ట్రం బిహార్, అదీ బిజెపితో పొత్తు కుదుర్చుకుని ఏర్పరచుకున్నది! అయినా బిహార్ ముఖ్యమంత్రిగా వున్న నితీశ్ మోదీని పబ్లిగ్గా విమర్శిస్తున్నాడు. మోదీని ప్రధానిగా ఆమోదించేది లేదని తేల్చి చెపుతున్నాడు.

నితీశ్ కారణాలు నితీశ్ కున్నాయి. 2004 పార్లమెంటు ఎన్నికలలో అతని పార్టీ బిజెపితో కలిసి పోటీ చేసినప్పుడు గోధ్రా అల్లర్ల వాల్ పోస్టర్లు బిహారంతా వెలిసి, ప్రజలీ పొత్తును తిరస్కరించారు. కేంద్రంలో వున్న ఎన్‌డిఏ గద్దె దిగవలసి వచ్చింది. బిహార్‌లో అధికారంలో వున్న లాలూ ప్రసాద్ పార్టీకి 40 సీట్లలో 22 దక్కాయి. ఆర్నెల్ల తర్వాత రాష్ట్రంలో జరిగిన ఎసెంబ్లీ ఎన్నికలలో బిజెపి-జెడి(యు) నెగ్గి నితీశ్ ముఖ్యమంత్రిగా సంయుక్త ప్రభుత్వం ఏర్పరచింది. ఇక అప్పణ్నుంచి నితీశ్ ఒక్కటే గట్టిగా నిశ్చయించుకున్నాడు - మోదీని బిహార్‌లో రానివ్వకూడదు అని! 2010 లో బిహార్‌లో వరదలు వచ్చినపుడు సహాయ కార్యక్రమాలకై గుజరాత్ ప్రభుత్వం తరఫున మోదీ రూ. 5 కోట్ల చెక్కు యిస్తే నితీశ్ తిరక్కొట్టేశాడు. 2010 అసెంబ్లీ ఎన్నికలలో కూడా మోదీ ఎన్నికల ప్రచారానికి రావక్కరలేదని స్పష్టంగా చెప్పాడు. గుజరాత్‌లో మోదీకి ప్రత్యామ్నాయం కనబడక ముస్లిములలో కొందరు అతనికి ఓటు వేశారు. కానీ బిహార్‌లో ముస్లిములకు ఎన్నో మార్గాలున్నాయి. పైగా వారి సంఖ్య గుజరాత్ ముస్లిముల కంటె రెండున్నర రెట్లు ఎక్కువ. అనేక నియోజకవర్గాల్లో వారి ఓట్లు గణనీయమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. మోదీ అంటే వాళ్లకు పడదు. వాళ్లకే కాదు, ఉదారవాదులైన హిందువులకు కూడా... అందువలన మోదీ లేని బిజెపిని మాత్రమే నితీశ్ భరించగలడు.

ఇటీవలి కాలంలో బిజెపి మోదీని నెత్తి కెక్కించుకుంటూ వుంటే నితీశ్‌కి మంటగా వుంది. కానీ 17 ఏళ్లగా కాపురం చేస్తూ వచ్చి చటుక్కున విడాకులు యివ్వలేడు కదా. అందువలన తనకు బిజెపిపై వ్యతిరేకత లేదనీ, కేవలం మోదీపై మాత్రమేననీ చెప్పుకోవడానికి అద్వానీని మెచ్చుకోసాగాడు. యుపిఏ అవినీతికి వ్యతిరేకంగా అద్వానీ రథయాత్ర ప్రారంభించినపుడు నితీశ్ దాన్ని నాంది పలికాడు. వెంటనే నితీశ్ శత్రువైన లాలూ - ''రామమందిర నిర్మాణం అంటూ అద్వానీ 1990లో రథయాత్ర మొదలుపెట్టినపుడు, దానికి ఎఱ్ఱజెండా వూపి అద్వానీని అరెస్టు చేసినవాణ్ని నేను. ఈ రోజు నితీశ్ అద్వానీ యాత్రలకు పచ్చజెండా వూపుతున్నాడు. ఇదీ నితీశ్ మార్కు సెక్యులరిజం' అంటూ వెక్కిరించాడు. అయినా నితీశ్ అద్వానీని పొగుడుతూనే వున్నాడు. 2009లో అద్వానీని ఎన్‌డిఏ ప్రధాని అభ్యర్థిగా ముందు పెట్టుకుని ప్రచారం చేసినపుడు కూడా అతను అభ్యంతర పెట్టలేదు. సంకీర్ణ ప్రభుత్వాలను నడపడానికి వాజపేయి సమర్థుడని, ఆయన పోటీలో లేనప్పుడు ద్వితీయస్థానం అద్వానీదే అని నితీశ్ చెపుతున్నాడు.

ఈ విధంగా బిజెపిలో వర్గవిభేదాలను పెంచడానికి నితీశ్ దోహదపడుతున్నాడు. చివరకు బిజెపిలో మోదీ వ్యతిరేకులే అతనికి అడ్డుపడాలని, బిజెపియేతర పార్టీ నాయకుణ్ని (అనగా తనని) ప్రధానిగా సూచించాలని - అతని ఆశ కావచ్చు. ఫేస్‌బుక్‌లో మోదీకి వున్న ఆదరణ చూసి రాబోయే ప్రధాని మోదీయే అని అనుకోవడానికి ఏమీ లేదు. కర్ణాటక ఎన్నికలలో బిజెపికు గెలిచే అవకాశాలు కనబడటం లేదు. ఫలితాలు రాగానే ఏమంటారు? ''మోదీ ప్రభావం గుజరాత్‌కే పరిమితం. ఇతర రాష్ట్రాలలో అతనేమీ పొడిచేయలేకపోయాడు. కర్ణాటకలో అతనేమీ ఓట్లు తేలేకపోయాడు.'' అని యాగీ చేస్తారు. పైగా బిజెపిలో మోదీ ఒక్కడే మొనగాడు కాదు. మధ్యప్రదేశ్‌లో శివరాజ్ చౌహాన్ మూడోసారి గెలుపొంది, మోదీ రికార్డుతో సమానమయ్యే ఛాన్సులు చాలా వున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో రమణ్ సింగ్ అధికారాన్ని నిలుపుకోవచ్చు. రాజస్థాన్‌లో వసుంధరా రాజే తిరిగి అధికారంలోకి రావచ్చు. వీరెవ్వరూ ''మేం మోదీ కారణంగా గెలిచాం'' అని చెప్పుకోరు. మోదీని గుడ్డిగా సమర్థించరు. వారి దృష్టిలో మోదీ సాటి ముఖ్యమంత్రి మాత్రమే! ఇతర రాష్ట్రాలలో తన వారిని ఎన్నికలలో నిలబెట్టి గెలిపించుకుంటే తప్ప మోదీకి వ్యక్తిగతంగా బలం చేకూరదు. అందుకని అతని కన్ను యుపి, బిహార్ వంటి యితర రాష్ట్రాలపై పడింది. అక్కడ నెగ్గుకు రావాలంటే వీర హిందూత్వవాదిగా ప్రచారం చేయించుకుని హిందూత్వ ఓట్లన్నీ దండుకోవాలి. ఆ విధంగా చేసినపుడు బిహార్‌లో మోదీని రప్పించడం నితీశ్‌కు ఆత్మహత్యాసదృశం.

అందుకని ఎన్‌డిఏలో వుంటూనే మోదీకి ప్రత్యామ్నాయంగా ఎదుగుదామని నితీశ్ చూస్తున్నాడు. మోదీకి కార్పోరేట్ల మద్దతు వుందని, అతనిపై కాపిటలిస్టు ముద్ర వుందని తెలుసు కాబట్టి తనను సోషలిస్టుగానే చూపించుకుంటున్నాడు. కార్పోరేట్ రంగం పెట్టుబడి పెట్టినపుడు ప్రజాసంక్షేమం పట్టించుకోదని, అందువలన ప్రభుత్వరంగమే పెట్టుబడులు పెట్టాలనీ నితీశ్ వాదిస్తాడు. బీదలకు యీ పాయింటు బాగా నచ్చుతుంది. అతను గుజరాత్ పేదల గురించి కూడా మాట్లాడతాడు. ''బిహార్‌లో పేదలు ఎటువంటి దుర్భర పరిస్థితుల్లో వున్నారో గుజరాత్‌లో పేదలూ అలాగే వున్నారు. తన రాష్ట్రంలో పెట్టుబడులు ప్రవహిస్తున్నాయని చెప్పుకునే మోదీ అనేక జిల్లాలలో తాగునీరు వసతి కూడా కల్పించలేకపోయాడు. గుజరాత్ అభివృద్ధి చెందడంలో విశేషం ఏముంది? వారికి

చుట్టూ సముద్ర తీరమే. శతాబ్దాలుగా వ్యాపారం సాగే కేంద్రాలన్నీ అక్కడే వున్నాయి. అందుకే పెట్టుబడులు అక్కడకి సులభంగా వస్తాయి. బిహార్ వంటి రాష్ట్రానికి సముద్రయాన సౌకర్యం లేదు కదా. బ్రిటిషు కాలం నుండీ మేం దోపిడీకి గురవుతూనే వున్నాం. మేం ఆలస్యంగా మేలుకున్నాం. అయినా ముందంజ వేస్తున్నాం. జిడిపి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎదుగుదల రేటులో మేం గుజరాత్ కంటె ముందు వున్నాం. మాకు మరిన్ని పెట్టుబడులు వస్తే మేం మరింత వేగంగా ముందుకు సాగుతాం. మోదీ మార్కు రాజ్యంలో పెట్టుబడులు వున్నచోటకే పెట్టుబడులు వచ్చిపడతాయి. మాలాటి రాష్ట్రాలు వెనకబడే వుంటాయి." అంటాడు నితీశ్.

నిజానికి గుజరాత్ ఎప్పటినుండో ప్రగతిపథంలో వుంది. మోదీ కాలంలో మరి కాస్త వేగంగా సాగిందంతే. కానీ వెనకబడి వున్న బిహార్‌ను పట్టాలెక్కించి నితీశ్ మన్నన లందాడు. మతకల్లోలాలలో పాల్గొన్నవారిపై కేసులు పెట్టడంలో, వారికి శిక్షలు వేయించడంలో దేశంలోనే బిహార్ అగ్రగామిగా వుందని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ వారు నితీశ్‌ను మెచ్చుకున్నారు. ఈ విషయంలో గుజరాత్ విషయం ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. ఇలా చెడ్డపేరు వస్తోందని మోదీ ప్రభుత్వం కితం నెలలోనే నరోడా పాటియా కేసు (2002లో 97 మంది ముస్లిములను చంపిన కేసు)లో నిందితులైన పదిమందికి ఉరిశిక్ష పడాలని సిఫార్సు చేసింది. ఇది ఒక పార్శ్వం మాత్రమే. మరో పక్క మోదీ తన కుడిభుజమైన అమిత్ షాపై ఎన్ని కేసులు వున్నా అతన్ని వెనకేసుకుని వస్తూండడమే కాదు, యిటీవల బిజెపి జాతీయ కార్యదర్శిగా కూడా చేయించాడు. యుపి, బిహార్, ఝార?ండ్, బెంగాల్, అసాం, మహారాష్ట్రలలో 150 స్థానాలలో ముస్లిములు ఓటింగును ప్రభావితం చేయగలరు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్ (మొత్తం ఆరు) రాష్ట్రాలలో వున్న 310 పార్లమెంటు స్థానాలలో బిజెపికి ప్రస్తుతం 40 మాత్రమే వున్నాయి. అందువలన బిజెపి సొంతంగా మెజారిటీ సాధించలేదు. పొత్తుదారులపై ఆధారపడవలసినదే. వారి వరస చూస్తే యిలా వుంది! – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)

మే 03, 04 గ్రేట్ ఆంధ్రా వీక్లీకై

ఎమ్బీయస్ : ప్రాంతీయ పార్టీల పాట్లు

వచ్చే ఎన్నికల తర్వాత ప్రాంతీయపార్టీలదే హవా అన్న వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ కలిసి మూడో ఫ్రంట్ ఏర్పరుస్తాయని చంద్రబాబు, ములాయం వంటి వాళ్లు అప్పుడప్పుడు అంటూ వుంటారు. మూడో ఫ్రంట్ ఉట్టిమాటే అని ప్రకాష్ కారాట్ (మన మీడియా భాషలో కారత్ – పేర్లు మార్చడంలో మనవాళ్లు ఘనులు) అనేశారు. "ఈ పార్టీలన్నీ కాస్సేపు ఎన్‌డిఏతో, కాస్సేపు యుపిఏతో వూరేగుతాయి. ఓ నిబద్ధత లేదు. వీటిని నమ్ముకుని ఫ్రంట్ ఏర్పరచడం జరిగేది కాదు" అనేశారాయన. మూడో ఫ్రంట్‌కు కేంద్రబిందువు సిపిఎం కాబట్టి దాని జనరల్ సెక్రటరీ మాటలకు మనం విలువిచ్చి తీరాలి. మూడో ఫ్రంట్ లేని పక్షంలో ఎన్‌డిఏతోగాని, యుపిఏతోగాని – ఎవరైతే తమ రాష్ట్రానికి నిధులు యిస్తామని హామీ యిస్తారో వాటితో జతకట్టడానికి యివి రెడీ. జగనూ అదే చెప్తున్నారుగా! తాము మద్దతు యివ్వబోయే ప్రభుత్వంలో ఏయే శాఖలు తీసుకోబోతున్నారో నిర్ణయించేశారు కూడా!

ఆయన లాగానే చాలా ప్రాంతీయపార్టీలు త్వరలో తాము కేంద్రంలో పెద్ద పాత్ర నిర్వహించబోతున్నామనే అంచనాతో ఢిల్లీలో లాబీయింగ్‌కు సన్నాహాలు చేసుకుంటున్నాయి. జయలలిత ఢిల్లీలోని సాకేత్‌లో తన పార్టీ కోసం ఒక ఆఫీసు తెరవబోతున్నారు. ఈ లోపున ప్రభుత్వం తరఫున పవన్ రైనా అనే రిటైర్డ్ ఐయేయస్ ఆఫీసర్ని, నరసింహన్ అనే ఒక ఎంపీని లయజన్ వర్క్ కోసం ఢిల్లీలో వుండమన్నారు. అకాలీదళ్ వాళ్లు యింకా తెలివైన పని చేశారు. పంజాబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ మంత్రిత్వశాఖ అంటూ మొదలుపెట్టి దాని ఆఫీసు ఢిల్లీలో పెట్టారు. అకాలీదళ్ అధ్యక్షుడు, పంజాబ్ ఉపముఖ్యమంత్రి అయిన సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఆ శాఖను తన దగ్గర పెట్టుకుని ఆ మిష మీద ప్రతి శనివారం ఢిల్లీ వచ్చి లాబీయింగ్ చేస్తున్నారు. బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ జయ్ పాండా అనే ఎంపీని యిలాటి లాబీయింగ్ పనికే పెట్టుకున్నారు. త ృణమూల్ కాంగ్రెస్ తన ఉపాధ్యక్షుడు, ఎంపీ అయిన డెరెక్ బ్రియన్‌కు యీ పని అప్పగించింది. వీళ్లంతా ఢిల్లీలో గాలి ఎలా వుందో అధ్యయనం చేసి, ఎన్‌డిఏ, యుపిఏలతో బేరాలాడి ఏ వైపు వెళితే మంచిదో తమ పార్టీలకు సలహా లిస్తారన్నమాట.

---

ఆశలు బాగానే వున్నాయి కానీ ఎన్నికలలో తగినన్ని సీట్లు గెలిస్తేనే వీళ్లకు మన్నన, గౌరవం. మన రాష్ట్రంలో టిడిపి, వైకాపా, తెరాస పార్టీల గురించి మనకు బాగా తెలుసు. కర్ణాటకలో జెడియస్ అధికారానికి సుదూరంగా వుంది. అసెంబ్లీ ఎన్నికలలో 20 శాతం సీట్లు కూడా వచ్చేట్టు లేవు. ఎడ్యూరప్ప పార్టీకి ఆ పాటి ఆశలు కూడా లేవు. తమిళనాడులో డిఎంకె పరిస్థితి ఆందోళనకరంగా వుంది. అక్కడ కరుణానిధికి చటుక్కున ఏమైనా అయితే డిఎంకె పార్టీ గుటుక్కుమంటుందన్న భయం వుంది. కరుణానిధి స్టాలిన్‌వైపు పూర్తిగా తిరిగిపోవడం అతని అన్న అళగిరికి బొత్తిగా నచ్చటం లేదు. శ్రీలంక సమస్యపై కేంద్రం నుండి తప్పుకోవాలన్న ఐడియా స్టాలిన్‌ది. కరుణానిధికి చెప్పగానే ఆయన అళగిరిని సంప్రదించకుండా సరేననేశాడు. అది అళగిరికి కోపం తెప్పించింది. సాటి

డిఎంకె మంత్రులు ముగ్గురు రాజీనామా చేసినా, తనూ నెపోలియనూ రిజైన్ చేయలేదు. ఒక రోజు ఆలస్యం చేసి, అందరినీ ఆందోళన పరచి అప్పుడు రాజీనామా చేశారు. చేశాక మన్‌మోహన్ సింగ్‌ను, చిదంబరాన్ని, సల్మాన్ ఖుర్షీద్‌ను స్నేహపూర్వకంగా కలిసి వచ్చారు. వీళ్లు పార్టీ ఫిరాయిస్తారేమోనని డిఎంకె అధినాయకత్వం అడిలి చచ్చింది. అక్కణ్నుంచి తమిళనాడు తిరిగి వచ్చాక కూడా అళగిరి చెన్నయ్‌లో జరిగిన కార్యవర్గ సమావేశం ఎగ్గొట్టి డైరక్టుగా మధురైకి వెళ్లిపోయాడు.

స్టాలిన్ పార్టీ పగ్గాలు చేపట్టిన దగ్గర్నుంచి తన ప్రాభవం తగ్గుతోందని అళగిరికి కోపం. అన్నా డిఎంకె ప్రభుత్వం 16 వేల కోట్ల రూ.ల గ్రానైట్ కుంభకోణంలో తన కొడుకు దురై దయానిధిని పేరు పేర్కొన్నపుడు డిఎంకె పార్టీ అడ్డుకోలేదని అతని బాధ. 2011 మేలో అళగిరి అనుచరుల్లో ఆరుగుర్ని భూ ఆక్రమణ కేసులో గూండా చట్టం కింద అన్నా డిఎంకె ప్రభుత్వం అరెస్టు చేసింది. సాధారణంగా యిలాటి సందర్భాల్లో అదంతా రాజకీయ కుట్ర అని డిఎంకె యాగీ చేస్తుంది. కానీ యీ విషయంలో మాత్రం వెంటనే వాళ్లను పార్టీ నుండి తొలగించి వారి స్థానంలో స్టాలిన్ అనుచరులను తీసుకుంది. ఈ జనవరిలో అళగిరికి అత్యంత సన్నిహితుడైన పొట్టు సురేష్ హతుడయ్యాడు. హత్యలో స్టాలిన్ అనుచరుడైన విపి పాండి హస్తం వుందని పుకార్లు వున్నాయి. కరుణానిధి కుటుంబానికి సన్నిహితులైన మారన్ సోదరులు యీ వివాదంలో కలగజేసుకోవటం లేదు. వాళ్లు యిప్పటికే ఎయిల్‌సెల్-మాక్సిస్ డీల్ కుంభకోణంలో యిరుక్కుని వున్నారు. ఏదైనా చేస్తే కేంద్రం వాళ్ల పని పడుతుందన్న భయం వారిది.

అళగిరినే కాదు, తన సవతి చెల్లెలు కనిమొళిని కూడా స్టాలిన్ పక్కకు తప్పించేస్తున్నాట్ట. కనిమొళి రాజ్యసభ సభ్యత్వం జులైలో పూర్తయిపోతోంది. అందువలన రాబోయే లోకసభ ఎన్నికల్లో కడలూరు నుండి పార్లమెంటుకి నిలబడదామన్న ఆలోచనతో ఆమె మార్చిన 24 న దగ్గర్లో వున్న దిండివనంలో ఒక పెద్ద ర్యాలీ ఏర్పాటు చేసుకుంది. జిల్లా అంతా తిరిగి కార్యకర్తలను పోగేసి భారీ ఎత్తున బలప్రదర్శన చేయాలన్న ప్లానులో వుందామె. అది విని స్టాలిన్ భయపడ్డాడు. అదే జిల్లాలో యీ మధ్యే అతను ఓ ప్రదర్శన ఏర్పాటు చేస్తే జనం ఎవరూ రాలేదు. ఇప్పుడు కనిమొళికి బాగా జనం వస్తే తన పరువు పోతుందనే భయంతో అతను తండ్రి వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నాడు. కరుణానిధి కనిమొళిని పిలిచి ర్యాలీ కాన్సిల్ చేసుకోమని చెప్పాడు. విధిలేక ఆమె సరే అంది. అందుకే యుపిఏ బలపరీక్ష ఎదుర్కోవలసిన అవసరమే వస్తే అళగిరి, కొందరు డిఎంకె ఎంపీలు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటు వేయరనే అందరూ అనుకుంటున్నారు. అళగిరి అంటే జయలలితకు పడదు. స్టాలిన్‌కు పడదు. ఇలాటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను కూడా దూరం చేసుకునే సాహసం అళగిరి, అతని అనుచరులు చేయరు. ఇలాటి కుటుంబ విభేదాలతో సతమతమయ్యే డిఎంకె వంటి ప్రాంతీయపార్టీ వచ్చే ఎన్నికల్లో ఏం సాధిస్తుందో, ఎంత సాధిస్తుందో వేచి చూడాలి.

---

2012 నవంబరులో బాల థాకరే గతించిన అనంతరం శివసేన భవిష్యత్తు ఎలా వుంటుందో అని ఆ పార్టీ అభిమానులు ఆందోళనగా వుండేవారు. వారి ఆందోళనలు నిజం అయ్యాయి. ఉద్ధవ్ థాకరే తన తండ్రి కున్న కరిజ్మా తనకు లేదని నిరూపించుకున్నాడు. ఇటీవలే పరశురామ్ ఉపార్కర్ అనే నాయకుడు శివసేన నుండి రాజ్ థాకరే పార్టీ అయిన ఎమ్ఎన్ఎస్ (మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన) లోకి దూకాడు. శివసేన ఎంపీ ఆనంద్ పరాంజపే శరద్ పవార్ పార్టీ ఐన ఎన్‌సిపికి సన్నిహితుడవుతున్నాడు. ఢిల్లీలో శరద్ పవార్ అనుచరులతో కనబడుతున్నాడట. పుణె నుండి శివసేన తరఫున ఎంపీగా ఎన్నికైన శివాజీ పాటిల్‌ను కూడా ఎన్‌సిపి దువ్వుతోంది. అతను పదేళ్ల క్రితం ఆ పార్టీ నుండే శివసేనకు మళ్లాడు. మళ్లీ వెనక్కి రప్పిద్దామని ఎన్‌సిపి ప్రయత్నం. మరాఠ్వాడా నుండి ఒక ఎంపీ, పదిమంది శాసనసభ్యులు ఎన్‌సిపి నాయకుడు, ఉప ముఖ్యమంత్రి అయిన అజిత్ పవార్ వద్దకు రాయబారాలు, బేరాలు సాగిస్తున్నారట. ఈ విధంగా శివసేనను ఓ పక్క ఎన్‌సిపి, మరో పక్క ఎమ్ఎన్ఎస్ హరిద్దామని చూస్తున్నాయి. వీళ్లను అడ్డుకోగల శక్తి ఉద్ధవ్‌కు వుందా లేదా అన్నది పెద్ద ప్రశ్న.

వాస్తవం ఏమిటంటే ఉద్ధవ్ ఆలోచనాపరుడు, సౌమ్యుడు, హింసాపద్ధతులకు వ్యతిరేకి, కాస్త పెద్ద మనిషి. దళిత పార్టీలతో కూడా పొత్తులు పెట్టుకోవడానికి సిద్ధపడతాడు. అతని తండ్రి బాల థాకరేకున్న దూకుడు, హింసాధోరణి, వాగ్ధాటి యితనిలో కానరావు. ఆ లక్షణాలు పుణికి పుచ్చుకున్నది బాల థాకరే సోదరుని కుమారుడు - రాజ్ థాకరే! శివసేన నాయకులకు, మధ్యతరగతి వారికి ఉద్ధవ్ నచ్చవచ్చు కానీ శివసేన కార్యకర్తల దృష్టిలో మాత్రం ఉద్ధవ్ 'చేతకానివాడు'. రాజే వాళ్లకు హీరో. కార్యకర్తలను రెచ్చగొట్టి, హింసకు ప్రేరేపించి, దానివలన వాళ్లు కేసుల్లో చిక్కుకుంటే, ఎవరేమనుకుంటారోనని జంకకుండా వెనకేసుకుని వచ్చే రకం. ఉద్ధవ్‌కు నాయకులతోనే తప్ప కింది స్థాయి కార్యకర్తలతో ముఖపరిచయం కూడా లేదు. మరాఠ్వాడాలోని జాల్నాలో యిటీవల ఉద్ధవ్ పెద్ద సభ నిర్వహించాడు. పార్టీ నాయకులందరికి జనసమీకరణ లక్ష్యాల్ని నిర్ధారించి సభను విజయవంతం చేశారు. నెల తిరక్కుండా రాజ్ థాకరే అక్కడే సభ పెట్టాడు. ఉద్ధవ్‌కు వచ్చినంతమంది జనం రాలేదు కానీ, వచ్చినవాళ్లందరూ వాళ్లంతట వాళ్లే వచ్చారు. దాన్ని బట్టే రాజ్‌కున్న బలం తెలిసింది.

ఇంకో విషయం - ఉద్ధవ్‌కు 52 ఏళ్లు మాత్రమే అయినా రెండుసార్లు గుండెకు ఆపరేషన్లు జరిగింది. ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనలేడు. పాల్గొన్నా 44 ఏళ్ల రాజ్‌లా గొంతు చించుకుని, రెచ్చగొట్టేట్లా మాట్లాడలేడు. 2014 మార్చిలో జరగబోయే

పార్లమెంటు ఎన్నికలలో ఉద్ధవ్ తగినన్ని ఎంపీ సీట్లు గెలవకపోతే, అతని పార్టీకి ముప్పే. ఇంకో ఆర్నెల్లలో జరగబోయే ఎసెంబ్లీ ఎన్నికల పాటికి పార్టీలో పెద్దగా ఎవరూ మిగలరు. అసలు ఆ ఎసెంబ్లీ ఎన్నికలలో బిజెపి శివసేనతో పొత్తు పెట్టుకుంటుందో, ఎమ్ఎన్ఎస్‌తో పెట్టుకుంటుందో చూడాలి. బిజెపి 1990 నుండి శివసేనతో పొత్తు పెట్టుకుంటోంది. ఇద్దరిలో శివసేనకు ఎప్పుడూ ఎక్కువ సీట్లు వచ్చేవి. 2009 ఎన్నికలలో మాత్రం బిజెపికి ఎక్కువ సీట్లు వచ్చాయి. బాల థాకరే వుంటేనే యీ పరిస్థితి వున్నపుడు ఉద్ధవ్‌తో జతకట్టి ప్రయోజనం ఏమిటని బిజెపి ఆలోచించి ఎమ్ఎన్ఎస్‌తో పొత్తు పెట్టుకోవచ్చు. ఉద్ధవ్ రాజ్‌తో కలవలేదు కాబట్టి ఎన్‌సిపితో పొత్తుకోసం చూడవచ్చు. ఏది ఏమైనా శివసేన బాల థాకరే నాటి శివసేన కాదు!

---

బెంగాల్‌లో వామపక్షాలను చిత్తు చేసి అధికారంలోకి వచ్చిన మమతా బెనర్జీ బలం నానాటికీ తగ్గుతోంది. పంచాయితీ ఎన్నికలకు వెళ్లడానికి కూడా జంకుతోంది. బెంగాల్‌ను దశాబ్దాలపాటు పాలించిన వామపక్ష ప్రభుత్వం పంచాయితీ ఎన్నికలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వచ్చి ఒక సంప్రదాయాన్ని నెలకొల్పింది. ఇప్పుడు పంచాయితీ ఎన్నికలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైంది. వాటిలో ఎలాగైనా నెగ్గాలని, లేకపోతే 2014లో వచ్చే పార్లమెంటు ఎన్నికలపై వాటి ప్రభావం పడుతుందని మమతకు ఆందోళనగా వుంది. వేసవిలో పెడితే అధికారపక్షం ఓడిపోయే ప్రమాదం వుంది కాబట్టి శీతాకాలంలో ఎన్నికలు పెడదామని అనుకుంది మమత. కానీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి కాలేదంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అడ్డుకుంది. కొన్ని నెలలాగి, ఎన్నికల కమిషన్‌ను సంప్రదించకుండానే ఏప్రిల్ నెలలో రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామంటూ మమత ప్రభుత్వం కమిషన్‌కు రాసింది. ''వద్దు, వద్దు, గ్రామీణ వాతావరణం చాలా ఉద్రిక్తంగా వుంది కాబట్టి, రిగ్గింగ్ జరగడం, దానిపై హింస జరగడం జరుగుతాయి కాబట్టి మూడు దశల్లో నిర్వహించాలి. రాష్ట్రపోలీసులతో బాటు కేంద్ర బలగాలను తెప్పించి వారి సమక్షంలో ఎన్నికలు జరపాలి.'' అన్నారు ఎన్నికల కమిషనర్ మీరా పాండే.

''పంచాయితీ ఎన్నికలకు కేంద్ర బలగాలెందుకు? మహామహా మావోయిస్టు గొడవల్లో కూడా రాష్ట్ర పోలీసులతోనే కానిచ్చేశారు కదా'' అని పంచాయితీ మంత్రి సుబ్రతా ముఖర్జీ వాదన. మార్చి 22 న ప్రభుత్వం ఏకపక్షంగా, ఎన్నికల కమిషన్‌ను సంప్రదించకుండా ''ఏప్రిల్ 26, 30 తారీకుల్లో పంచాయితీ ఎన్నికలొహో'' అని చాటించేసింది. దానిపై ఎన్నికల కమిషన్ హైకోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకుంది. కేంద్ర బలగాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రప్పించకూడదని ప్రభుత్వం, అవి లేకుండా ఎన్నికలు నిర్వహించమని ఎన్నికల కమిషన్ భీష్మించాయి. కమిషన్ చిన్నపిల్లాడిలా వ్యవహరిస్తోందని బెంగాల్ మంత్రులు అంటున్నారు. ఇద్దరి మధ్య ఘర్షణ వస్తే ఏం చేయాలో రాజ్యాంగంలో స్పష్టంగా లేదు. కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వానికి మమతో గొడవ తెచ్చుకోవడం యిష్టం లేదు. తమ రాయబారిగా జైరాం రమేష్‌ను పంపి సర్దిచెపుదామనుకుంది. కానీ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఒప్పుకోలేదు. తమతో తెగతెంపులు చేసుకున్న మమత పంచాయితీ ఎన్నికలలో ఓడిపోవాలని వారి కోరిక. జైరాం రమేష్ పర్యటన రద్దు చేయించారు. మమత ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌తో సయోధ్య చేసుకోవడానికి సుముఖంగా లేదు. ఏప్రిల్ తేదీలు దాటి పోయాయి కాబట్టి కొత్తగా మే 5, 8 తారీకుల్లో ఎన్నికలు నిర్వహిస్తామంటూ యింకో ప్రకటన చేసింది. శారదా చిట్ ఫండ్స్ కుంభకోణం బయటపడ్డాక కూడా తమ పార్టీ నెగ్గుతుందన్న ధైర్యమే వుండి వుంటే తృణమూల్ యిలా ప్రవర్తించేది కాదు.

కొన్ని ప్రాంతీయ పార్టీలు యిలా కొట్టుమిట్టు లాడుతూంటే అవి భవిష్యత్తులో నిర్ణాయక పాత్ర పోషిస్తాయని ఎలా అనుకోగలం?

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 05 గ్రేట్ ఆంధ్రా వీక్లీకై ఎమ్బీయస్ : అలా వెనక్కి పోయాను...**

'అధ్యక్షా..' అనగానే వైయస్ గుర్తుకు వచ్చినట్టు, 'అలా ముందుకు పోతాం..' అనే ఊతపదం వినగానే 'చంద్రబాబు' గుర్తుకు వస్తారు. ఇదంతా మిమిక్రీ ఆర్టిస్టుల పుణ్యం. నాకు ఒక్కోప్పుడు అనిపిస్తూ వుంటుంది – మిమిక్రీ కళాకారులు యీ నాయకులు, నటులను అనుకరిస్తున్నారా లేదా వీళ్లే మిమిక్రీ వాళ్లను అనుకరిస్తున్నారా అని. ఎవరైనా వెక్కిరిస్తున్నారని గమనించినపుడు మనం ఆ అలవాటు మానుకోవడానికో, తగ్గించుకోవడానికో చూస్తాం. కానీ వీళ్లు అలాటి ప్రయత్నాలు చేస్తున్నట్లు కనబడదు. మిమిక్రీ వాళ్లే అతి చేస్తారనుకుంటే వీళ్లు వాళ్లను మించి అతి చేస్తూ పోతారు.

ఆ ప్రాసెస్ రివర్సు చేద్దామన్న ఉద్దేశం కలిగినట్టుంది చంద్రబాబుగారికి – హఠాత్తుగా 'ముందుకు పోతాం..' మానేసి '..వెనక్కి పోయాను' అనేశారు. అందరూ ముందుకు ముందుకు అంటూ వుంటే యీయనేమిటి, గతంలోకి వెళ్లిపోయానంటున్నారు, టైమ్ మెషిన్ ఏమైనా దొరికిందా అని ఆశ్చర్యపడుతున్నారా? ఆంధ్రజ్యోతి రాధాకృష్ణతో యింటర్వ్యూలో '...ఇప్పుడు 1999కు మునుపు చంద్రబాబును నేను' అన్నారు. 2000 సంవత్సరంలోనే ఇరవై ఏళ్ల ముందుచూపుతో 2020 చూసేసినాయన యిప్పుడు పధ్నాలుగేళ్ల వెనక్కు వెళ్లిపోవడమేమిటి? అంటే 1999కు మునుపు బాబు, 1999 తర్వాత బాబు వేర్వేరు స్వభావాలతో వున్నట్టా? ఉన్నానని

ఆయనే అంటున్నారు. ఈ మార్పు స్వభావంలో కాబట్టే చెప్పుకోవాలి. శారీరకమైన మార్పులకు మనమందరం యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా లోనవుతూనే వుంటాం. ఆ ప్రక్రియను వెనక్కి తిప్పలేం కూడా. తిప్పగలిగితే అందరం యిప్పుడున్న వయసు కంటె పదేళ్లు వెనక్కి వెళదామనుకుంటాం, అలా వెళ్లలేం కాబట్టే 'ఐ యామ్ ఫీలింగ్ యంగర్ టుడే' అనుకుంటాం. కాబట్టి యిది ఒట్టి మానసికమైన అనుభూతి మాత్రమే.

ఇలా చెప్పవలసిన సందర్భం ఏమిటంటే – 'నేను మారాను. ఇప్పుడు నేను మారిన మనిషిని.' అని చెపుతూ ఎంత తీవ్రంగా మారారో చెప్పడానికి '1999 ముందుకాలానికి మారాను' అని చెప్పారు. ప్రకృతిలో మార్పు ఎప్పుడూ ముందుకే వుంటుంది. కోతి మనిషికి మారడానికి వేల సంవత్సరాలు పట్టిందనుకునుకుందాం, లక్ష సంవత్సరాలు టైమిచ్చినా మనిషి కోతిగా మారగలడా? పాలు పెరుగుగా మారడం చూస్తాం. శీతాకాలమైతే ఆ మార్పు సరిగ్గా జరగక పెరుగు గడ్డకట్టదు, పాలపాలగా వుండిపోతుంది. వేసవికాలంలో మరీ మారిపోయి పుల్లగా కూడా అయిపోతుంది. కానీ ఏ కాలంలోనూ పెరుగు పాలగా మారడం జరగదు. ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశానంటున్నారు బాబు. ఈ 14 ఏళ్ల అనుభవాన్నీ అన్–లెర్న్ చేసి 1999 నాటికి వెళ్లిపోయానంటున్నారు. మామూలుగా మారడమే కష్టమనుకుంటే ఇలా వెనక్కి మారడం యింకా కష్టం. ముందుకు మొగ్గలు వేయగలం, వెనక్కి మొగ్గలు వేయాలంటే చాలా నేర్పు కావాలి. బాబుని అభినందించాల్సిందే.

బాబుగారు, మారడం అనే పదాలు పర్యాయపదాలు అయిపోయాయి. 2004 ఎన్నికలలో ఓడిపోయిన దగ్గర్నుంచి యివాళ్టి దాకా – 'నేను మారాను, మీరూ మారండి' అని బాబు పార్టీ కార్యకర్తలతో అనడం కనీసం పది సార్లయినా నేను చదివి వుంటాను. 'నమ్మరే, నమ్మరే, నేను మారానంటే నమ్మరే..?' అని బాబు పాటలు పాడతారు. 'సిగరెట్టు మానడం చాలా యీజీ. నేను పదిసార్లు మానేశాను' అన్నాట్ట వెనకటికెవడో. అంటే మానేసిన ప్రతీసారీ మళ్లీ మొదలుపెట్టినట్టే కదా. లేకపోతే తిరిగి తిరిగి మానేసే ఛాన్సు ఎలా దక్కుతుంది? బాబుగారి మార్పు కూడా యిలాటిదే కాబోలు. మారిన ప్రతీసారి రబ్బరులా యథాపూర్వ స్థితికి వెళ్లిపోతూ వుంటారేమో. అప్పుడు మళ్లీ మారే అవకాశం వస్తుంది. ఇలా ముందుకూ వెనక్కీ వూగిసలాడే స్థితి చూసి ఆయన అనుచరులు తాము మారే పని పెట్టుకుని వుండరు. అందుకే బాబు ఎప్పుడు చూసినా 'మారండి, మారండి' అంటూ వుంటారు. మారం, మారం అని అవతలివాళ్లు మారాం చేస్తారు కాబోలు.

'1999కి ముందు బాబుకి, తర్వాత బాబుకి గల తేడా ఏమిటి?' 20 లైన్లు మించకుండా వ్యాసము వ్రాయుము అని పొలిటికల్ హిస్టరీ స్టూడెంటుకి 20 మార్కుల ప్రశ్న యిస్తే ఎలా రాస్తాడో వూహించండి. 1999కి కాస్త ముందే ఆయన లెఫ్ట్ వారు సహజమిత్రులు అన్న భావాన్ని అటకెక్కించి, నేషనల్ ఫ్రంట్‌ను వదిలిపెట్టి బిజెపితో చెట్టాపట్టాలు వేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ రైట్‌కు మళ్లుతారా? 1999కి ముందు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పారు, యిప్పుడు మళ్లీ తిప్పుతారా? – ఇలా రాస్తే కరక్టు ఆన్సరు కాదనవచ్చు. నిజానికి బాబు రాజకీయజీవితం చూస్తే 1995 వరకు ఆయనలో ఒట్టి రాజకీయ నాయకుడు మాత్రమే కనబడ్డాడు. కాంగ్రెసులో వుండగా చిన్న మంత్రి. ఎన్టీయార్ పార్టీ పెట్టినపుడు రాజకీయదృష్టితో చూసి, అది గెలిచే అవకాశాలు కనబడక దానిలోకి రాలేదు. పార్టీ గెలిచాక బ్యాక్‌రూమ్ బాయ్‌గా వుండి మావగారికి సాయపడ్డారు. ఎన్టీయార్ ఆదర్శాలు వలిస్తూ వెలిగిపోతూ వుంటే పార్టీకి కావలసిన నిధులు, రాజకీయపు టెత్తులు, ఎవరికి పనులు చేసిపెట్టాలి, ఎవరికి అక్కరలేదు – యిలాటి వ్యవహారాలు యీయన చూసుకున్నారు. 'ఎన్నికలు గెలవడానికి మా దగ్గర ఓ ట్రిక్కు వుంది, మా పార్టీ సభ్యులు వేరే వాళ్లకు ఓటేస్తే కనిపెట్టడానికి మా దగ్గర ఒక సాంకేతిక పరికరం వుంది' యిలాటి స్టేటుమెంట్లే యిస్తూండేవాడు యీయన.

ఎన్టీయార్‌పై ప్రత్యర్థులు జోకులు వేసేవారు – "ఆయన ఎస్సీ, బిసీలకు పనులు చేసిపెడతానని చెప్పుకుంటాడు. ఎవరైనా వస్తే ఎస్సీయా? బీసీయా అని అడిగి పని చేసిపెడతాడు. ఎస్సీ అంటే – సేమ్ కాస్ట్? అని అర్థం. బిసీ – అంటే బాబు కాండిడేట్? అని అర్థం." ఈజోకులో తెలిసేది ఏమిటంటే చెన్నారెడ్డి గారి వెనుక కలక్షన్ ఏజంట్లుగా వారి కుమారులు వ్యవహరించేవారనే పుకారు వున్నట్టే టిడిపిలో డర్టీ జాబ్ అంతా బాబు చేసేవారని చెప్పుకునేవారు. పార్టీలో అందరూ క్లీన్‌గా వుంటే పార్టీ ఎలా నడుస్తుంది? పైగా ఓ పక్క కాంగ్రెస్ నిధులు కుమ్మరిస్తూ వుంటే ఎదుర్కోవడం ఎలా? నాదెండ్ల ఉదంతంలో తన ఎమ్మెల్యేలు గోడదూకడం చూసిన తర్వాత ఎన్టీయార్ యీ విషయాన్ని గుర్తించారట. 1989 తర్వాత ప్రతిపక్ష నాయకుడిగా నిభాయించుకుని వచ్చే క్రమంలో, ఆ తర్వాత టిక్కెట్లు పంపిణీ చేసే తరుణంలో చంద్రబాబు తన పార్టీ ఎమ్మెల్యేలకు సన్నిహితమయ్యారు. ఎన్టీయార్ ఆదర్శాల వల్లింపు చూసి అడిలిపోయిన వారికి చంద్రబాబు వూరట నిచ్చేవారు. 1995 ఆగస్టులో ఎన్టీయార్‌ను పడగొట్టే వరకు బాబు యిమేజి అంతే. పెద్ద ఎడ్మినిస్ట్రేటర్‌గా కూడా ఎవరికీ తెలియదు. పార్టీ సభ్యుల పేర్లన్నీ కంప్యూటరైజ్ చేసేశాం, కమ్యూనిస్టుల తరహాలో పార్టీ కార్యకర్తలకు రాజకీయపాఠశాల నిర్వహించాం – యిలాటివే చెప్పుకునేవారు. (ఇప్పుడా పాఠాల గోలే లేదు) అధికారం చేజిక్కించుకున్నాక కొంతకాలం వరకు ఫిరాయించి వచ్చేసిన ఎమ్మెల్యేలు 'మాకేంటంట?' అని బాబును బెల్లించేవారు. క్రమేపీ పార్టీని, ప్రభుత్వాన్ని అదుపులోకి తెచ్చుకుని బాబు ఎడ్మినిస్ట్రేటర్‌గా, స్టేట్స్‌మన్‌గా, ముందుచూపు వున్న నాయకుడిగా కొత్త యిమేజి సంతరించుకున్నారు.

ఇప్పుడు ఆ కాలానికి వెళ్లిపోతానని బాబు అంటున్నారు. మధ్యలో మార్పు ఎందుకు వచ్చిందట? ఆయన మాటల్లోనే చెప్పాలంటే – '1999 తర్వాత కీర్తికండూతి, ఫలితాలు త్వరగా సాధించాలన్న ఆత్రుత కొన్ని తప్పులు చేయించాయి.' ఎన్టీయార్‌లా ఉపమానాలూ, వైయస్‌లా సామెతలూ అవీ వాడరు కాబట్టి బాబుగారికి తెలుగుపై మరీ అంత పట్టు లేదని నా అనుమానం. అందువలన 'అహంకారం'

అనే పదం కూడా నిఘంటువులో వుందని ఆయనకు గుర్తు చేస్తున్నాను. 'నాకే అన్నీ తెలుసు, నువ్వేం చెప్పనక్కరలేదు' అని అనుకుని, అనడమే అహంకారం అంటారు. అదే యింటర్వ్యూలో ఆ పదం వుపయోగించకుండానే ఆయన చెప్పారు – 'ఇప్పుడు నేను అందరినీ కలుపుకుని పోతూ అందరి అభిప్రాయాలూ స్వీకరిస్తూ వెళ్తాను' అని. బాబు సన్నిహితులు ఫిర్యాదు చేసేది అదే – 'మేం చెప్పామండీ, కానీ ఆయన వినడు' అని. ఈ అహంభావమే మనిషిని వెనక్కి నెట్టేస్తుంది. ఏ మేరకు అంటే మనిషిని బట్టి వుంటుంది. బాబును 1999 సంవత్సరానికి నెట్టేసింది. అక్కణ్నుంచి ఆయన మళ్లీ ప్రయాణాన్ని మొదలుపెట్టాలి. ప్రస్తుతకాలానికి ఎప్పటికి చేరుకుంటారో ఏమో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 06** **ఎమ్బీయస్ : ఎన్టీయార్ విగ్రహావిష్కరణ**

ఇవాళ తెలుగువాళ్లు ఆనందించే రోజు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి ప్రాతినిథ్యం వహిస్తున్న భారత పార్లమెంటులో ఎన్టీయార్ విగ్రహం ఆవిష్కరించబడింది. ఊరూరా అనేక విగ్రహాలు పెట్టవచ్చు. కానీ పార్లమెంటులో పెట్టినవాటికి శాశ్వతత్వం వుంటుంది. ఒకవేళ రాబోయే దశాబ్దాలలో పార్లమెంటు మరో భవనానికి మార్చినా, యీ విగ్రహాలను మ్యూజియంలాగైనా వుంచుతారు తప్ప కూల్చేయరు కదా. అది చూడడానికి వెళ్లినవాళ్లలో కొందరైనా ఎవరీయన? అని అడిగి తెలుసుకుంటారు కదా. తెలుగు జాతిలో ఉద్భవించిన మహనీయుల్లో ఎన్టీయార్ ఒకరు. పివి నరసింహారావుగారూ మహనీయుడే. కానీ ఆయన తెలుగు, తెలుగు అని చాటింపు వేయలేదు. ఎన్టీయార్ రాజకీయాల్లోకి వచ్చాక మాటాడితే తెలుగు తెలుగు అంటూ అలమటించి తెలుగుకి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఆయన రాజకీయాలతో, సిద్ధాంతాలతో, వ్యక్తిత్వంతో విభేదించిన తెలుగువారు సైతం తెలుగుతనం అన్న కారణంగానైనా ఎన్టీయార్ విగ్రహం వెలిసినందుకు ఆనందించ వలసినదే. కానీ దాన్ని కూడా వివాదం చేసి కూచున్నాం మన తెలుగువాళ్లం. అది కూడా మన తెలుగుతనంలో భాగమే అనుకుని వూరుకోవడమే ఉత్తమం.

ఏ కాంగ్రెసు నైతే భూస్థాపితం చేయడానికి ఎన్టీయార్ కలలు కన్నారో, ఆ కాంగ్రెస్ చోదిత ప్రభుత్వమే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విధివిలాసం. రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి కాంగ్రెస్ విగ్రహాన్ని పెట్టిందన్న వాదన వింతగా వుంది. కామరాజ్ నాడార్ మొదట కాంగ్రెస్ వాది. పార్టీ ఇందిరా గాంధీ చేతిలోకి వెళ్లాక విడిపోయి వేరే పార్టీ (కాంగ్రెస్ – ఆర్గనైజేషన్ అనేవారు)లో వున్నారు. ఇందిరా కాంగ్రెస్‌ను ఓడించడానికి శతథా ప్రయత్నించారు. అయినా ఇందిరా కాంగ్రెసే ఆయన విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టింది. అంతమాత్రం చేత తమిళనాడు ప్రజలంతా ఇందిరా కాంగ్రెస్‌కు ఓట్లేసి ప్రభుత్వంలోకి తెచ్చేయలేదు. కాంగ్రెస్‌తో ఒక్కోసారి కలిసి, మరోసారి విభేదించిన డిఎంకె పార్టీ నేత మురసొలి మారన్ విగ్రహాన్ని కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వమే పెట్టింది. అది చూసి డిఎంకె అభిమానులందరూ కాంగ్రెస్‌కు ఓట్లేశారా? ఎమ్జీయార్‌కు భారతరత్న యిచ్చినందుకు ఎడిఎంకెవారు కాంగ్రెసుకు ఓట్లేశారా? లేదు కదా! చంద్రబాబు కాంగ్రెసు నాయకుల పేర విగ్రహాలు వేయించారు, పార్కులు పెట్టించారు, సంస్థలు నెలకొల్పారు. అంతమాత్రాన కాంగ్రెసు అభిమానులందరూ బాబు పార్టీకి ఓట్లేశారా?

ఇవన్నీ కాంగ్రెసుకు తెలియదా? తెలిసినా కూడా విగ్రహానికి అనుమతి యిచ్చారు అంటే రాజకీయ ప్రయోజనాలు ఆశించి.. అని ఎలా అనగలరా? ఆంబేద్కర్, సుభాష్ బోస్, ప్రకాశం.. వీళ్లందరూ కాంగ్రెసును విడిచి పెట్టి వేరే పార్టీలు పెట్టుకున్నవారే! వీళ్లందరి విగ్రహాలు పెట్టినందుకు కాంగ్రెసు ఏమైనా బావుకుందా? అసలు కొన్నేళ్లు పోయాక యివన్నీ ఎవరైనా పట్టించుకుంటారా? ఏ విగ్రహం ఎవరి హయాంలో ప్రతిష్ఠాపించారు? వారికి, విగ్రహం వారికి రాజకీయ విభేదాలు వున్నాయా? ఉంటే ఎంతకాలం వున్నాయి? ఎన్నాళ్ల సఖ్యత? ఎన్నాళ్ల విముఖత? – ఇవన్నీ ఎవరు లెక్కలు తీస్తారు? ఎవరు గుర్తు పెట్టుకుంటారు? ఒకే పార్టీ అయినా వ్యక్తుల బట్టి కూడా అభిప్రాయాలు మారతాయి కదా. ఎన్టీయార్ పోరాడింది ఇందిరా గాంధీపై. ఇందిరకు ఎన్టీయార్‌పై వున్న కసి సోనియాకు వుండకపోవచ్చు. సొంతపార్టీ వాడైన పివి నరసింహారావుపై సోనియాకున్న కసి, విపక్షం వాడైన వాజపేయికి లేకపోవచ్చు. ఈ రోజు విగ్రహావిష్కరణకు సోనియా రాకపోవడానికి ఎన్టీయార్‌పై ద్వేషం అని కారణాలు వూహించుకోవడం అనవసరం. మరీ అంత ద్వేషమే అయితే విగ్రహాన్ని అడ్డుకునేవారు. ఆవిడ రాకుండా కొందరు కాంగ్రెస్ ఎంపీలు అడ్డుకున్నారు అంటున్నారు టిడిపి ఎంపీలు. మరి కొందరు కాంగ్రెస్ ఎంపీలు, మంత్రులు వచ్చేరే!? సోనియా వద్దంటే వాళ్లు వచ్చేవారా?

కొందరు కాంగ్రెసు ఎంపీలు మాత్రం 'మేము రాము' అని చెప్పి వెలితిపడ్డారు. వారిలో సుబ్బరామిరెడ్డి గారు ఒకరు. కాంగ్రెసు పతనానికి కారకుడైన ఎన్టీయార్ విగ్రహావిష్కరణకు వెళ్లడం ఏమిటని ఆయన అభ్యంతరం? రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని గాంధీగారు ఓ కుదుపు కుదిపారు. రాణిగారి మకుటంలో మణితుల్యమైన భారత్‌ను వూడదీసేశారు. ఆయన్ని చూసి ప్రతీ దేశంలోనూ తిరుగుబాట్లు వచ్చి బ్రిటిషు సామ్రాజ్యం కుంచించుకుపోయింది. అయినా బ్రిటిషు వాళ్లు గాంధీగారి బొమ్మను టుసాడ్ మ్యూజియంలో పెట్టుకున్నారు. ఓ బ్రిటిషువాడు ఆయనపై సినిమా తీస్తే నిక్షేపంలా చూశారు. సుబ్బరామిరెడ్డిగారిది వాళ్లకు మించిన బాధా? ఆయన అంతటి హార్డ్‌కోర్ కాంగ్రెస్ వాదా? ఏదీ.., కాంగ్రెసు పార్టీ చరిత్రంతా బట్టీ పట్టేసి, రోజూ చరఖా తిప్పేసి, గాంధేయమార్గంలో అతి సాధారణ జీవితం గడిపేస్తూ...!? తెలియలేదుస్మండీ. నేనింకా ఆయన చేసే అనేకానేక వ్యాపారాల్లో రాజకీయం కూడా ఒకటనుకుంటూ వచ్చా యిన్నాళ్లూ. ఈయనకు యింత కాంగ్రెసు భక్తి వుందని వూహించలేకపోయాను. కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధానమంత్రి

కూడా హాజరైనా యీ కరడుగట్టిన కాంగ్రెసు వాది పాపం రాజీ పడలేకపోయారు. పురంధరేశ్వరి కాక వేరెవరైనా విగ్రహం యిచ్చి వుంటే, తానాశిస్తున్న వైజాగ్ ఎంపీ సీటుకై పురంధరేశ్వరి పోటీ పడకుండా వుండి వుంటే సుబ్బరామిరెడ్డి గారికి ఎన్టీయార్‌పై ఆగ్రహం, కాంగ్రెస్‌పై ప్రేమ కాస్త పలచబడేవేమో!

పురంధరేశ్వరి ఫ్యాక్టర్ వల్లనే యీ విషయంపై అంత చర్చ జరిగింది. ఆవిడ ద్వారా బాబును చికాకు పెట్టడానికే సోనియా విగ్రహానికి సమ్మతించి వుండవచ్చు కూడా. ఎన్టీయార్ విగ్రహంపై కాని, భారతరత్నపై కానీ బాబు ఎప్పుడూ శ్రద్ధ పెట్టలేదన్నది ఎవరూ కాదనలేని సత్యం. నేషనల్ ఫ్రంట్, ఎన్‌డిఏ ప్రభుత్వాలు ఆయన కనుసన్నల్లో నడిచాయి. 'ప్రధాని ఎవరో నిర్ణయించేవాణ్ని' ఆయన ఇంటర్వ్యూల్లో చెప్పుకున్నారు. అలాటి వాడికి ఒక విగ్రహం వేయించడం పెద్ద విశేషమా? అవన్నీ అనవసరం అని ఆయన అనుకున్నాడు, దట్సాల్! ఎన్టీయార్ మహానుభావుడు అని మీరూ, నేనూ అనుకోవచ్చు. ఎందుకంటే మనం ఆయన్ని తెరమీద మాత్రమే చూశాం. బాబు రోజూ పక్కనుండి చూశారు. రాజకీయాల్లో ఎన్టీయార్ అనుభవశూన్యత, తొందరపాటుతనం అన్నీ దగ్గరగా చూశాక 'అసలీయనకు యింత పేరు ఎందుకు వచ్చింది చెప్మా' అని బాబు ఆశ్చర్యపడుతూ వుండి వుంటారు. 'నా దర్శకత్వం లేకపోతే ఈ తోలుబొమ్మ ఏమవుతుంది?' అనే చిలిపి ఆలోచన కూడా వచ్చి వుంటుంది. అది అమల్లో పెట్టి చూసేసరికి ఎన్టీయార్ బొక్కబోర్లా పడ్డారు. 'నా తమ్ముళ్లు, నా తమ్ముళ్లు' అంటూ వైస్‌రాయి కెళితే రాయి పడలేదు కానీ చెప్పు పడింది. 'నా జనం, నా జనం' అంటూ తీరాంధ్రకి వెళితే జనం పలకలేదు. ఇదంతా చూసిన బాబుకి ఎన్టీయార్‌పై గౌరవం ఏం మిగులుతుంది చెప్పండి? అందుకే 'ఇప్పటినుండి సినీ రాజకీయాలకు స్వస్తి. ఇకపై ప్యూర్ రాజకీయాలే' అని ప్రకటించి అలా నడిపించి చాణక్యుడిగా పేరు తెచ్చుకున్నారు. కృష్ణుడి వేషంలో ఎన్టీయార్ పట్టినది ఉత్తుత్తి చక్రం, జాతీయ రాజకీయాల్లో బాబు తిప్పినది అసలైన చక్రం. ఇస్తే గిస్తే భారతరత్న బాబుకి యివ్వాలి, ఎన్టీయార్‌కి ఎందుకు? – ఇలా అనుకున్నారు కాబట్టే ఎన్టీయార్ విగ్రహం ఐడియాకు బూజు పట్టించేశారు.

ఎన్టీయార్‌కు పార్లమెంటులో విగ్రహయోగం వుంది కాబట్టి డా॥ వెంకటేశ్వరరావు గారి రాజకీయంగా అన్ని దెబ్బలు తగిలాయి. బాబుతో వేగలేక టిడిపి వదిలి బిజెపిలో చేరితే అక్కడా బాబు పొత్తుదారుగా ఎదురయ్యి తరిమేశారు. చివరకు ఏమీ చేయలేక కాంగ్రెసులో చేరారు, ఆయనతో బాటు ఆయన భార్య పురంధరేశ్వరి కూడా. వాళ్ల అదృష్టం – కాంగ్రెస్ 2004లో, 2009లో గెలిచింది. గతంలో తండ్రిని వెన్నుపోటు పొడిచిన పాపాన్ని క్షాళన చేసుకోవాలని ఆవిడ అనుకున్నారు. ఎన్టీయార్ ఫైలు కదిలింది. ఇన్నాళ్లకు విగ్రహం వెలిసింది. ఇది బాబును యిరకాటంలోకి నెట్టింది. విగ్రహం పెట్టించినందుకు ఆవిడకు ఎక్కడ క్రెడిట్ వస్తుందో అన్న చింత కంటె, ఆ పని తను ఎందుకు చేయించలేదన్న ప్రశ్న వస్తుందని ఆయన బాధపడ్డారు. దీని వెనక కాంగ్రెసుకు దుష్టచింతన వుందని ఆరోపించారు. దాంతో యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ వంటి వారు గతాన్ని తవ్వి తీసి బాబు ఏం చేయలేదో అందరికీ వివరించారు. టిడిపి అక్కడితో వూరుకుంటే పోయేది. బాబుకి ఆహ్వానంపై రగడ ప్రారంభించారు. మూడు నాలుగు రోజులుగా ఏక చర్చ – బాబును పిలవకపోవడం ఏమిటి? అని.

స్పీకరు ఎంపీలను పిలవడమే సంప్రదాయంట. పోయినాయన పెట్టిన పార్టీకి ప్రస్తుతం వున్న అధ్యక్షుణ్ని పిలవ వలసిన అవసరమే లేదట. ప్రకాశం గారి విగ్రహం పెట్టినపుడు ఆయన స్థాపించిన ప్రజాపార్టీ అధ్యక్షుణ్ని పిలిచి వుంటారని అనుకోను. ఎన్జీ రంగా గారి విగ్రహం పెట్టినపుడు ఆయన పెట్టిన, చేరిన పార్టీల అధ్యక్షులను పిలవాలంటే చోటు సరిపోదు. అన్ని పార్టీలు మారాడాయన. బాబుగారి కేసులో అయితే ఆయన ఎన్టీయార్‌ను దింపేసి ఆయన చేతిలో నుండి పార్టీ లాక్కున్న పెద్దమనిషి. ఆయన్ను పిలిచి తీరాలని వీళ్లంతా పట్టుబట్టడం వింతల్లో కల్లా వింత. అయినా పిలిస్తేనే వెళ్లాలా? ఎన్టీయార్ జయంతికి, వర్ధంతికి ఎవరు పిలిచారని వీళ్లు ఆయన సమాధి వద్దకు వెళుతున్నారు? ఈ పిలుపులు, పేరంటాలు స్పీకరుకి విధాయకం కానప్పుడు పిలవాలి, పిలవాలి అంటూ టిడిపి ఎంపీలు మూడుసార్లు వెళ్లి ఆవిణ్ని బతిమాలడం దేనికి? పురంధరేశ్వరి పిలిస్తే వెళ్లి వుండేవారు అని పార్టీ నాయకులు చెప్పుకున్నారు. పార్లమెంటు ఆవిడ యిల్లా? అది ఆవిడ యింట్లో ఫంక్షనా? విగ్రహానికి డబ్బు యిచ్చింది, అంతే. అంతమాత్రం చేత విగ్రహంపై సర్వహక్కులూ ఆవిడకు వచ్చేస్తాయా? "మా నాన్నను ఎదిరించి బాబు వైపు వెళ్లిన ఎంపీలను ఎవర్నీ పిలవకండి" అని ఆవిడ అంటే స్పీకరు వాళ్లను పిలవడం మానేస్తారా? అలాటి హక్కులు ఆవిడకు లేనపుడు బాధ్యతలు మాత్రం ఎందుకుంటాయి?

ఆవిడ కావాలనుకున్న వాళ్లను పిలిచింది. వాళ్లే కాదు, తక్కినవాళ్లూ వచ్చారు. ఎందుకు వచ్చారని అడిగిందా? ఎన్టీయార్ కుటుంబసభ్యులందర్నీ ఆ ఫంక్షన్‌కు పిలవాలన్న రూలుందా? అయినా మేం బాబును పిలిచాం. ఇన్విటేషన్ వాళ్ల ఆఫీసుకి పంపించాం అంటారు వెంకటేశ్వరరావుగారు. 'మీరే స్వయంగా వెళ్లి పిలవవచ్చుగా' అన్నారు కొందరు టిడిపి నాయకులు. 'గతంలో మూడు గంటలపాటు వెయిట్ చేయబెట్టి వెనక్కి పంపించిన అనుభవం నాకింకా గుర్తుంది' అంటాడు ఆయన. 'వీళ్లు పిలవడం లెక్క కాదు, స్పీకరే పిలవాలి' అంటూ పట్టుబట్టారు బాబు. టిడిపి ఎంపీలు వేడుకోగా చివరకు పిలుపుల ముచ్చట తీర్చారు స్పీకరు. '...అబ్బే తీర్చలేదట' అంటారు లక్ష్మీపార్వతి. 'ఎన్టీయార్ భార్యను కదా, నన్నెందుకు పిలవలేదు? అని అడిగితే 'ఎంపీలను తప్ప వేరెవరినీ పిలవలేద'ని స్పీరు నాతో చెప్పారు' అంటారు లక్ష్మీపార్వతి. అంటే నాదీ, బాబుదీ పిలవని పేరంటమే అని ఆవిడ నొక్కి చెప్పినట్టే. అంతమాత్రాన అక్కడ కొంప మునగలేదు కదా. అయినా కుటుంబంలో అందర్నీ పిలిచిన పురంధరేశ్వరి సవతి తల్లిని పిలవకపోవడం లోటే. పిలుపు లేకపోయినా వచ్చి లక్ష్మీపార్వతి లోటు తీర్చారు.

ఇవన్నీ వ్యక్తిగత కుటుంబ విషయాలు కాబట్టి చర్చించకూడదు. కానీ ఎన్టీయార్ భారతరత్నకు, దీనికి లింకు వుంది కాబట్టి

మాట్లాడవలసి వస్తోంది. ఇప్పుడు ఎన్టీయార్‌కు భారతరత్న యివ్వాలని కోరుతున్న చంద్రబాబు గతంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఎన్టీయార్‌కు మరణానంతర భారతరత్న యివ్వబోతే అడ్డుపడ్డారని చెప్పుకుంటారు. కారణం ఏమిటంటే – 'ఎన్టీయార్ తరఫున ఆయన భార్యగా లక్ష్మీపార్వతి వేదిక ఎక్కి భారతరత్న తీసుకోవడం బాబు సహించలేకపోయారట.' ఇదే నిజమైతే అంతకంటె దురదృష్టం వుండదు. ఆవిడ వేదిక ఎక్కి ఫోటోలు తీయించుకునేది ఒక్క రోజే కదా. దేశచరిత్ర వున్నంతకాలం భారతరత్న బిరుదుగ్రహీతల పేర్లు శాశ్వతంగా వుంటాయి కదా. ఏ ఎవార్డు ఎవరి తరఫున ఎవరు వెళ్లి తీసుకున్నారో ఎవరికి గుర్తు? మొన్ననే కేంద్రప్రభుత్వం ప్రాణ్‌కు ఫాల్కే ఎవార్డు యిచ్చింది. ఆ విషయమే మనకు గుర్తు వుంటుంది తప్ప అవేళ ఆయన అనారోగ్యం చేత వెళ్లలేదని మర్చిపోతాం. ఆ ఫంక్షన్‌లో ప్రాణ్ కుటుంబసభ్యులెవరూ హాజరు కాలేదని మీడియాలో రిపోర్టులు వచ్చాయి. 'లేదు, పదిమంది వచ్చాం, కానీ ప్రొటోకాల్ ప్రకారం ఎవర్నీ పైకి పిలవకూడదట.' అని ప్రాణ్ కూతురు సమాధానం యిచ్చింది. ఇవన్నీ మనం అతిత్వరలో మర్చిపోతాం. ప్రాణ్–ఫాల్కే ఎవార్డు యివే గుర్తుంటాయి.

ఆనాడు బాబు భరించలేకపోయినా, ఈనాడు పురంధరీశ్వరిగాని పిలవకపోయినా ఎన్టీయార్ రెండవ భార్యగా లక్ష్మీపార్వతి స్థానం పదిలం. నాకు లక్ష్మీపార్వతి పట్ల పక్షపాతం ఏమీ లేదు. లక్ష్మీపార్వతి, బాబు అనే యిద్దరు రాజకీయ అత్యాశాపరుల మధ్య నలిగి ఎన్టీయార్ మరణించారన్న ఆవేదన వుంది. ఆవిడ రాజకీయాల్లోకి చొరబడకుండా ఎన్టీయార్ జీవితంలో మాత్రమే ప్రవేశించి మద్దతుగా నిలబడి వుంటే ఆయనకు ఊరట, మనకు ఒక మంచి నాయకత్వం మిగిలేది. ఆవిడ అనవచ్చు – 'నాకు యిష్టం లేకపోయినా ఆయనే నన్ను రాజకీయాల్లోకి ప్రోత్సహించారు' అని. అది నిజమే కావచ్చు. అప్పటికే ఆయన నిరాసక్త కుటుంబంతో విసిగి వేసారి వున్నాడు. బాబు చేష్టలు కూడా నచ్చడం మానేసి వుంటాయి. తన రాజకీయ వారసత్వం ఆవిడకు అప్పగిద్దామన్న ఆలోచనతోనే ఆవిణ్ని ఆకాశానికి ఎత్తేయసాగాడు. దాని పర్యవసానాలు ఎలా వుంటాయి, అసలు తనకు ఆ అర్హత వుందా లేదా అన్నది ఆవిడ చూసుకుని వారించవలసినది. ఎన్టీయార్ బతికుండగా, మరణానంతరం ఆవిడ చుట్టూ చేరినవారు ఆవిణ్ని మోసగించారని అందరికీ తెలుసు. అలాటివారిని చేరదీసిందంటేనే తెలుస్తోంది – ఆవిడ విజ్ఞత, మేధస్సు! ఎన్టీయార్ ఎత్తేస్తే ఆవిడ ఎగరబోయింది. దబ్బున కూలబడింది. కూలబడుతూ ఆయన్నీ కూల్చేసింది. నిజానికి ఆవిడ వలన బాగుపడినదెవరయ్యా అంటే – చంద్రబాబు. ఆవిడ బూచి చూపించి, అందర్నీ అదలగొట్టి, ఎన్టీయార్‌ను గద్దె దింపి, తను పైకి వచ్చాడు. ఆ ఉపకారానికైనా బాబు ఆవిణ్ని భారతరత్నకోసం వేదిక నెక్కనివ్వాల్సింది!

లక్ష్మీపార్వతిగారి గురించి మనకు ఎలాటి అభిప్రాయాలున్నా, ఎన్టీయార్‌కు మాత్రం గొప్ప అభిప్రాయం వుంది. కుటుంబం యావత్తు తనను ఒంటరి చేసిన వేళ ఆసరాగా నిలిచిందన్న అభిమానం, వాత్సల్యం వుంది. రవీంద్ర భారతి వేదికలపై ఆవిడ ఉపన్యసిస్తూ వుంటే ఆవిడకేసి ఎంతో ఆపేక్షగా చూసేవాడాయన. కుటుంబమంతా ఆవిడపై కత్తి కడితే తను కవచంలా నిలిచాడు. ఆవిడను వదులుకోమని హితులు, సన్నిహితులు ఎంత చెప్పినా వినలేదు. ఆవిడకోసం రాజ్యాన్ని వదులుకున్నాడు. అటువంటి లక్ష్మీపార్వతి తన విగ్రహావిష్కరణ సమయంలో వుండడం ఆయన ఆత్మకు సంతోషం కలిగిస్తుంది. ఆవిడ సవతి పిల్లలు, రాజకీయ ప్రత్యర్థులు తప్పకుండా గింజుకుని వుంటారు. అది వాళ్ల సమస్య, మనది కాదు. మనవరకు మన హీరో ఎన్టీయార్. ఆయన విగ్రహం పార్లమెంటులో వెలిసింది. ఆయన ఆత్మ సంతోషించే తీరులో ఆయన కుటుంబం యావత్తు – రెండో భార్యతో సహా – అక్కడ హాజరైంది. ఇంకేం కావాలి? ఈ వివాదాలు మర్నాటి కల్లా పాతబడతాయి. రేపటి పేపర్లలో హెడ్‌లైన్స్ కర్ణాటక ఎన్నికల గురించి వుంటాయి తప్ప విగ్రహంపై తర్జనభర్జనలు వుండవు. విగ్రహం మాత్రం శాశ్వతం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 08, వీక్లీకై** **ఎమ్బీయస్ : కిరణ్‌కు కలిసి వచ్చిన కర్ణాటక**

కర్ణాటక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. బిజెపి ప్రభుత్వం కూలిపోతుందని అందరూ అనుకున్నారు కానీ కాంగ్రెసుకు సంపూర్ణ ఆధిక్యత వచ్చి ఒంటిచేత్తో ప్రభుత్వం ఏర్పరచ గలుగుతుందని ఎవరూ అనుకోలేదు. సర్వే ఫలితాలను, ఎగ్జిట్ పోల్స్‌ను అధిగమిస్తూ కాంగ్రెసుకు 121 వచ్చాయి. బిజెపి, జెడియస్ రెండో స్థానానికై పోటీ పడి డ్రా చేసుకున్నాయి. ఈ స్థాయిలో గెలుపు అందుకోవడానికి కాంగ్రెసు పొడిచేసినదేమిటి? ఏమీ కనబడటం లేదు. ప్రతిపక్ష పాత్రలో కూడా కర్ణాటక కాంగ్రెసు ఉద్ధరించినది ఏమీ లేదు. బ్రహ్మాండమైన నాయకత్వమూ లేదు. అభ్యర్థుల ఎంపిక కూడా అంత బాగా జరగలేదన్నారు. ఇదంతా ప్రభుత్వ వ్యతిరేకత ఓటు కానీ, కాంగ్రెసు అనుకూల ఓటు కాదని స్పష్టంగా తెలుస్తోంది.

ప్రభుత్వ వ్యతిరేకత అతి తీవ్రస్థాయిలో వుందని ఫలితాలు చూస్తే తెలిసిపోతోంది. ఉపముఖ్యమంత్రితో సహా 12 మంది మంత్రులు మట్టి కరిచారు. బిజెపి గతంలో తెచ్చుకున్న సీట్లలో 40% కూడా తెచ్చుకోలేకపోయింది. ఓట్లశాతంలో కాంగ్రెసు కంటె 17% వెనకబడింది. కాంగ్రెసుకు 37% బిజెపికి 20%. ఎందువలన అంటే చటుక్కున చెప్పే సమాధానం – అవినీతి వలన! అని. మరి కాంగ్రెసు ఆధ్వర్యంలో నడుస్తున్న యుపిఏ ఏమైనా తక్కువ 'తిందా'? సరిగ్గా ఎన్నికల సమయంలోనే కోల్ గేట్ వివాదం నడుస్తోంది. అంతకుముందు మైనింగ్ స్కామ్, దాని కంటె ముందు 2 జి స్కామ్. వీటిని గుర్తు పెట్టుకోవడం ఎవరి తరమూ కాదు. కేంద్ర అవినీతి వెర్సస్ రాష్ట్ర అవినీతి అనాలేమో! ఎడ్యూరప్పను పంపించివేసి, క్షాళన పొందామని బిజెపి చెప్పుకుంటోంది కాబట్టి వాళ్లకు ఓట్లు

వేయవచ్చు కదా వేయలేదేం? బిజెపి, కాంగ్రెసు రెండూ అవినీతిమయమే అనుకున్నపుడు మూడో పార్టీ జెడియస్‌ను ఆదరించవచ్చు కదా! మన లోకసత్తా అక్కడ అభ్యర్థులను నిలబెట్టిందట, పోనీ వాళ్లకు ఓట్లేసి ప్రోత్సహించవచ్చుగా!

ఫలితాల విశ్లేషణ మరింత లోతుగా జరిగాక విషయాలు తెలియవచ్చు కానీ ప్రస్తుతానికి మాత్రం కొట్టవచ్చినట్టు కనబడుతున్నది – కర్ణాటక ఓటర్లు బిజెపికి బుద్ధి చెప్పదలచారని, అందుకే కాంగ్రెసులో ఎన్ని లోపాలున్నా వారికి అధికారం కట్టబెట్టారని. బిజెపికి ఎందుకు బుద్ధి చెప్పబోయినట్లు? ఎందుకంటే సుస్థిరప్రభుత్వాన్ని అందించ లేకపోయినందుకు! గతంలో కాంగ్రెసు, బిజెపి, జెడియస్‌లకు ముగ్గురికీ ఓటర్లు కాస్త కాస్త సీట్లు యిచ్చేవారు. కాంగ్రెసు, జెడియస్‌లు పొత్తు కట్టి పరిపాలించారు. అదను చూసి జెడియస్ కుమారస్వామి కాంగ్రెసును వదిలేసి బిజెపితో కత్తు కలిపాడు. వంతుప్రకారం బిజెపికి అధికారం అందించవలసిన సమయం వచ్చేసరికి చెయ్యిచ్చాడు. మోసగించబడిన ఎడ్యూరప్పపై జాలి పడిన ఓటరు 2008 ఎన్నికలలో అతనికి అధికారం అందించాడు. అదే చేత్తో నమ్మకద్రోహి కుమారస్వామికి మొట్టికాయ వేశాడు. ఈ సారీ మొట్టికాయలే పడ్డాయి కానీ కాస్త లైట్‌గా పడ్డాయి. కాంగ్రెసుకో, బిజెపికో ఓ 80 వచ్చి ఆగిపోతే ఆ 40 సీట్లతో కుమారస్వామి, వాళ్ల నాన్న చెడుగుడు ఆడేసి వుండేవారు. ఓటరు వాళ్లకా ఛాన్సు యివ్వలేదు.

ఓటరు కరుణతో అధికారానికి వచ్చిన ఎడ్యూరప్ప అతి త్వరగా తన పరపతిని హారతికర్పూరంలా హరాయించివేశాడు. ఎన్నో దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాల్లో పడి కొట్టుకుంటూ జీవితకాలంలో ముఖ్యమంత్రి అయ్యే ఛాన్సు వస్తుందో రాదో తెలియక అల్లాడిన ఎడ్యూరప్ప జన్మలో మళ్లీ యీ ఛాన్సు రాదన్నట్టు, మూడేళ్ల పాలన పదేళ్లు గుర్తుంచుకునేట్టు విచ్చలవిడిగా రెచ్చిపోయాడు. దక్షిణాదిన బిజెపి జెండా పాతేశాం, యిక అలా అలా హిందూమహాసముద్రం దాకా దూసుకుపోవడమే, తెలంగాణా అంశంతో ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టేసి తెలంగాణలో మన రెండో జెండా పాతేస్తున్నాం అని చెప్పేసుకుని అధిష్టానాన్ని ముగ్గులో పెట్టేశాడు. ఆపరేషన్ కమలం అన్నాడు, డబ్బు ప్రవహించింది. డబ్బుంటే చేయలేదని ఏదీ లేదని నమ్మాడు, హై కమాండ్‌ను నమ్మించాడు. 'కళ్లు మూసుకుని కూర్చుంటే ఎవరో ఒకళ్లు పని చేసుకుని పోతారు, గతంలో గోధ్రాలో కళ్లు మూసుకున్నాం, మోదీ నెగ్గుకొస్తున్నాడు, అలాగే యిప్పుడు కళ్లు మూసుకుంటే డబ్బుపోసి ఎడ్యూరప్ప దక్షిణాదిన విజయం చేకూరుస్తాడు' అని బిజెపి అధిష్టానం అనుకుంది. ఎడ్యూరప్ప వాళ్ల అలుసు కనిపెట్టి ఆడించాడు. అతను చెప్పినట్టల్లా వాళ్లు ఆడారు. కొన్నాళ్లకు 'తొండ ముదిరి వూసరవెల్లి అయింది. దిగుదిగు నాగన్నా' అన్నారు. ముహూర్తం కుదరలేదన్నాడు యితను. దిగక తప్పనప్పుడు వీరివీరి గుమ్మడిపండు వీరి పేరు ముఖ్యమంత్రి అన్నాడు. సరేసరే సర్సరే అన్నారు అధిష్టానం. ఇంకొన్నాళ్లకు అదేదో సినిమాలో సుత్తి వేలుగా 'వీడి ఫేసు నాకు నచ్చలేదు, దింపేయండి, యీ సత్రకాయను పెట్టండి' అన్నాడు. సర్సర్సరే అంది అధిష్టానం.

నా అనుమానం – ఈ అస్థిరతే ఓటరును విసిగించింది. ఈ మార్పులు, తోక కుక్కను ఆడించడం, తోక చెప్పినట్టు కుక్క ఆడుతూ కరవడం మర్చిపోవడం, చేతకానితనాన్ని బాహాటంగా ప్రదర్శించడం – యివన్నీ బిజెపిపై అసహ్యాన్ని పుట్టించి వుంటాయి. 12 జిల్లాల్లో ఒక్క సీటు కూడా రాలేదట. కంచుకోట లాటి మంగళూరు ప్రాంతంలో కూడా దెబ్బ తిందట. 50% ఒక్కళిగలు తప్ప తక్కిన అన్ని కులాల వారూ కాంగ్రెసువైపు మొగ్గు చూపాయని తొలి నివేదికలు తెలుపుతున్నాయి. గతంలో బిజెపికి ఓటేసిన లింగాయతులు కూడా యీసారి బిజెపికి టాటా చెప్పారట, అలా అని ఎడ్యూరప్పకూ వేయలేదు. ఎడ్యూరప్ప పార్టీ 216 స్థానాల్లో నిలబడి 6 గెలుచుకుంది, శ్రీరాములు పార్టీ 4 గెలుచుకుంది – అంటే అర్థం ఏమిటంటే బిజెపితో సంబంధం పెట్టుకున్న ప్రతీపార్టీకీ వాతలు పడ్డాయని! ఈ ఫలితాలు చూశాక బిజెపి యికపై ఏ రాష్ట్ర ముఖ్యమంత్రిని ఓ పట్టాన మార్చదు. దీని నుండి కాంగ్రెసుకూడా పాఠాలు నేర్చుకుంటుంది.

కిరణ్ పై అసమ్మతి పెరిగిపోతోంది, తనను మార్చేస్తారు అని మీడియాలో ఎన్ని వార్తలైనా రానీయండి. నా ఉద్దేశం – కాంగ్రెసు మార్చదని! ఇప్పటికే యితను మూడోవాడు. మొదటిది యాక్సిడెంటు కాబట్టి పార్టీని తప్పు పట్టలేము. వైయస్సార్ మరణానంతరం రోశయ్యను ఆర్థికమంత్రిగా కొనసాగిస్తూ కిరణ్‌ను సిఎం చేసి వుంటే పోయేది. అలా చేయకుండా రోశయ్యను సిఎం చేసి నాలిక కరుచుకున్నారు. రిస్కులు తీసుకోని రోశయ్య తెలంగాణ అంశాన్ని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోయారు. ఆయన్ని తీసేసే సమయానికి అధిష్టానానికి కూడా కాస్త బుద్ధి వచ్చింది. సిఎంకు చేతులు కట్టేయకూడదు అనుకుని కాస్త పవర్స్ విదిల్చారు. ఉంటే వుంటాం, పోతే పోతాం అన్న ధోరణిలో కిరణ్ రంగంలోకి దిగి తనకు వచ్చిన రీతిలో పాలన చేసేస్తున్నారు. తను ఏం చేసినా విమర్శిస్తారు అనుకున్న వాళ్లని దగ్గరకు తీసుకోవడం లేదు. వీళ్లతో గంటల తరబడి కూర్చుని కన్విన్స్ చేయడానికి ప్రయత్నించి భంగపడడం కంటె, ఆ టైములో ప్రజల వద్దకు వెళితే వాళ్లయినా గుర్తు పెట్టుకుంటారు అనుకుని జనం మధ్యనే తిరుగుతున్నారు. అధిష్టానం కూడా పూర్తి ఫ్రీ హ్యేండ్ యివ్వకపోయినా 'ఏదో చేస్తున్నాడు కదా, చేయనీ' అన్న ధోరణిలో వుంది. ఇతన్ని తీసేస్తే వేరే ఎవర్ని పెట్టాలి? అతను ఎప్పటికి కుదురుకుంటాడు? అన్న బెంగ వుంది. ఇప్పుడు కర్ణాటక ఫలితాలు చూశాక మార్చే ఐడియా పూర్తిగా వదిలిపెట్టేసి వుంటుంది.

అందువలన కిరణ్ ముఖ్యమంత్రిత్వానికి యిప్పట్లో ఢోకా లేదు. డియల్ వగైరాలు తమ టైమును వేరేలా సద్వినియోగం చేసుకుంటే బాగుంటుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 09, 10 వీక్లీకై** **ఎమ్బీయస్ : తృణమూలాలు కదిలిస్తున్న చిట్ ఫండ్స్**

2012 డిసెంబరులో యిదే పత్రికలో చిట్ ఫండ్స్‌కు మమతా బెనర్జీకు గల లింకు గురించి, దానిపై సిపిఎం వారు అసెంబ్లీలో రగడ చేసినప్పుడు ఆమె వారిని సమర్థించడం గురించి రాస్తూ శారదా చిట్ ఫండ్స్ పేరు కూడా ప్రస్తావించడం జరిగింది. ఏప్రిల్ నెల వచ్చేసరికి దేశమంతా దాని గురించే మాట్లాడసాగింది. మమతా బెనర్జీ వ్యక్తిగతంగా, పార్టీగతంగా ఆ గ్రూపుతో వున్న సంబంధాలు బయటకు వచ్చేశాయి. తృణమూల్ కాంగ్రెసు సమర్థకులుగా నిలిచిన మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా దివాలా తీయడంతో ఆ పార్టీ మూలాలే కదిలిపోయే పరిస్థితి వచ్చింది.

బెంగాల్‌లో పెద్ద పరిశ్రమలు లేవు. చిన్న పరిశ్రమల్లో తక్కువ జీతాలకు పనిచేయడం, చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని బతకడం సాధారణ బెంగాలీకు యిష్టం వుండదు. అందువలన ఆ ఉద్యోగాలు, వ్యాపారాలలో చాలాభాగం యితర రాష్ట్రాల నుండి వచ్చినవారు చేసుకుంటూ వుంటారు. ఇక బెంగాలీ మధ్యతరగతి యువత చిన్న చిన్న కంపెనీల్లో చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ కష్టపడకుండా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషిస్తూ వుంటారు. ఎవరైనా ఎక్కువ వడ్డీ యిస్తామంటే ఆశ పడి దానిలో డబ్బు పెట్టుబడి పెట్టేస్తారు. వాళ్ల యీ వీక్‌నెస్ గమనించి అనేకమంది దుర్మార్గులు ఫైనాన్సు కంపెనీలు, చిట్‌ఫండ్ కంపెనీలు మొదలుపెడతారు. అవి చాలా మంచి కంపెనీలని, వాటిలో పెట్టుబడి పెడితే లాభమనీ ప్రచారం చేయడానికి మీడియాను ఉపయోగించుకుంటారు. మొదట్లో మీడియాకు డబ్బులిస్తారు, కాస్త డబ్బు వచ్చాక మీడియా సంస్థనే కొనేస్తారు. నిరుద్యోగ యువతను పట్టుకుని వాళ్లను ఏజంట్లగా నియమిస్తారు. మన యింటిపక్క కుర్రాడు వచ్చి 'చిట్ కట్టండి, ఆంటీ, నేను భరోసాగా వున్నానుగా' అంటే గృహిణి నమ్మక ఏం చేస్తుంది?

ఈ కథ దశాబ్దాలుగా సాగుతోంది. 1980లలో సంచయిత కంపెనీ బెంగాల్ మధ్యతరగతిని కొల్లగొట్టేసింది. నిలువునా ముంచేసింది. పియర్‌లెస్ పై కూడా నీలినీడలు వచ్చి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం చర్య తీసుకోబోయింది కానీ వాళ్లు తప్పించుకున్నారు. ఒక దశలో ప్రభుత్వమే వారి వద్ద అప్పు తీసుకోవలసి వచ్చింది. లెఫ్ట్ ఫ్రంట్ హయాంలో కుక్కగొడుగుల్లా అనేకం పుట్టుకుని వచ్చాయి తప్ప ఫెయిలవలేదు. అంటే ఓ స్థాయిలో నడిపారన్నమాట. తృణమూల్ ఎదగ నారంభించగానే ఫైనాన్సు కంపెనీ వాళ్లంతా దన్నుగా నిలిచారు. తమ చేతిలోని మీడియా ద్వారా ఆమెను అపరకాళికగా, జగదోద్ధారిణిగా జనాలను నమ్మించారు. ఈవిడ గెలిచింది. గెలిచాక యిక ఆవిడ బొమ్మ పెట్టుకుని వ్యాపారం చేసుకోసాగారు. 'మమత డబ్బే యిది, టాక్సు గొడవల వలన వేరే వాళ్ల పేర మీద పెట్టింది. ఈ కంపెనీకి ఢోకా లేదు, ప్రభుత్వమే దీన్ని ఆదుకుంటుంది.' అని ఏజంట్ల ద్వారా ప్రచారం చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో మమత హెలికాప్టర్‌లో తిరిగి ప్రచారం చేయడానికి కోట్ల రూపాయలు ఖర్చయితే అది వీరే భరించారు. మావోయిస్టు ప్రాంతాల్లో ఆడపిల్లలకు మమత ద్వారా సైకిళ్ల పంపిణీకి డబ్బు యిచ్చినది వారే. ఆవిడకి నిధులు అందించడానికి వాళ్లు ఎంచుకున్న రాజమార్గం ఒకటుంది. మమతా బెనర్జీ బొమ్మలు వేస్తూ వుంటుంది. ఆ బొమ్మలను కోట్ల రూపాయలు వెచ్చించి కంపెనీ డబ్బుతో వాళ్లు కొన్నారు. ఆ బొమ్మలను, మమత ఫోటోను విచ్చలవిడిగా వాడుకున్నారు. వాడవద్దు అని మమత ఎన్నడూ చెప్పలేదు. ఇవన్నీ చూశాక మమత – చిట్ ఫండ్స్ లింకును సామాన్య ప్రజలు నమ్మక ఛస్తారా? ఇప్పుడు బోర్డు తిప్పేశాక నాకే సంబంధమూ లేదని మమత అంటే నమ్మడం మానేస్తారా?

శారదా గ్రూపు చైర్మన్ సుదీప్తో సేన్. మొదట్లో తిండిపదార్థాలు అమ్మేవాడు. 2009లో రియల్ ఎస్టేటు, ఫైనాన్సు రంగాల్లోకి ప్రవేశించాడు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల జనాల్లోకి చొచ్చుకుపోయాడు. రెండేళ్లలో 96 కంపెనీలు కొన్నాడు, తెరిచాడు. వాటిలో 30 కంపెనీల్లో డైరక్టరుగా తన కంపెనీలో రిసెప్షనిస్టుగా చేరి సన్నిహితురాలిగా మారిన దేవయాని ముఖర్జీని పెట్టుకున్నాడు. అనేకమంది రిటైర్‌డ్ బ్యూరోక్రాట్స్‌ను కంపెనీలో ఉద్యోగులుగా తీసుకుని ప్రజలను యింప్రెస్ చేశాడు. వాటి ప్రచారం కోసం మీడియాలోకి పెద్ద ఎత్తున వచ్చి 7 న్యూస్ పేపర్లు, మ్యాగజైన్లు, 3 టివి ఛానెల్స్ పెట్టాడు. గత ఎసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్‌కు పూర్తి మద్దతు యిచ్చాడు. మమత ముఖ్యమంత్రి అయ్యాక వీళ్ల ఫంక్షన్లన్నిటికీ హాజరు కాసాగింది. ఆమె పార్టీ ఎంపీ శతాబ్ది రాయ్ ఈ శారదా గ్రూపుకి బ్రాండ్ అంబాసిడర్‌గా పని చేయసాగాడు. కునాల్ ఘోష్ అనే ఇంకో రాజ్యసభ ఎంపీ యీ గ్రూపులోని ఓ మీడియా సంస్థకు సిఇఓగా వున్నాడు. రవాణా మంత్రి మదన్ మిత్ర యీ సంస్థ కార్మికుల యూనియన్‌కు అధ్యక్షుడిగా వున్నాడు. వీళ్లందరినీ చూపిస్తూ, అప్పుడప్పుడు ప్రభుత్వ చిహ్నాన్ని వాడుకుంటూ, ప్రభుత్వ మద్దతుతో నడుస్తున్న కంపెనీ అని చెప్పుకుంటూ శారదా గ్రూపు అతి త్వరలో రాష్ట్రంలో కల్లా పెద్ద చిట్ ఫండ్ సంస్థగా ఎదిగింది. మూడు లక్షల మంది ఏజంట్లను నియమించింది. వారిలో చాలామంది తృణమూల్ కార్యకర్తలే. కోటి మంది డిపాజిటర్లు వీళ్ల ఉచ్చులో యిరుక్కున్నారు.

ఇదంతా సవ్యంగా లేదని తొలిసారిగా 2009లో ప్రధానికి ఫిర్యాదు చేసినది – తృణమూల్‌కే చెందిన ఎంపీ సోమేన్ మిత్ర. కానీ ఎవరూ పట్టించుకోలేదు. మమత యుపిఏకు మద్దతు యిస్తున్నంతకాలం వీటిపై పెద్ద చర్చ జరగలేదు. మద్దతు ముచ్చట తీరగానే కేంద్రం అజమాయిషీలో వున్న సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వారు మమతకు ఆర్థిక మద్దతు కల్పిస్తున్న చిట్ ఫండ్ కంపెనీల వ్యవహారాలపై పరిశోధన మొదలుపెట్టారు. అప్పటిదాకా ఆగడానికి మరో కారణం కూడా వుంది. శారదా గ్రూపు బెంగాల్‌లోనే కాదు, ఈశాన్య రాష్ట్రాలకు కూడా విస్తరించింది. ఇక్కడ తృణమూల్‌ను మచ్చిక చేసుకున్నట్లు అక్కడ కొందరు కాంగ్రెసు వాళ్లను

మచ్చిక చేసుకుంది. అసాం ముఖ్యమంత్రిగా వున్న తరుణ్ గొగోయ్‌ను పదవీభ్రష్టుణ్ని చేయడానికి కొందరు కాంగ్రెస్ నాయకులకు నిధులు సమకూర్చిందట కూడా.

ఎప్పుడైతే సెబి గట్టిగా విచారణ మొదలుపెట్టిందో, వామపక్షాలు ఆందోళన ప్రారంభించాయో యిక తట్టుకోలేక సేన్ ఏప్రిల్ 10 న పారిపోయాడు. పారిపోయే ముందు ఏప్రిల్ 6 న సిబిఐకు ఒక ఉత్తరం రాసి తృణమూల్ నాయకులను, కాంగ్రెస్ నాయకులను యిరికించాడు. "వీళ్లు నన్ను ఉపయోగించుకున్నారు. నన్ను బ్లాక్‌మెయిల్ చేసి నష్టాల్లో వున్న వాళ్ల కంపెనీలను నాకు అంటకట్టారు." అని ఆరోపించాడు. చిదంబరం భార్యకు కూడా డబ్బు యిచ్చానని చెప్పాడు. అదే సమయంలో తన 3 లక్షల ఏజంట్లకు బహిరంగ లేఖ రాస్తూ "మీరంతా దీన్ని ఒక ట్రస్టుగా చేసి నడుపుకోండి" అని ఆఫర్ యిచ్చాడు. చివరకు ఏప్రిల్ 23 న తన డైరక్టర్లు దేవయాని ముఖర్జీ అరవింద్ చౌహాన్‌లతో సోనేమార్గ్‌లో హెూటల్లో జమ్మూ కశ్మీర్ పోలీసులకు పట్టుబడ్డాడు.

అతను పారిపోగానే శారదా గ్రూపుకి చెందిన మీడియా సంస్థలన్నీ (సకాల్‌బేలా, ఆజాద్ హింద్, తారా న్యూస్, తారా మ్యూజిక్, తారా బంగ్లా, ప్రభాత్ వార్తా, పరామా, సెవెన్ సిస్టర్స్ పోస్ట్, ఛానెల్ 10, బెంగాల్ పోస్ట్ వగైరా) మూతబడి 1500 మంది జర్నలిస్టులు, యితర సిబ్బంది నిరుద్యోగులయ్యారు. మూడు సంవత్సరాలుగా పని చేస్తున్న ఆ ఉద్యోగులకు జనవరి నుండి జీతాలు లేవు. వాళ్ల జీతాల్లోంచి కట్ చేసిన ప్రావిడెంట్ ఫండ్ ప్రభుత్వానికి పంపబడలేదు. కంపెనీ మూతపడ్డాక ఆ డిపాజిటర్లంతా శారదా కంపెనీ ఆఫీసులను ధ్వంసం చేసి, ఏజంట్లను పట్టుకుని చావగొట్టసాగారు. వాళ్లు యిళ్లు వదిలి పారిపోయారు. ఆ తర్వాత డిపాజిటర్లు మమత యింటి ఎదుట ధర్నా చేశారు. "సెబి హెచ్చరించినా మీరు ఆ కంపెనీపై చర్యలు తీసుకోలేదు" అని నిందించారు. "జరిగిందేదో జరిగింది. ఇకముందు ఏం చేయాలో చూదాం" అని వూరుకుంది మమత. ఇదే అదనని లెఫ్ట్ పార్టీలు ఆమెపై విమర్శలు గుప్పించాయి. యూత్ కాంగ్రెస్ ఆందోళనలు నిర్వహిస్తోంది.

"చిట్ ఫండ్స్ కార్యకలాపాలను నియంత్రిస్తూ బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం 2003లో చేసిన బిల్లు చాలా బలహీనంగా వుంది. దాన్ని కేంద్రం అనుమతి కోసం పంపారు. అక్కణ్నుంచి యింకా రాలేదు. కాబట్టే దీన్ని అదుపు చేయలేకపోయాం." అని మమత వాదిస్తోంది. "అది బిల్లు, చట్టం కాదు. దాన్ని తిప్పి పంపే ప్రశ్నే లేదు. అయినా ఆర్డినెన్సు చేయవచ్చుగా" అంటున్నారు న్యాయనిపుణులు. చివరకు మమత కలకత్తా హై కోర్టు మాజీ న్యాయమూర్తి శ్యామల్ సేన్ అధ్యక్షతన ఓ కమిషన్ ఏర్పాటు చేసి యీ వ్యవహారాలు పరిశీలించమంది. చిట్ ఫండ్ బాధితులు బెంగాల్ గ్రామీణ ప్రాంతాలలో కూడా విస్తరించి వున్న కారణంగా పంచాయితీ ఎన్నికలలో తృణమూల్ దెబ్బ తినవచ్చని భావిస్తున్నారు. అది నివారించడానికి శారదా కంపెనీ బాధితులకోసం ఒక నిధిని ఏర్పాటు చేద్దామనుకుంటోంది. దానికోసం సిగరెట్లపై అదనపు పన్ను వేస్తుందట. ఏప్రిల్ 24 న తన కార్యాలయం వద్దకు వచ్చిన పాత్రికేయులతో మాట్లాడుతూ "మీరంతా సిగరెట్లు తాగడం పెంచితే వాళ్లకు మంచి జరుగుతుంది" అనడంతో డాక్టర్లు, మానవహక్కుల కార్యకర్తలు మండిపడుతున్నారు. అసలు రాష్ట్రప్రభుత్వానికి యిలా పన్నులేసి నిధులు వసూలు చేసే హక్కు వుందా లేదా అని చర్చ సాగుతోంది.

ఇన్నాళ్లూ శారదా చిట్ ఫండ్స్‌తో కలిసి ఊరేగిన మమత యిప్పుడు ప్లేటు ఫిరాయించింది. "ఈ లాటి కేసుల్లో కంపెనీ యజమానులు తమ పేర వున్న ఆస్తిని భార్య బదిలీ చేసేసి చట్టప్రకారం విడాకులు తీసేసుకుంటారు. ప్రభుత్వం ఆస్తి స్వాధీనం చేసుకుని డిపాజిటర్లకు పంచుదామంటే వాడిపేర ఏమీ వుండదు. జైలుకి పంపించగలుగుతామంతే. జైల్లోంచి తిరిగి వచ్చాక ఆ విడాకులిచ్చిన భార్యతో కలిసి హాయిగా ఆస్తి అనుభవిస్తూ గడిపేస్తాడు. ఈ శారదా గ్రూపు చైర్మన్ సుదీప్త సేన్ మంచివాడు కాదట. ఏకంగా ముగ్గురు భార్యలట. వాళ్ల పేర యిలాగే బదిలీ చేశాడో ఏమో..' అంటోంది. అంటే మీరెంత చేసినా మీకు ఒరగబోయేది ఏమీ లేదని డిపాజిటర్లకు ముందే చెప్తోందన్నమాట. దేవయానిని సాక్షిగా పెట్టుకుని జరిగినదంతా బయటకు లాగాలని పోలీసుల ప్రయత్నం. మమత పార్టీ సభ్యులకున్న లింకులు నిర్ధారించబడితే యీ కేసును సిబిఐ తన చేతిలోకి తీసుకుంటుంది. అప్పణ్నుంచి కేంద్రానికి మమత మద్దతు కావలసి వచ్చినప్పుడల్లా యీ కేసు అక్కరకు వస్తూ వుంటుంది. మధ్యలో కోటిమంది మదుపుదార్ల సంగతేమిటని మాత్రం అడగవద్దు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 11** **ఎమ్బీయస్ : వరదలో కొట్టుకుపోయిన కడియం**

మేం గేట్లు తెరవటం లేదు కానీ లేకపోతే వరదే! అన్నారు చంద్రబాబు. తెరవకపోయినా వరద వచ్చి పడింది – అయిన ఆయన అనుకున్న దిశలో కాదు! ఆ వరదలో సైకిలుని అంటిపెట్టుకున్న కడియం కొట్టుకుపోయింది. సైకిలు పాతబడింది కాబట్టి అంతకంటె ఆధునికమైన కారు వైపు షికారు వెళుతోంది. ఈ కడియానికి శీల వూడి చాలాకాలమైందని ఏ క్షణాన్నయినా జారిపడిపోవచ్చని వార్తలు వస్తూనే వున్నాయి. హరిహరీ, అదంతా దుష్ప్రచారం, నమ్మరాదు అని శ్రీహరి కొట్టి పారేస్తూ వచ్చారు. కొట్టి పారేస్తున్నకొద్దీ నమ్మకం మరింత గట్టిపడింది. చివరకు తాను తెగ తిట్టిన తెరాసలోనే కడియం జేరబోతున్నారట.

నిజానికి యీ మధ్య వైరభక్తి తెలుగునాట బాగా ముదిరింది. ఎవర్నయితే బాగా తిడుతున్నారో వాళ్ల పార్టీలోనే చేరుతున్నారు. చిరంజీవి, రోజా, దేవేందర్ గౌడ్, మైసూరా రెడ్డి, దాడి, శ్రీహరి, రేపోమాపో కొండా, కొణతాల... లిస్టు పెరిగిపోతోంది. మనకు బాగా నచ్చనివారు మన మనసులో తిష్ట వేసుకుని వుండిపోతారనుకుంటాను. రోజూ తిట్టి తిట్టి వాళ్లకు మానసికంగా

సన్నిహితమయిపోతామేమో. వాళ్లకు సన్నిహితమై పోయి, అప్పటిదాకా వున్న పార్టీ నాయకుడు శత్రువుగా కనబడతాడు. సడన్‌గా పాత విషయాలు కుప్పలుతిప్పలుగా గుర్తుకు వచ్చేస్తాయి. అప్పుడలా చేశారు, యిప్పుడిలా అవమానించారు.. అంటూ ఏకరువు పెడతారు.

మళ్లీ ఆర్నెల్లకో, ఏడాదికో సొంతగూటికి మళ్లీ చేరారనుకోండి – అప్పుడు వీటి గురించి అడిగితే 'అబ్బే అప్పటి మా నాయకుడు నా చేత అలా చిలకపలుకులు పలికించారు, నేను పలికాను' అంటారు. మళ్లీ వీళ్లంతా కలిసి సిబిఐపై జాలిపడతారు – అది అధికారపక్షపు పంజరంలో చిలక, గోరింక.. అంటూ. తమ మీద తామే జాలి పడవచ్చు కదా. రెట్టించి అడిగామనుకోండి – 'రాజకీయంలో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు వుండరు' అంటూ దబాయిస్తారు. అక్కడికి రాజకీయ నాయకులకు మామూలు సామాజిక సూత్రాలు ఏవీ వర్తించనట్లు!

టిడిపి తెలంగాణ గురించి స్పష్టంగా ఏమీ చెప్పలేదని కడియం శ్రీహరిగారికి యిప్పుడు స్పష్టమైంది. ప్రత్యేక తెలంగాణకు మేము అనుకూలం అని అఖిలపక్షానికి లేఖ యిచ్చి వచ్చినాయన ఆయన. ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన ఆయన పార్టీ సహచరుడు యనమల రామకృష్ణుడు కూడా ఏమీ అభ్యంతరం పెట్టలేదు. లేఖ యిచ్చేటప్పుడు శ్రీహరిగారు చదువుకోలేదేమో. కానీ చదువు వచ్చిన తెలుగువాళ్లందరికీ అర్థమైంది – టిడిపి రాష్ట్రవిభజనకు అనుకూలంగా లేఖ యిచ్చింది అని. బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టివేసి నాటకం ఆడుతున్నది వైకాపా తప్ప టిడిపి కాదు. వైకాపా యిద్దరు ప్రతినిధులు అదే పాట పాడారు. కాంగ్రెసు పార్టీ ఒక్కటే రెండు గొంతుకలు వినిపించింది – ఒకటి దృఢంగా, మరొకటి పీలగా! పీలగా వినిపించినది సమైక్యవాదం. అఖిలపక్షంలో ఏం చేసినా, ఫైనల్‌గా యిప్పటిదాకా రాష్ట్రానికి సమైక్యంగా వుంచినది కాంగ్రెసు సంకల్పం మాత్రమే.

టిడిపి విభజనవాదాన్ని తలకెత్తుకున్నా కడియం పార్టీ విడిచిపెట్టి వెళ్లడం దేనికి? నిజానికి 'తెలుగువారమంతా ఒక్కటే' అనే నినాదంపై వెలిసిన తెలుగుదేశం పార్టీని సమైక్యవాదం నుండి విభజనవాదం వైపు మళ్లించినది కడియం, ఎర్రబెల్లి వంటి నాయకులే. దేవేందర్ గౌడ్ అదే అంశంపై పోరాడి పార్టీ విడిచి వెళ్లిపోయారు. 'తెలంగాణకు సై అని చెప్పి, తెరాసతో చేతులు కలిపితే చాలు, తెలంగాణ అంతా స్వీప్ చేస్తాం' అని యీ నాయకులే చంద్రబాబును ఊదరగొట్టారు. ఆయన వాళ్ల మాట విన్నాడు. ఎర్రన్నాయుడు అధ్యక్షతన ఉత్తుత్తి కమిటీ ఒకటి వేసి, విభజనకు ఒప్పుకుంటున్నాం అని లేఖ రాసి పంపించి, తెరాసను చంక నెత్తుకున్నారు.

ఏం జరిగింది? తెలంగాణలోని సమైక్యవాదులంతా టిడిపికి వ్యతిరేకంగా ఓటేశారు. అటు కోస్తాలోనూ మొట్టికాయలు పడ్డాయి. 2009 ఎన్నికల్లో టిడిపికి వచ్చిన సీట్లు 92. అంటే మూడోవంతు సీట్లు అన్నమాట. రెండిటికి చెడ్డ రేవడిలా అయ్యారు. ఆ ఫలితాలు చూసి, విభజనవాదం మన వంటికి పడదని పార్టీ మూలసిద్ధాంతమైన సమైక్యవాదానికి మళ్లీ మరలారా? లేదే! విభజననే పట్టుకుని వేళ్లాడారు. డిసెంబరు 9 ప్రకటన తర్వాత కోస్తా, సీమల్లో వచ్చిన రియాక్షన్ చూశాక చిరంజీవి 'సామాజిక తెలంగాణ' నినాదం వదిలేసి సమైక్యాంధ్ర నినాదాన్ని ఎత్తుకున్నారు. భావాల్లో స్పష్టత వచ్చింది. కనీసం ఒక ప్రాంతంలో పట్టు నిలుపుకున్నారు. చంద్రబాబు ఆ పని చేయలేదు. రెండు కళ్ల సిద్ధాంతం ఎంచుకున్నారు. ఇక దానిపై అందరూ జోకులే.

టిడిపిని చంపితే తప్ప తమకు మనుగడ లేదని గుర్తించిన తెరాస – టిడిపిపైనే అన్ని బాణాలూ ఎక్కుపెట్టింది. కాంగ్రెసును వదిలేసి, టిడిపినే విలన్‌గా విభజనవాదులకు చూపుతోంది. టిడిపి ఎన్ని మొగ్గలు వేసినా, విభజనవాదులు చేరువ కావటం లేదు. అటు సమైక్యవాదులనూ టిడిపి నిలుపుకోలేక పోయింది. ఫలితంగా – నాలుగేళ్లగా ఒక్క ఉపయెన్నికలోనూ ప్రధాన ప్రతిపక్షం నెగ్గలేకపోయింది. ఇప్పటికైనా టిడిపి కళ్లు తెరవడం లేదు. తెలంగాణకు అనుకూలం అని లేఖ యిస్తే చాలు, తెలంగాణ మన వెనక నిలుస్తుంది అని కడియం వంటి నాయకులు చెపితే బాబు తల వూపుతూ వాళ్లు చెప్పినట్టే చేశారు.

వాళ్లే చెప్పివుంటారు, మనం గేట్లు తెరిస్తే చాలు, తెరాస నుండి మన పార్టీకి జనాలు వచ్చి పడిపోతారని! చివరకు వాళ్లే గోడ దూకేశారు. ఇంకా ఎనిమిది, పది మంది దాకా దూకేసేట్టు వున్నారని చెప్పుకుంటున్నారు. మరి ప్రత్యేక తెలంగాణకు అనుకూలం అని చెప్పి బాబు ఏం బావుకున్నట్టు? కడియం, ఎర్రబెల్లి వంటి నాయకులు తనను మిస్‌గైడ్ చేశారని బాబు యిప్పటికైనా గ్రహించారా? విభజనవాదం వైపు మళ్లించి, రాష్ట్రం మొత్తంలోని సమైక్యవాదులకు దూరం చేసి, పార్టీని బలహీనపరిచి, యిమేజిని నాశనం చేసి బయటకు వెళ్లారని యిప్పటికైనా అర్థమైందా?

విభజనవాదం అనేది తెరాసకు మాత్రమే అచ్చి వచ్చింది. తక్కిన ఏ పార్టీకి అది అతకదు. ఎందుకంటే తక్కిన అన్ని పార్టీలకు ప్రత్యేక తెలంగాణతో బాటు యితర ఎజెండాలు వుంటాయి. కోస్తా, సీమల్లో మనుగడ సాగించవలసిన అవసరం వుంది. అందువలన ఒక హద్దు దాటి అవి వెళ్లలేవు. సర్వశక్తులూ విభజనకోసమే ధారపోయలేవు. కానీ తెరాస అలా కాదు, తెలంగాణ దాటి దాని చూపు ప్రసరించదు. అందువలన కోస్తా, సీమ వాసులను అది యిష్టం వచ్చినట్లు తిట్టగలదు. ప్రత్యేక తెలంగాణ తప్ప మరేమీ మాట్లాడము అని భీష్మించగలదు. కడియం పోతూ పోతూ 'టిడిపికి తెలంగాణపై స్పష్టత లేదు' అన్నారు. 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడి వున్నాను అని బాబు అనలేదు' అని ఆరోపించారు. అనకపోవడమేమిటి, రాసి యిస్తేనూ? ఎటొచ్చీ బాబు స్పష్టంగా చెప్పనిది ఏమిటి? హైదరాబాదుతో కూడిన 10 జిల్లాలతో తెలంగాణ ఏర్పడాలి అని అనటం లేదు. అది తెరాస ఒక్కటే అనగలదు – కోస్తా, సీమల్లో దానికి ఓట్లు లేవు కాబట్టి.

తెలంగాణ ఏర్పాటుకు ఒప్పుకుంటూనే హైదరాబాదుపై బేరాలాడేందుకు టిడిపి తలుపు తెరిచి పెట్టుకుని వుంటుంది. అది కూడా

చేయకపోతే తెరాసకు, దానికీ తేడా ఏముంటుంది? తెరాసతో సమానంగా మనం కూడా ఉద్యమాలు చేయాలి అని తెలంగాణ టిడిపి నాయకులు బాబును డిమాండ్ చేస్తూ వుంటారు. ఉద్యమం చేయడం అంటే ఏమిటి? ఆంధ్రప్రాంతీయులను బండబూతులు తిట్టడం, వాళ్లకు నీళ్లు ఆపేస్తానని, తిరిగి రానివ్వమనీ ప్రతిజ్ఞలు చేయడం. టిడిపి అలా చేయగలదా? అలా చేస్తే కోస్తా, సీమల్లో తిరగగలదా? ఆ మధ్య రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలకే చాలా గొడవ జరిగింది. అందువలన టి-టిడిపి ఏం చేసినా కాస్త మర్యాదగానే, హద్దుల్లో వుంటూనే ఉద్యమం చేయాలి. కానీ తీవ్రవిభజనవాదికి యిలాటి పెద్దమనిషి తరహా విధానాలు రుచిస్తాయా? అతని దృష్టిలో తెరాసయే హీరో. తెరాస 'టిడిపి ఆంధ్రావాళ్ల పార్టీ' అంటే అతను నమ్మేస్తాడు.

టిడిపి అభ్యర్థికి నాలుగు ఓట్లు పడ్డాయంటే – అది అతని వ్యక్తిగత ప్రతిభ వల్లనే కానీ, పార్టీ మొహం చూసి కాదు. 'తెలంగాణలో మనకున్న క్యాడర్ ఎవరికీ లేదు కాబట్టి జై తెలంగాణ అంటే చాలు, ఓట్లన్నీ మనవే' అంటూ యిదే కడియం చెప్తూ వచ్చారు. ఇవాళ 'తెలంగాణలో 17 పార్లమెంటు స్థానాల్లో 13 చోట్ల యిన్‌చార్జీలు లేరు. 119 ఎసెంబ్లీ స్థానాల్లో 35 చోట్ల యిన్‌చార్జిలు లేరు' అంటూ గణాంకాలు చెప్తున్నారు. తెలంగాణకు అనుకూలం అని లేఖ యిస్తే సరిపోతుందని వూరుకున్నారా బాబు? ఆ లేఖ యిచ్చినా క్యాడర్ తిరిగి రాలేదా? ఉత్సాహంగా లేరా?

ఇలాటి పరిస్థితుల్లో చంద్రబాబు యింకా విభజనవాదాన్ని పట్టుకుని వేళ్లాడడంలో విజ్ఞత ఏమిటో ఆయనకే తెలియాలి. ఆయన ఏదో ఒక పీటను నమ్ముకోకుండా రెండూ పీటల మధ్య విన్యాసాలు చేసి మధ్యలో పడిపోతున్నారు. 'తెలంగాణపై కాంగ్రెసు స్పష్టంగా చెప్పనప్పుడు మనం మాత్రం ఎందుకు చెప్పాలి?' అంటూ వచ్చారు. పోనీ అలాగని అచ్చు కాంగ్రెసు బాటే పట్టారా? లేదే! కాంగ్రెసు ప్రణబ్ కమిటీకి లేఖ యివ్వకపోయినా యీయన యిచ్చారుగా – అనుకూలం అంటూ! ఇటీవల అఖిలపక్షంలో కూడా కాంగ్రెసు రెండు నాలుకలతో మాట్లాడితే టిడిపి మాత్రం అనుకూలం అని పునరుద్ఘాటిస్తూ మళ్లీ యింకో లేఖ యిచ్చారుగా. దానివలన జరిగిన మేలేదైనా వుందా? బాబు పాదయాత్ర జరగనిచ్చారు అని చెప్పుకోవచ్చు. అంతేనా అదొక పెద్ద విజయమా? ఓ పక్క నాయకులు పార్టీ వదిలేసి వెళ్లిపోతూ, కార్యకర్తల నైతిక స్థయిర్యాన్ని దెబ్బ తీస్తూ వుంటే అదేమీ కంటికి ఆనటం లేదా?

2014 ఎన్నికల దాకా రాష్ట్రం విడిపోదని అందరికీ తెలిసిపోయింది. 2009 నుండి 2014 వరకు రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచిన ఘనత కాంగ్రెసుకు పోతుంది. ఇదే కాలంలో విభజన అంశాన్ని సజీవంగా వుంచిన ఘనత తెరాసకు పోతుంది. మరి టిడిపికి ఏ ఘనత దక్కుతుంది? తెరాసకు వంత పాడినందుకా? పాడి తెరాస నుండి మెప్పు ఏదైనా పొందుతోందా? తెరాసకు కొత్తగా స్పేస్ ఎక్కణ్నుంచీ రాదు. ఉన్నవాళ్లను అణచివేస్తేనే వాళ్లకు చోటు దక్కుతుంది. టిడిపిని పూర్తిగా హరాయించుకుని, ఆ పై కాంగ్రెసు పని బడదామని చూస్తున్నారు. బిజెపి బలహీనంగా వున్నంతకాలం వాళ్లతో కలిసి పయనించారు. ఇప్పుడు తెలంగాణవాదంలో తమకు ప్రత్యామ్నాయంగా బిజెపి ఎదుగుతూండడంతో వాళ్లను దూరం పెట్టేస్తున్నారు, రేపు కలహించినా ఆశ్చర్యం లేదు.

ఎందుకంటే ఇతర పార్టీల్లోంచి వచ్చే తీవ్రతెలంగాణావాదులకు కెసియార్ వ్యవహారశైలితో పేచీలు వున్నాయి. తెరాస కుటుంబ పార్టీ. వెలమ కులస్తులు ప్రాబల్యంలో వున్న పార్టీ. అక్కడ ఎంత ఎదిగినా కెసియార్ కుటుంబానికి ఒదిగే వుండాలి. ముఖ్యపదవులు వాళ్లకు పోయిన తర్వాత తక్కినవే వీళ్లకు దక్కుతాయి. ఇవ్వకపోయినా అడుగుదామంటే కెసియార్ అదను చూసి మాయమై పోతారు. ఎవరికీ దొరకరు. అంతా ఆయన కళాకళలపై ఆధారపడి వుంటుంది. ఎవరూ నిలదీసి అడగలేరు. బిజెపి అయితే జాతీయపార్టీ. కాంగ్రెసులో లాగానే ఎదిగేందుకు ఎవరికైనా ఛాన్సుంటుంది. ఒకే కులానికి కట్టుబడి వున్నది కాదు. పైగా నిధులకు కొరత లేదు. తెరాసలో అయితే మీ నిధులు మీరే తెచ్చుకోండి అంటున్నారు. ఈ కారణాల వలన తెరాసతో యిమడలేని వాళ్లు కమలం వైపు కన్నేస్తున్నారు. నాగం జనార్దనరెడ్డి తోవ చూపించారు. కొండా దంపతులు కూడా అటే చూస్తున్నారంటున్నారు.

ఇంకా కొందరు అటు వెళ్లినా వింతేమీ లేదు. తెలంగాణా యివ్వగలిగేది ప్రాంతీయపార్టీ కాదు, జాతీయపార్టీయే. 'ప్రాంతీయపార్టీ గెలిచినా కేంద్రంలోని జాతీయపార్టీని అదిలించో, బెదిరించో, బతిమాలో రాష్ట్రం తెచ్చుకోవాలి. దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలంటే 'మా మేనమామ చెవిలో బొచ్చు మొలిపించు, అప్పుడు నాకు ఐశ్వర్యం వస్తుంది' అని డొంకతిరుగుడుగా అడిగినట్టు వుంటుంది. అంతకంటె డైరక్టుగా జాతీయపార్టీలో చేరి, దాన్ని బలపరిస్తే మంచిది కదా, అందుకే బిజెపిలో చేరాం' అని వాళ్లు చెప్పుకోవచ్చు. టిడిపి, కాంగ్రెసు నుండి నాయకులు తమ పార్టీలో చేరకుండా బిజెపిలో చేరితే తెరాస చూస్తూ వూరుకోదు. పళ్లు నూరుతుంది. అంతకంటె వర్స్ సినారియో ఏమిటంటే – 'ఎన్నికలలో గెలవాలంటే ప్రత్యేక తెలంగాణ పట్ల కమిట్‌మెంట్ చాలదు, నిధులుండాలి. అవి లేవు కాబట్టి మీకు టిక్కెట్లు యివ్వటం లేదు. మేం నెగ్గి, రాష్ట్రం విడిపోయి, మేమే అధికారంలోకి వస్తే అప్పుడు ఎమ్మెల్సీ పోస్టులప్పుడు కనబడండి చూదాం. ఈలోగా నిధులు తెచ్చిన ఎన్నారైలకో, యిప్పుడే విమానంలో దిగిన బొంబాయి పారిశ్రామికవేత్తలకో టిక్కెట్టు యిస్తాను.' అని కెసియార్ యిప్పటిదాకా జెండాలు మోసిన కార్యకర్తలకు, మాజీ లెజిస్లేటర్లకు, ఎంపీలకు చెప్తే వాళ్లు మండిపడతారు. వాళ్లకు ఎఱ్ఱ తివాచీ పరిచి బిజెపి తీసుకుంటుంది. మెహబూబ్‌నగర్‌లో చేసినది అదేగా! అలాటప్పుడు తెరాస, బిజెపిని ప్రత్యర్థిగా చూడక మరోలా చూస్తుందా? అందుకే కెసియార్ ఒంటరి పోరు అంటున్నారు.

టిడిపిని వదిలిపెట్టడానికి డబ్బు మూటల ప్రాబల్యం కూడా కారణమంటున్నారు కడియం. 'టిడిపిలో పారిశ్రామికవేత్తలు ఏం చెపితే అదే జరుగుతోంది, ఎందుకంటే నిధులు సమకూరుస్తున్నది వాళ్లు కాబట్టి...' అని ఆయన అభియోగం. మరి తెరాసలో కూడా అదే జరగబోతోందని టిక్కెట్ల పంపిణీ వద్దే తెలుస్తోంది కదా. కర్ణాటక ఎసెంబ్లీ ఎన్నికలలో కూడా డబ్బున్నవాళ్లే గెలిచారట. అన్ని

పార్టీలూ 80% కి మించి టిక్కెట్లు కోటీశ్వరులకే యిచ్చాయి. అక్కడ కంటె మన రాష్ట్ర ఎన్నికలలో డబ్బు ప్రాధాన్యం ఎక్కువ అని అందరికీ తెలుసు. అందువలన డబ్బున్నవాళ్లనే తెరాస ఎంచుకుంటుందనుకోవాలి. అది చూసి కడియం నిరుత్సాహపడతారో ఏమో. ఆ మాట కొస్తే కడియం రాక చూసి వరంగల్ జిల్లా తెరాస కార్యకర్తలు ఎంత నీరసించారో. ఎన్నేళ్లయినా వీళ్లే నాయకులా? వీళ్ల పీడ వదిలించుకోవాలని తెరాసలోకి వస్తే యిక్కడా యీయనే దాపురించాలా? అనుకుని వుంటారు ఆయన ప్రత్యర్థులు. ఓపికున్నవాళ్లు యితర పార్టీల్లోకి జారుకుంటారు. లేనివాళ్లు లోపలే వుండి కుట్రలు పన్నుతారు.

ఫిరాయింపులను ప్రోత్సహిస్తే యిదే యిబ్బంది. గత రెండేళ్లగా మీడియా అంతా కోడై కూస్తోంది – తెలంగాణలో తెరాస, కోస్తా, సీమల్లో వైకాపా స్వీప్ చేసేస్తాయనీ, కాంగ్రెస్, టిడిపి శంకరగిరి మాన్యాలు పట్టి పోవాల్సిందేననీ! ఇంత బిల్డప్ యిస్తే అలా జరగదని అప్పణ్నుంచీ రాస్తూ వచ్చాను. ఎందుకంటే – గెలిచే పార్టీలోకే దూకుదామని ఎవరైనా చూస్తారు. ఈ రెండు పార్టీలకీ ఛాన్సుంది అనగానే అందరూ దూకుతారు, టిక్కెట్లు అడుగుతారు. దక్కకపోతే ఎదురు తిరుగుతారు, దాని విజయావకాశాలు దెబ్బ తీస్తారు. చివరాఖరికి తెరాస, వైకాపా మొదట్లో అనుకున్నంత విజయాలు సాధించవు – ఇదీ నా లాజిక్.

వైకాపాలో కొణతాల, కొండా అసంతృప్తి బయటపడింది. అంతకుముందు జిల్లా యిన్‌చార్జిల సమావేశాల్లో భీకరమైన పోరాటాలు చూశాం. సర్ది చెప్పి, వాగ్దానాలు చేయడానికి నాయకుడు అందుబాటులో లేడు. కొండా దంపతులకు జగన్ ములాఖాత్ దొరికింది కాబట్టి ప్రస్తుతానికి శాంతించారు. ఇకపై ఎందరికి యిలాటి అవసరాలు పడతాయో, ఎంతమందికి జగన్ యింటర్వ్యూ యిస్తారో, ఎన్నికలు దగ్గర పడిన కొద్దీ మహారాజశ్రీ ప్రభుత్వం వారు సెక్యూరిటీ కారణాలు చెప్పి యింటర్వ్యూలపై పరిమితి విధిస్తే ఏమవుతుందో వూహించండి. ఎందువలన యిలా జరుగుతోంది? కొణతాల విషయంలో నియోజకవర్గం తన చేతిలోంచి పోతుందేమోనన్న భయం! కొండా దంపతుల అజెండా పెద్దది. మొదటినుండీ అంటిపెట్టుకుని వున్నాం కాబట్టి జిల్లా మొత్తం తమ చేతిలో వుండాలని వాళ్ల కోరిక. రేపు ఆ జిల్లా నుండి పెద్ద తెరాస నాయకుడు లేదా కాంగ్రెస్ నాయకుడు ఎవరైనా టిక్కెట్టు దొరక్క వైకాపాకు వస్తే వాళ్లకు కండువా కప్పి, వీళ్ల కేసి తిరిగి 'మీ నియోజకవర్గం మీరు చూసుకోండి చాలు, మీ పక్క నియోజకవర్గంలో వీళ్లకు టిక్కెట్టిస్తాం..' అంటారు. ఇంత సేవ చేసి కేవలం ఒకటి, రెండు స్థానాలకే పరిమితమయితే ఎలా అని వీరి బాధ. మరి కొత్తగా వచ్చినవాళ్లకు ఏమీ యివ్వకపోతే ఎలా అని పార్టీ నాయకుల బాధ.

పాతనీరుకి, కొత్తనీరుకి మధ్య సంఘర్షణ తప్పదు. వరంగల్‌లో రాజయ్య, కడియం శ్రీహరి ఘోరంగా పోట్లాడుకునేవారు. రాజయ్య కాంగ్రెస్‌కు వెళ్లి తెరాసలోకి వచ్చారు. కడియం టిడిపిలో వుండి యిప్పుడు తెరాసలోకి వచ్చారు. ఇద్దరి మధ్య సఖ్యత పొసగాలంటే టైము పడుతుంది. పైగా యిది ఎన్నికలు దగ్గర్లో వున్నాయి. తన అనుచరులకు టిక్కెట్లు యిప్పించుకోవడానికి యిద్దరూ తలపడవలసి వస్తుంది. పార్టీలోనే అంతర్గత కలహాలు పుట్టుకొస్తాయి. తెరాసకైనా, వైకాపాకైనా యిదే అవస్థ. బాబుగారు గేట్లు తెరిచి వరద తెప్పించి పక్క పార్టీ వాళ్లను తన పార్టీలోకి లాక్కుని వస్తే ఆయనకూ యిదే బాధ. తమను వీడి వెళ్లిపోయిన నాయకులను మళ్లీ వెనక్కి తెచ్చుకుని వస్తే కాంగ్రెసుకూ యిదే బాధ. ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెసులో విలీనం అయిందనే సాంకేతికంగా అనుకుంటున్నాం కానీ మానసికంగా కాలేదు. అది వేరే గ్రూపు కిందే వ్యవహరిస్తోంది. తెరాసలో కూడా కొన్నాళ్ల తర్వాత 'మాజీ టిడిపి గ్రూపు' అంటూ ఒకటి తయారు కావచ్చు.

ఎందుకిలా జరుగుతోంది? కొత్తగా పార్టీ పెట్టినపుడు క్యాడర్‌ను తయారుచేసుకోకుండా అనుభవజ్ఞులు అనే మిషతో పాత నాయకులను యితర పార్టీల నుండి లాక్కోవడంతో వస్తోంది చిక్కు. క్యాడర్‌ను తయారుచేసుకోవడం శ్రమతో కూడుకున్న పని. అంత కష్టం ఎందుకులే అనుకుని రెడీమేడ్ సరుక్కి వెళితే యిదీ అవస్థ. వచ్చినంత వేగంగానూ బయటకు వెళ్లిపోయే రిస్కు వుంది. వాళ్లు లోపలకి రావడం వలన లోపల వున్నవాళ్లు ఉక్కపోత ఫీలై బయటకు వెళ్లిపోయే ప్రమాదం వుంది. కడియం శ్రీహరి రాక వలన తెరాసలో రాబోయే పరిణామాలు నెల్లాళ్లపాటు గమనిస్తే యీ విషయం మరింత స్పష్టంగా తెలుస్తుంది. ఇప్పటికే అడుగుతున్నారు – కడియం ఏమంత గొప్ప నాయకుడని మనం తీసుకోవాలి? 2009లో తెరాస మద్దతు యిచ్చినా ఓడిపోయాడు. మొన్న ఉపయెన్నికలో తెరాస అభ్యర్థి, కొండా సురేఖ తలపడితే యీయన ఎక్కడ తేలాడు? ఇలాటివాడు మనకి అవసరమా? టిడిపిని యిరకాటంలో పెట్టామన్న ఆనందం తప్ప మనకు దక్కేది ఏముంది? అని. వీటికి తెరాస నాయకత్వం వద్ద సమాధానం లేదు. కడియం తెరాస అధిష్టానాన్ని సంతృప్తి పరచగలరు కానీ తెరాస కార్యకర్తలు గట్టిగా నిలదీస్తే తట్టుకోలేరు.

కడియం ఉదంతం వలన టి–కాంగ్రెస్ ఎంపీల విషయంలో జరగబోయేది కూడా మనం వూహించవచ్చు. ప్రస్తుతం వాళ్లు చేస్తున్నదేమిటి? 'మేం ఆంధ్రప్రాంతం నాయకులతో కలిసి బస్సు యాత్ర కూడా చేయం, ఇక్కడ ఎన్నికలు పెడితే తెరాసకు వ్యతిరేకంగా అభ్యర్థిని నిలబెట్టకూడదని వాదిస్తాం, నిలబెడితే ప్రచారం చేయం, కాంగ్రెస్ నాయకత్వాన్ని తిడుతూనే వుంటాం, డిసెంబరు 9 నాటి హామీ మాటిమాటికీ గుర్తు చేసి యిరకాటంలో పెడుతూనే వుంటాం, తెలంగాణ యిచ్చి తీరాలని వాదిస్తాం, దానివలన తక్కిన ప్రాంతాల్లో కాంగ్రెసు ఎలా పోయినా ఫర్వాలేదంటాం, తెలంగాణ యిచ్చినా అన్ని సీట్లూ గెలిచి చూపిస్తాం అని హామీ యివ్వం, కెసియార్‌కు నచ్చచెప్పి తెరాసను విలీనం చేసుకుంటేనే అది సాధ్యం అని ముందే చెపుతున్నాం, కెసియార్ విలీనానికి ఒప్పుకుంటారని ముందుగా గ్యారంటీ యివ్వం, తెలంగాణ ప్రకటించేసి రిస్కు తీసుకోండి..' అని చెప్పడమేగా!

ఇదంతా చేసేది కూడా ఐదారుమంది ఎంపీలు! వీరిలో వరంగల్, కరీంనగర్ జిల్లాల వాళ్లు ఎక్కువ. తక్కిన వాళ్లలోకూడా తమ

నియోజకవర్గాల్లో వున్న ఒత్తిళ్ల మేరకు అధిష్టానాన్ని ఒత్తిడి చేద్దామని చూసేవారే తప్ప 'నేను నాయకుణ్ని, నా ప్రజలకు నచ్చచెప్పుకోగలుగుతాను' అని ధీమాగా మాట్లాడేవాళ్లు లేరు. 'రిస్కు తీసుకుని కేంద్రం తెలంగాణ యివ్వాలి, త్యాగం చేసి కెసియార్ పార్టీని విలీనం చేయాలి, మేం మాత్రం ఏ రిస్కూ తీసుకోం. కానీ యీ చర్యల వలన వచ్చే లాభం మేం పొందుతాం' అని వీళ్లు అంటూంటే వినడానికి నవ్వు వస్తుంది. కడియం శ్రీహరి కూడా టిడిపిని యిలాగే ఒత్తిడి చేసి, టిడిపి ప్రత్యేక తెలంగాణాకు సై అన్నాక తెరాసలోకి జంప్ చేశారు. రేపు వీళ్లూ అదే చేయవచ్చు. కాంగ్రెస్ అధిష్టానం మెడలు వంచి, తెలంగాణ ప్రకటింప చేసి, అప్పుడు తెరాసలోకి వెళ్లిపోతే..? ఈ అనుమానం కాంగ్రెసు హై కమాండ్‌కు కూడా వుంది కాబట్టే వీళ్లను పట్టించుకోవడం మానేసింది. ఏం చేస్తారో చేసుకోండి అన్నట్టు కూర్చుంది. కాంగ్రెస్ ఎంపీ రాజయ్య తెరాసలోకి వచ్చేస్తారన్న ప్రచారం చాలా బలంగా వుంది కాబట్టే కడియం చాలాకాలం తటపటాయించారట. చివరకు ఆయన రానని చెప్పడంతో కెటియార్ కడియం యింటికి వచ్చి ఆ విషయం చెప్పి, 'ఇక మీరు వచ్చేయండి, మీకు సీటు ఖాయం' అన్నాకనే కడియం వచ్చారట. కడియం వచ్చాక తెరాసలో వచ్చే ప్రకంపనలు తెరాసలోకి వద్దామనుకుంటున్న టికాంగ్రెసు ఎంపీలకు జాగ్రత్తగా గమనిస్తారు. మనం వారినీ, వీరినీ యిద్దరినీ గమనిద్దాం. **(సమాప్తం)**
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 14, 15 వీక్లీకై** **ఎమ్బీయస్ : 2014లో చిరంజీవి సిఎం అభ్యర్థి..?**

కాప్షన్ చదవగానే నవ్వుకుని వుంటారు. మాజీ ప్రజారాజ్యం పార్టీ వాళ్లు తప్ప ఎవరూ సీరియస్‌గా తీసుకోని చిరంజీవిని సిఎం ఏమిటి అని! కాంగ్రెసులో చిరంజీవి అనుచరుల కలయిక పాలూ–నీరూలా లేదు, నూనె–నీరూలా వుంది. నూనె గ్రూపు స్పష్టంగా కనబడుతూ వుంటుంది. అప్పుడప్పుడు ప్రెస్ మీట్ పెట్టి (గాంధీభవన్‌లో కాదు) చిరంజీవి అంతటి నాయకుడు, యింతటి నాయకుడు అని స్టేటుమెంట్లు యిస్తూ వుంటుంది. దానివలన కలిగే లాభం ఏమిటంటారా? చిరంజీవికి దక్కాల్సిన కేంద్రమంత్రి పదవి దక్కేసింది కానీ గ్రూపులో అసంతృప్త ద్రావణాలు యింకా వున్నాయి కాబట్టి వాళ్లకు కూడా శాంతి జరిపించాలని హెచ్చరికలన్నమాట – మేమింకా సజీవంగా వున్నాం, మా గాడ్‌ఫాదర్ గొప్పవాడు, తలచుకుంటే ఏమైనా చేసేయగలడు అని! అయితే చిరంజీవి రాజకీయజీవి కాదని, బొత్తిగా వెర్రిబాగులవాడని, పార్టీ నడిపే ఓపిక లేనివాడని, బేరసారాలు బాగా ఆడలేడని జనసామాన్యంలో ఒక అభిప్రాయం పాతుకుపోయింది. మొన్న కర్ణాటక ఎన్నికలలో తప్ప యిప్పటిదాకా చిరంజీవి ప్రచారం చేసిన అన్ని ఉపయెన్నికలలో – రాష్ట్రం లోపల, వెలుపల – పార్టీ ఓడిపోయింది. మరి అలాటివాణ్ని ముఖ్యమంత్రి చేస్తాం అని రాష్ట్రకాంగ్రెస్ 2014 ఎన్నికలకు వెళుతుందా?

మామూలుగా అయితే వెళ్లకూడదు. మంచి దూకుడుగా వెళుతూ, తనకంటూ ఒక యిమేజి కల్పించుకుంటున్న కిరణ్‌కుమార్‌నే సిఎం అభ్యర్థిగా ప్రకటించుకుని వెళ్లాలి. కానీ చిరంజీవి వైపు మొగ్గవచ్చు అన్న అనుమానం కలగడానికి కారణం – కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెసు విజయం. అది కాంగ్రెసు విజయం కాదని, బిజెపి అపజయం మాత్రమే అని సింపుల్‌గా అనేయవచ్చు. కానీ బిజెపికి ప్రత్యామ్నాయంగా కాంగ్రెసునే ఎందుకు ఎంచుకున్నారు? జెడియస్‌నో, కెజెపినో ఎందుకు ఎంచుకోలేదు? అని గట్టిగా ఆలోచిస్తే కాంగ్రెసు ఫార్ములా కాస్త తడుతుంది. కాంగ్రెసు అభ్యర్థుల ఎంపిక విషయంలో చాలా తప్పులు చేస్తోందని, కులసమీకరణలను సరిగ్గా లెక్కలోకి తీసుకోవడం లేదని, బలహీనమైన అభ్యర్థులను నిలబెడుతోందని ఎన్నికలకు ముందు మీడియా రాసింది. చివరకు చూస్తే కాంగ్రెసు అంచనాలకు మించిన విజయాన్ని సాధించడానికి కారణం – కులాల ఫార్ములా అనే తేల్చారు.

కర్ణాటక ఎన్నికలలో కులం చాలా ప్రధాన భూమిక వహిస్తుందని పరిశీలకులు అంటారు. ఆ రాష్ట్రంలో చాలా ప్రముఖ స్థానంలో వున్నవారు లింగాయతులు. జనాభాలో 17%. వీళ్లు మన రాష్ట్రంలో రెడ్లలా చాలాకాలంగా రాజకీయాల్లో వున్నారు. మొదటితరం ముఖ్యమంత్రుల్లో చాలామంది వీళ్లే. ఆర్థికంగా కూడా బలమైన వర్గం. వీళ్లు కాంగ్రెసుకు మద్దతుగా నిలబడేవారు. వీరేంద్ర పాటిల్ అనే లింగాయత్ నాయకుణ్ని ఇందిరా గాంధీ అవమానకరంగా తొలగించివేసిన దగ్గర్నుంచీ కాంగ్రెసుపై వీరు కత్తికట్టి బిజెపివైపు మొగ్గు చూపసాగారట. వీరి తర్వాత సంఖ్యాపరంగా పెద్ద సంఖ్యలో 14% వున్నవాళ్లు వొక్కళిగలు (గౌడులు). సామాజికపరంగా వీళ్లు లింగాయతుల తర్వాతే. లింగాయతులను రాజకీయంగా ఎదిరిస్తూ వచ్చారు. వాళ్లు కాంగ్రెస్‌వైపు వున్నారు కాబట్టి వీళ్లు సోషలిజంవైపు ఎక్కువగా మొగ్గారు. దేవెగౌడ యీ కులం వాడే. ప్రస్తుతం అతని పార్టీ జెడియస్‌ను యీ కులంవారు ఆదరిస్తున్నారు.

లింగాయతులలో చాలామంది బిజెపికి, వొక్కళిగల్లో చాలామంది జెడియస్‌వైపు వున్నారు కాబట్టి కాంగ్రెసు తక్కిన కులాల వారిని చేరదీయాలని నిశ్చయించుకుంది. సంఖ్యాపరంగా మూడో స్థానంలో (8–9%) వున్న కురుబ అనే బిసి కులానికి చెందిన సిద్ధరామయ్యను ముందు పెట్టుకుని కాంగ్రెసు ఎన్నికలలోకి వెళ్లింది. శాసనసభాపక్షంలో నాయకుడి పదవి అతనికే యిచ్చింది. అతనికి మద్దతుగా కర్ణాటక పిసిసి అధ్యక్షుడిగా పరమేశ్వర అనే దళితుణ్ని, కేంద్రమంత్రిగా వున్న మరో దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గేను నిలిపింది. ఈ ముగ్గురు ప్రముఖంగా కనబడడంతో బిసిలు, దళితులు (జనాభాలో 21%) ఆకర్షితులయ్యారు. బిజెపిని నిలవరించడానికి ముస్లిములు (10%), యితర మైనారిటీలు కూడా యీవైపే వచ్చారు. ఈ ప్రయోగం గతంలో దేవరాజ్ అర్సు కూడా చేశాడు. గుజరాత్‌లో మాధవసింహ్ సోలంకీ కూడా చేశాడు. ఈ ప్రయోగం సఫలమైంది. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రిగా ఎవరిని చేస్తారన్న

ప్రశ్న వచ్చింది. చాలా దశాబ్దాలుగా హై కమాండ్ ఎవరు చెపితే వారు అనడమే సాగుతోంది. కానీ సోనియా ఎన్నికైన లెజిస్లేటర్లనే తమ నాయకుణ్ని ఎంచుకోమంది. రహస్య బ్యాలట్‌లో సిద్ధరామయ్యకు ఎక్కువ ఓట్లు పడ్డాయి. అతనే ముఖ్యమంత్రి అయ్యాడు. దళితులు కదాని ఎన్నికల్లో ఓడిపోయిన పరమేశ్వరను, కేంద్రంలో వున్న మల్లికార్జున ఖర్గేను పైనుంచి రుద్దలేదు.

ఒబిసి ఓటు బ్యాంకు ఎంత దృఢమైనదో యుపి, బిహార్‌లు చూపించాయి. దక్షిణాదిన తొలిసారిగా కర్ణాటకలో పీఠం వేసిన బిజెపిని తొలగించడానికి కాంగ్రెసు ఒబిసి మంత్రాన్ని పఠించింది. అదే మంత్రాన్ని పొరుగున వున్న ఆంధ్రలో ప్రయోగించి చూస్తుందన్న అనుమానం కలుగుతోంది. లింగాయతులు, వొక్కళిగల్లా ఇక్కడా మనకు రెడ్లు, కమ్మలు వున్నారు. రెడ్లు కాంగ్రెసుతో, కమ్మలు ప్రతిపక్షాలతో ఐడెంటిఫై అయి వున్నారు. ఇప్పుడు రెడ్లు కాంగ్రెసును వీడి వైకాపావైపు చూస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. అలా వెళ్లే రెడ్లను నిలిపి ఆకట్టుకోవడానికే కిరణ్ కుమార్ రెడ్డిని సిఎం చేశారని, అనేక ముఖ్యపదవులు రెడ్లకు కట్టబెట్టారనీ ప్రచారం జరిగింది. ఏం చేసినా జనం వైకాపావైపు వున్నారన్న అనుమానం వస్తే రెడ్లు అటువైపు వెళ్లడానికి సంకోచించరు. జగన్ క్రైస్తవుడు కాబట్టి క్రైస్తవ మైనారిటీలు అతనివైపే వుండడంలో ఆశ్చర్యం లేదు, యితర మైనారిటీలు కూడా అతనివైపు మొగ్గవచ్చు. ఇక కాంగ్రెసుకు మిగిలినది దళితులు, ఒబిసిలు. వీళ్లను సమీకృతం చేసుకుంటే కర్ణాటకలో లాగానే గెలుపు అందుకోవచ్చని కాంగ్రెసు వ్యూహకర్తలు భావించవచ్చు.

సంఖ్యాపరంగా రెడ్లు, కమ్మల కంటె ఎక్కువమంది వున్నా కాపులకు యిప్పటివరకు ముఖ్యమంత్రి పదవి దక్కలేదు. చిరంజీవి రాజకీయాల్లోకి వచ్చినపుడు ఆ అవకాశం లీలగా పొడసూపి అంతలోనే ఆవిరై పోయింది. కాపులను, బిసిలను, దళితులను తమవైపు గట్టిగా నిలుపుకుంటే కాంగ్రెసుకు ఓటుబ్యాంకు ఏర్పడుతుంది. కాపుల విషయంలో ఒక వింత అంశం వుంది. సామాజికంగా అగ్రకులమే కానీ, కాపుల్లోనే కొన్ని వర్గాలు బిసిలుగా గుర్తింపబడతాయి. రామచంద్రయ్యగారిని టిడిపిలో వుండగా బిసి నాయకుడు అనేవారు. పార్టీ ఫిరాయించగానే కాపు అనేశారు. బొత్స, డియస్ యిత్యాది నాయకులు కాస్సేపు కాపు నాయకులు అంటారు, కాస్సేపు బిసిలంటారు. చూడబోతే కాపు అనే ఛత్రం కింద ఓసిలు, బిసిలు అందరూ వున్నారు. అందువలన కాపులందర్నీ బిసిలుగా పరిగణించమని కాపునాడు కోరుతూంటుంది. అలా అయితే సంఖ్య యింకా పెరుగుతుంది కదాని ఆశ. మరి దానికి తక్కిన బిసిలు ఒప్పుకుంటారా అన్నది ప్రశ్న. బిసిల రిజర్వేషన్‌పై ఓ సీలింగు వుంది కదా, కాపులు కూడా బిసి లనిపించుకుంటే మరి అసలు బిసిల వాటా తగ్గిపోతుంది కదా! ఫైనల్‌గా కాపుల్ని బిసిలుగా గుర్తించకపోవచ్చేమో కానీ కాపులు, బిసిలు సన్నిహితంగా మెలిగే ఛాన్సుంది.

ఈ లెక్కలు వేసుకుని కాంగ్రెసు కాపు కులస్తుడైన చిరంజీవిని ముఖ్యమంత్రి కాండిడేటుగా ముందుకు పెట్టి ఎన్నికలకు వెళ్లవచ్చని నా వూహ. కాపులు మాత్రమే ఓటేస్తే చాలదు, బిసిలు కూడా ఓటేయాలి. కానీ వాళ్లు టిడిపిని వదలకపోతే..? ఎన్టీయార్ రాజకీయాల్లోకి వచ్చాక బిసిలకు రాజకీయప్రాధాన్యం పెంచారు. టిడిపికి మద్దతుగా బిసిలు నిలిచారు. చిరంజీవి కూడా యీ బిసిలకే గేలం వేశారు. కొంతమేరకే విజయం సాధించారు. కొత్త పార్టీకి 17% ఓట్లు వచ్చాయంటే మామూలు విషయం కాదు. చిరంజీవి మా బిసి ఓట్లను పట్టుకుపోయారు కాబట్టే మేం ఓడిపోయాం అని విశ్లేషించుకున్న బాబు బిసిలను ఆకర్షించడానికి శతథా ప్రయత్నిస్తున్నారు. బిసిలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. బిసి డిక్లరేషన్ అన్నారు. ఏం చేసినా టిడిపి గెలిస్తే కమ్మ కులస్తుడైన బాబే ముఖ్యమంత్రి అవుతారు తప్ప కాపులెవరూ కారు కదా. అలాగే వైకాపా గెలిస్తే జగనే తప్ప వేరెవరూ ముఖ్యమంత్రి కారు కదా. వేరే కులస్తులు ముఖ్యమంత్రి కావాలంటే జాతీయ పార్టీ ఐన కాంగ్రెసులో మాత్రమే ఆ సౌలభ్యం వుంది. 'రెడ్లు వైకాపా వైపు వెళ్లిపోతున్నారు కాబట్టి తన అవసరం కొద్దీ ప్రస్తుతం కాంగ్రెసు మనల్ని దువ్వుతోంది, కాపును ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపుతోంది' అని కాపులు గ్రహించినా 'ఏది ఏమైనా యీ ఛాన్సు వదులుకుంటే మళ్లీ రాకపోవచ్చు' అనుకుని కాంగ్రెసువైపు మళ్లినా మళ్లవచ్చు.

సొంతంగా పార్టీ పెట్టి ముఖ్యమంత్రి కాలేకపోయిన చిరంజీవిని చూపిస్తే ఓట్లు పడతాయా అన్న సందేహం రావచ్చు. 2009లో అధికారంలో వున్న కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా చిరంజీవి ఎదిగి వుంటే కనీసం 100 సీట్లయినా వచ్చి వుండేవి. కానీ ఆయన పార్టీ నిర్మాణవ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో దెబ్బ తిన్నాడు. దానికి తోడు మీడియా ఆ పార్టీ యిమేజిని పూర్తిగా దిగజార్చింది. మహా కూటమిని ఆకాశానికి ఎత్తేసి కాంగ్రెసును గద్దె దించగల సత్తా ఆ కూటమికే వుందని చాటింది. దాంతో కాంగ్రెసు వ్యతిరేకులు, చిరంజీవి అభిమానుల్లో చాలామంది కూడా ఆ కూటమివైపే మొగ్గారు. మహాకూటమి, ప్రజారాజ్యం రెండూ దెబ్బ తిన్నాయి, కాంగ్రెసు గెలిచేసింది. ఈ సారి చిరంజీవి అధికారపక్షం నుండి పోటీ చేస్తున్నారు, పటిష్టమైన పార్టీ యంత్రాంగం ఆయన వెనుక వుంది. అందువలన ఆయన అభిమానులందరూ, కాపు ముఖ్యమంత్రి కావాలని కోరుకునేవాళ్లు, రెడ్డి, కమ్మ తప్ప వేరెవరు ముఖ్యమంత్రి అయినా ఫర్వాలేదనుకునే బిసిలు – ఓట్లు వేసే ఛాన్సుంది. దళితవర్గీకరణకు టిడిపి ఒప్పుకుంది కాబట్టి మాదిగలు టిడిపిని అభిమానించవచ్చు. వాళ్లను నిలవరించడానికి మాలలు కాంగ్రెసువైపు పూర్తిగా మొగ్గవచ్చు. ఎందుకంటే వైకాపా అసెంబ్లీలో ఒకలా, కౌన్సిల్‌లో మరొకలా మాట్లాడి రెండు వర్గాల వారినీ మెప్పించలేకపోయింది.

ఓటింగు కులాలవారీగా అవుతుందని నేను చెప్పటం లేదు. సెఫాలజిస్టులు, విశ్లేషకులు ఉత్తరభారతంలో వేసుకున్న సమీకరణాలనే దక్షిణాదిన కూడా అన్వయింపచేసి లెక్కలు వేస్తారు. అనేక సందర్భాలలో అవి తప్పుతున్నాయి. ఏ సినిమా ఎందుకు ఆడిందో చెప్పలేనట్టుగానే, ఏ పార్టీ ఎందుకు నెగ్గిందో చెప్పడం కూడా కష్టమే. ఎవరికి తోచిన ఊహలు వారు చేస్తారు. కర్ణాటక ప్రయోగం సక్సెసైంది కాబట్టి ఆ ఫార్ములాను యిక్కడా వర్తింప చేసి చూస్తారనే భావనతో యీ అంచనాకు రావడం జరిగింది. ఇలాగే జరిగితే

మరి రేయింబవళ్లు కష్టపడి యిమేజి పెంచుకుంటున్న కిరణ్ గతేమిటి? తనను సిఎం అభ్యర్థిగా ప్రకటించకపోతే ఆయన వూరుకుంటాడా? అన్న ప్రశ్న వస్తుంది. ఆయన అలగవచ్చు, 'ప్రస్తుతం కేంద్రమంత్రి పదవి యిస్తాం, చిరంజీవి సరిగా పాలించలేకపోతే అతన్ని దింపేసి నీకే ఛాన్సు యిస్తాం' అని అధిష్టానం వూరుకోబెట్టవచ్చు. కాదని ఎదురు తిరిగితే కిరణ్ వెనక పదిమంది ఎమ్మెల్యేలు కూడా నిలుస్తారని నేను అనుకోను. 'మంత్రిపదవి కూడా పొందలేకపోయిన నిన్ను సిఎం చేసి మూడేళ్లపాటు వుంచినదే ఎక్కువ, సంతోషించి మెదలకుండా వూరుకో, చెప్పినట్టు చేయి' అని హితులు సలహా యిస్తారు. 'సామాజిక తెలంగాణ అని చెప్పి తర్వాత సమైక్యవాదం అంటూ మోసం చేసిన చిరంజీవిని ఒప్పుకోం' అని తెలంగాణ కాంగ్రెసు వాదులు సణగవచ్చు. వాళ్లు ఎంత సణిగినా వినకుండా రెండేళ్లగా ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన సిఎం, పిసిసి అధ్యక్షుడుతో బండి లాక్కుని వస్తున్న అధిష్టానం ఆ అభ్యంతరాలను పట్టించుకోకపోవచ్చు.

చివరలో ఒక్క మాట – చిరంజీవిని సిఎం కాండిడేటుగా ప్రకటించే అవకాశం వుందంటున్నాను తప్ప, ఆయన కాంగ్రెసును దరిచేర్చగలరని నేను అనటం లేదు. పైగా ఎన్నికల తర్వాత జగన్‌తో ఒప్పందం కుదిరితే జగన్‌ను సిఎంను చేసి చిరంజీవిని పక్కకు పెట్టేయవచ్చు. జగన్‌తో ఒప్పందాలు లేకుండా కాంగ్రెసే ప్రభుత్వం ఏర్పరచి చిరంజీవితో ప్రభుత్వం ఏర్పరచినా, తెలంగాణ రెడ్డిని ఎవరినైనా డిప్యూటీ సిఎంగా పెట్టవచ్చు. చిరంజీవి సరిగ్గా పాలించలేకపోతే ఆర్నెల్లు చూసి దింపేయవచ్చు. ...ఏదైనా జరగవచ్చు కానీ ఒక్కటి మాత్రం ఖాయం – చిరంజీవిని ముఖ్యమంత్రి అభ్యర్థి అని చెప్పకపోయినా ఆయన్ను ఆ విధంగా ప్రొజెక్టు చేస్తారు. ప్రచార కమిటీకి సారథ్యం యిచ్చి బాగా తిప్పి కాపు, బిసి ఓట్లు పట్టుకురమ్మనమని చెప్తారు. ఈయనే ముఖ్యమంత్రి కాబోతాడన్న ఆశ కాపుల్లో, బిసిల్లో కలిపిస్తారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 16, 17 వీక్లీకై**

## ఎమ్బీయస్ : వందనము రఘునందనా..!

తెరాసపై రఘునందన్ చేస్తున్న దాడి చూసి టిజి వెంకటేష్ యిత్యాదులు వెంటనే – 'వందనము రఘునందనా, సేతుబంధనా, భక్త చందనా' అని సాగే త్యాగరాజు కీర్తనను గుర్తు చేసుకుని వుంటారు. సేతుబంధనా (వంతెన కట్టినవాడా)కు బదులు హరిబంధనా (హరీష్‌రావును కట్టడి చేసినవాడా) భక్త చందనా(భక్తులకు చందనవృక్షం వంటివాడివి) కు బదులు ఆంధ్రచందనా అని మార్పులు చేసుకుని వుంటారు. 'పారిశ్రామికవేత్తలను బెదిరించి డబ్బు తీసుకున్నావు' అని ఆరోపించి 'ఎవరు తీసుకున్నారో నేను నిరూపిస్తా' అంటూ రఘునందన్ ఎదురుదాడి ప్రారంభించగానే నాలిక కరుచుకున్న తెరాస నాయకులకు కూడా ఈ కీర్తనలోని చరణాలు గుర్తుకు వచ్చి వుంటాయి 'శ్రీదమా, నాతో వాదమా? నే భేదమా? ఇది మోదమా?' (మనం వేర్వేరు కాదు కదా, నాతో వాదించడం న్యాయమా, దీని వలన నీకు సంతోషం కలుగుతుందా?) అని.

ఆంధ్రప్రాంతపు రాజకీయనాయకులు బహిరంగంగా, హైదరాబాదులోని పారిశ్రామికవేత్తలు చాటుగా యిన్నాళ్లూ వాపోతూ వున్నది యివాళ తెరాస నాయకులు తామే బయట పెట్టుకున్నారు. ఉద్యమం పేరుతో తెరాస నాయకులు విరాళాలు బలవంతంగా వసూలు చేస్తున్నారని, తెలంగాణ యిస్తే యిది మరీ ముదిరిపోతుందని హైదరాబాదులోని పారిశ్రామికవేత్తలు శ్రీకృష్ణ కమిటీ సభ్యుల వద్ద మొర పెట్టుకున్నారని చాలామంది చెప్పుకున్నారు. విభజన వుద్యమం పట్ల సానుభూతి వున్నవాళ్లు 'ఇది దుష్ప్రచారం' అని కొట్టి పారేస్తారు. కానీ మామూలుగా ఆలోచిస్తే ఒక విషయం తప్పకుండా తడుతుంది – పారిశ్రామికవేత్తల్లో చాలామంది ధూర్తులు వున్నారు. వర్కర్లకు జీతాలు యివ్వడం ఆలస్యం చేస్తారు, ప్రావిడెంటు ఫండ్ వాళ్ల దగ్గర్నుంచి వసూలు చేసి ట్రస్టుకి కట్టకుండా తాము వాడేసుకుంటారు. ఇఎస్‌ఐ ఫీజు, ఇన్‌కమ్‌టాక్సు యివన్నీ వసూలు మాత్రం కచ్చితంగా చేసి, ప్రభుత్వానికి కట్టకుండా వాళ్లను యిక్కట్లపాలు చేస్తారు. ఇలాటివాళ్లు కెసియారో, మరో తెరాస లీడరో వచ్చి ఐదు నిమిషాల పాటు తట్టో, బుట్టో పట్టుకుంటే ఐదులక్షలు, పదిలక్షలు యిచ్చారంటే ఆనందంగా, ఐచ్ఛికంగా యిచ్చారనగలమా?

వాళ్లపై ఎవరో ఒకరు ఒత్తిడి చేసి వుంటారు కదా! రఘునందన్ చేశారని హరీష్ అనవచ్చు, హరీష్ చేశారని రఘునందన్ అనవచ్చు. ఎవరైతేనేం, మొత్తానికి తెరాస నాయకులే కదా ఒత్తిడి చేసి విరాళాలు తీసుకున్నది! కరీంనగర్‌లో బ్రహ్మాండమైన బహిరంగ సభ జరిగింది, వరంగల్‌లో అలాయ్ బలాయ్ అంటూ ఊరంతా భోజనాలు పెట్టారు అంటే వీటన్నిటికీ డబ్బు ఖర్చవదా? కెసియార్ ఫామ్‌హౌస్‌లో ఎన్ని ప్రయోగాలు చేసినా (వాటిని మెచ్చుకుంటూ ఈనాడులో ఓ వ్యాసం వచ్చింది కూడా) చెట్లకు కరెన్సీ నోట్లు కాయించలేరు కదా! వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు యీ వ్యయం భరించివుంటారు. వాళ్లు తెలంగాణ పట్ల భక్తితో చేశారా, భయంతో చేశారా అన్నది తేలాలి. రఘునందన్ రేపు నిజంగా లిస్టు బయటపెడితే యిచ్చినవాళ్ల పేర్లు తెలుస్తాయి. అప్పుడు వాళ్ల నడిగినా వాళ్లు 'అబ్బే, స్వచ్ఛందంగా యిచ్చిన విరాళాలే..' అనే అంటారు తప్ప మరోలా అనరు. అయితే విరాళాల సేకరణ జరిగిందని మాత్రం తేటతెల్లం అవుతుంది.

ఈ విరాళాల తేనెతుట్టను కెసియార్ అనవసరంగా కదిపారు. రఘునందన్‌ను సస్పెండ్ చేసి వూరుకుంటే పోయేది. 'మెదక్ జిల్లా పారిశ్రామికవేత్తలనుండి బలవంతంగా విరాళాలు సేకరించినట్లు వారి నుండి ఫిర్యాదులు వచ్చాయి' అని తమ టీవీ ఛానెల్‌లో స్క్రోలింగ్‌లు వేయించడంతో రఘునందన్ రగిలారు. కౌంటర్ ఆరోపణలు చేశారు. మురికి విషయాలన్నీ ఒక్కొక్కటీ బయటకు లాగి

చాకిరేవు పెడుతున్నారు. తెరాస నాయకులకు గ్కు తిరగటం లేదు. వాదోపవాదాలు చూస్తే యిప్పటిదాకా తేలింది ఏమిటి? వేరే జిల్లా వాడైన హరీశ్ మెదక్ జిల్లాకు వచ్చి పాతుకుపోవడం రఘునందన్‌కు రుచించటం లేదు. 2004లో ఎమ్మెల్యే కూడా కాని హరీశ్‌ను మంత్రిని చేయడం దగ్గర్నుంచి తూర్పారపట్టడం మొదలుపెట్టారు. వేర్పాటు ఉద్యమం గ్రామగ్రామాలకు పాకి మూలాల్లోకి వెళ్లిపోయింది అంటే యిదే కాబోలు. టిడిపిని ప్రాంతీయపార్టీ అంటున్నాం, తెరాసను ఉపప్రాంతీయపార్టీ అంటున్నాం. తెలంగాణ అంటూ ఏర్పడ్డాక ఓ పాతికేళ్లకు ఉత్తర తెలంగాణవాళ్లు మాపై సవారీ చేస్తున్నారంటూ దక్షిణ తెలంగాణవాళ్లు ఫిర్యాదు చేయవచ్చేమో అని వూహాగానాలు చేస్తున్నాం. ఇది చూడబోతే జిల్లా స్థాయి దాకా చొచ్చుకుపోయినట్టుంది. వేరే జిల్లావాడు మా వద్ద జెండా పాతడం ఏమిటంటున్నారు.

హరీశ్ నిస్సందేహంగా చురుకైన నాయకుడు. కెసియార్‌లాగే మంచి వక్త. ఆయనకు లేని ఓపిక, కార్యకర్తలతో కలుపుగోరుతనం యీయనకు వున్నాయి. అలా అలా ఎదిగిపోతూ వున్నాడు. కెసియార్ బలహీనతలు తెలుసుకున్న హరీశ్ తను చెప్పినట్లు ఆడిస్తున్నాడని రఘునందన్ ఆరోపణ. కెసియార్ కొడుకు, కూతురుకి కూడా యిలాటి ఫిర్యాదుల్తే వున్నట్లు వినబడుతూ వస్తోంది. అందుకే 2009లో హరీశ్‌ను శాసనసభాపక్ష నాయకుణ్ని చేయలేదనుకోవాలి. దాంతో అలిగిన హరీశ్ వైయస్సార్‌ను కలిసి పార్టీ వదిలి వచ్చి వేస్తానని ఆఫర్ యిచ్చారని పుకార్లు వచ్చాయి. ఇప్పుడు రఘునందన్ మళ్లీ వాటిని ప్రస్తావించారు. సిద్దిపేటలో కాలేజి కోసం కలిశానని హరీశ్ వివరణ. ఆ మాటకొస్తే నువ్వే కలిశావు, యిప్పుడు చంద్రబాబును కలిశావు అన్నారు హరీశ్. నిరూపించండి అంటాడీయన. కెసియార్‌ను వెన్నుపోటు పొడవబోయాడని, అధ్యక్షుడిగా దించేద్దామని తనతో సహా అందరు జిల్లా అధ్యక్షులకు ఫోన్లు చేశాడని, చివరకు అది కుదరక కెటియార్‌ను సిరిసిల్లలో ఓడించడానికి ప్రత్యర్థి మహేందర్‌రెడ్డికి 50 లక్షలు యిచ్చాడని, తను జిల్లాలో ఎదగకుండా ఎమ్మెల్సీ ఎన్నికలలో తన ప్రత్యర్థి భూపాల్‌రెడ్డికి డబ్బులిచ్చి తనను ఓడించాడని ఆరోపణలు చేశాడు.

ఇప్పుడు టిక్కెట్టు అడిగాడు. ఇవ్వలేదు. అందర్నీ తిట్టిపోశాడు. ఈసారి యీయన నాయిని నర్సింహారెడ్డిని కూడా నిందించాడు – కార్మిక సంఘాల పేర వసూళ్లు చేస్తున్నారని! కెసియార్‌ను పిరికిపంద అన్నాడు. అర్ధరాత్రి పూట ఏ స్థితిలో వుండి తనపై సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారో అంటూ విసుర్లు విసిరాడు. జయశంకర్‌కు రాజ్యసభ సభ్యత్వం యిస్తానని దగా చేశారని, కోదండరామ్‌ను ప్రయివేటుగా తెగతిట్టి జాక్ చైర్మన్‌గిరీ నుండి దింపేయబోతే ఉద్యమకారులు తిరగబడ్డారని గుర్తు చేశాడు. ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ విప్‌ను ధిక్కరించినవారిపై కెసియార్ వేటు వేయకపోవడం ఎన్నటికీ తెగని మిస్టరీ. డబ్బు చేతులు మారిందని, క్రాస్ ఓటింగ్ కెసియార్ అనుమతితోనే జరిగిందని అంటారు. తెరాసతో విభేదించే, బయటకు వచ్చే ప్రతీవాడూ యీ విషయం ఎత్తక మానరు. ఈయనా డిటో.

తెలంగాణ ఉద్యమాన్ని నీరు కార్చడానికి వైయస్ నుండి, కెవిపి ద్వారా కాంగ్రెస్ నుండి కెసియార్‌కు నిధులు అందుతూంటాయని జనసామాన్యం చెప్పుకుంటూ వుంటారు. వాటితోటే కెసియార్ ఓడలు కొనేశారని ఒకరంటే, కాదూ ఏకంగా పోర్టే కొనేశారని మరొకరు అంటూ వుంటారు. సూటుకేసులు అందాయి కాబట్టే బయ్యారం విషయంలో కెసియార్ మౌనం పాటించారని చంద్రబాబు కూడా అన్నారు. వైయస్ మరణం తర్వాత నెలవారీ ముడుపులు అడిగితే రోశయ్య నాకేం తెలియదన్నారని, అందుకే కెసియార్ దీక్షకు కూర్చున్నారని ప్రచారం జరిగింది. ఇన్నాళ్లూ యివన్నీ ..ట,...ట కబుర్లే. రఘునందన్ వాటి స్థాయి పెంచుతూ ఢిల్లీ అశోకా హోటల్లో హరీశ్ కెవిపి నుండి సూటుకేసులు తీసుకున్నారని ఆరోపించారు. పార్క్ హయత్‌లో ఒప్పందాలు జరిగాయంటున్నారు. తెరాస నాయకులు ఎవరి వద్ద నుండి ఎన్ని డ్రాఫ్టులు, చెక్కులు తీసుకున్నది నంబర్లు, సిడిలతో సహా బయటపెడతానంటున్నారు. ఆయన లాయరు కాబట్టి డాక్యుమెంటేషన్ పక్కాగానే వుంటుందని వూహించవచ్చు. చివరి నిమిషంలో రాజీ కుదిరి, అంతా గప్‌చుప్ కావచ్చు కానీ యిప్పటివరకైతే కంపు లేపడం జరిగింది.

ఈయన విజయరామారావు, చంద్రశేఖర్‌ల పేర్లు ప్రస్తావించి వాళ్లకూ అన్యాయం జరిగిందని, అసంతృప్తితో వున్నారని చెప్పాడు. తను ఒక నియోజకవర్గానికి టిక్కెట్టు అడిగి భంగపడ్డట్టుగా ఒప్పుకున్నాడు. 12 ఏళ్లగా పార్టీకి సేవ చేసినప్పుడు అడగడంలో తప్పేముంది? కడియం శ్రీహరి, గంగుల కమలాకర్ ఏ గంగలో మునిగి పునీతులయ్యారని వాళ్లను పార్టీలో చేర్చుకుని టిక్కెట్టు యిస్తున్నారు? మేం తగమా? అని సూటిగా అడుగుతున్నాడు. నాయకత్వం దగ్గర సమాధానం లేదు. పార్టీ బలహీనంగా వున్నచోట చేర్చుకుంటున్నాం అని చెప్పబోయారు. కరీంనగర్, వరంగల్‌లో కూడా పార్టీ బలహీనంగా వుందా అని యీయన వెక్కిరించాడు. అసలు రఘునందన్‌ను జనవరి నుండి జిల్లా అధ్యక్షపదవి నుండి తప్పించారు. అప్పుడే యిక తప్పుకో బాబూ అని సంకేతాలు వచ్చి వుంటాయి. ఓర్చుకున్నాడు. ఇప్పుడు ఏం జరిగిందో ఏమో సస్పెండ్ చేశారు. పార్టీ పేర వసూళ్లు చేశారని ఆరోపణలు చేశారు. అలాటివాణ్నయితే మరి యిన్నాళ్లూ జిల్లా అధ్యక్షుడిగా ఎందుకుంచారని యీయన అడుగుతున్నాడు. సమాధానం ఏం చెప్తారు?

నా అనుమానం – టిక్కెట్టు యివ్వననడంతో రఘునందన్ అటూ యిటూ చూసి వుంటారు. బిజెపి కన్నుగీటి వుంటుంది. జాతీయపార్టీల ద్వారానే తెలంగాణ సాధ్యం అంటున్నాడు చూడండీయన. మేం టిక్కెట్టు యిస్తాం వచ్చేయ్, వచ్చేటప్పుడు నీలాటి అసంతృప్తులను వెంటబెట్టుకుని రా అని వుంటుంది బిజెపి. ఈయన అందర్నీ టచ్ చేసి చూస్తూంటే ఎవరో కెసియార్‌కు చెప్పి వుంటారు. ఆయన వెంటనే 'ఆఫ్ విత్ ద హెడ్' అని వుంటారు. షోకాజ్ నోటీసు వంటి ఫార్మాలిటీస్ ఎవరైనా గుర్తు చేయబోతే అవన్నీ జాన్తానై అని వుంటారు. బయటకు పంపుతూ అతనిపై దుర్మార్గుడి ముద్ర కొట్టడానికి వసూళ్ల మాట ఎత్తారు, రఘునందన్ దాన్నే తిప్పుకొడుతున్నారు. కెసియార్‌కు తెలంగాణ పట్ల చిత్తశుద్ధి లేదని, ప్రత్యామ్నాయం లేకనే అతన్ని భరిస్తున్నారనీ, 110–17 తో

గెలిచినా పిల్లల్ని మంత్రులు చేస్తారు తప్ప తెలంగాణ తేరని ఖండితంగా చెప్తున్నారు.

రఘునందన్‌కు ప్రజల్లో ఏ పాటి బలం వుందో తెలియదు కానీ టీవీ చర్చల ద్వారా మంచి వాగ్ధాటిగల వాడని మాత్రం టీవీ ప్రేక్షకులకు తెలుసు. పార్టీ పుట్టినప్పటి నుండీ నాయకత్వంతో వున్నాడు కాబట్టి వాళ్ల బలాలు, బలహీనతలు అన్నీ తెలుసు. ఇతర పార్టీ నాయకుల యింటికి తరచుగా వెళ్లి మాట్లాడుతూండే తెరాస నాయకులు తమ కార్యకర్తలు మాత్రం అదే పని చేస్తే అదో పెద్ద నేరంగా చిత్రీకరిస్తున్నారు. కెసియార్‌తో చాలామంది మేధావులు విభేదించి బయటకు వచ్చేసినా పార్టీ నడుస్తూనే వుంది. కానీ యీ సారి రఘునందన్ బయటకు వచ్చేస్తున్నది – సైద్ధాంతిక విభేదాలతో కాదు. టిక్కెట్టు దొరక్క ! బయటపార్టీ వాళ్లకు, డబ్బిచ్చే వాళ్లకు టిక్కెట్లు యివ్వడానికి తనబోటి కార్యకర్తను బలి యిస్తున్నారని, ఉత్తిపుణ్యాన ఆరోపణలు చేస్తున్నారని రఘునందన్ ఆక్రోశిస్తున్నారు. ఇది సాధారణ తెరాస కార్యకర్త హృదయంలో స్పందన కలిగిస్తుంది. తెరాస వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే పార్టీకి నష్టం కలగడం ఖాయం. ఈ పాటికే ఆ పని మొదలుపెట్టి వుంటారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**ఫిల్లర్** **చైనావాళ్లు యిక విలన్లు కారు...**

హాలీవుడ్ సినిమాల్లో గతంలో రష్యావాళ్లను విలన్లుగా చూపించేవారు. ఆ తర్వాత చైనావాళ్లను పట్టించారు. ఇటీవల చైనాతో ఆర్థికబంధాలు గట్టిపడటంతో చైనీయులను విలన్లగా చూపించకూడదన్న నిశ్చయానికి వచ్చారు హాలీవుడ్ నిర్మాతలు. కొందరు అమెరికన్ యువకులు చైనీయుల దాడిని తిప్పికొట్టడం అనే యితివృత్తంపై గత సంవత్సరం ఎమ్‌జిఎమ్‌వారు "రెడ్ డాన్" అనే సినిమా తీశారు. ఆ తర్వాత నాలిక కర్చుకుని కంప్యూటర్ గ్రాఫిక్స్ ద్వారా చైనా జండాలను, చైనా సింబల్స్‌ను, చైనీస్ సంభాషణలను ఉత్తర కొరియా వాటిగా మార్చారు. దీనికి మిలియన్ డాలర్ల ఖర్చు అయింది. "పైరేట్స్ ఆఫ్ కరిబియన్ – ఎట్ వరల్డ్స్ ఎండ్", "మెన్ ఇన్ బ్లాక్ 3", నిర్మాతలు కూడా సినిమా పూర్తయాక ఎడిటింగ్ టేబుల్ మీద చైనా విలన్లను కత్తిరించేశారు. దీనికి కొన్ని వారాలు పట్టింది. జేమ్స్ బాండ్ తాజా చిత్రం "స్కై ఫాల్"లో చైనీస్ సెక్యూరిటీ ఏజంటు చావును ఎడిట్ చేశారు. విలన్ చైనీస్ జైలులో చిత్రహింసకు గురైన విషయాన్ని కూడా తొలగించారు.

ఇదంతా ఎందుకయ్యా అంటే హాలీవుడ్‌లో చైనా మార్కెట్ దెబ్బ తినకూడదని! గత ఏడాదిలో చైనా బాక్సాఫీసు ఆదాయం 30% పెరిగి 2.74 బిలియన్ డాలర్లు అయింది. ఇది ప్రపంచంలో రెండవ పెద్ద మార్కెట్. చైనా సెన్సారు వాళ్లకు నచ్చకపోతే చైనాలో హాలీవుడ్ సినిమా విడుదల కాదు. ఇంత మార్కెట్ పోతుందంటే కష్టం కదాని యీ మార్పులు! చైనీస్ సెన్సారు అధికారులను సంతృప్తి పరచడానికి "క్లౌడ్ అట్లాస్" అనే సై-ఫై సినిమాలో ఏకంగా 40 నిఎఎల చిత్రాన్ని తీసేశారు. చైనానా మజాకానా?

**మే 18** **ఎమ్బీయస్ : మూడో ఫ్రంటా? ఎన్‌డిఏనా?**

కడియం శ్రీహరి వెళ్లిపోవడం చేత టిడిపి బలహీనపడలేదని చూపించుకోవడానికి కాబోలు ఎర్రబెల్లి దయాకరరావు జాతీయ రాజకీయాల్లో టిడిపి పాత్ర గురించి మాట్లాడారు. బిజెపితో కత్తు కలిపి ఎన్‌డిఏ ద్వారా చక్రం తిప్పే ఛాన్సు టిడిపికి వుందని వాదించారు. మూడో ఫ్రంట్ అంటే లెఫ్ట్ ఆధ్వర్యంలో నడుస్తుంది. తెలంగాణలో లెఫ్ట్ పాత్ర పరిమితం. ఇప్పుడు అక్కడ అప్‌బీట్‌లో వున్నది బిజెపి. నాగం చేరారు. కొండా చేరబోతున్నారన్న వార్తలు వచ్చాయి. విజయశాంతి కూడా అటు వెళ్లవచ్చంటున్నారు. ఆమె సత్సంబంధాలున్న రఘునందన్ కూడా బిజెపివైపు వెళ్లవచ్చు. ఇలా తెలంగాణలో తెరాసకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న బిజెపితో టిడిపి పొత్తు కలిపితే తమకు అనువుగా, ప్రయోజనకరంగా వుంటుందని ఎర్రబెల్లి లెక్క వేశారు.

అయితే ఆంధ్రప్రాంతంలో బిజెపికి ఏ పలుకుబడీ లేదు. అందువలన అబ్బే ఎన్‌డిఏతో కలవడమేమిటి, మూడో ఫ్రంట్‌తోనే కలుస్తాం అని కోడెల ఎర్రబెల్లిని సవరించారు. ఈ భిన్నస్వరాలలో దేన్ని నమ్మాలో తెలియటం లేదనుకుంటూ వుంటే అధ్యక్షుడైన చంద్రబాబు మూడో ఫ్రంట్‌కే ఓటేశారు. అది ప్రకటించడానికి ముస్లిముల్లో వెనకబడిన వర్గాల సభను ఎంచుకున్నారు. మూడో ఫ్రంట్‌కు ప్రధాన చోదకులుగా వుండవలసిన సిపిఎం జనరల్ సెక్రటరీ కారాట్‌కే దానిపై నమ్మకం లేనప్పుడు (పెద్దగా ఠికానా లేని సిపిఐ మాజీ కార్యదర్శి బర్ధన్ మాత్రం మూడో ఫ్రంట్ అన్నారనుకోండి) బాబు యింకా దాన్ని పట్టుకుని ఎందుకు వేళ్లాడుతున్నట్లు? రాష్ట్రంలో టిడిపి పరిస్థితి ఎలా వుంది? జాతీయ స్థాయిలో దానికి వూతం వుంటే దాని సహాయంతో యిక్కడ బలపడే అవకాశం వుందా? ఇలా అనేక విషయాలు ఆలోచిస్తేనే ఎవరితో పొత్తు పెట్టుకుంటే టిడిపికి లాభిస్తుందో మనకు ఒక అంచనా లభిస్తుంది.

పాదయాత్ర ముగిశాక దాని ఫలితాలను బేరీజు వేసుకుని చూస్తే చాలా విషయాలు తడతాయి. దానికి 'వస్తున్నా మీ కోసం' అని పేరు పెట్టినా బాబు వెళ్లిన ప్రతీ చోటా 'మీరు యిబ్బందులు పడుతున్నారు, నన్ను సిఎంను చేయండి, మీ కష్టాలను బాపుతాను' అనే పాటే పాడారు. ఆయన వచ్చినది ఆయన పార్టీ ప్రచారానికే అని అందరికీ తెలుసు. అది వేరే బొట్టు పెట్టి చెప్పాలా? మీ కష్టాలు చూశాను, చలించాను అని వూరుకుంటే పోలేదా? ఆయన పక్కన మాట్లాడేవాళ్లు, ప్రజల్లో కలిసిపోయి ఆయన్ను కీర్తించే టిడిపి కార్యకర్తలు 'మీరు మళ్లీ రావాలి సార్' అని ఎలాగూ అంటారు కదా. ఈయనే పదేపదే అది చెప్పుకోవడం బాగా లేదు.

పైగా యిదే ఆఖరి పాదయాత్ర కాదు, ఎన్నికల ముందు నడిచో, బస్సెక్కో మళ్లీ ఓ సారి జనంలోకి ఎలాగూ వెళతారు. అప్పు లేదా ఉపకారం అడుగుదామనుకున్నప్పుడు లేదా మొదటిసారే అడిగేయం కదా. ఎలా వున్నార్ బ్రదర్.., ఊరికే ఫోన్ చేశా.., చూసి చాలాకాలమైందని వచ్చా.. అంటూ యాక్షన్ చేస్తాం. రెండోసారి వెళ్లి 'అదే మొన్న వచ్చినపుడే అడుగుదామనుకున్నాను. వేరే చోట ఎడ్జస్ట్ అవుతుందేమోనని అనుకుని వూరుకున్నాను.. కానీ కాలేదు.. ఇఫ్ యూ డోంట్ మైండ్.. జస్ట్...' అంటూ అసలు మాట బయటపెడతాం. బాబు కూడా అదే చేయాల్సింది. జస్ట్ చూడడానికే వచ్చా అనేసి, తర్వాతసారి వచ్చినపుడు 'గతంలో వచ్చినపుడు మీ సమస్యలు అర్థమయ్యాయి, వాటి మీద మా పార్టీ మేధావులతో చర్చించి.. యిదిగో యీ ప్లాను వేసుకుని వచ్చాను.. మాకు అధికారం యిస్తే దీన్ని అమలు చేస్తాను' అంటే 'అబ్బో మన గురించి యింటికి వెళ్లాక కూడా ఆలోచించాడురా పాపం' అనుకుంటారు. ఇలా మొదటిచూపులోనే 'నన్ను సిఎంను చేసి చూడండి' అంటే ఏం బాగుంటుంది?

రెండో పాయింటు – హామీలు. ఏకంగా అన్ని హామీలా? చంద్రబాబు హామీ అంటే చివరకు జోక్‌గా మారిపోయింది. బజెట్‌లో ఇంత శాతం ఫలానాదానికి, యింత శాతం మరోదానికి అంటూ చెప్పుకుంటూ పోతే కాస్తయినా నమ్మేవారేమో! 'బాబు మాటలకు విశ్వసనీయత లేదు' అనే స్టాంపు కొట్టి వైయస్ వెళ్లిపోయారు. చొక్కాకు పట్టుకున్న నూనె మరకలా అది ఎంతకీ వదలటం లేదు. ఏవైనా గణాంకాలు చెప్పి 'నేను ఆచరణసాధ్యమైనవే చెపుతున్నాను' అంటే నమ్మేవాళ్లేమో. పాదయాత్ర చేస్తూండగా నది ఎదురైందనుకోండి, జాలర్లు కనబడ్డారు. 'మీకు వలలు కొనడానికి ఋణాలు యిస్తాను, వరదలు వచ్చినపుడు మీ గుడిసెలు మునిగిపోకుండా నదికి దూరంగా యిళ్లు కట్టి యిస్తాను.' అనేశారు. అక్కడే బట్టలుతుకుతున్న చాకలివాళ్లు కనబడ్డారు. "బట్టలు ఉడికించుకోవడానికి ప్లాస్టిక్ బానలు ఉచితంగా యిస్తాను. ఆరేసుకోవడానికి రేవంతా తాళ్లు కట్టిస్తాను." అన్నారు. తడిబట్టలతో ఆడవాళ్లు అమ్మవారి విగ్రహానికి ప్రదక్షిణలు చేస్తూ కనబడ్డారు. "మీకు పసుపు, కుంకుమ పొట్లాలు ఫ్రీ" అన్నారు.

ఇంకో పక్క స్నానాలు చేస్తూ మంత్రాలు చదువుతున్న బ్రాహ్మలు కనబడ్డారు. అదే వూపులో 'మీకు పంచెలు ఫ్రీ, జంజాలు ఫ్రీ, పిలక పెట్టుకుంటే గుండు ఫ్రీ..' లాటివి చెప్పి వూరుకోకుండా ఆవేశంలో 'బ్రాహ్మణులకు ఒక నిధి పెడతాను. వాళ్లకు పెన్షన్లు, వాళ్ల పిల్లలకు స్కాలర్‌షిప్పులిస్తాను, వాళ్లు కూడా రాజకీయంగా ఎదగాలి..' లాటివి ఏవో అనేశారు. 'అవన్నీ తర్వాత చూదాం. జనాభాలో 4% వున్న బ్రాహ్మణులకు మీ పార్టీ యిస్తున్న ప్రాముఖ్యత ఏమిటి? మీ ఎమ్మెల్యేలలో ఒక్కరైనా బ్రాహ్మడు వున్నాడా?' అని టీవీ చర్చల్లో బ్రాహ్మణ సంఘం నాయకులు నిలదీసి అడిగితే టిడిపి నుండి సౌండు లేదు.

పాదయాత్రలో వెళుతూ ఏ జిల్లాలో ఏ కులం ఓట్లు ఎక్కువగా వున్నాయని అనిపిస్తే వాళ్లకు వరాలు కురిపించేశారు బాబు. వరాలు పుచ్చుకున్న వర్గాలకు కూడా ఆ హామీలు గుర్తున్నాయో లేదో తెలియదు. వీటి అమలు సాధ్యాసాధ్యాల గురించి పాత్రికేయులు అడిగితే మానిఫెస్టో సమయంలో చెప్తామన్నారు బాబు. అప్పటిదాకా ఎందుకు? ఇప్పుణ్నుంచే ఆ పనిమీద వుండి, నెలా రెండునెలల్లో ఓ బ్లూ ప్రింటు తయారు చేసి చూపవచ్చు కదా!

మూడో పాయింటు – వైయస్ గురించిన నిత్యభజన. అసలు పాదయాత్ర అన్నపుడే వైయస్‌తో పోలిక వచ్చేస్తుంది. సత్యాగ్రహం అనగానే గాంధీ గుర్తుకు వచ్చినట్లు, పాదయాత్ర అనగానే పాతతరం వారికి వినోబా భావే గుర్తుకు వచ్చినట్లు, ఆమరణ నిరాహారదీక్ష అనగానే పొట్టి శ్రీరాములు గుర్తుకు వచ్చినట్లు, చైతన్యరథం అనగానే ఎన్టీయార్ గుర్తుకు వచ్చినట్లు, యీ తరం వారికి పాదయాత్ర అనగానే వైయస్సారే గుర్తుకు వస్తారు. చంద్రబాబు యింత అవస్థ పడి పాదయాత్ర చేసే బదులు బస్సు యాత్ర చేసినా సరిపోయేది. లక్ష్యం ప్రజలను కలవడమే కదా! ప్రజలు వైయస్‌ను ఎక్కడ మర్చిపోతారో అన్నట్టు బాబు ప్రతీ చోటా వైయస్ నామాన్నే స్మరిస్తూ పోయారు – కాస్సేపు తండ్రినీ, కాస్సేపు కొడుకునీ!

మార్కెటింగు పరిభాషలో పొజిషనింగ్ అంటారు కదా. బాబు వైయస్, జగన్ అవినీతి గురించి వివరించే క్రమంలో అనేకసార్లు ఆ పేర్లు జపించి ప్రజల మెదళ్లలో వైయస్ పేరు చిరస్థాయిగా నిలిచేట్లు చేశారు బాబు. అది రాంగ్ స్ట్రాటజీ. ఎన్టీయార్ టిడిపి పెట్టినపుడు కాంగ్రెస్ పార్టీని తిట్టేవారు తప్ప ఇందిరా గాంధీ పేరు ఎత్తేవారు కారు. అది కూడా చాలా తక్కువ సార్లు ప్రస్తావించేవారు. పైగా ఆయన ఉపన్యాసాలు చాలా క్లుప్తంగా వుండేవి. బాబు ఉపన్యాసాలు సుదీర్ఘం. ఎప్పటికీ ముగించరు. పైగా ఆయన ఉపన్యాసాల్లో హుషారు వుండదు, చమక్కులు వుండవు, పదాడంబరం వుండదు. హావభావాలు, ఆంగికాలు, ఉద్రేకాలూ వుండవు. ఏవేవో అంకెలు చెపుతూ, అనవసర వివరాలిస్తూ తారీకులతో బోరు కొట్టే హిస్టరీ టీచరులా చెప్పుకుపోతారు. సాధారణ ప్రజకు అంత సమాచారం అక్కరలేదు. ఊళ్లో ఏదైనా లాయర్ల సమావేశానికి, విద్యావంతుల సమావేశానికి వెళ్లినపుడు ఓ గంటసేపు మాట్లాడి యివన్నీ చెప్తే బాగుంటుంది కానీ ఎండలో నిలబడిన ప్రజలకు యిదంతా సుత్తి అనిపిస్తుంది.

ఆయన ఉపన్యాసంలో చాలా భాగం అవినీతి చుట్టూ తిరుగుతుంది. 'వైయస్ కుటుంబం అవినీతిపరులు, కిరణ్ అవినీతి పరుడు, కాంగ్రెస్ అవినీతిలో మునిగి తేలుతోంది, మేమొక్కళ్లమే పుణ్యజీవులం. మేం అధికారంలోకి వచ్చి వాళ్ల అక్రమాస్తులు స్వాధీనపరుచుకుని మేం యిచ్చే ఆకాశమంత ఎత్తు హామీలను అమలు చేస్తాం.' (కేసు గెలిచిన సందర్భాల్లో కూడా ఆస్తులు స్వాధీనం చేసుకోవడం ఎంత కష్టమో అన్ని వ్యాపారాలు చేసిన బాబుగారికి తెలియదా?) ఎన్నిసార్లు చెప్పినా, ఎక్కడ చెప్పినా యిదే పాఠం. ఇది వినేవాడు తలెత్తి చూస్తే కనబడేది హైటెక్ పాదయాత్ర. ఎసి వ్యాన్‌లు, నీళ్ల వ్యాన్‌లు, కారవాన్‌లు, సిబ్బంది, సెక్యూరిటీ, భోజనాలు, హంగామా... మరి వీటికి డబ్బు ఎక్కణ్నుంచి వస్తోంది అన్న ప్రశ్న అతనికి రాదా? బాబు తన జేబులోంచి డబ్బు తీయరు. ఎవరో పారిశ్రామిక

వేత్తల చేత ఖర్చు పెట్టిస్తున్నారు అనుకుందాం. దీనికి వాళ్లు ప్రతిఫలం ఆశించరా? అధికారం వచ్చాక కాంట్రాక్టులనీ, ప్రాజెక్టులనీ డిమాండ్ చేయరా?

అబ్బే యివన్నీ స్థానిక నాయకులు పెట్టుకుంటున్నారు అని టిడిపివారు జవాబిస్తారు. అది నిజమే అనుకున్నా వాళ్లకు మాత్రం ఎక్కణ్నుంచి వస్తోంది? ఇవాళ యింత ఖర్చు పెట్టారంటే రేపు పదవులు అడ్డు పెట్టుకుని జనాల దగ్గర దీనికి రెట్టింపు గుంజరా? 'వైయస్ పాదయాత్ర చాలా సింపుల్‌గా గడిచిపోయింది. ఎక్కడ జనాభా అక్కడే పోగుపడ్డారు. ఈయన తన వెంట వందలాదిమందిని తెచ్చుకుంటున్నాడు' అని ప్రజలు అనుకునేట్లా హైటెక్ పాదయాత్ర చేయడం అనవసరం కదా! దీని వలన వీళ్లు యివాళ కాకపోతే రేపైనా అవినీతికి పాల్పడతారన్న భయాన్ని ఓటర్లలో కలిగించారు కదా!

పాదయాత్ర ద్వారా బాబు ప్రజలు వైయస్‌ను మర్చిపోకుండా చేస్తే, టిడిపి నాయకులు తమ నిత్యప్రకటనల ద్వారా బాబు వయసు మనం మర్చిపోకుండా చేశారు. మాట్లాడితే 'ఈ వయసులో కూడా బాబు యిలా పాదయాత్ర చేయడం గ్రేట్..' అంటూ మరీ మరీ గుర్తు చేశారు. నిజానికి బాబు పొడుగ్గా, ఆరోగ్యంగా, చురుగ్గా కనబడతారు. యోగా చేస్తారని, మితాహారి అనీ వార్తలు వచ్చేవి. 60 ఏళ్లు దాటినా అన్ని ఫ్యాకల్టీలు చక్కగా పనిచేస్తున్నాయి అని అసూయపడేట్లా వుండేవారు. అలాటిది పాదయాత్ర పుణ్యమాని ఆయన రోగాల చిఠ్ఠా ప్రజల ముందు పరిచారు. బిపి, సుగర్.. అన్నీ వున్నాయట. ఈ వయసులో.. అంటూ మాటిమాటికీ అంటూ వుంటే ఎవరైనా సరే యిరిటేట్ అవుతారు. ఒక నడివయసు స్త్రీని 'ఈ వయసులో కూడా మీరు స్మార్ట్‌గా వున్నారు' అని చూడండి. ఆవిడ సిగ్గుపడి నవ్వి వూరుకుంటుంది. రెండోసారి అనండి, ఉరిమి చూస్తుంది, మూడోసారి అనండి – 'నా వయసుతో మీకేం పని?' అని చికాకు పడుతుంది. మగాళ్లూ అంతే – మహా అయితే నాలుగోసారికి రియాక్టవుతారు.

టిడిపి నాయకులకు యీ యింగితం లేకపోయింది. రోజూ 'ఈ వయసులో కూడా..' అంటూ పదేపదే చెప్పి ప్రజల మెదళ్లలో చంద్రబాబును ఒక ముసలివాడిగా పొజిషన్ చేసి వదిలిపెట్టారు. అసలే ఓటర్లలో యువత ఎక్కువ. తక్కువ వయసువాడన్న కారణంగా వాళ్లకు జగన్‌పై అభిమానం పుడుతోంది. ఆ తర్వాతి స్థానంలో కిరణ్ వున్నారు, ఆయన క్రికెటర్ అనే మోజు ఒకటుంది. రాహుల్‌పై కూడా యువకుడన్న ఫీలింగు వుంది. వారికి కాంట్రాస్టుగా చంద్రబాబును కాళ్లీడ్చుకుంటూ నడిచే ముసలివాడిగా ప్రొజెక్టు చేయడం ఎంత పొరబాటు? పైగా అది మనం ఎక్కడ గుర్తించమో అని 'ఈ వయసులో కూడా నడుస్తున్నాడు చూడండి' అంటూ రన్నింగ్ కామెంటరీ ఒకటా? నా ఉద్దేశంలో పాదయాత్ర వలన జరిగిన అతి పెద్ద నష్టం యిదే!

మరి లాభం లేదా? ఉంది. టిడిపి కార్యకర్తలలో పార్టీని కన్సాలిడేట్ చేసుకోగలిగారు. పార్టీ యింకా జీవించే వుందని, 2014 ఎన్నికల వరకైనా చురుగ్గా వుంటుందని ఆయన నచ్చచెప్పగలిగారు. ఆయన పాదయాత్ర సాగుతూండగానే కొందరు నాయకులు గోడదూకేయడం గురించి జోకులు వేశారు. కానీ వాళ్లంతా ముందే ప్లాను చేసి వుంటారు. పాదయాత్ర టైములో వెళ్లిపోతే బాబు స్థయిర్యాన్ని దెబ్బ తీసినట్టు వుంటుంది పథకం వేసి వుంటారు. ఎందుకంటే పాదయాత్ర మొదలు పెట్టి, ముగించే లోపున జరిగిన చారిత్రక పరిణామాలూ, ఎన్నికలూ, తీవ్ర ఘటనలూ ఏవీ లేవు. ఎప్పుడో తీసుకున్న నిర్ణయాన్ని యిప్పుడు అమలు చేశారంతే!

పాదయాత్ర వలన ప్రజలకు కలిగే మేలు అంటూ ఏమీ లేదు, టిడిపి పట్ల వాళ్లకు అభిమానమూ పెద్దగా పెరిగి వుండదు. ఎందుకంటే బాబు హామీలు నమ్మశక్యంగా లేవు. ఆయన ఉపన్యాసాలు ఉత్తేజకరంగానూ లేవు. కొత్తగా వచ్చి చేరిన ఓటు బ్యాంకు ఏదీ వుండి వుండదు. అయితే కార్యకర్తలకు మాత్రం బాబు కళ్లల్లో పడ్డామన్న తృప్తి కలిగి వుంటుంది. ఏ వూళ్లో పార్టీ ఏ మేరకు బలంగా వుందో, బలహీనంగా వుందో గ్రౌండ్ లెవెల్ రియాలిటీలు ఏమిటో బాబుకు అవగతం అయి వుంటాయి. ఎందుకంటే రోజులో ఆయన నడిచినది నాలుగైదు గంటల కంటె ఎక్కువ లేదు. 7, 8 గంటలు నిద్రకూ, 2 గంటలు తక్కిన వాటికీ పోయినా రోజులో 10 గంటలైనా స్థానిక నాయకులతో మాట్లాడడానికి, విషయాలు గ్రహించడానికీ వెచ్చించి వుంటారు.

పాదయాత్ర సందర్భంగా బాబు యిచ్చిన స్టేటుమెంట్లు అన్నిటిలోనూ నాకు బాగా నచ్చినది ఒకటుంది – 'కార్యకర్తలు ప్రజలకు దూరం అయిపోయారు, నేను వస్తే తప్ప కదలడం లేదు' అని ఒక చోట అన్నారు. ఇదే పార్టీలో ప్రధానమైన లోపం. అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా కార్యకర్తలు ప్రజలకు పనులు చేసి పెడుతూ వుండాలి. వాళ్లతో సంబంధబాంధవ్యాలు నెరపుతూ వుండాలి. 9 ఏళ్లగా అధికారంలో లేకపోవడంతో, 2014లో నైనా కచ్చితంగా అధికారంలోకి వస్తామన్న ధీమా లేకపోవడంతో – టిడిపి నాయకులు, కార్యకర్తలు నీరసించారు. పార్టీ పనులు పట్టించుకోవడం మానేసి సొంతపనులు వ్యాపారాలు చూసుకుంటున్నారు. ప్రజలకు, వాళ్లకు మధ్య గ్యాప్ పెరిగిపోయింది. ఎన్నికల సమయంలో మాత్రమే వాళ్లు అడావుడి చేస్తున్నారు. బాబు నియోజకవర్గ పర్యటనకు వచ్చినపుడు కాస్త హంగామా చేస్తున్నారు. టిడిపి అభిమానులను కన్సాలిడేట్ చేయడం, ధైర్యం నింపడం, స్థానికంగా ఏవైనా కార్యక్రమాలు చేస్తూ వుండడం.. యిలాటివన్నీ పోయాయి. కేవలం టీవీ చర్చల్లో, మీడియాలో నాలుగు స్టేటుమెంట్లు యివ్వడంతో సరిపెట్టుకుంటున్నారు. మరి యిదే సమస్య కాంగ్రెసును కూడా పీడిస్తుంది కదా, వాళ్లెలా నిలదొక్కుకుంటున్నారు? అని అడగవచ్చు.

నేనోసారి ఓ పెద్దాయన్ని అడిగాను – 'కాంగ్రెసయినా, టిడిపి అయినా మీరు యివ్వాల్సిన ముడుపులు తప్పవు కదా, మీరు కాంగ్రెసు పాలన ఎందుకు కోరుకుంటున్నారు?' అని. దానికి ఆయన సుదీర్ఘమైన జవాబిచ్చాడు – ''కాంగ్రెసులో ఓ సౌలభ్యం వుంది. జాతీయపార్టీ కాబట్టి అనేకమంది నాయకులుంటారు. నిర్ణయం ఒక వ్యక్తి యిష్టాలయిష్టాల మీద, కళాకళల మీద ఆధారపడి వుండదు. ఫ్యాక్టరీ పెట్టడానికి నాకో లైసెన్సు కావాలనుకోండి, ముఖ్యమంత్రి కాదన్నా ఫర్వాలేదు. రాష్ట్రంలో పరిశ్రమల మంత్రిని

పట్టుకుని అతని ద్వారా ఢిల్లీలో పరిశ్రమల మంత్రిని కలుసుకుని సిఎంపై ఒత్తిడి పెంచవచ్చు. లేదా ఫ్యాక్టరీ పెడదామనుకున్న చోట స్థానికంగా వున్న మంత్రి ద్వారా సిఎంకు గట్టిగా చెప్పించవచ్చు. అదీ కాకపోతే ఎంపీని పట్టుకుంటే ఢిల్లీ కాబినెట్‌లో ఎవరో ఒకరు దొరుకుతారు. వీళ్లెవరితోనూ పరిచయాలు లేకపోతే పార్టీ వర్గాల ద్వారా ప్రయత్నించవచ్చు. రాష్ట్ర అధ్యక్షుణ్నో, కార్యదర్శినో పట్టుకుని ఢిల్లీలో వున్న కాంగ్రెస్ పార్టీ నాయకులలో ఎవరో ఒకర్ని ఆశ్రయించి వాళ్ల ద్వారా చెప్పించుకోవచ్చు. ఢిల్లీలో కనీసం అరడజను మంది ముఖ్యమైన నాయకులుంటారు. ఎవరో ఒకరు దొరక్కపోరు...

''...అదే టిడిపి అనుకోండి – అన్ని నిర్ణయాలూ బాబుగారివే. ప్రభుత్వపరంగా వెళ్లినా, పార్టీపరంగా వెళ్లినా ఆయన దగ్గరే ఫైలు ఆగిపోతుంది. ఆయన సరేనంటే యిబ్బంది లేదు, కాదంటే ఏమీ చేయలేం. ఎవ్వరూ సహాయం చేయలేరు. సీనియర్ మంత్రులు కూడా 'మేం కన్విన్స్ అయ్యామండీ, కానీ పెద్దాయన ఒప్పుకోవటం లేదు. కారణం అడిగే ధైర్యం మాకు లేదు. అడిగినా – 'ఇది కరక్టు కాదని నాకు తెలుసు, మీకంటె నాకు ఎక్కువ అవగాహన వుంది' అనేస్తారు. మనసులో సందేహం వుంటే బయటపెట్టరు. మేం హెల్ప్‌లెస్." అనేస్తారు. బాబుగారికి ఎంత తెలుసో, ఎంత తెలియదో, ఆయనకు ఫీడింగ్ ఎవరు, ఎలా యిచ్చారో తెలియదు. పిలిచి ఓపెన్‌గా అడగరు.

"తనకు అన్నీ తెలుసని ఆయన ప్రగాఢ విశ్వాసం. కరంటు చార్జీలు ఒకేసారి అంత తీవ్రంగా పెంచవద్దని ఆయన పార్టీ సహచరులు చెప్పినా విన్నారా? గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి బాగా లేదని చెపితే విన్నారా? 'ఏం ఫర్వాలేదు' అంటూ తన పరిపాలనాకాలాన్ని కుదించుకుని, ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. ఆంధ్రప్రాంతం నాయకులు తెరాసతో ఎన్నికల పొత్తు వద్దంటే విన్నారా? అప్పుడు తప్పులు చేశానని యిప్పుడు అనుకుని ఏం లాభం? టిడిపి అనే కాదు, ప్రతీ ప్రాంతీయపార్టీతో యిదే బాధ. నిర్ణయాధికారం ఒకరి చేతుల్లోనే కేంద్రీకృతం అయి వుంటుంది. వాళ్లు మనకు ఎప్పుడు తలుపు తీస్తారో, ఎప్పుడూ మూస్తారో తెలియదు. కాంగ్రెసు అయితే అనేక గుమ్మాలు, కిటికీలు, ఏదో ఒక దానిద్వారా లోపలకి దూరవచ్చు. పనులు జరిపించుకోవచ్చు. అందుకే కాంగ్రెసు పట్ల మాకు సానుభూతి వుంటుంది." అన్నాడాయన.

వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలలో అధికసంఖ్యాకులు యిలాగే అనుకుంటూ వుంటే ఒంటరిగా పోటీ చేస్తే టిడిపికి 2014లో అధికారం దక్కడం అంత సులభమేమీ కాదు. ఎందుకంటే పార్టీలకు ఆర్థిక సహాయం చేయవలసినది వాళ్లే. రాష్ట్రంలో పట్టు తక్కువగా వుంది కాబట్టి జాతీయ స్థాయిలో నైనా గట్టి పట్టు సంపాదించుకోకపోతే టిడిపికి గడ్డుకాలమే. జాతీయస్థాయిలో టిడిపి ఎంచుకోవలసినది – మూడో ఫ్రంట్, ఎన్‌డిఏ ల మధ్య!

మూడో ఫ్రంట్‌లో గట్టిగా కనబడేదెవరు? లెఫ్ట్, ములాయం! ఈ డిఎంకె, ఎడిఎంకెలలో ఎవరు ఎటువైపు వుంటారో ఎవ్వరూ చెప్పలేరు. లెఫ్ట్ వుంటుంది కాబట్టి మమతా బెనర్జీ ఛస్తే రాదు. నవీన్ పట్నాయక్ బిజెడి వస్తే రావచ్చు. తెరాస ఎటు వెళుతుందో చెప్పలేం. జెడియస్ వస్తుంది కానీ దానికి 5, 6 సీట్ల కంటె ఎక్కువ వుండవు. మాయావతి, లాలూ కలిస్తే బలపడుతుంది. కానీ వాళు ్ల వాళ్ల రాష్ట్రాలలో ఏ మేరకు నెగ్గుకుని వస్తారో తెలియదు. ఈ పార్టీలన్నీ కేంద్రంలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే వాళ్లకు లోపల్నుంచో, బయటినుండో మద్దతు యిద్దామని చూస్తాయి. ఒక కారణం – తాము పాలించే రాష్ట్రానికి నిధులు, రెండో కారణం – తమపై పెట్టి వున్న సిబిఐ కేసులు. కేంద్రం ఏం తలచుకుంటే అది చేయగలదు. ఇటువంటి జనాల్ని నమ్ముకుని టిడిపి మూడో కూటమితో జత కడతాం అంటే సబబుగా తోచదు.

రాష్ట్రంలో లెఫ్ట్‌తో జతకడితే వచ్చే లాభం ఏమిటి? సిపిఐ జై తెలంగాణ అంటోంది. సిపిఐతో జతకట్టి ఉపయెన్నికలలో టిడిపి బావుకున్నది ఏమీ లేదు. ఇక సిపిఎం టిడిపికి క్రమేపీ దూరం అవుతోంది. వైకాపా వైపు మొగ్గుతుందేమోనన్న పుకార్లు కూడా వస్తున్నాయి. వాళ్ల మద్దతు కొన్ని నియోజకవర్గాల్లో ఉపయోగపడుతుంది కానీ దానికోసం వాళ్లు ఒక్కోళ్లు పాతికేసి సీట్లు అడుగుతారు. వాళ్లకు సర్దుబాటు చేయడం కోసం, గెలిచే స్థానాలలో తన క్యాడర్‌ను నిరాశ పరచవలసి వస్తుంది. మహా కూటమి ప్రయోగం వైఫల్యం తర్వాత 'పొత్తుల వలన నష్టపోయాం' అని బాబు ఎన్నోసార్లు అన్నారు.

మూడో ఫ్రంట్ లేకపోతే టిడిపికి వున్న ఆప్షన్లు ఏమిటి? యుపిఏ, ఎన్‌డిఏ ! యుపిఏతో కలిసే ప్రశ్నే లేదు. కాంగ్రెసు బలపరచిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామి కదా అంటే అప్పటి పరిస్థితి వేరు. ఎన్నికల తర్వాత జగన్ యుపిఏలో చేరతానని ఎప్పణ్నుంచో చెపుతున్నారు. వైకాపా, టిడిపి ఒకే వైపు వుండే ఛాన్సే లేదు కదా. అందువలన యుపిఏపై టిడిపి ఆశ వదలుకోవవలసినదే. లోపాయికారీ ఒప్పందాలంటారా, అవి వుండవచ్చు. అవసరం తీరాక కలహించవచ్చు. ఇక మిగిలినది ఎన్‌డిఏ. ఈసారి మోదీని ముందుకు పెట్టుకుని వెళుతోంది కాబట్టి కార్పోరేట్ రంగంలో సగం మంది ఎన్‌డిఏకు మద్దతుగా నిలుస్తారు. తక్కిన సగంలో కూడా చాలామంది ఎందుకైనా మంచిదని అటూ యిటూ కూడా మద్దతు యిస్తారు. ఎన్‌డిఏ యీసారి పార్లమెంటు ఎన్నికలలో భారీనిధులతో, హైటెక్ ప్రచారంతో తలపడబోతోంది. మోదీకి యువతలో చాలా ఫాలోయింగ్ వచ్చింది. సాంప్రదాయక రాజకీయవిధానాలకు భిన్నంగా వెళ్లి, దేశానికి నూతన దిశను చూపుతాడని ఆశిస్తున్నారు. నిజానికి బాబుది కూడా కార్పోరేట్ స్టయిలే! ఎన్‌డిఏతో వెళితే భావసారూప్యత ప్రస్ఫుటమై యువతను ఆకర్షించవచ్చు.

నిధుల విషయానికి వస్తే – చాలాకాలంగా ప్రతిపక్షంలో వున్నారు కాబట్టి టిడిపికి నిధుల కొరత వుండి వుంటుంది. వాటి కోసమే కార్పోరేట్ దిగ్గజాలను వాటేసుకోవడం, దాని కారణంగా సీనియర్ పార్టీ నాయకులను దూరం చేసుకోవడం జరుగుతోంది. మహా

కూటమి గెలిచేస్తోందని మీడియా చేసిన అడావుడి చూసి విదేశాలలో వున్న టిడిపి అభిమానులు 2009లో విరాళాలు దండిగా యిచ్చారట. ఈసారి ఆ స్థాయిలో యిస్తారని అనుకోను. ఒక్క ఉపయెన్నికలో కూడా గెలవని పార్టీపై ఆశలు పెట్టుకునే ఆశావాదులు చాలా తక్కువమంది వుంటారు. గెలిచే గుఱ్ఱానికే అందరూ మాలీసు చేస్తారు. దాణా వేస్తారు. స్వదేశీ, విదేశీ దాణా ఏదీ దొరక్కపోతే డబ్బున్నవాళ్లకే టిక్కెట్లు యివ్వవలసి వస్తుంది. అది నాయకులను బాధపెట్టి, టిక్కెట్లు దొరకనివారు యితర పార్టీల్లోకి దూకేట్టు చేస్తుంది, పార్టీ అభిమానులను గాయపరచి గెలుపు అవకాశాలను దెబ్బతీస్తుంది. ఎన్‌డిఏతో పొత్తు పెట్టుకుంటే నిధులకోసం ధనికులను తప్పనిసరిగా ఆదరించవలసిన అవస్థ తప్పుతుంది.

ఎన్‌డిఏతో పొత్తు పెట్టుకుంటే నష్టాలేమిటి? ఒకటి – పొత్తులో భాగంగా తెలంగాణలో ఉద్యమం బలంగా వున్న నియోజకవర్గాల్లోని కొన్ని సీట్లు వదులుకోవలసి వస్తుంది. తెరాసకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని చూస్తున్న బిజెపి ఆ సీట్లలో గెలుస్తుందేమో కూడా! అది గెలిచినా గెలవకపోయినా టిడిపి మాత్రం గెలుస్తుందన్న గ్యారంటీ అస్సలు లేదు. అందువలన 'గాలికి పోయిన పిండి కృష్ణార్పణం' అనుకుని వూరుకోవడం ఉత్తమం. ఆంధ్రప్రాంతంలో సీట్లు అడిగితేనే చిక్కు. కానీ బిజెపి ఆంధ్రప్రాంతానికి పూర్తిగా తిలోదకాలు యిచ్చేసినట్టుంది కాబట్టి ఎక్కువ అడగదేమో!

అయినా బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి టిడిపి తటపటాయిస్తుంది. కారణం – బిజెపికి వున్న హిందూత్వ పార్టీ ముద్ర! వాళ్లను చేరదీస్తే హిందువుల్లో ఉదారవాదులు, మైనారిటీలు దూరమవుతారేమోనన్న బెంగ. మైనారిటీల్లో అభద్రతాభావం వుంటుంది కాబట్టి మూకుమ్మడిగా ఓటు వేస్తూంటారు. మైనారిటీల్లో ముఖ్యులు క్రైస్తవులు, ముస్లిములు. అవతల జగన్, అనిల్ వంటి తీవ్ర క్రైస్తవులు, బైబిల్ పట్టుకుని తిరిగే విజయమ్మ వైకాపా పక్షాన కనబడుతూ వుంటే క్రైస్తవులు టిడిపికి ఎలాగూ ఓటేయరు. ఇక ముస్లిములు – తెలంగాణ ప్రాంతంలో ముస్లిములు బిజెపికి పూర్తిగా వ్యతిరేకం అనుకోవచ్చు. అక్కడ టిడిపికి ప్రస్తుతం ఎలాగూ పెద్ద బలం లేదు. ఆంధ్రప్రాంతంలో ముస్లిములు టిడిపికి దూరమవుతారా లేదా అన్న విషయం ఆలోచించాలి. గతంలో టిడిపి–బిజెపి పొత్తు వున్నపుడు వాళ్లు ఎటు ఓటింగు వేశారో పరిగణించాలి. ఇప్పుడు వారిలో సగం మందే వేస్తారనుకోవాలి. ఎందుకంటే అప్పుడు బిజెపి అభ్యర్థి వాజపేయి వంటి పెద్దమనిషి. ఇప్పుడు బిజెపి అభ్యర్థి మోదీ వంటి కరడుగట్టిన హిందూవాది.

హిందువుల్లో ఉదారవాదులకు కూడా మోదీ విషయంలో అభ్యంతరాలు వున్నాయి. మోదీ మన రాష్ట్రముఖ్యమంత్రిగా నిలబడితే తప్పకుండా వ్యతిరేకిస్తారు. కానీ అతనితో కలిసినంత మాత్రాన టిడిపిని శిక్షిస్తారా? అన్న వాదనను సందేహించాలి. ముస్లింలీగుతో కలిసి పొత్తు పెట్టుకున్నా కాంగ్రెసుకు, కమ్యూనిస్టులకు ఓటేయటం లేదా? టిడిపి ఎప్పుడూ మతతత్వాన్ని ప్రోత్సహించలేదు. వారి పాలనలో మతకల్లోలాలు జరగలేదు. ముస్లిములెప్పుడూ అభద్రతకు లోను కాలేదు. అలాటప్పుడు కేవలం బిజెపితో పొత్తు పెట్టుకున్నంత మాత్రాన టిడిపిని నిరాకరిస్తారా? నిరాకరిస్తారనే బాబు సందేహం. అందుకే ఆయన 'గతంలో బిజెపితో పొత్తు పెట్టుకుని తప్పు చేశాం. ఛస్తే మళ్లీ వాళ్లతో పెట్టుకోం' అని మాటిమాటికీ ప్రకటిస్తూ వుంటారు. జెడి(యు)లా బేలన్స్ చేసుకుంటూ సాగే ఆలోచన చేయరు.

ఈయన యిలాగే అంటూ వుంటే తెలంగాణ టిడిపి నాయకులు ఆలోచనలో పడతారు. నానాటికీ ఇమేజి మసకబారుతున్న, నియంతృత్వ పోకడలున్న తెరాసలోకి వెళ్లడానికి జంకుతున్న టిడిపి నాయకులు బిజెపిలోకి వెళ్లడానికి ఉత్సాహపడవచ్చు. వీరి చేరిక బిజెపికి, వాళ్లకూ ఉభయతారకంగా వుంటుంది. నాగం జనార్దనరెడ్డి మార్గం చూపించారు. రేపు ఎర్రబెల్లి దయాకరరావు కూడా ఊగిసలాడవచ్చు. ఆయన కూడా ఫిరాయిస్తే బాబు తప్పకుండా తన ఎన్‌డిఏ–వ్యతిరేక విధానంపై పునరాలోచించుకోవలసి వస్తుంది.
**(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 22, 23 వీక్లీకై** **ఎమ్బీయస్ : చెరసాలలో ఒక ఏడు..**

జగన్ జైలుకి వెళ్లి ఒక ఏడాది అయింది. నిరసన తెలపడానికి వైకాపాకు ఒక సందర్భం దొరికింది. ఆ మాటకొస్తే నిరసనల కోసం వాళ్లు ఏడాది దాకా ఆగలేదు. జైలుకి వెళ్లిన రోజునుండి తమ పత్రిక ద్వారా, టీవీ ఛానెల్ ద్వారా అభ్యంతరాలు తెలుపుతూనే వున్నారు. ప్రజల్లో అవగాహన పెంచుతూనే వున్నారు. షర్మిల పాదయాత్ర చేస్తూనే వున్నారు. 'బాబు పాదయాత్ర గురించి రాస్తున్న మీరు షర్మిల పాదయాత్ర గురించి రాయరేం?' అని కొందరు నన్ను అడిగారు. బాబు పాదయాత్ర గురించి మెచ్చుకుంటూనో, విమర్శిస్తూనో రాయడానికి అనేక అంశాలు వున్నాయి. షర్మిల పాదయాత్రలో వున్నది ఒకటే అంశం – 'కాంగ్రెసు, టిడిపి కలిసి జగన్‌ను జైల్లో పెట్టారు, మీరంతా అన్నకు అండగా నిలవాలి'. అంతే! 'నేను అధికారంలోకి వస్తే అది చేస్తాను, యిది చేస్తాను' అని షర్మిల అంటే అప్పుడు దానిపై వ్యాఖ్యానించవచ్చు. ఆవిడ తను అధికారంలోకి వస్తానని చెప్పటం లేదు. జగన్‌కు అనుకూలంగా ప్రజల మద్దతు కూడగట్టడానికి మాత్రమే వచ్చింది. అందువలన పాత్రపోషణతో బాటు సంభాషణలూ పరిమితం. జనం చూడ్డానికి వస్తున్నారు అంటే వింతేమీ లేదు. వైయస్ కూతురని కొంత, ఆడకూతురు యింత కష్టపడిపోతోందని కొంత.

అసలు సోదరుడి కోసం యిన్నాళ్లు పాదయాత్రలు చేసిన సోదరి ఎవరైనా వున్నారా? నాకైతే గుర్తుకు రావడం లేదు. నెహ్రూ సోదరి విజయలక్ష్మీ పండిట్‌కు ఆయనకూ పడేది కాదు. నెహ్రూ కోసం కష్టపడడం ఔటాఫ్ క్వశ్చన్. సరోజినీ నాయుడు, హరీంద్రనాథ్

చటోపాధ్యాయ సోదరీసోదరులే కానీ వాళ్లు ఒకళ్లకోసం మరొకరు శ్రమ పడినట్లు లేదు. తమిళనాడులో కనిమొళి, ఆమె సవతి సోదరులు స్టాలిన్, అళగిరిలు రాజకీయాల్లో వున్నారు కానీ, త్యాగాల దాఖలా లేదు. కనిమొళి జైల్లో వుంటే సోదరులు బయట పదవుల్లో వున్నారు కానీ కాలికి బలపం కట్టుకుని తిరగలేదు. తిరగాలా, తిరిగితే లాభం వుంటుందా అని అడిగితే చెప్పలేం కానీ ఇలా తిరగడం మాత్రం విశేషమే అని ఒప్పుకోవాలి. కేసు పూర్వాపరాలు తెలియని గ్రామీణజనం 'తప్పు చేసినవాళ్లయితే దాక్కోవాలి కదా, యిలా బాజాప్తా తిరుగుతున్నారంటే తప్పు చేయలేదేమో' అని తర్జనభర్జన పడితే పాదయాత్ర వలన మేలు చేకూరినట్లే. మరో పక్క జగన్ భార్య భారతి పత్రిక, టీవీ నిర్వహణ ద్వారా జగన్ కేసు గురించి అవగాహన పెంచుతున్నారు. జగన్‌ను జైల్లో యింకా వుంచడం ఎంత అన్యాయమో వ్యాసాలు రాయిస్తున్నారు, సామాన్యజనాల చేత చెప్పిస్తున్నారు. పనిలో పనిగా అండర్ ట్రయల్స్ గురించి, శిక్షాకాలం ముగిసిపోయినా జైల్లో వున్నవాళ్ల గురించి, జైల్లో వుంటూ కేసు విచారణ ప్రారంభం కాని వాళ్ల గురించి కూడా కథనాలు వేస్తూ వుంటే యిది ఒక 'సోషల్ ఎవేర్‌నెస్ ఉద్యమం'గా బలపడేది. ఇప్పుడు జగన్ గురించి గురించి మాత్రమే రాస్తే 'ఇదేదో సొంత గోల' అన్నట్టు అనిపిస్తుంది.

ఇంతకీ ప్రజలు ఏమనుకుంటున్నారు? అది చెప్పడం మహా కష్టం. నాయకులు తమ సొంత అభిప్రాయాలను జనాభిప్రాయంగా అనుకుంటూ వుంటారు. విశ్లేషకుల్లో కూడా పార్టీ అభిమానులైతే రంగుటద్దాలలో చూసే ప్రమాదం వుంది. నిష్పక్షపాతంగా చెప్పాలనుకున్నా ప్రజలలో అత్యధికులు ఏమనుకుంటున్నారో, అది ఎలా మారుతూ వస్తోందో తెలుసుకునే మార్గం ఏది? అందువలన కొంత వూహించక తప్పదు. జగన్ ఎంతో కొంత అవినీతి చేసే వుంటాడని ప్రజలనుకోవడంలో వింత లేదు. అతి తక్కువ కాలంలోనే అమితంగా ఆర్జించాడని న్యాయాధీశులు అనడమే కాక, సాధారణ ప్రజలకు కూడా తెలుసు. అయితే అది ఏ మేరకు వుంది? ఇతరులతో పోలిస్తే తక్కువా? ఎక్కువా? అతి ఎక్కువా? అన్నదే ప్రశ్న. రాజకీయాల్లో డబ్బు చుట్టూనే తిరుగుతున్నాయనీ, రాజకీయ నాయకులందరూ అవినీతిలో మునిగి తేలుతున్నారనీ నిరక్షరాస్యుడి దగ్గర్నుంచి అందరికీ తెలుసు. ఓటు వేయడానికి డబ్బు పుచ్చుకుంటున్నపుడు అతనికి తెలుసు – 'అవతలివాడు కష్టార్జితం యివ్వడం లేదు, తను దోచుకున్నదానిలోంచే మనకు కొంత పడేస్తున్నాడు' అని. రాజకీయాల్లోకి రావడం యిదే ప్రథమం అయితే – 'ఇప్పటిదాకా దోచుకోలేదు కానీ యికపై దోచుకోవడానికి గాను పెట్టుబడి పెడుతున్నాడు' అని అర్థం. 'ఈ పెట్టుబడి కూడా ఏదో ఒక రకమైన అక్రమమార్గంలో వచ్చినదే, చెమటోడ్చి సంపాదించినది యిలా పంచిపెట్టడు' అని కూడా అనుకుంటాడు.

మరి రాజకీయనాయకులందరూ అవినీతిపరులే అయినపుడు జగన్ ఒక్కణ్నే ఎందుకు టార్గెట్ చేయడం అనే ప్రశ్న వస్తుంది. ఎందుకంటే తక్కినవాళ్లు కాస్త హద్దుల్లో వుంటే జగన్ హద్దుల్లేకుండా దోచుకున్నాడు కాబట్టి అంటారు. అధికారంలోకి రాకుండానే యింత దోచితే, వచ్చాక మరెంత దోచుకుంటాడో అని ఆలోచించాలంటారు. ఆ 'ఇంత' ఎంత? అని అడిగితే మాత్రం అందరూ తబ్బిబ్బు పడుతున్నారు. 'లక్ష కోట్లు..' అన్న స్లోగన్ తెగ వాడేశారు. సిబిఐ ఎన్ని కేసులు పెట్టినా ఆ అంకెకు చేరలేకపోయింది. చివరకు టిడిపి వారి అంకెల గారడీ గురించి మైసూరా రెడ్డి, దాడి వీరభద్రరావు చెప్పేసేసరికి వాటికి విశ్వసనీయత పూర్తిగా పోయింది. కాంగ్రెసు కానీ టిడిపి కానీ వైకాపా గురించి ఏం మాట్లాడినా అవినీతి, లక్షకోట్లు గురించి మాట్లాడి మాట్లాడి మనను యిమ్యూన్ చేసేశారు. చివరకు విసుగెత్తి 'అవును, జగన్ అవినీతిపరుడే, వాట్ నెక్స్‌ట్?' అని అడిగే స్థితికి తీసుకుని వచ్చారు. 2009లో వైయస్ అవినీతి గురించి యిలాగే మాట్లాడి మాట్లాడి ఓట్లశాతాన్ని తగ్గించగలిగారు కానీ ఓడించ లేకపోయారు. మళ్లీ అవే ఆరోపణలు జగన్‌పై చేస్తే ఎలా? ఒకే నేరానికి రెండు శిక్షలు వుండవన్నట్లు, ఒకే నేరానికి యిద్దర్ని దండించలేం కదా! వైయస్ కాలపు అవినీతిని అధికారంలో వున్న వైయస్ నెత్తికే చుట్టాలి తప్ప, కొడుకుకి ఎలా ఆపాదిస్తారు? ఈయన వెళ్లి చెప్పడం చేత చేశాడు అంటే చట్టం ఒప్పుతుందా? కాంగ్రెసు వాళ్లు వైయస్‌ను, వైయస్ అవినీతిని, వైయస్ కాబినెట్‌ను ఎక్కడ కలపాలో, ఎక్కడ విడదీయాలో తెలియక కొట్టుమిట్టులాడి దారం చిక్కుపరిచేశారు. ఆ చిక్కుదారంలో వాళ్ల మంత్రులే యిరుక్కున్నారు. అందువలన వాళ్లు యీ అంశంపై గట్టిగా మాట్లాడలేని పరిస్థితి వచ్చిపడింది.

ఇక టిడిపికి అటువంటి యిరకాటాలు ఏమీ లేవు. వైయస్‌ను, అతని కొడుకుని, అల్లుణ్ని, కాబినెట్ సహచరులను అందర్నీ చాకిరేవు పెట్టవచ్చు. అయితే ఆధారాలు కావాలి. వాటికై సిబిఐపై ఆధారపడ్డారు. అయితే సిబిఐ వాళ్లకు ఉపయోగపడుతున్నట్టు లేదు. నిజానికి జగన్ వ్యవహారంలో అతనికి పరోక్షంగా సాయపడుతున్నది సిబిఐ అనే చెప్పాలి. సిబిఐ కేసులు పెట్టి జగన్‌ను జైల్లో పెట్టగానే సాధారణ ప్రజలందరికీ 'ఇందులో ఏదో దొరికినట్టు వుంది' అని అనుకోవడం జరిగింది. దానికి తగ్గట్టు మొదట్లో సిబిఐ చాలా అడావుడి చేసింది. లక్ష్మీనారాయణగార్ని మీడియా హీరోగా చూపించింది. ఫలానా వాళ్లను అరెస్టు చేశారు, వాళ్లు జగన్ గురించి ఫలానా విషయం కక్కేశారు అంటూ వార్తలు వచ్చేశాయి. జగన్ యిరుక్కున్నాడన్నమాట అని అందరికీ అనిపించింది. కానీ అక్కడే అతి జరిగింది. సిబిఐ, మీడియా కలిసి జగన్‌పై సొంత విచారణ జరిపేస్తున్నాయి అన్న అభిప్రాయం కలిగేటంత దూరం వెళ్లిపోయింది వ్యవహారం. సిబిఐ ఆఫీసుకు యివాళ ఫలానా ఆయన యిన్ని గంటలకు వస్తున్నారు, అదిగో టీవీ కెమెరాల సాక్షిగా కారు ఎక్కారు, సిబిఐ వారి గదిలో అరగంట పోయాక మంచినీళ్లు తెప్పించుకున్నారు, తాగి మూతి తుడుచుకున్నారు, జగన్ వాళ్లను చూసి పళ్లు కొరికాడు, వీళ్ల ఒళ్లు గగుర్పాటు చెందింది... యిలా ప్రత్యక్ష వ్యాఖ్యానం వేసుకుంటూ పోయారు. సిబిఐ సహకారం లేనిదే యిదంతా సాధ్యం కాదని అందరికీ తెలుసు కాబట్టి లక్ష్మీనారాయణ గారి పాత్రపై అందరికీ సందేహాలు ముసిరాయి.

అంతలో ఆయన కాల్ లిస్టు సంపాదించి ఆయన్నే బోనెక్కించారు. 'చంద్రబాబు కేసులపై దర్యాప్తు చేయమంటే సిబ్బందికి తీరిక లేదని కోర్టుకి చెప్పారు. తీరికెందుకుంటుంది లెండి, ఇంత వున్నతస్థానంలో వుండి మీరే రోజులో గంటల తరబడి ఫ్రెండ్‌తో కబుర్లు చెప్తూ కూర్చుంటే మీ జూనియర్లకు మాత్రం ఫ్రెండ్సుండరా? కబుర్లుండవా?' అని వెక్కిరించారు. నా ఫోను, నా ఫ్రెండు, నా యిష్టం, నా లిస్టు బయటపెట్టడం నేరం, ఘోరం అని ఆయన ఎంత వాదించినా ప్రజల దృష్టిలో ఆయన ఒక్కసారిగా జారారు. ఇక అప్పణ్నుంచి మీడియాలోకి రావడం మానేశారు. వ్యక్తిగతంగా ఆయనకు జరిగిన డామేజి ఒక ఎత్తు కానీ సంస్థగా సిబిఐకు చాలా పెద్ద డామేజే జరిగింది. ఆ చార్జిషీటుల పరంపర కోర్టువారిని మెప్పిస్తోందేమో కానీ, ప్రజలకు మింగుడు పడటంలేదు. సంస్థాపరంగా సిబిఐకు సామర్థ్యం వుంది గానీ సరిగ్గా పని చేయనివ్వరని అంటారు. అధికారంలో వున్నవారు ప్రత్యర్థులపై కేసులు పెట్టడానికి దాన్ని వినియోగించుకుని, సరైన సమయంలో రాజీ కుదిరితే కేసును నీరు కార్చిస్తారని అంటారు. సిబిఐ చాలా పెద్ద వ్యవస్థ కాబట్టి అధికారంలో వున్నవారి మాటలు వినేవారు కొందరు, వినకుండా స్వతంత్రంగా వ్యవహరించేవారు కొందరూ వుంటారు. అందువలన కొన్నిసార్లు దానికి మంచిపేరు, మరి కొన్నిసార్లు చెడ్డపేరు వస్తూ వుంటుంది. అధికారంలో వున్నవారికి, ప్రత్యర్థులకు కుదిరే బేరసారాల బట్టి కేసు విచారణను నియంత్రిస్తూ వుంటారు. సరైన సమయంలో సిబిఐ అధికారినో, సిబిఐ న్యాయవాదినో, కోర్టు న్యాయమూర్తినో బదిలీ చేయడం ద్వారా కేసు సాగదీస్తూ వుంటారు. ఇది దశాబ్దాలుగా ప్రతి పార్టీ చేస్తున్న వ్యవహారం.

కానీ జగన్ కేసులో సిబిఐ యీ పాటి కూడా చేయలేకపోయింది. ప్రాథమిక విచారణ కాస్త చేసుకుని, సాక్ష్యాలు సేకరించాకనే కేసు పెట్టడం జరుగుతుంది. విచారణ అంటారు, మరీ అవసరమైతే అరెస్టు కూడా చేస్తారు. అరెస్టు చేశాక చార్జి షీటు దాఖలు చేసి కేసును నడిపిస్తారు. ఇక్కడ జగన్ అరెస్టుకు ముందే సిబిఐ చాలా కసరత్తు చేసి వుంటుంది కదా. ఆ తర్వాత అతన్ని అరెస్టు చేసి లోపల పెట్టింది. ఇక అక్కణ్నుంచి 'ఇంకా విచారణ చేయాలి, చార్జి షీటు పెట్టడానికి యింకా సమయం కావాలి' అంటూ కోర్టులో విన్నపాలు చేసుకుంటూ పోతోంది. దానివలన మనందరికీ అందుతున్న సంకేతం ఏమిటి? 'వీళ్ల దగ్గర సరుకు లేదు' అని. పరీక్షల్లో చూడండి, సబ్జక్టు బాగా వచ్చిన కుర్రాడు గబగబా పరీక్ష రాసుకుంటూ పోతాడు. రాని వాడే దాహం అంటాడు, టాయిలెట్టు అంటాడు, పైన ఫ్యాన్ తిరగటం లేదంటాడు, పెన్ను విరిగిందంటాడు, తలనొప్పి అంటాడు, బయట చప్పుళ్లయి ఏకాగ్రత దెబ్బ తింటోందంటాడు. ఇక్కడ సిబిఐ కూడా – కేసులో చాలా కోణాలున్నాయి కాబట్టి విచారణకు ఎక్కువ సమయం పడుతోందంటోంది. ఏం, సిబ్బంది వున్నారుగా, సెల్‌ఫోన్‌పై ప్రయివేటు సంభాషణలు పక్కన పెట్టి పని మీద శ్రద్ధ పెట్టమనండి. చురుగ్గా చేయమనండి. అయినా అన్ని కోణాలూ చూసుకున్నాకే అరెస్టు చేయాల్సింది. విచారణ పూర్తి కాకుండానే అరెస్టు చేసి కూర్చోబెట్టడం దేనికి?

'అబ్బే చేయకపోతే ఎలా? సాక్ష్యాలు తారుమారు చేసేస్తాడు' అంటుంది సిబిఐ. కోర్టువారు అవునవును అంటున్నారు. ఈ ఆరోపణలు యివాళ్టివా? సిబిఐ చేపట్టడానికి మూడేళ్ల ముందు నుండీ చలామణీలో వున్నాయి. వైయస్ బతికుండగానే వీటి ప్రస్తావన వచ్చింది. సాక్ష్యాలు మార్చడానికి యింతకాలం ఆగుతారా ఎవరైనా? అయినా సాక్ష్యాలు తారుమారు చేయాలనుకుంటే జగన్ స్వయంగా బయటకు వచ్చి చాకు పట్టుకుని బెదిరించాలా? వైయస్ జమానాలో హైదరాబాదులో కడపవాళ్ల పేరు మీద అనేక కబ్జాలు జరిగిపోయాయి. తెల్ల లుంగీలు కట్టుకుని వచ్చి, జయప్రకాశ్ రెడ్డి భాష మాట్లాడుతూ 'కేరాఫ్ పులివెందల' అని చెప్పుకున్నారు. అవునో కాదో ఎవరు చూడవచ్చారు? వైయస్ మద్దతు వుండి వుంటుందనుకుని అందరూ భయపడ్డారు. ఇది చూసే కెసియార్ దాన్ని పెద్ద యిస్యూ చేశారు. ఇప్పుడు సాక్ష్యాలు తారుమారు చేయడానికి జగన్ స్వయంగా రావాలా? ఫోన్ చేయాలా? జగన్‌కున్న స్టేచర్ బట్టి అతని పేరు చెప్పి ఎవరైనా బెదిరించగలరు. ఇంతమాత్రం కూడా సిబిఐకు తోచలేదంటే వాళ్లేం యిన్వెస్టిగేట్ చేస్తున్నట్లో నాకు అర్థం కాలేదు. తమాషా ఏమిటంటే వాళ్లు న్యాయమూర్తులను కూడా కన్విన్స్ చేసేయగలుగుతున్నారు. నా మట్టుకు నేను మొదట్లో ఉత్సాహంగా సిబిఐ పెట్టిన కేసుల గురించి చదివాను. తర్వాత పట్టించుకోవడం మానేశాను – యీ కేసు యిప్పట్లో తేలేట్లు లేదని!

అసలు క్విడ్ ప్రో కో నిరూపించడం మహా కష్టం. 'జగన్ బెదిరించడం వలన నేను నా యిష్టానికి వ్యతిరేకంగా అతని కంపెనీలో పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది' అని ఎవరైనా యిన్వెస్టర్ ఒప్పుకుంటే తప్ప వీళ్లేం చేయగలరు? ఫలానా కంపెనీలో ఎందుకు షేరు తీసుకున్నావ్? అని అడిగితే నవ్వుతారు. షేర్ వేల్యూ తక్కువ వున్నపుడు కొని, ఎక్కువ రేటు వచ్చాక అమ్ముదామనే ప్రతీవాడూ చూస్తాడు. నష్టాల్లో వున్న కంపెనీలో ఎందుకు పెట్టావ్ అంటే మరీ నవ్వుతారు. కొత్త కంపెనీ ఎప్పుడూ నష్టాల్లోనే వుంటుంది. బ్రేక్ ఈవెన్ అయ్యేందుకు చాలా ఏళ్లు పడుతుంది. అప్పటిదాకా ఎవరూ ఆ కంపెనీలో షేర్లు కొనరా? కొనకూడదని నిషేధం ఏమైనా వుందా? ఈ మాత్రం కామన్‌సెన్స్ కూడా లేకుండా పత్రికల్లో వ్యాసాలు వచ్చేస్తూ వుంటే చదవడానికి మహా విసుగ్గా వుంటుంది. పైగా ఈ కేసుల్లో క్విడ్ ప్రో కో – లింకు ఎస్టాబ్లిష్ చేయడం మహా కష్టం. అధికారంలో వున్నది తండ్రి, ప్రయోజనాలు చేకూర్చినది అతని మంత్రివర్గం. అధికారంలో వున్నవాళ్లే అధికార దుర్వినియోగం అంటూ చేయగలరు. లేనివాడు ఎలా చేయగలడు? పైగా పెట్టుబడి కంటె పొందిన ప్రయోజనం తక్కువగా వున్న కేసుల్లో యీ లాజిక్ బొత్తిగా పని చేయదు. అందుకే సిబిఐ సాక్షుల్లో ఎవరైనా జగన్‌కు వ్యతిరేకంగా అడ్డం తిరుగుతారేమో, అది పెట్టుకుని జగన్‌ను యిరికించవచ్చన్న ఆశతో వేచి వుంటోంది. అలా తిప్పడానికి వారి మార్గాలు వారికి వుండి వుంటాయి. వాటికి టైము పడుతుంది. అందుకే అలా నానుస్తూ పోతున్నారు.

ఇంత తక్కువ కాలంలో అన్ని ఆస్తులు ఎలా సంపాదించాడు? అనే ప్రశ్నకు మన రాష్ట్రంలోనే వేలాది మంది నాయకులు సమాధానం చెప్పుకోలేరు. అది ఏ యిన్‌కమ్ టాక్సు వారో డీల్ చేయవలసిన వ్యవహారం. అలాగే ఫెరా, ఫెమా, మనీ లాండరింగ్

వ్యవహారాల కేసులు. రిలయన్సు దగ్గర్నుండి అనేక కార్పోరేట్లు యీ కేసులు ఎదుర్కుంటూనే వుంటారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేటు వారు ఏవో జరిమానాలు విధిస్తూ వుంటారు. అది మరీ ఎక్కువగా వుందని కంపెనీలు కోర్టులకు వెళుతూ వుంటాయి. ఇదంతా ఏళ్ల తరబడి సాగే వ్యవహారం. వీటికి గాను వాళ్లందరినీ జైల్లో కూర్చోబెట్టరు. సిబిఐ జగన్‌ను జైల్లో కూర్చోబెట్టి రిస్కు తీసుకుంది. సరైన రీతిలో కథ నడిపించి వుంటే జగన్ ప్రతిష్ఠ మసకబారేది. కానీ సిబిఐ మధ్యలో కళ్లు తేలేసినట్టయింది. సరిగ్గా పాటరాని గాయకుడు పై స్థాయిలో రాగం తీసి సవ్యంగా కిందకు దిగ లేక సతమతమైనట్లు అయింది. జగన్‌పై కేసు గట్టిగా లేదన్నమాట అన్న సంకేతం ప్రజల్లోకి పంపించినట్టయింది. దీని వలన జగన్ లాభపడ్డాడా అంటే చెప్పడం కష్టం. పార్టీ పరంగా నష్టమే జరిగింది. జగన్ బయట వుండి వుంటే పార్టీ సంస్థాపరంగా పుంజుకుని వుండేది. లోపల వుండడం వలన నాయకులను అదుపు చేయడం కష్టం. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ యీ లోపం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. టిక్కెట్ల పంపిణీ సమయానికి తారస్థాయికి చేరుతుంది.

ఇక జగన్ కారాగారవాసం వలన ప్రజల్లో సానుభూతి పెరుగుతుందా, తరుగుతుందా? నా ఉద్దేశంలో మార్పు వుండదు. మొదట్నించి సానుభూతి వున్నవారికి అది అలాగే వుంటుంది. లేనివారికి కొత్తగా కలగదు. మొత్తం మీద చూస్తే 'వేయాల్సిన దండన కంటె ఎక్కువే వేశారు కానీ ఎంతోకొంత అవినీతి జరిగే వుంటుంది లేకపోతే జైల్లో ఎందుకు పెడతారు?' అనే భావనే మిగులుతుందనుకుంటాను. చివరకు అవినీతి అనేది ఎన్నికలలో అంశంగా కాకుండా పోతుందేమో ననిపిస్తోంది. అలా చాలాసార్లు జరిగింది. అవినీతినే ప్రధానాంశంగా చేసుకుని ఎన్నికలకు వెళదామనుకునే పార్టీలు ముందుగా సరైన సర్వే చేయించి దానికి తగినంత ప్రాధాన్యతే యిస్తే మంచిది, లేకపోతే 2009లో జరిగినట్లే జరగవచ్చు. మరి ఏడాది జైలు జీవితం జగన్‌పై ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తుంది? జయలలిత వంటి వ్యక్తులు జైలు జీవితం తర్వాత మరింత క్రూరంగా మారారు. మరిన్ని అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నారు. మరి జగన్ ఎలా మారతారు? సాధుస్వభావుడై, అవినీతి మచ్చ పడని పరిపాలన అందించాలనే దృఢసంకల్పంతో బయటకు వస్తారా? లేక కసితో నియంతగా మారి ప్రత్యర్థులను వేటాడతారా? జగన్‌ను వ్యక్తిగతంగా తెలిసినవాళ్లు మాత్రమే యీ ప్రశ్నలకు సమాధానాలను ఊహించగలరు. మనం మాత్రం వేచి చూడవలసినదే. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**మే 24** **ఎమ్బీయస్ : పంచపాండవులంటే మంచం కోళ్లల్లా...**

'పంచపాండవులంటే నాకు తెలియదా? మంచంకోళ్లల్లా ముగ్గురు..' అంటూ రెండు వేళ్లు చూపించిందట ఒకావిడ. తెరాసలో చేరే కాంగ్రెసు ఎంపీల సంఖ్య అలాగ తయారైంది. మొదట్లో ఏడుగురుండేవారు. తర్వాత మధు యాష్కీ వెనక్కి తగ్గారు. సర్వే సత్యనారాయణ, బలరాం నాయక్ అంతకుముందే తగ్గారు. కేంద్రంలో మంత్రులు కావడంతో వారి దృక్పథం విశాలమైంది. తెలంగాణ యిస్తే దేశం మొత్తం మీద ఎన్నేసి సమస్యలు వస్తాయో ఒక్కసారిగా వాళ్లకు జ్ఞానోదయం అయింది. పొన్నం ప్రభాకర్ గట్టిగా మాట్లాడడంతో సరిపెట్టారు కానీ తెరాసలోకి వెళ్లనన్నారు. ఆయన జిల్లా కరీంనగర్‌లో యిప్పటికే బోల్డుమంది తెరాస నాయకులున్నారు. వాళ్లందరినీ కాదని కెసియార్ తనకు టిక్కెట్టు యిస్తారో లేదోనని ఆయన బెంగ. గుత్తా సుఖేందర రెడ్డి ఒక్కోప్పుడు గట్టిగా మాట్లాడతారు, మరోసారి మెత్తగా వుంటారు. పార్టీలు మారడం ఆయనకు కొత్త కాదు. తన జిల్లాలో తెరాసకి బలం వుందా, వైకాపాకు బలం వుందా అన్న సంగతి ఆయన తేల్చుకోలేకపోతున్నారు. ప్రస్తుతానికి వెనక్కి తగ్గారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డికి, ఆయన సోదరుడికి వ్యాపారపరమైన బంధనాలు, వైయస్సార్ కుటుంబంతో బంధాలు వున్నాయి. బిల్లులు పాస్ చేయించుకోవడానికే వాళ్లు అధికార పార్టీలో కొనసాగుతున్నారని వారి ప్రత్యర్థులు అంటారు. ఆ పనులన్నీ అయ్యాక చేత వైకాపాలో చేరవచ్చు. తెరాసలో చేరడానికి కెసియార్ వ్యవహారశైలి అడ్డు వచ్చిందేమో తెలియదు.

ఇక మొదటినుండీ రంకెలు వేస్తూ వున్న రాజయ్య, మందా, వివేక్ మిగిలారు. వీరిలో రాజయ్య చివరిక్షణం దాకా వూగిసలాడి వరంగల్ సీటు ఖాయం కాకపోవడంతో ఆగిపోయారట. ఈయన ఆగారు కాబట్టి కడియం ముందుకు దూకారు. రాజయ్యకు ఎంపీ సీటు కాదు కదా, ఎమ్మెల్యే సీటు యిద్దామన్నా అక్కడ రసమయి బాలకిషన్ దస్తీ వేసేసుకున్నారు. ఎట్టకేలకు మందా, వివేక్ మాత్రం వన్ ప్లస్ వన్ ఆఫర్‌తో అనుకున్న పని పూర్తి చేస్తున్నారు. మందా కుమారుడికి, వివేక్ సోదరుడికి అసెంబ్లీ సీట్లు యిస్తామని కెసియార్ హామీ యిచ్చారట. ఈ యిద్దరు ఎంపీలతో బాటు కొసరుగా మాజీ ఎంపీ కేకే కూడా దూకారు. తను ఎన్నికలలో పోటీ చేయనని ఆయన అంటున్నారు. అలా అన్నా ఆయన కుమారుడు విప్లవ్‌కు అసెంబ్లీ సీటు ఆఫర్ కూడా దక్కలేదట. అబ్బే నా పిల్లలు రాజకీయాల్లోకి రావడం నేను చచ్చిన తర్వాతనే అంటున్నారు. కెసియార్ ప్రహసనం తర్వాత యిలాటివి ఎవరూ నమ్మడం మానేశారు.

తెరాస వైపు దుమికే కార్యక్రమ ప్రారంభదశలో కేకే రాజ్యసభ ఎంపీగానే వుండేవారు. అప్పట్లో చాలా దూకుడుగా – నా పదవి చిత్తుకాగితం వంటిది, చెత్తబుట్టలో పారేస్తా వంటి గ్రాండ్ స్టేటుమెంట్లు అతి నాటకీయంగా యిచ్చేవారు. రాజ్యసభకు రాజీనామా చేయబోతూ వుంటే వద్దని అహ్మద్ పటేల్ బతిమాలినా 'ఠర్, నేను అనుకున్నది చేసి తీరతా' అంటూ వెళ్లి యిచ్చేసి వచ్చారు. ఆ రాజీనామా ఆమోదించబడకపోయినా, చివరకు అధిష్టానం వారు యీయనకు బదులుగా పదవిని పవిత్రంగా చూసేవారికి యీ సారి టిక్కెట్టు యిద్దామనుకుని యీయనికి చెత్తబుట్ట యిచ్చి పంపేశారు. తెలంగాణ గురించి యీయన ఎన్ని ఉపన్యాసాలు యిచ్చినా యీయన్ని ఎన్నికల బరిలో నిలబెట్టే సాహసం తెరాస కూడా చేయదు. సామాన్య ప్రజలకు ఆయన ఆలోచనాస్రవంతి, ప్రసంగప్రవాహం

అందదని భయం. ఆయన మేధావి వర్గానికి చెందినవాడు కాబట్టి ఎమ్మెల్సీగానో, రాజ్యసభ మెంబరుగానో తెరాస పంపవచ్చు.

మందా జగన్నాథం గారికి పార్టీలు మారడం మంచినీళ్ల ప్రాయం. ఆయన డాక్టరీ చదువు చదివినా, పదవులు అనుభవిస్తున్నా దళిత కార్డు వాడుకోవడానికి ఏ మాత్రం వెనకాడరు. కావూరి సాంబశివరావు రాజీనామా చేసినపుడు స్పందించిన తీరునీ, తను రాజీనామా చేస్తానన్నపుడు స్పందించిన తీరునీ యీయన పోల్చి చూసి దానికి కులం రంగు పులిమారు. కావూరి ఎన్నో ఏళ్లగా కాంగ్రెసు పార్టీని అంటిపెట్టుకుని వున్నారు. కష్టకాలంలో కూడా విడిచిపెట్టలేదు. అయినా ఆయన రాజీనామా చేస్తానన్నంత మాత్రాన మంత్రి పదవి కట్టబెట్టలేదు. ఏం చేసుకున్నా యిచ్చేది లేదన్నారు. ఎటొచ్చీ తొందర పడవద్దు అంటూ ఢిల్లీ నుండి ఫోన్లు వచ్చి వుంటాయి. పని కానప్పుడు ఎన్ని ఫోన్లు వస్తేనేం? ఇక మందాకు దశాబ్దాలపాటు ఒకే పార్టీలో వుండే ఓపిక లేదు. ఆయన కాంగ్రెసులో వున్నదే తక్కువ. పైగా ఆయన డిమాండు – కాంగ్రెసు తీర్చలేనిది. రేపు గుత్తా సుఖేందర'రెడ్డి' యిలాగే బెదిరించినా రెడ్డిగారు కదాని కాంగ్రెసు ఆయన మాట మన్నించదు. ఇక్కడ దళిత ప్రస్తావనే అనవసరం.

వీళ్లు వెళ్లిపోయినందుకు కాంగ్రెసు ఏమైనా బాధపడుతోందా? ఆ సూచనలేమీ కనబడటం లేదు. ఐసియులో వున్న పేషంటు ఎప్పుడు పోతాడా అని బంధువులు ఎదురు చూసినట్టు వీళ్లు గుమ్మం ఎప్పుడు వదులుతారా అని కాంగ్రెసు చూసినట్టుంది. వీళ్లు ఢిల్లీ వెళ్లి వచ్చి 'తెలంగాణ యిచ్చేస్తారని సోనియా మాటల వలన మాకు అర్థమైంది' అని స్టేటుమెంటు యిచ్చిన మర్నాడే ఢిల్లీ ప్రతినిథి ఎవరో ఒకరు 'తెలంగాణానా? అది ఏమి? ఎట్లుండును? దాని గురించి మాకు సోయి, స్పృహ లేదే!' అంటూ వచ్చారు. రాజీనామాలు ప్రకటించాక పిసిసి అధ్యక్షుడైనా ప్రకటన చేయలేదు. కిరణ్‌గారు పెదాలు చప్పరించేశారు –'ఇష్టముంటే వుంటారు, లేకపోతే పోతారు, మనమేం చేస్తాం?' అంటూ. కాంగ్రెసులో వున్నంతకాలం వీళ్లు తమ నియోజకవర్గాలను ఏవైనా ఉద్ధరించేసి వుంటే యింత పాప్యులర్ నాయకులు వెళ్లిపోతే ఎలా అన్న బెంగ కాంగ్రెసుకు వుండేదేమో! వీళ్లు ఎంతసేపు కెసియార్‌తో మంతనాలు జరపడం, ఢిల్లీ పార్లమెంటు మెట్ల మీద కూర్చుని నిరసనలు చేయడం, పార్లమెంటు లోపలకి వెళ్లినపుడు నినాదాలు చేయడం... వీటితో కాలక్షేపం చేశారు. తమ నియోజకవర్గ సమస్యల గురించి ప్రశ్నలు వేయడాలు కానీ, ప్రాజెక్టులు సాధించుకు రావడాలు కానీ చేయలేదు. తెలంగాణ నినాదం పై మళ్లీ గెలుద్దామని చూస్తున్నారు తప్ప తమ పెర్‌ఫార్మెన్స్ బలం మీద అయితే కాదు.

వీళ్లు వెళ్లిపోయాక సోనియా ఓ పెద్ద నిట్టూర్పు విడిచి వుంటారు, పార్లమెంటులో వీళ్ల చికాకు తప్పింది కదాని! స్వపక్షంలో వుంటూ వైరిపక్షంలా ప్రవర్తించేవాళ్లతోనే యిబ్బంది. పూర్తిగా వైరిపక్షంలో వుంటే చిక్కే వుండదు. మనకూ కాస్త రిలీఫే. వీళ్లు కాంగ్రెసులో వున్నంతకాలం ఎప్పుడు వెళతారా అన్న ఊహాగానాలు చదివి చదివి విసిగిపోయాం. కాంగ్రెస్ మాట తప్పింది కాబట్టి గుర్తు చేస్తున్నాం అంటూ అరిగిపోయిన రికార్డుల్లాటి వీళ్ల స్టేటుమెంట్లు వినివిని సొమ్మసిల్లాం. ఇప్పుడు వాళ్లు ఫక్తు తెరాస నాయకుల్లాగానే మాట్లాడతారు కాబట్టి మీడియా పెద్ద కవరేజి యివ్వదు. ఆ మేరకు యింకో న్యూస్ చదువుకోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2013)**

**జూన్ 01** **ఎమ్బీయస్ : మరో వెయ్యి ఏనుగుల బలం...**

ఇద్దరు ఎంపీలు, ఓ మాజీ ఎంపీ వచ్చి తన పార్టీలో చేరగానే 'నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది..' అన్నారు కెసియార్. అంతకుముందు కడియం శ్రీహరి గారు చేరినప్పుడు యిదే ముక్క చెప్పారు. ఆయన ఒక్కరూ వెయ్యి ఏనుగుల పెట్టు అయితే యీ ముగ్గురూ కలిసి వెయ్యి ఏనుగులు కావడమేమిటి? మూడు వేల ఏనుగుల బలం కావాలి కదా అన్న మీమాంస అనవసరం. అలా లెక్కలు తీస్తే కడియం శ్రీహరి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వరుసగా ఓడిపోతూ వచ్చిన మనిషి, ఆయనే వెయ్యి ఏనుగుల పెట్టయితే మరి యిద్దరు లోకసభ సభ్యులు చెరో ఐదు వేల ఏనుగుల పెట్టు కావద్దా? వారికి తోడు బహుభాషా కోవిదుడు కేకే, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ మెంబరుగా చేసి, రాజ్యసభను కూడా అలంకరించిన మనిషి ఆయన విలువ రెండూ వేల ఏనుగులైనా కట్టవద్దా?

అయితే యిలా ముక్కస్య ముక్క అర్థః అన్నట్టు లాగి పీకకూడదు. చాలా ఆనందం కలిగితే 'ఏనుగెక్కినంత సంబరం' అంటారు. ఆ సంబరం చిన్నపుడు వుంటుంది కానీ పెద్దయిన కొద్దీ దాని స్థానంలో భయం వచ్చి చేరుతుంది. ఏనుగు మంచి మూడ్‌లోనే వుందా? దానికి తిండీ అదీ పెట్టారా? మావటీడు తాగి, దాన్ని అంకుశంతో వూరికే పొడిచి చికాకు పెట్టడం లేదు కదా? అన్న శంకలు వస్తాయి. రేలంగికి యిలాగే గజారోహణం చేస్తామని ఎవరో వస్తే ఆయన భయపడ్డాట్ట. 'జనాల్ని చూసి దానికి తిక్కరేగి, తొండంతో నన్ను లాగి పడేసి, పాదం కింద తొక్కదు కదా?' అని అడిగారట బెదురుతూ. 'మీ లాటి మహానటుణ్ని అలా ఎందుకు చేస్తుందండీ?' అని వచ్చినవాళ్లు నచ్చచెప్పబోయారట. 'నేను మహానటుణ్నన్న సంగతి మీకు తెలుసు, ఏనుక్కి తెలియదు కదా' అని లాజిక్ లాగాడట ఆయన.

ఇవన్నీ భాషాచమత్కారాలు. పార్టీ ఫిరాయింపుదారులు గోడ దూకి వచ్చినప్పుడల్లా కెసియార్‌కు వెయ్యేసి ఏనుగుల బలం వచ్చి చేరిపోయి, ఆయనకు తగని ఓపిక వచ్చేసి పల్లెబాట, పాదయాత్ర చేసేసి, వూరూరా తెలంగాణ తల్లి విగ్రహాలు స్థాపించేస్తారని, రోజూ తెలంగాణ భవనానికి వచ్చేస్తారనీ, ఫామ్ హౌజ్‌కి వెళ్లి రెస్టు తీసుకునే అవసరం పడదనీ, ఈసారి ఆమరణ నిరాహారదీక్ష చేపడితే నెల్లాళ్ల దాకా సెలైన్ తీసుకోకుండా బండి లాగిస్తారనీ అనుకోకూడదు. బలం అంటే శారీరక బలం కాదు, మానసిక స్థైర్యం.

'తెలంగాణలో నువ్వు తప్ప అన్యనాయకుడు లేడు, తెరాస తప్ప వేరు పార్టీ లేదు' అని వీళ్లందరూ తన ముందు సాగిలపడుతూండడం ఆయనకు కొండంత తృప్తిని యిస్తుంది. ఇక్కడ 'కొండంత' అనగానే – ఏ కొండ? యాదగిరి కొండా? తిరుపతి కొండా? పర్వతం అని వుంటే బాగుండేది కదాన్న చర్చ ప్రారంభించకూడదు.

తనకు బలం పెరిగిన సందర్భాల్లో ఏ యింగ్లీషు వాడో అయితే తమకు హార్స్ పవర్ పెరిగిందనేవాడు – వాళ్లకు వేగంగా పరుగులు పెట్టే గుఱ్ఱాలే ఆస్తి. మన భారతీయులకు గజబలం ముఖ్యం. ఎన్ని గజాలుంటే అంత గొప్ప. రాజుగారు ఎత్తయిన ఏనుగెక్కి అంబారీ కట్టించుకుని దానిలో కూర్చుని యుద్ధానికి బయలుదేరేవాడు. అంత ఎత్తునుండి యుద్ధం ఎలా చేయగలడో నాకు అర్థం కాదు. కత్తి యుద్ధం చేయలేడు. బాణాలు వేయగలడంతే. కానీ రాజు ఎక్కడున్నాడో శత్రువులకు సులభంగా తెలిసిపోతుంది. వాళు గురిచూసి బాణాలు వేయగలరు. అది తప్పించుకుని పారిపోదామంటే ఏనుగు కదలాలిగా! ఏనుగు మందగమనం భరించలేక కిందకి దుమికితే కాలు విరగవచ్చు. ఇదిగో యిలాటి సమస్యలతోనే మన భారతీయ సైన్యం యుద్ధాల్లో ఓడిపోతూ వచ్చింది. శత్రువులు గుఱ్ఱాల మీద వేగంగా వచ్చి ఎడాపెడా ఎటాక్ చేసేవారు. మన ఏనుగులను చూసి భయపడేవారు కానీ ఒడుపుగా దాని తొండం కోసేసేవారు. దానితో అది పిచ్చెక్కినట్టు ఘీంకరిస్తూ అటూ యిటూ పరుగులు పెట్టి సొంత సైనికులనే కాళ్ల కింద వేసి తొక్కేసేది. అందువలన ఏనుగులు వుండడం అన్ని వేళలా లాభదాయకం కాదు. శత్రువు కోటగోడలు బద్దలు కొట్టడానికి మాత్రం పనికి వస్తాయంతే.

ఇప్పుడు తెరాసకు గజబలం పెరుగుతోంది. ఈ హెవీ వెయిట్స్ ప్రత్యర్థుల కోటగోడలు భేదించుకుని వచ్చి చేరుతున్నారు. ఆకారాలు భీకరంగా వుంటున్నాయి కానీ అంతిమంగా ప్రయోజనం ఏమిటో తెలియటం లేదు. కడియం శ్రీహరి ఒకప్పుడు గొప్ప నాయకుడే కావచ్చు, యివాళ ఆయన స్టాండింగ్ ఏమిటి? వ్యక్తిగతంగా పలుకుబడి వుంటే యిన్నిసార్లు అంత ఘోరంగా ఓడిపోతారా? 2009లో తెరాస మద్దతు యిచ్చినా గెలవలేదు కదా! ఆయన సీనియారిటీని చూసి ఆయనకు ఏదో ఒక పదవి యివ్వాలి, గెలిచే చోట టిక్కెట్టు యివ్వాలి. ఆయన వలన తెరాసకు కొత్తగా వచ్చే ఓట్లు వుంటాయా? తెరాసకు ఆయన అవసరం వుందా? ఆయనకు తెరాస అవసరం వుందా?

పైగా యిలాటి ఏనుగులు రావడం వలన చిన్న ప్రాణులు వాటి కాళ్ల కింద నలుగుతాయి. అప్పటిదాకా ఆ నియోజకవర్గంలో పనిచేసిన వారందరికీ ఆశలు అడుగంటుతాయి. ఇప్పుడు చేరుతున్న మందా, వివేక్‌ల వలన కూడా యివే సమస్యలు వస్తాయి. వాటి సంగతి తర్వాత చూసుకోవచ్చు, ముందు వాళ్లను మన దగ్గరకు రానీ, దాని వలన కాంగ్రెసువాళ్లల్లో అధైర్యం వస్తుంది, అది చాలు అని కెసియార్ వూహ. ఎందుకంటే ఏనుగులు దృష్టిని బాగా ఆకర్షిస్తాయి. ఎంపీ స్థాయి వారు ఫిరాయిస్తే జాతీయ మీడియాలో కూడా చర్చకు వస్తుంది.

కాంగ్రెసు, టిడిపి గుండెల్లో దడ పుట్టించడానికి యిలాటి ఫిరాయింపులు కెసియార్‌కు ఉపయోగిస్తాయి. కానీ అదే సమయంలో దాని వలన పార్టీలో యిబ్బందులు వస్తాయి. నిజానికి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో తెరాస యితర పార్టీల నుండి నాయకులను తీసుకుంటే అది 'కౌంటర్-ప్రొడక్టివ్' అయ్యే ప్రమాదం వుంది. ఇప్పటికే ఆ జిల్లాలు తెరాస నాయకులతో కిటకిట లాడుతున్నాయి. కొత్త నీరు వస్తే పాత నీరు బయటకు పోవలసి వస్తుంది. బయటకు పోయినా మంచిదే. పోకుండా లోపలే వుండి ఎసరు పెడితే అసలుకు ముప్పు. పొన్నం ప్రభాకర్‌కు అదే భయం పుట్టింది. రాజయ్య అదే భయంతో ఆఖరి నిమిషంలో ఆగారు.

కేరళ ఆలయోత్సవాలలో ఏనుగుల వలన యీమధ్య చాలామంది చచ్చిపోతున్నారు. అసామ్, బిహార్ వంటి వివిధ ప్రాంతాల నుండి ఏనుగులను కేరళకు తెప్పించి స్థానికంగా వున్నవాటితో కలిపి వరుసలో నిలబెట్టడంతో వాటికి సయోధ్య కుదరక చికాకు పడి, చూడడానికి వచ్చినవాళ్లపై పడి గాయపరుస్తున్నాయి. తెరాసకు కూడా యిలాటి సమస్యే రాబోతోంది. కాంగ్రెసు, టిడిపిలలో వుంటూ వచ్చి దశాబ్దాలుగా కత్తులు దూస్తూ వచ్చినవారిని ఒక గూటికి తీసుకుని వచ్చి ఒక తాటికి కట్టేద్దామని చూస్తే కట్టుబడతారా? ఇద్దరూ తెలంగాణ వారే అన్న సామ్యం ఒక్కటి తప్ప భావసామ్యం బొత్తిగా లేదు కదా. 610 జీవో రాజకీయాలకు ఎందుకు అన్వయించదు? ఓ జిల్లా నాయకుడు మరో జిల్లాకు ఎందుకు వచ్చి పోటీ చేయాలి? అని రఘునందన్ వంటి లాయరు లాజిక్కులు లాగుతూన్న యీ తరుణంలో యీ తెలంగాణ కామన్ ఫ్యాక్టర్ ఎంతవరకు కట్టి వుంచగలదు?

పోనీ తీసుకున్నవాళ్లేమైనా ప్రజాదరణ వున్న వాళ్లా అంటే అదీ లేదు. మొన్నటిదాకా వీళ్ల చేత ముక్కచివాట్లు తిన్నవాళ్లే. సిగ్గూశరం లేదనీ, పదవులు పట్టుకుని వేళ్లాడుతున్నారనీ... యిలాగ సాగింది. ఇవాళ ఆజాద్‌గారు చెప్పారు – మా దగ్గర కూడా ప్యాకేజీ బేరాలు చేసి కుదరక వెళ్లిపోయారని. అది జనాలు నమ్మితే చాలా ప్రమాదం. వీళ్లు మొట్టమొదటిగా చెప్పుకోవలసినది – ఇన్నాళ్లు కాంగ్రెసులో ఎందుకు ఆగారని? డిసెంబరు 9 ప్రకటన రియాక్షన్ చూసి యూ టర్న్ తీసుకుని డిసెంబరు 23 ప్రకటన రాగానే వీళ్లకు అర్థమై వుండాలి, కాంగ్రెసు వెనకడుగు వేసిందని. ఆ తర్వాత కృష్ణ కమిటీ రిపోర్టు గురించి ఆగారని అనుకున్నా, ఆ రిపోర్టు దగ్గర పెట్టుకుని కూడా రెండున్నరేళ్లు గడిపారు కదా. కాంగ్రెసేతర పార్టీలన్నీ చెపుతూనే వున్నాయి కదా, ఈ రోజు దేవుళ్లా కనబడుతున్న కెసియార్ కూడా ఎప్పణ్నుంచో చెపుతున్నారు కదా. అయినా వీళ్లు యిన్నాళ్లు నమ్మకుండా యిన్నాళ్లకు – ముఖ్యంగా అక్టోబరులో ఎన్నికలు వుంటాయని అంటున్నపుడు– చెవిన వేసుకున్నారంటే వింతగానే వుంది కదా!

వీళ్ల సంగతి కెసియార్‌కి తెలియదా? తెలుసు. కానీ తీసుకున్నారు. ఎందువలన? ఆయన వద్ద తెలంగాణ వాదులు తక్కువగా

వున్నారనా? వీళ్లు వచ్చి చేరిన నియోజకవర్గాలలో స్వచ్ఛమైన తెలంగాణవాదులు కరువయ్యారనా? అబ్బే! నా అనుమానం – ఆయనకు గెలిచేవాళ్లు కావాలి. కరక్టుగా చెప్పాలంటే తమను తాము గెలిపించుకునేవాళ్లు కావాలి. కేవలం తెలంగాణవాదంతో గెలిపించగలమన్న విశ్వాసం కెసియార్‌లో కనబడటం లేదు. డబ్బున్న కాండిడేట్లు కావాలి, వాళ్లకే టిక్కెట్లు యిస్తాం అని చెప్పేశారట కూడా. డబ్బు ముందు ఏ వాదమూ గెలిచేట్టు లేదని ఆయనకు తోస్తోంది. జగన్ పార్టీకి డబ్బుకి లోటు లేదు, కాంగ్రెసు అధికార పార్టీ కాబట్టి దానికీ లేదు, టిడిపికి గట్టి మద్దతుదారులున్నారు కాబట్టి వాళ్లకూ డబ్బుంది, కార్పోరేట్ బలం మెండుగా వున్న బిజెపికీ నిధులున్నాయి. వీళ్లతో తలపడాలంటే డబ్బున్న అభ్యర్థులు కావాలి.

అందుకే వివేక్, మందాలను పిలిచారు. రాజయ్య దగ్గర పెద్దగా వున్నట్టు లేదు, అందుకని ఆయన అడిగిన నియోజకవర్గాలు యివ్వలేమన్నారు. అసెంబ్లీ టిక్కెట్లు మామూలు నాయకులకు యిచ్చినా, ఎంపీ టిక్కెట్లు సంపన్నులకే యిచ్చి గెలిచి రమ్మంటారు. అయిదారు మంది గెలిచినా కేంద్రంలో కీలకమైన భూమిక వహించవచ్చు కదాని ఆశ. ఎన్నికలలో డబ్బు ప్రాధాన్యం పెరుగుతూన్న యీ రోజుల్లో కెసియార్ ఆలోచనను తప్పు పట్టలేం. కానీ ఓటర్లు వీళ్ల దగ్గర డబ్బు తీసుకుని వేరే వాళ్లకు ఓటేసినా, డబ్బు కాక వేరే ఫ్యాక్టర్ పని చేసినా యీ లెక్క తప్పినట్టే ! పైగా గెలిచాక యీ పెద్దమనుషులు ''మా సొంత డబ్బుతో మేం గెలిచాం, మీరు మమ్మల్ని గెలిపించినదేముంది?'' అంటూ యుపిఏకో, ఎన్‌డిఏకో యీయనతో చెప్పకుండా మద్దతు యిచ్చేయవచ్చు? మందావారి గతచరిత్ర, వివేక్ తండ్రి తెలంగాణ ప్రజాసమితి పేర గెలిచి దాన్ని నట్టేట ముంచి కాంగ్రెసులోకి గెంతేసిన చరిత్ర, గతంలో కాంగ్రెసు తెరాసను చీల్చిన చరిత్ర – అన్నీ మనకు తెలుసు. వీళ్లతో యుద్ధానికి వెళ్లడమంటే రాజుగారు గజబలంతో సాగినట్టే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 03** **ఎమ్బీయస్ : శల్యులకు శాల్యూట్ చెప్పేస్తున్నారు**

డిస్సిడెంట్ లీడర్ అనే పదానికి క్లుప్తనామంగా పేరుబడిన డిఎల్‌కు ఉద్వాసన చెప్పారు. గట్టిగా మాట్లాడితే డిస్మిస్ చేసి పంపారు – అదీ ఊళ్లో లేనపుడు. విదేశాలకు వెళ్లేటప్పుడు మంత్రి, తిరిగి వచ్చేటప్పుడు మాజీ. ఇన్నేళ్లు ఆగగా లేనిది ఊరు వచ్చాకనే తీసివేయవచ్చు కదా అని కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రాజీనామా అడిగితే యిచ్చేవాణ్నిగా అంటున్నాడాయన. ఆ మర్యాదలు డియల్ పాటించి వుంటే అవతలివాళ్లూ పాటించేవారేమో! ఆయన సంప్రదాయాలను, సభ్యతలను ఎప్పుడో అతిక్రమించి వున్నాడు, ఆయనకు అదే ధోరణిలో సత్కారం జరిగింది. పేయింగ్ బ్యాక్ యిన్ ద సేమ్ కాయిన్ అంటారు కదా అలాటిదన్నమాట. తీసేద్దామనుకున్నాక యింటికి పిలిచి చందన తాంబూలాది సత్కారాలు సమర్పించి రాజీనామా అడిగే కంటె 'విత్ టెల్లింగ్ ఎఫెక్ట్' – మనసులో నాటుకునేట్లు వ్యవహరిస్తేనే తెలిసి వస్తుందనుకుని వుంటారు.

నిజానికి యీ పని ఎప్పుడో చేసి వుండాల్సింది. ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని అంతలేసి మాటలు అంటూ వుంటే అసలు యిన్నాళ్లూ ఎందుకు సహించారో మనకు అర్థం కాదు. ఇప్పుడు ప్రత్యేకంగా చేసిన నేరం అంటూ ఏమీ లేదు. బంగారు తల్లి పథకం గురించి మాట్లాడుతూ 'ప్రభుత్వాన్ని రాళ్లేసి కొట్టండి' అన్నారు కాబట్టి యీ చర్య అంటే అదీ పొసగదు. గతంలో యింకా చాలాచాలా మాట్లాడారు. మంత్రిత్వశాఖను కుదిరచి హెచ్చరిక పంపినా ఆయన ఖాతరు చేయలేదు. ఇదంతా కిరణ్ ప్రతాపం అంటున్నారు కొందరు, ప్రతాపం ఏమిటి, అపరాధం అంటున్నారు మరికొందరు. కిరణ్ చేతిలో పవరే వుంటే రెండేళ్ల క్రితమే డియల్ మాజీ అయి వుండేవారు. ఇన్నాళ్ల వరకు హై కమాండ్ ఓపిక పట్టమని అనడంతో ఆగి వుంటారు. ఇప్పటికి సరే, కానీయ్ అనేశారు. చేసేదేదో కాస్త డ్రమటిక్‌గా చేద్దామని కిరణ్ అనుకుని వుంటారు. ఎందుకంటే కిరణ్ యిప్పుడు ప్రయత్నిస్తున్నది – టఫ్ మ్యాన్ యిమేజి కోసం! కిరణ్ వ్యక్తిగతంగా కచ్చపెట్టుకుని యిలా వ్యవహరించాలనుకున్నా దానికి హై కమాండ్ ఎలా అనుమతించిందన్న ప్రశ్న వస్తుంది.

ఆ మాటకొస్తే – కాంగ్రెసు పార్టీ కాబట్టి యింతకాలం సహించారు. మరే యితర పార్టీ అయితే ఎప్పుడో తరిమేసి వుండేవారు. ప్రాంతీయ పార్టీలయితే చెప్పనే అక్కరలేదు. నోరెత్తినా నెల్లాళ్లలో షోకాజ్ నోటీసు లేకుండా తీసేసేవారు. అసలు డియల్‌ను కాబినెట్‌లో ఎందుకు తీసుకున్నా రనుకున్నారు? వైయస్‌ను తిట్టాడన్న క్వాలిఫికేషన్ తప్ప వేరేమైనా వుందా? వైయస్ బతికుండగానే వ్యతిరేకించాడన్న పాయింటు మీదనే డియల్‌ను, శంకరరావును తీసుకున్నారు. అప్పట్లో తక్కిన మంత్రులెవరూ వైయస్‌నుగాని, జగన్‌గాని ఏమీ అనేవారు కారు. వీళ్లిద్దరూ నోటికి ఎంత వస్తే అంత అనేసేవారు. రోశయ్య హయాంలో వైయస్‌ను మా మనిషే అని చూపెట్టిన హై కమాండ్, కిరణ్ హయాం వచ్చేసరికి వైయస్‌ను దోషిగా నిలబెట్టాలని నిశ్చయించుకుంది. అప్పుడు వీళ్లు పనికి వచ్చారు. పోనుపోను వీళ్లే తలనొప్పిలా తయారయ్యారు. శంకరరావు తన తోటి మంత్రులపైనే ఒంటికాలిపై లేవడం మొదలెట్టారు. ఫిర్యాదులు చేయసాగారు. దాంతో డిస్మిస్ చేసి యింటికి పంపించారు. ఈయన మిగిలాడు. ఈయన పనీ కానిచ్చేశారు.

డియల్ తన బాణాలన్నీ కిరణ్‌పైనే ఎక్కుపెట్టారు. ఇటీవల కళంకిత మంత్రులపై కూడా...! పార్టీ సమావేశాల్లో, కాబినెట్ మీటింగుల్లో మాట్లాడవలసిన విషయాలన్నీ బయట మాట్లాడడం మొదలుపెట్టారు. అదీ అతి తీవ్రపదజాలంతో! 'ప్రభుత్వం ఎంత అధ్వాన్నంగా పని చేస్తోందో మేం చెప్పడం దేనికి? మంత్రులే చెప్తున్నారు' అని అపోజిషన్ వాళ్లు అనడానికి వీలు చిక్కింది. సిఎంకు కాబినెట్‌పై పట్టు లేదు.. అని మీడియా, ప్రతిపక్షం అందరూ అనసాగారు. ప్రతీ ప్రభుత్వంలోనూ అసమ్మతివర్గం వుంటుంది.

ముఖ్యమంత్రి సమావేశాలకు గైరుహాజరు కావడం, చిన్నా చితకా ప్రకటనలు యివ్వడం సహజం. కానీ డియల్ చాలా దారుణమైన స్థాయిలో విమర్శలు చేశారు. ఇదంతా పార్టీ మంచికోసమే చేశాను, రాష్ట్రప్రభుత్వపు పనితీరు మెరుగు పరచడానికే చేశాను. నేను చెప్పేదానిలో అసత్యం ఏముంది? నేను చెప్పే నిష్టురసత్యాలు భరించలేకపోతున్నాడు ముఖ్యమంత్రి – అని పెద్ద హరిశ్చంద్రుళ్లా చెప్తున్నాడీయన. అంత హరిశ్చంద్రుడైతే కేంద్రప్రభుత్వంలో జరుగుతున్న అనేక స్కాముల గురించి మాట్లాడడేం? ప్రధానమంత్రి ఆఫీసు సైతం వివాదాల్లో చిక్కుకుంది కదా, అనేక కేంద్రపథకాలు భ్రష్టు పట్టాయి కదా… వాటి గురించి మాట్లాడడేం? ఎంతసేపూ 'సిఎం ఫేషియల్ చేయించుకుని ఫోటో తీయించుకున్నాడు, జుట్టుకి రంగేసుకున్నాడు' లాటి కబుర్లు ఎందుకు? ముఖ్యమంత్రి జుట్టురంగుకి, ఫేస్‌పౌడరుకి లెక్క సరే, కోల్ స్కామ్‌లో కోట్ల ప్రజాధనం పోయింది. ధైర్యం వుంటే వాటి గురించి మాట్లాడాలి.

డియల్‌ను తీసేస్తే నష్టం ఏమిటి అని హై కమాండ్ ఆలోచించి వుంటుంది. వైయస్‌ను, జగన్‌ను తిట్టేవాళ్లు అప్పట్లో ఎవరూ వుండేవాళ్లు కాదు కాబట్టి వీళ్ల అవసరం పడింది. ఇప్పుడు అనేకమంది తిడుతున్నారు. ఆనం వివేకానంద రెడ్డి ఒక్కరు చాలు – ఎన్ని అవాచ్యాలైనా మాట్లాడడానికి. (తాజా ఉదాహరణ – 'సంవత్సరీకం') ఈయన పొడిచేసేది ఏమీ లేదు. ఇక యీయనకు ప్రజాబలం వుండి వుంటే కాస్త తటపటాయించేవారు. కడప ఉపయెన్నికలో జగన్‌తో పోటీపడినప్పుడు పలికిన బీరాలకు, వచ్చిన ఓట్లకు పోలిక లేకుండా పోయింది. సొంత నియోజకవర్గంలో డిపాజిట్ దక్కలేదు. ఇప్పుడు బర్తరఫ్ చేస్తే ఒక్క ఎమ్మెల్యే కూడా నిరసనగా రాజీనామా చేయలేదు, పార్టీని ఎదిరించలేదు. మీడియావారు, ప్రతిపక్షాలు మాత్రమే జాలి కురిపిస్తున్నాయి. చార్జిషీట్లు తీసుకున్న మంత్రులను కొనసాగించినవారు యీయన్ని మాత్రం తీసేయడమేమిటని వారి విమర్శ. దానికీ దీనికీ ముడిపెట్టడం అర్థరహితం. ఇక్కడి అంశం – అవినీతి కాదు, అసమ్మతి. అసమ్మతి ఏ స్థాయి వరకు అనుమతిస్తాం? అనే విషయంపై తన నాయకులకు అధిష్టానం క్లారిటీ యివ్వదలచింది. డియల్ ఉదంతం ద్వారా సంకేతం యిచ్చింది. గ్రహించినవాళ్లు గ్రహిస్తారు. డియల్‌ను తీసేసిన తర్వాత కొందరు కొత్త వ్యాఖ్యానాలు చేశారు – జగన్‌ను విమర్శించినవాళ్లకు కాబినెట్‌లో స్థానం లేకుండా పోతోంది. గతంలో శంకరరావు, యిప్పుడు డియల్.. అంటున్నారు. అసలు విమర్శించినందుకే వీళ్లకు పదవులు దక్కాయని వీళ్లెలా మర్చిపోతున్నారో తెలియదు. జగన్‌ను తిట్టిన వాళ్లకు, ఉరి వేయాలన్న వాళ్లకు శిక్షలు పడతాయంటే ప్రస్తుత కాంగ్రెసు నాయకుల్లో చాలామందికి పడాలి మరి.

తమాషా ఏమిటంటే డియల్ నిన్న మాట్లాడుతూ 'జగన్ చేసిన పొరపాటేమిటి?.. జగన్‌తో నాకు శత్రుత్వం దేనికి? ఆయనతో నేనెందుకు పోరాడాలి?..జగన్ తండ్రి నాకు మంచి స్నేహితులు..' అంటున్నారు. ఇవన్నీ అచ్చుతప్పులేమోనని నా అనుమానం. వైయస్‌ను అంత తూర్పార బట్టిన యీయన కూడా యిలా అంటున్నాడంటే మతిపోతోంది. వైకాపాలోకో వెళతాడని, టిడిపి పార్టీలోకో వెళతాడని అంటున్నారంటే అది నిజమేమోనన్న సందేహం కలుగుతోంది. ఇది వూహించే హై కమాండ్ యిప్పుడు అర్జంటుగా పీకేసిందేమో! అసలు యిప్పటిదాకా యీయన చేసినది శల్యసారథ్యమే కదా. మంత్రిగా వుంటూ ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడు. సహకార ఎన్నికలలో ఆయన నియోజకవర్గంలో కూడా తన పార్టీ వాళ్లను గెలిపించలేదు. ఇలాటి శల్యుడే కేకే కూడా. తెలంగాణ యివ్వకపోతే పార్టీ ఓడిపోతుంది, ఓడిపోతుంది అంటూ ఒకటే నస. అందుకే పార్టీ వీడతానంటే వెళ్లిరా అన్నారు. ఈ శల్యులందరకూ సెల్యూట్ చెప్పడానికే నిశ్చయించుకున్నట్టుంది కాంగ్రెస్. ఈ పని మిగతా పార్టీలు కూడా చేస్తే పరిస్థితి కాస్త తేటపడుతుంది… ఎవరెటో స్పష్టంగా తేలుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 04 వీక్లీకై** **ఎమ్బీయస్ : నాగం ఎత్తుకున్న రాగం**

జాతీయపార్టీలతో తప్ప ప్రాంతీయపార్టీలతో తెలంగాణ రాదని నాగం ఎత్తుకున్న రాగం కెసియార్‌ను మండిస్తోంది. 'ఇక్కడ మేం గులాబీ జెండా పాతివుండకపోతే 'నువ్వు ము…, మూతీ మూసుకుని (సభాముఖంగా యిలా ఎలా మాట్లాడగలుగుతారో!) బాబు చెప్పులు మోసుకుంటూ వెళ్లేవాడివి కాదా?' అని తిట్టేశారు. టిడిపిలోంచి బయటకు వచ్చేవరకే నాగం పెద్ద లీడరుగా కెసియార్ కంటికి కనబడ్డారు. ఒకసారి బయటకు వచ్చాక నానాటికీ తీసిపడేశారు. ఆయనను టి–జాక్‌లో తీసుకోకుండా ముప్పుతిప్పలు పెట్టారు. వెయిటింగ్ లిస్టులో పెట్టిపెట్టి చివరకు ఆర్ఏసి యిచ్చారు. జాక్ బోగీ ఎక్కాక బెర్త్ సంపాదించి ప్రధానపాత్ర వహిద్దామనుకుంటే అసలు బోగీనే కదలకుండా చేశారు. నాగంతో బాటు బయటకు వచ్చిన యిద్దరు ఎమ్మెల్యేలను లాగేసుకుని రెక్కలు విరిచేసి ఒంటరిని చేశారు. ఇన్ని పార్టీల నుండి యిందరు నాయకులను ఎడాపెడా గుంజుకుంటున్న కెసియార్ నాగంను మాత్రం తెరాసలో ఎందుకు రానీయలేదో! లేక నాగంకే భయం వేసిందా? ఇద్దరూ టిడిపిలో కలిసి పనిచేశారు కదా. పాతకథలేమైనా వున్నాయేమో! కెసియార్ తనకంటె జూనియర్ అనే ఫీలింగు నాగంకు వుందేమో! టిడిపిలోనుండి వచ్చిన తన పాతసహచరులతో తెరాసలో నాగం తనకు వ్యతిరేకంగా గ్రూపులు కడతారన్న భయం కెసియార్‌కు ఉందేమో!

జార?ండ్ ముక్తిమోర్చా అనే ప్రాంతీయపార్టీ వలననే జార?ండ్ అనే రాష్ట్రం ఏర్పడిందని కెసియార్ గుర్తు చేస్తే రాష్ట్రం ఏర్పడేనాటికి ఆ పార్టీ పూర్తిగా దెబ్బ తిని వున్నదని నాగం రిటార్టు యిచ్చారు. అంతేకాదు, 'తెలంగాణ ఉద్యమం తెరాసతో పుట్టిందంటున్నావ్, 1969లో నేను జైలుకి వెళ్లాను, నువ్వు అప్పుడేం చేస్తున్నావ్? లాగూ వేసుకుని తిరుగుతూ వుండి వుంటావ్' అని దెప్పి పొడిచారు. 'తెలంగాణ ఉద్యమం ఎప్పుడు పుట్టింది? ఎన్నేళ్లు నడిచింది?' అని పరీక్ష పేపర్లో ప్రశ్నగా యిస్తే ఛస్తాం. కొందరి దృష్టిలో అది నిజాం

దిగిపోయిన క్షణం నుండీ వెల్లోడి ప్రభుత్వకాలంలోనే పుట్టింది. మరి కొందరు ఆంధ్రప్రదేశ్‌తో పుట్టిందంటారు. ఇంకొందరు బ్రహ్మానందరెడ్డి-చెన్నారెడ్డి గొడవల్లో పుట్టిందంటారు. ఈ మధ్య తెరాస వాళ్లు 'అసలు కెసియార్ లేకపోతే ఉద్యమం ఎక్కడుంది?' అంటున్నారు. 'అబ్బే జయశంకర్ ఎప్పణ్నుంచో నడిపిస్తున్నారు' అంటారు ఆయన భక్తులు. ఎంతమంది పాల్గొంటే, ఎన్నాళ్లు అవిరామంగా నడిస్తే ఉద్యమం అనే హోదా దక్కుతుందో తెలిస్తే దీనికి జవాబు తెలుస్తుంది.

నాగంకు హఠాత్తుగా గొంతుపెరగడానికి కారణం బిజెపి ఆయనకు యిచ్చిన విలువ! బిజెపివారు తెలంగాణను గట్టిగా పట్టించుకుంటున్నట్టే వుంది. ఎదగడానికి వారికి యిక్కడ చోటు కనబడుతోంది. నాగం జనార్దనరెడ్డి తన నగారాను విలీనం చేస్తూంటే దాన్ని ఓ పెద్ద యీవెంట్‌గా మలచుకోవడానికి బిజెపి అధ్యక్షుడే వచ్చి పెద్ద మీటింగు పెట్టారు. ఇంతా చేసి నాగం ఒక ఎమ్మెల్యేనే కదా! కానీ బిజెపి అలా అనుకోలేదు. ఆయన వంటి హెవీ వెయిట్ తమ పార్టీలో చేరడమే తమ భాగ్యం అన్న బిల్డప్ యిచ్చారు. ఆయన వెనక్కాల ఆసేతుహిమాచలం వుందని (!) రాజ్‌నాథ్ చెప్పారు. ఆయనతో బాటు మాజీ మంత్రి పుష్పలీల, మాజీ ఎమ్మెల్యే రాథోడ్, యింకా యితర పార్టీల నాయకులు కూడా వచ్చి చేరేట్లు ప్లాన్ చేశారు. ఇక నాగం పెద్ద లీడరులాగానే ప్రవర్తిస్తారు. ఇప్పుడు ఆయన వెనుక వున్నది – ఒక నియోజకవర్గానికి పరిమితమైన 'నగారా సమితి' కాదు, ఒక జాతీయ పార్టీ!

బిజెపికి తక్షణ కర్తవ్యం ఏమిటి? తెలంగాణలో ఎదగడం! అన్ని రాజకీయపార్టీలూ తమ రాజకీయప్రయోజనాల కోసమే తెలంగాణపై నిర్ణయం తీసుకుంటూ వుంటే (నిర్ణయం చెప్పకపోవడం కూడా ఓ నిర్ణయమే) తాము మాత్రం ఉత్తిపుణ్యాన తెలంగాణ గురించి ఎందుకు కమిట్ కావాలని బిజెపి అగ్రనాయకత్వం ఆలోచిస్తోందట. 'తెలంగాణ యిస్తామంటే మనకేం లాభం? అక్కణ్నుంచి 12 సీట్లు రావాలని ఆశిద్దాం, కనీసం 6 తెచ్చుకుందాం. ఏమీ లేకుండా, తెరాసను బలోపేతం చేయడానికి మనం ఎందుకు తంటాలు పడాలి?' అని వారి ఆలోచనట. తెలంగాణలో ఎదగాలంటే తెరాసకు పోటీగా ఎదగాల్సిందే! కాంగ్రెస్, టిడిపిలు మధ్యస్త పార్టీలు కాబట్టి పూర్తి తెలంగాణవాదానికి కట్టుబడిన పెద్ద పార్టీలు తెరాస, బిజెపి రెండే కాబట్టి (సిపిఐను ఆటలో అరటిపండుగా లెక్కేస్తున్నాను) ఆ రెండూ పోటీ పడక తప్పదు. ఇతర పార్టీలనుండి నాయకులను ఆకర్షించడంలో తెరాస, బిజెపి రెండూ పోటీ పడతాయి. ఇద్దరికీ నాయకుల కొరత వుంది. తెరాసను దిగలాగడానికి బిజెపి ఉపయోగిస్తున్న వాదం – తెరాస ప్రాంతీయపార్టీ అని!

''వెనకటికో భక్తుడికి దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకో అంటే 'మా మేనమామ చెవిలో బొచ్చు మొలిపించు, నాకు ఐశ్వర్యం కలుగుతుంది' అన్నాట్ట. ఇప్పుడు తెరాస చెపుతున్నదీ అలాగే వుంది. మమ్మల్ని గెలిపించండి, మేం కేంద్రంలోని జాతీయ పార్టీపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ తెస్తాం అంటున్నారు. జాతీయ పార్టీలు రెండే – మేమూ, కాంగ్రెస్. మూడో ఫ్రంట్ హుళక్కి. కాంగ్రెసు ఎలాగూ ఓడిపోతుంది. ఒకవేళ గెలిచినా తెలంగాణ యివ్వదు. తెరాస మా దగ్గరకే వచ్చి అడుగుతుంది. ఎన్నికల్లో మమ్మల్ని ఓడగొట్టి మళ్లీ మా దగ్గరకే వస్తే మేం యిస్తామా? ఇస్తే మాకేం లాభం అని ఆలోచించమా? అందువలన తెలంగాణ కోరుకునేవాళు ్ల తెరాస తలచుట్టూ చెయ్యి తిప్పి మా ముక్కు పట్టుకోవడం కంటె డైరక్టుగా మా ముక్కే పట్టుకోవచ్చుకదా!" అని బిజెపి వాదన.

రాజ్‌నాథ్ మీటింగులో నాగం యిదే అడిగారు – 'రాష్ట్రంలో బిజెపిని ఓడగొట్టాలి, దేశంలో గెలిపించాలి, ఇదేం పద్ధతి? తెరాసకు యిదేం తిక్క ఆలోచన? జరిగేదేనా?' అని. కిషన్ రెడ్డి హెచ్చరించారు – 'తెరాసను కాంగ్రెసు కలిపేసుకుంటుంది. కాంగ్రెసు తెలంగాణ యివ్వదు. అందువలన తెరాసకు వేసే ప్రతీ ఓటూ తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకమైనదే' అని. బిజెపి తెరాసపై యింత విరుచుకుపడుతుంటే వాళ్లు వూరుకుంటారా? కెటియార్ 'బిజెపితో మాకు మిత్రవైరుధ్యం తప్ప శత్రుత్వం లేదు' అంటూనే 'ఒక ఓటు – రెండు రాష్ట్రాలంటూ చేసిన కాకినాడ తీర్మానాన్ని కాకి ఎత్తుకెళ్లిందా? మీకు చిత్తశుద్ధి లేదు. చంద్రబాబు వద్దంటే మాత్రం తెలంగాణ యివ్వకపోవడమేం? రేపు గెలిచినా వెంకయ్యనాయుడు వంటి ఆంధ్ర నాయకుడు అడ్డుపడతాడు. అదే మేమైతేనా? మా పార్టీలో ఆంధ్ర నాయకుడన్నవాడే లేడు...' అంటున్నారు. 'రాజధాని చుట్టు వున్న ప్రాంతాల వారికి ప్రత్యేక రాష్ట్రమేల?' అని అద్వానీ అడిగిన ప్రశ్న యింకా గుర్తు చేస్తూనే వున్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వాములు వద్దంటే రామమందిరంలాగానే తెలంగాణ కూడా గొంగళీలా పడి వుంటుంది కదా! అన్న సందేహమూ వుంది ప్రజలకు. ఇది గ్రహించే 'తెలంగాణ వద్దనే వారితో పొత్తు పెట్టుకోం' అని రాజనాథ్ ప్రకటించారు. అక్కడికి ఆయనకేదో ఛాయిస్ ఉన్నట్టు! ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఏర్పరచే అవకాశం దగ్గర్లో వున్నపుడు యిలాటి శషభిషలతో ఛాన్సు వదులుకుంటారా?

బిజెపితో మిత్రవైరుధ్యం మాత్రమే నెరపుదామన్న ఉద్దేశంతో తెరాసకు వున్నా శత్రుత్వం రాకతప్పదు. ఇద్దరూ ఒకే చెరువులో ఒకే చేపలకోసం గేలాలు వేసుకుని కూర్చున్నారు. మెహబూబ్‌నగర్, పరకాల నియోజకవర్గాలలో పోటీ పడిన చరిత్ర వెక్కిరిస్తోంది. పైగా నాగం ఫ్యాక్టర్ ఒకటుంది. నాగం టిడిపిలో వున్న తన పరిచయస్తులను బిజెపిలోకి లాక్కుని రావచ్చు. కమ్యూనిస్టులకు తప్ప తక్కినవారికి బిజెపి మరీ అంత అంటరాని పార్టీ కాదు. ముస్లిం ఓటర్లు ఎక్కువగా వున్న నియోజకవర్గ నాయకులు మాత్రమే కొంత వెనకాడవచ్చు కానీ తక్కినవాళ్లకు బిజెపి ఓకేనే. పైగా కార్పోరేట్ మద్దతు వున్న బిజెపి వాళ్ల ఎన్నికల ఖర్చు కూడా భరిస్తాననవచ్చు. తెరాస కానీ, టిడిపి కానీ డబ్బున్న వాళ్లకే టిక్కెట్లు యివ్వబోతున్నట్లు కనబడుతోంది. డబ్బు లేక టిక్కెట్లు దక్కని సాధారణ తెలంగాణవాదులందరికి బిజెపి ద్వారములు తెరిచే వుంచుతుంది. కెసియార్ వ్యవహారశైలి అంటే భయమున్న నాయకులకు బిజెపిలో వాతావరణం ఆమోదయోగ్యంగా వుండవచ్చు.

టి-జాక్‌లో చేరడానికి తపించిన నాగం యిప్పుడు దాన్ని పట్టించుకోరేమో! ఇవాళ్టి మీటింగులో కనబడలేదు. జాక్‌లో వామపక్షవాదులు

ఎక్కువమంది వున్నారు. వాళ్లకు బిజెపి అంటే పడదు. జాక్‌లో వున్నంతకాలం మనం తెరాసకు పక్కవాయిద్యంగానే (సెకండ్ ఫిడిల్) మిగులుతామని నాగం బిజెపి నాయకులకు నచ్చచెప్పి, బయటకు తీసుకుని వచ్చేయవచ్చు. నాగం–కెసియార్ వాగ్యుద్ధం పెరుగుతూపోతే తెరాస–బిజెపిల మధ్య అగాధం మరింత లోతవుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 5.6 వీక్షికె** **ఎమ్బీయస్ : కులాంతర వివాహాల బూచితో ఓట్లవేట**

ప్రస్తుతం తమిళనాడులో వన్నియార్–దళిత కులాల పోరు సాగుతోంది. వన్నియార్ కులం వారు పెట్టుకున్న పిఎంకె పార్టీ నాయకులు హింసకు తలపడి, జైళ్లకు వెళ్లారు. '2016లో రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎడిఎంకె గెలవడం కష్టం – ప్రభుత్వ వ్యతిరేకత వుంటుంది కాబట్టి! డిఎంకె గెలవడం కష్టం – కరుణానిధి అనంతరం కుటుంబం చీలిపోతుంది కాబట్టి! ఈ రెండింటికి ప్రత్యామ్నాయంగా మనం ఎదగాలి.' అనే విధానంతో పిఎంకె అమలు చేస్తున్న పథకం యిది. దానికి అది ఎంచుకున్న మార్గం – దళితవ్యతిరేకత, కులాంతర వివాహవ్యతిరేకత !

వన్నియార్ కులం సామాజికంగా దళితుల కంటె కాస్త ఎక్కువ స్థాయిలో వున్న మోస్ట్ బ్యాక్‌వర్డ్ కాస్ట్ (ఎమ్‌బిసి) వర్గంలోకి వస్తారు. ఉత్తర తమిళనాడు జిల్లాలలో అధిక సంఖ్యలో వున్నారు. బ్రాహ్మణ వ్యతిరేకత అంటూ కులపరంగా పోరాటం చేసి రాజకీయాల్లోకి వచ్చి స్థిరపడిన ద్రవిడ పార్టీల నుండి స్ఫూర్తి పొందిన ఎస్.రామదాసు అనే నాయకుడు వన్నియార్ కులాల ఓట్లను సమీకృతం చేసేందుకు 1980లో 'వన్నియార్ సంఘం' స్థాపించారు. అప్పటిదాకా ఆ ఓట్లన్నీ డిఎంకెకు వెళ్లేవి. "మా జనాభాకు తగిన నిష్పత్తిలో మాకు రిజర్వేషన్ ఫలాలు దక్కలేదు. బిసిలలో వర్గీకరణ చేసి మాకు ప్రత్యేక రిజర్వేషన్ యివ్వండి." అనే నినాదంతో రామదాసు హింసాత్మక ఆందోళనలు చేసి డిఎంకె, ఎడిఎంకెలను వణికించారు. ఆ ఆందోళనలు ఎంత దుర్మార్గంగా సాగాయంటే 1987 సెప్టెంబరు లో వారికి ప్రాబల్యం వున్న జిల్లాలలో వేలాది చెట్లు నరికేసి హైవేలపై పడేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. దుకాణాలను దోచారు, వాహనదారులను , పాదచారులను కొట్టారు. పోలీసులు చర్య తీసుకోక తప్పలేదు. కాల్పుల్లో 18 మంది చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. 1989 అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించి, వన్నియార్ ఓట్లు వన్నియారేతరులకు వేయం అని బ్యానర్లు కట్టి ప్రదర్శించారు. పోటీ చేసే పార్టీల బ్యానర్లు చింపి పారేశారు.

ఇలా తొమ్మిదేళ్లపాటు ఆందోళనలు చేసి 1989లో చివరకు పాట్టాళి మక్కళ్ కచ్చి (శ్రామికజన పక్షం) – పిఎంకె అనే పేరుతో పార్టీ ఏర్పరచారు రామదాసు. ఈ మధ్య కెసియార్‌లాగానే ఆయనా తను కానీ తన కుటుంబసభ్యులు కానీ ఎన్నికలలో పోటీ చేయం, రాజకీయ పదవులు ఆశించం అంటూ ప్రకటించి పార్టీ అధ్యక్షుడిగా వేరేవాణ్ని పెట్టాడు. (తర్వాత 15 ఏళ్లకు, 2004లో డాక్టరుగా పనిచేస్తున్న తన కొడుకు అన్బుమణిని హఠాత్తుగా రాజకీయాల్లోకి తెచ్చి ఎన్నిక కూడా కాకుండానే కేంద్ర ఆరోగ్యమంత్రిగా చేశాడు) వన్నియార్లందరూ రామదాసు చెప్పిన వాళ్లకే ఓటేయసాగారు. వాళ్లకు సుమారు 16, 17 లక్షల ఓట్లు వుంటాయి. 1989 లోకసభ ఎన్నికల్లో పిఎంకె ఒక సీటు గెలిచింది. అది ప్రారంభం. 1991, 1996 అసెంబ్లీ ఎన్నికలల్లో పిఎంకెకు 3% ఓట్లు గుత్తగా పడుతున్నాయని తేలింది. 1950లలో డిఎంకె ఎలాటి లక్ష్యాలతో పోరాడిందో 40 ఏళ్ల తర్వాత పిఎంకె అంతకంటె తీవ్రమైన లక్ష్యాలతో పోరాడింది. తమకు బలం వున్న ఉత్తర తమిళనాడుని వేరే రాష్ట్రంగా ప్రకటించమంది. స్థానికులకే ఉద్యోగాలు యిమ్మనమంది. తమలాటి వెనకబడిన కులాలకు అన్యాయం జరుగుతోందని గగ్గోలు పెట్టింది. తమతో విభేదించినవారిని చావగొట్టి చెవులు మూసింది.

పిఎంకెను వన్నియార్లు ఆదరించడంతో ఉత్తర తమిళనాడు జిల్లాల్లో గట్టి దెబ్బ తగిలిన డిఎంకెకు వారిని మచ్చిక చేసుకోవడానికి ఎంబిసిలకు వేరే కోటా పెట్టింది. ఎన్నికలలో పొత్తు కుదుర్చుకుంది. వాళ్లను చూసి తర్వాతిసారి ఎడిఎంకె పెట్టుకుంది. స్థిరత్వం లేని పిఎంకె ఎప్పుడు ఏ కూటమిలో వుంటుందో ఎవరూ చెప్పలేరు. 1999లో ఎన్‌డిఏతో వుండి రెండు కేంద్రమంత్రి పదవులు పొందింది. 2004కి యుపిఏ వైపు మళ్లింది. మళ్లీ మంత్రి పదవులు. వారిలో ఒకరు తనయుడు అన్బుమణి. ఢిల్లీ ఎయిమ్స్‌లో ప్రఖ్యాత హృద్రోగ నిపుణుడు, తెలుగువాడు ఐన డా।। వేణుగోపాల్‌తో పేచీ పెట్టుకుని ఆయన్ను అవమానకరంగా పంపించివేసినది అన్బుమణియే. 2009 వచ్చేసరికి యుపిఏతో తెగతెంపులు చేసుకుని ఎన్‌డిఏవైపు వెళ్లింది పిఎంకె. ఆ పాచిక పారలేదు. ఎడిఎంకెతో పొత్తు పెట్టుకుని 7 చోట్ల పోటీ చేస్తే ఏడుచోట్లా ఓడిపోయింది. 2011 అసెంబ్లీ ఎన్నికలలో డిఎంకెతో కలిసి 30 సీట్లలో పోటీ చేస్తే 3 చోట్ల మాత్రం గెలిచింది. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో పార్టీ గుర్తింపు పోగొట్టుకుంది. ఎలాగైనా మళ్లీ ఎదగాలనీ, తనకంటూ ఒక పెద్ద ఓటు బ్యాంకు సృష్టించుకోవాలనే పట్టుదలతో వుంది ఆ పార్టీ. యుపిలో దళితులు ఆదరించే బహుజన సమాజ్ పార్టీకి, అగ్రకులస్తులు ఆదరించే బిజెపికి వ్యతిరేకంగా మధ్యకులస్తులను (బిసిలని వ్యవహరిస్తున్నారు) సమీకృతం చేసి విజయం సాధించిన ములాయంను ఆదర్శంగా తీసుకోదలచుకున్నాడు రామదాసు. మధ్యకులాల నన్నిటినీ ఒక కూటమిగా ఏర్పరచి, ఆ కులాలకు 20% రిజర్వేషన్ యిస్తామని మాట యిచ్చి, 2016 ఎసెంబ్లీ ఎన్నికల నాటికి ఆ కూటమి ద్వారా ఓ 50 సీట్లు తెచ్చుకోగలిగితే ప్రభుత్వాన్ని తన చెప్పుచేతల్లో వుంచుకోవచ్చని రామదాసు ఐడియా.

కొందరిని ఓ పక్కకు చేర్చాలంటే వాళ్లకు ఎవరో ఒకరిని బూచిగా చూపించాలి. సామాజికంగా యీ కులాలు దళితుల కంటె ఒక్క మెట్టు మాత్రమే పైన వుంటాయి కాబట్టి అగ్రవర్ణాల కంటె వీరికే దళితులపై వైరం ఎక్కువ. మనం కలిసి వుండకపోతే దళితులు

మనల్ని నాశనం చేసేస్తారని భయపెడుతూ రామదాసు యీ కులాలను ఏకీక ృతం చేస్తున్నాడు. నిజానికి అయిదారేళ్లపాటు – ములాయం, మాయావతితో చేతులు కలిపినట్లే – దళితులతో చేతులు కలిపి పోరాటాలు చేశాడు. కానీ దళిత–వన్నియార్‌ల మధ్య పొసగలేదు. 2012 నుండి ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది, ముఖ్యంగా ధర్మపురి జిల్లాలో. దళితులు 'విడుదలై చిరుతైగళ్ కచ్చి' (విసికె) పేర తిరుమావళవన్ నాయకత్వంలో ఒక పార్టీగా ఏర్పడి వన్నియార్లతో ఘర్షిస్తున్నారు. 2012 నవంబరులో ధర్మపురి జిల్లాలో నాయకన్‌కోట్టయ్ వద్ద మూడు దళిత కాలనీల్లో 238 యిళ్లను కాల్చివేశారు. దీనికి నేపథ్యం – ఒక కులాంతర వివాహం! దివ్య అనే 20 ఏళ్ల వన్నియార్ అమ్మాయి ఆ కాలనీల్లో ఒకదానిలో నివసించే ఇళవరసన్ అనే దళితయువకుణ్ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అది అవమానంగా భావించిన ఆమె తండ్రి నాగరాజన్ ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో వన్నియార్లు ఆ కాలనీని, అటూయిటూ వున్న కాలనీలను దండించారు.

అంతటితో ఆగలేదు. కులాంతర వివాహాలను ప్రతిఘటించడానికి రామదాసు 9 మధ్యకులాలతో "ఆల్ కమ్యూనిటీస్ ఫెడరేషన్" అనే సంఘం ఏర్పరచాడు. ఈ 'ఆల్..' లో దళితులూ లేరు, అగ్రవర్ణాలూ లేరు. తమ ఆడపిల్లల్ని దళిత యువకులు ప్రేమ పేరుతో మోసం చేసి, పెళ్లి చేసుకుని తమ కులాల పరువు తీస్తున్నారనే బాధతో కుమిలే కులాల ప్రతినిధులే వున్నారు. నిజానికి తమిళనాడులో కులాంతర వివాహాలు చాలా తక్కువని అమెరికాకు చెందిన ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ అధ్యయనంలో తేలింది. కేరళలో దళితేతర కులాంతర వివాహాలు 20% కాగా, తమిళనాడులో 1.3% ట! తమిళనాడులో 1000 వివాహాలు జరిగితే వాటిలో దళితులతో యితర కులస్తులు చేసుకునే వివాహాలు 12 మాత్రమేట! అయినా యీ ఫెడరేషన్ 2012లో చెన్నయ్‌లో ఏర్పరచిన సమావేశంలో వక్తలు "ఈ దళిత కుర్రాళ్లు జీన్స్‌వేసుకుని కూలింగ్ గ్లాసులు పెట్టుకుని, సెల్‌ఫోన్లు పట్టుకుని, మోటార్ సైకిళ్లపై తిరుగుతూ మన యిళ్లల్లో అమ్మాయిలను వలలో వేసుకుంటున్నారు. ఒక దళిత పార్టీ దీని వెనక్కాల వుండి ఒక పథకం ప్రకారం నడిపిస్తోంది. మేం కులాంతర వివాహాలకు వ్యతిరేకం కాదు కానీ మన కులస్తులను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు లాగడానికి ప్రేమ పేరిట జరిగే యీ నాటకాలకు వ్యతిరేకం. అమ్మాయిల పెళ్లి వయసును 18 నుండి 21 వరకు పెంచండి. అబ్బాయిలకు 23 చేయండి. దళితులపై అత్యాచార నిరోధానికి పెట్టిన చట్టం దుర్వినియోగం అవుతోంది. నాన్–బెయిలబుల్ కేసులు పెడుతున్నారు. వాటిల్లో బెయిలు యిచ్చేట్లా చట్టాన్ని మార్చాలి." అని డిమాండు చేశారు. 2013 జనవరిలో మధురైలో మరో సమావేశం పెట్టి అక్కడా యిలాగే మాట్లాడారు.

ఈ ఉపన్యాసాలతో ఆపకుండా ప్రత్యక్ష చర్యకు దిగాలని నిశ్చయించుకుని ఏప్రిల్ 25, చైత్రపౌర్ణమి నాడు మహాబలిపురం వద్ద వన్నియార్ యువోత్సవం ఏర్పాటు చేశారు. ఉత్తర తమిళనాడు, పాండిచ్చేరిల నుండి వన్నియార్ యువకులందరినీ వందలాది వాహనాల్లో కదలిరమ్మనమని పిలుపు నిచ్చారు. పాండిచ్చేరి నుండి మహాబలిపురం వచ్చే దారిలో హై వే కు కాస్త దూరంగా మరక్కణం కాలనీ అనే దళిత కాలనీ వుంది. 11 ఏళ్ల క్రితం 2002లో చైత్రపౌర్ణమి రోజునే ఆ కాలనీలో వన్నియార్ యువకులకు, దళితులకు కొట్లాటలు జరిగి ఇద్దరు వన్నియార్ కుర్రాళ్లు మరణించారు. ఇప్పుడు వేర్వేరు జిల్లాల నుండి వస్తున్న పిఎంకె కార్యకర్తలు మధ్యాహ్నవేళ హై వే కు పక్కగా యూకలిప్టస్ చెట్ల దగ్గర వాహనాలు ఆపి మందు కొట్టి భోజనానికి ఉపక్రమించారు. ఆ తర్వాత ఏం జరిగింది అన్నదానిపై వివిధ కథనాలు వినబడుతున్నాయి. 'వాహనాల వాళ్లు మా కాలనీకి చెందిన కుర్రాళ్లు మోటర్ సైకిళ్లపై వెళుతూ వుంటే డాష్ యిచ్చి పడేశారు. న్యాయం అడుగుదామని వెళితే పట్టుకుని కొట్టారు' అంటారు దళిత నాయకులు. ఇంకో కథనం ప్రకారం – మోటార్ సైకిలు యాక్సిడెంట్లు ఏమీ జరగలేదు కానీ ఆ చోటు చూడగానే 2002 నాటి సంఘటన గుర్తుకు వచ్చి వన్నియార్ యువకుల రక్తం ఉడుకెత్తి అటుగా వచ్చిన దళితయువకులపై బియర్ బాటిళ్లు విసిరారు. దాంతో గొడవ ప్రారంభమైంది.

ఏది ఏమైతేనేం, పిఎంకె కార్యకర్తలు మరక్కణం కాలనీపై పడి గుడిసెలపై పెట్రోలు బాంబులు విసిరారు. 9 గుడిసెలకు ఒక పశువుల దొడ్డికి నిప్పు పెట్టారు. వస్తువులు దోచారు, గుడిని ధ్వంసం చేశారు. "ఇదంతా ప్లాను ప్రకారమే జరిగింది, రోడ్డు మీద వెళ్లేవాళ్లకు మా కాలనీ కనబడదు. వేర్వేరు జిల్లాల నుండి వచ్చినవాళ్లకు ఫలానా చోట 2002లో గొడవ జరిగిందని ఎలా తెలుస్తుంది? నిజానికి రెండు మూడు రోజుల క్రితం వన్నియార్ కులస్తులు వచ్చి మా యిళ్లు అవీ చూసుకుని వెళ్లారు" అంటారు దళిత నాయకులు. తమ కాలనీపై దాడి జరగగానే దళితులంతా వెళ్లి హైవే పై బైఠాయించారు. వన్నియార్ కులస్తులను తెచ్చే వాహనాలన్నీ ఆగిపోయాయి. వాళ్లు చైత్రపౌర్ణమి ఉత్సవానికి వెళ్లలేకపోయారు. ఆ ఉక్రోషంతో వాళ్లు బళ్లు దిగి అక్కడున్న షాపులను, ప్రభుత్వ, ప్రయివేటు వాహనాలను ధ్వంసం చేశారు. టోలు బూతులను, సిసిటివి కెమెరాలను ధ్వంసం చేశారు. రాళ్లు విసిరారు. ఇదంతా చూసి పోలీసులు వస్తే వాళ్లమీద రాళ్లేశారు. వాళ్లు గాలిలో తుపాకులు కాలిస్తే కొంతమంది పిఎంకె నాయకులు గాయపడ్డారు.

వాళ్లు రాకుండానే మహాబలిపురంలో చైత్రపౌర్ణమి ఉత్సవం జరిగింది. వేదిక నుండి రామదాసు గర్జించారు – "మా వన్నియార్లను ఎవరూ ఆపలేరు. ప్రభుత్వం రాత్రి 10 గంటల వరకే అనుమతి యిచ్చింది. ఇప్పుడు 11.30 అయింది. నేను ఉపన్యసిస్తూనే వున్నాను. దమ్ముంటే కేసు పెట్టుకోండి' అని. దమ్మున్న ముఖ్యమంత్రి జయలలిత ఆయనను అరెస్టు చేయించింది – నియమాలు ఉల్లంఘించారంటూ. ఆ కేసులో మే 2 న బెయిల్ లభిస్తే, '2004 ఏప్రిల్ లో రజనీకాంత్ అభిమానులపై మీ సెక్యూరిటీవాళ్లు దాడి చేసిన కేసులో మిమ్మల్ని యిప్పుడు అరెస్టు చేస్తున్నామంటూ' తీసుకెళ్లి జైల్లో పెట్టారు. ఆయనతో బాటు పిఎంకె నాయకులు అనేకులను అరెస్టు చేశారు. ఈ అరెస్టుల కారణంగా పిఎంకె కార్యకర్తలు హింసను మరింత పెంచారు. ఏప్రిల్ 25 నుండి మే 6 లోగా, 500

పబ్లిక్, ప్రయివేటు బస్సులను నష్టపరచారు. 13టికి నిప్పుపెట్టారు. రేషన్ షాపులు, లిక్కరు షాపులు ధ్వంసం చేశారు. 160 చెట్లు కొట్టేశారు, 20 చింత చెట్లను కాల్చేశారు. ఓ రాజస్థానీ ట్రక్కు డ్రైవరును చావగొట్టేసి అతని చావుకు కారణమయ్యారు. మహాబలిపురంలో సముద్రపు ఒడ్డున్న వున్న గుడిని పాడుచేశారు. ఎడిఎంకె ఆఫీసులపై దాడి చేసి ఒక ఎమ్మెల్యే యింటికి వెళ్లి చావగొట్టారు. ఎందుకిదంతా అంటే 'ఏప్రిల్ 25 న మరక్కణం సంఘటన తర్వాత దళితులు కక్షతో వివేక్, సెల్వరాజ్ అనే యిద్దరు వన్నియార్ కుర్రవాళ్లను రోడ్డు మీద చంపేశారు. దానికి ప్రతీకారంగా యీ హింస ప్రజ్వరిల్లింది' అంటున్నారు రామదాసు, అన్బుమణి. 'వాళ్లిద్దరు గొడవల్లో కాదు రోడ్డు యాక్సిడెంట్లో పోయారు' అంటున్నారు పోలీసులు.

ఇంత ధన, ప్రాణ, మాన నష్టం జరిగితే 'మానవీయ దృక్పథంతో రామదాసును జైలు నుండి విడుదల చేయాల'ని కరుణానిధి జయలలితను కోరారు. రాజకీయాలకోసం పచ్చని చెట్లను నరికివేసే యీ దుర్మార్గుల పట్ల కరుణ చూపితే భూమాత మనల్ని క్షమిస్తుందా? తక్కిన రాజకీయ పక్షాలు కూడా రామదాసును విడుదల చేయాలని కోరాయి. ఇంత జాలి ఎందుకంటే – వన్నియార్‌లకు కోపం తెప్పిస్తే తమకు వాళ్ల ఓట్లు రావేమోనన్న భయం. కులాల పేరుతో ఓట్లు అడగనారంభిస్తే చివరకు యిటువంటి పరిణామాలే సంభవిస్తాయని పొరుగున్న వున్న మన తెలుగు నాయకులు చూసైనా నేర్చుకోవాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 7** **ఎమ్బీయస్ : ఈ రకం ఆత్మహత్యలు అస్సలొద్దు...**

ఎవరు ఆత్మహత్య చేసుకున్నా ఖండించవలసినదే. నయంకాని రోగబాధతో, వృద్ధాప్యంతో నెలలుగా బాధపడేవారు మరణాన్ని ఆహ్వానిస్తే అర్థం చేసుకోవచ్చు కానీ, ఆరోగ్యవంతులు చేతులారా ప్రాణం తీసుకోకూడదు. ఇటీవలి కాలంలో కనీవినీ ఎరుగని తీరులో తెలంగాణ పేరుతో ఆత్మహత్యలు జరగడం అందర్నీ నిర్ఘాంతపరుస్తోంది. తమ నాయకుణ్ని జైల్లో పెట్టారని ఆత్మహత్యలు చేసుకునే ఆవేశపరుల్ని తమిళనాడులోనే చూసేవాళ్లం. ఇప్పుడు మన తెలుగువాళ్లకు ఆ వ్యాధి అంటింది. గతంలో జరిగిన ఉద్యమాలలో కొందరు అసువులు బాసారు అంటే దాని అర్థం – పోలీసు కాల్పుల్లో పోయారని. ఇప్పుడు పోలీసుని కాకపోయినా ఉత్తుత్తి వాగ్దానాలు చేసి మాట తప్పిన నాయకుణ్ని ఎదిరించబోయి ప్రాణాలు పొగొట్టుకున్నా అదో పద్ధతిగా వుండేది. ఏమీ లేకుండా 'జై తెలంగాణ' అని ఓ కాగితమ్ముక్క మీద రాసేసి ఎండ్రిన్ తాగేయడం వింత ! తెలంగాణ రాదన్న నిరాశతో కొందరు చేసుకుంటే వస్తుందన్న ఆశతో మరి కొందరు చేసుకున్నారు. వీరిలో చాలామంది పోతూ పోతూ 'నా చావే ఆఖరి చావు కావాలి' అని రాసేసి చావడం 'వింతాతివింత' ! నీ చావు నీ చేతిలో వుంది కానీ ఇంకోడిది నీ చేతిలో లేదు. ఇకపై ఎవరూ యిలా చావకూడదు, చరిత్రలో నాదే ఆఖరి పుట కావాలి అని కోరుకోవడం అత్యాశ కదా. నాయకుల మాటలు విని ఆశలు ప్రలోభపడడం నీ ఒక్కడికే పరిమితం కాదు.

తెలంగాణ సిద్ధించాలని కోరుకుంటున్న నాయకులు యిలాటి ఆత్మహత్యలు వలదని చెప్తూనే వుంటారు. మళ్లీ అదే రాగంలో 'ఇంతమంది ఆత్మహత్యలు చేసుకున్నా..' అంటూ ఆత్మహత్యల్ని గ్లోరిఫై చేస్తారు. అందుకే యీ అనర్థం. మార్గరెట్ థాచర్ హైజాకర్ల గురించి 'వాళ్లకు ఆక్సిజన్ పబ్లిసిటీయే. దాన్ని బంద్ చేస్తే సరి.' అన్నారు. ఈ ఆత్మహత్యల్ని ఆపాలంటే వాటికి పబ్లిసిటీ యివ్వకపోవడం, అమరవీరులుగా కీర్తించకపోవడం – ఒక్కటే మార్గం. అది జరగకపోవడం వలననే తెలంగాణ పేర యింకా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. అవి ఎన్ని అనే వివాదం అప్రస్తుతం. ఉద్యమకారులు చెప్తున్న వెయ్యి (యీ మధ్య ఎవరో కానీ 10% బోనస్ కలిపి 1100 అన్నారు) కాకపోవచ్చు, ఉద్యమవ్యతిరేకులు చెప్తున్నట్లు సున్నా కూడ కాకపోవచ్చు. అసలు అంకె ఆ మధ్యలో ఎక్కడో వుండవచ్చు. నేననేది – ఆ అంకె ఒక్కటే అయినా దాన్నీ తలచుకుని మనం బాధపడవలసినదే అని. నవమాసాలు కని ప్రసవించిన తల్లికి, పోషించిన తండ్రికి ఎంతటి గర్భశోకం ! తలచుకుంటేనే మనకు కళ్లలో నీళ్లు కారతాయి.

ఈ రకమైన ఆత్మహత్యల పట్ల బాధపడుతూంటే నిన్న మరో రకమైన ఆత్మహత్య జరిగింది. ఇది తెలంగాణ యివ్వలేదన్న నిరాశతో చేసుకున్నది కాదు, తెలంగాణ వచ్చినా నాకేం లాభం అన్న నిరాశతో చేసుకున్నది. ఉద్యమంలో పాల్గొంటే తనకు గుర్తింపు వస్తుందని, తెరాసలో పదవి దక్కుతుందని ఆశపడిన యువకుడు ఆ కోరిక నెరవేరే మార్గం కనబడకపోవడంతో తనను తానే చంపుకున్నాడు. ఉద్యమంలో పాల్గొన్నవారందరూ తమను తాము త్యాగమూర్తులుగా చెప్పుకుంటారు. పదవుల కోసం కాకుండా, ప్రజల అభీష్టం మేరకు లక్ష్యం కోసం పోరాడుతున్నామని చాటుకుంటారు. పార్టీలు మారేవారందరూ యిలాటి కబుర్లు చెప్పడం మామూలే. మాకు ఏ పదవులూ వద్దు, తెలంగాణ సిద్ధిస్తే చాలు అంటారు. కానీ పార్టీలో చేర్చుకుంటూ కెసియార్‌గారు 'వారిని ఖాళీగా ఎలా కూర్చోబెడతాం? పార్లమెంటుకి పంపిద్దాం, అసెంబ్లీకి పంపిద్దాం, తెలంగాణ వాణి వినిపించేట్లా చేదాం' అంటారు. అంతకుముందు నుండి యిక్కడ వేళ్లాడుతున్న వారి గొంతు నచ్చడం మానేసిందేమో! కానీ వాళ్లకు అది అర్థం కావటం లేదు. నిరాశ పడుతున్నారు. తెరాసలో కొత్తనీరు వచ్చి పాతనీరును కొట్టేయడంతో వచ్చే సమస్యలివి. మానసిక వేదనతో ఆగి వుంటే బాగుండేది. శారీరకంగా హింసించుకోవడం బాధాకరం.

ఇప్పుడు ఆత్మహత్య చేసుకున్న గుండా నాగరాజు 30 ఏళ్ల బ్రహ్మచారి. తెరాస ఆవిర్భావం నుండి మంథనిలో చురుగ్గా పనిచేస్తున్నాట్ట. ప్రస్తుతం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, యువజనవిభాగం జిల్లా నేతట. 2009లో కెసియార్ ఆమరణ నిరాహారదీక్ష చేసినపుడు

మంథని పోలీసు స్టాఫ్ క్వార్టర్స్ పైకి ఎక్కి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. పరిస్థితి ముదిరాక డిసెంబరు 8 న టెలిఫోన్ ఎక్స్‌ఛేంజ్ టవర్ ఎక్కబోయాడు. సకల జనుల సమ్మె సందర్భంగా చేసిన అదావుడికి 20 కేసుల దాకా అతనిపై నమోదై వున్నాయి. వీటితో తెరాసలో యింకా పెద్ద పదవి దక్కుతుందని ఆశపడ్డాడు పాపం. కానీ యిటీవల నియోజకవర్గ ప్రతినిధిగా రాంరెడ్డి చేరడంతో అతన్ని పట్టించుకోవడం మానేశారు. రాంరెడ్డి కుమారుడు సునీల్ రెడ్డి యువజనవిభాగం రాష్ట్ర కార్యదర్శి. ఇద్దరూ అతన్ని పక్కకు పడేశారు. వైకాపా నాయకుణ్ని తెరాసలో చేర్చే ప్రయత్నాలను నాగరాజు అడ్డుకోవడం వలననే విభేదాలు వచ్చాయని ''ఈనాడు'' రాసింది. ఏది ఏమైనా యితను తనకి అన్యాయం జరిగిందని ఫీలై పెద్ద నాయకులకు ఫిర్యాదులు మొదలు పెట్టాడు. కవితతో చెప్పాడట. కెసియార్‌తో చెప్దామని చూస్తే వేదిక ఎక్కనీయలేదట. ఇక యిలాక్కాదని మంథనిలో కార్యకర్తల శిక్షణా శిబిరానికి ఎండ్రిన్ సీసా తెచ్చుకుని వచ్చేశాడు. కెసియార్‌ని కలిసి మాట్లాడదామంటే దగ్గరకు రానీయలేదు. దాంతో అది తాగేసి జై తెలంగాణ నినాదాలు చేస్తూ ప్రాంగణమంతా తిరిగి అపస్మారకస్థితిలోకి జారుకున్నాడు. ఆసుపత్రికి తీసుకుని వెళుతూంటే మరణించాడు. ఇది తెరాస నాయకులకు షాక్ యిచ్చింది. చాలామంది పరామర్శకు వెళ్లారు. వెళ్లినవాళ్లలో కెసియార్, కుటుంబసభ్యులు లేరు. తెరాసేతర నాయకులందరికీ దీనిలో మంచి అవకాశం కనబడింది. అంత్యక్రియలు పెద్ద సంఖ్యలో హాజరై అతన్ని శవాన్ని చూసి వచ్చారు. మంథని బంద్‌కు పిలుపు నిచ్చారు. 'కార్యకర్తల కాలికి ముల్లు గుచ్చుకుంటే పంటితో తీస్తాన'ని అన్న కెసియార్ పలకరింపుకి కూడా రాలేదని తీవ్రంగా విమర్శించారు.

ఈ విధంగా నాగరాజు చావు రాజకీయప్రయోజనాలకు ఉపయోగపడింది. తెరాసలో డబ్బు సంచులకే తప్ప కార్యకర్తలకు చోటు లేదని ఎర్రబెల్లి విమర్శించడానికి పనికి వచ్చింది. ఒక ప్రాణం ఖరీదు యింతేనా? అని ఆత్మహత్య చేసుకోబోయేవారు ఎవరికి వారు ప్రశ్న వేసుకోవాలి. నాయకులు ఎన్నో కబుర్లు చెప్తారు. జెండా మోస్తే అందలం ఎక్కిస్తామని కార్యకర్తలకు చెప్తారు. ఇక ఓటర్లకు చేసే వాగ్దానాలు అన్నీ యిన్నీ కావు. ఈ మధ్య పగటికలల వ్యాపారంలో కెసియార్ చంద్రబాబుతో పోటీ పడుతున్నారు. తాజా హామీ – తెలంగాణ వస్తే పేదలందరికీ టూ బిఎచ్‌కె యిళ్లట! ఆ హామీ నమ్మేసి ఎవరైనా వున్న గుడిసె కూల్చేసుకుంటే అంతకంటె అజ్ఞాని వుండడు. అదే విధంగా రాబోయే తెలంగాణ బంగరు తెలంగాణ అనే ఆశతో యీ రోజు జీవితాన్ని బుగ్గి చేసుకోవడం కంటె బుద్ధిహీనత లేదు.

నాయకులు చివరకు ఎవర్ని అందలం ఎక్కిద్దామనుకుంటే వారినే ఎక్కిస్తారు. మొదటినుండీ వున్నవారు బోయీల గానే మిగులుతారు. ఈ పరిస్థితికి ఒడంబడితేనే పార్టీ కార్యకర్తలుగా చేరాలి. లేకపోతే ఆ పార్టీకి సానుభూతిపరుడిగా వుంటే ఎన్నికల వేళ ఓటు వేసి వూరుకోవాలి. తెరాస అనే కాదు, ఏ పార్టీ అయినా యిదే కథ. రాకెట్‌ను పైకి పంపించాలంటే యింధనం కావాలి కదా. ఆ యింధనమే కార్యకర్తలు. వారు హరించిపోతే తప్ప రాకెట్ పైకి లేవదు. ఆ రాకెట్‌లో వుండేది హై ప్రొఫైల్ మనుష్యులు. వాళ్లు డబ్బుతో, పలుకుబడితో ఆ స్థానం కొనుక్కుంటారు. కార్యకర్తలు డబ్బులకు, అన్నపానాలకు ఆశించవచ్చు తప్పు లేదు. దక్కుతాయి. కానీ ఏకంగా పదవులకై ఆశపడడం తప్పు. ఆట్టే మాట్లాడితే ఘోరం. ఇంకా ఎవరైనా నాగరాజులుంటే వారందరూ తమ స్థాయిని గుర్తెరిగి పురుగుల మందు డబ్బాలకు దూరంగా వుండండి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 12** **ఎమ్బీయస్ : నమో నామజపం**

ఆడ్వానీ గురించి రాస్తూ నేను మోదీ గురించి చేసిన వ్యాఖ్యలు కొందర్ని నొప్పించాయి. నాకు తెలుసు – నెటిజన్లలో చాలామంది న.మో. నామజపం చేస్తున్నారనీ, ఈ దేశం ఉద్ధరించబడాలంటే మోదీ అధికారంలోకి వచ్చి తీరాలని గాఢంగా నమ్ముతున్నారనీ! అటువంటి వారి సంఖ్య లక్షల్లో వున్నా నా అభిప్రాయాలు, నా అనుమానాలు వెల్లడించడానికి నేను సంకోచించను. మోదీ భక్తులు అతన్ని రాహుల్‌తో పోల్చి, ఆడ్వానీతో పోల్చి చూడండి ఎంత గొప్పవాడో అనేస్తారు. అసలు అందరికీ రాహుల్ అనే మొద్దబ్బాయి ఒకడు దొరికాడు. అరవింద్ కేజ్రీవాల్ అనుయాయులు కూడా రాహుల్ వెర్సస్ అరవింద్ అంటూ ఓ లిస్టు రాసి ఫార్వార్డ్స్ పంపుతారు. రాహుల్ తనను తాను ప్రధానిగా యింక చూపుకోలేదు. కనీసం కేంద్రమంత్రి పదవియైనా ఆశించలేదు. పార్టీ నిర్మాణానికి అంకితమవుతున్నాడు. సోనియా ఆరోగ్యం క్షీణిస్తోంది కాబట్టి ఆమె స్థానంలో కింగ్ మేకర్‌గా అవుదామన్న కోరిక వుందేమో. మన్‌మోహన్ వంటి మరొక నోరులేని బుద్ధిజీవిని గద్దెపై కూర్చోబెట్టి చక్రం తిప్పుదామని చూస్తున్నాడేమో! కాలమే సమాధానం చెప్పాలి. ఈ లోగా అతన్ని ప్రధాని అభ్యర్థిగా మనమే ఊహించేసుకుని మోదీతో, అరవింద్‌తో, నితిన్‌తో.. మరొకరితో పోల్చి చూడవలసిన అవసరం లేదు. ఇక ఆడ్వానీ వెర్సస్ మోదీ విషయంలో వయసు విషయం తరచుగా తెస్తున్నారు. ఆడ్వానీ, మోదీ యిద్దరూ సీనియర్ సిటిజన్లే. ఆడ్వానీ మరీ ముసలి అయినా అన్ని ఫ్యాకల్టీలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. దేశానికి యువనాయకత్వం కావాలి అనే నినాదమే చేపడితే రాహుల్ కూడా పనికి రాడు. 35 ఏళ్లు దాటినవాణ్ని యువకుడని ఎలా అంటాం? మధ్యవయస్కుడే అవుతాడు.

మోదీ నియంత అని నేను రాసినది ఒప్పుకుంటూనే కొందరు 'అవును మాకు నియంతే కావాలి, యీ దేశాన్ని ఓ దారిలో పెట్టాలంటే నియంతే కావాలి' అంటూ రాశారు. నిజం చెప్పాలంటే మనలో ప్రతీ ఒక్కరికీ నియంత కావాలనే కోరిక అంతర్గతంగా

వుంటుంది. జానపదకథల్లో రాజుగారిలా ధర్మగంట వేళ్లాడకట్టి, అప్పటికప్పుడు తీర్పులు చెప్పేసి, తప్పు చేసినవాడి తల ఎగరగొట్టేసి, అమాయకుడికి బంగారు నాణాల మూట యిచ్చేద్దామనే కల వుంటుంది. కారులో వెళుతూంటే అడ్డం వచ్చిన ప్రతీ పాదచారినీ తుపాకీతో కాల్చేద్దామనీ, నడిచి వెళుతూంటే బురద చిమ్ముతూ వెళ్లిన కారు వాడి టైర్లు పేల్చేద్దామనీ, మనం క్యూలో నిల్చుంటే పక్కనుండి వచ్చి దూరేవాడి చేతులు విరిచేయాలనీ, మన రిజర్వ్‌డ్ బెర్త్‌లో ప్లీజ్ అంటూ వచ్చి కూర్చున్న ఆర్డినరీ టిక్కెట్టుగాణ్ని రైలు కిందకు తోసేయాలనీ – యిలా ఎన్నో కోరికలు. ఇలా చేసినా శిక్ష పడదని ప్రభుత్వం ఒక్కమాట అననివ్వండి, రాత్రికి రాత్రి దేశజనాభా పదోవంతుకి తగ్గిపోతుంది. ప్రతీవాడూ తనకు న్యాయం అనుకున్నది చేసేస్తాడు. మనలో వుండే యీ నిగూఢకాంక్షే నియంతలను ఆరాధించేట్లు చేస్తుంది. నేను నియంతల గురించి చాలాకాలం క్రితం సీరీస్ రాశాను. ముస్సోలినీ, హిట్లర్, స్టాలిన్, మావోల గురించి నేను రాసినవి ఆర్కయివ్స్‌లో వున్నాయో లేదో తెలియదు కానీ ఉంటే ఓ సారి చదవండి. ఎటువంటి వాతావరణంలో నియంతలు ఉద్భవించి ఎదుగుతారో మీకు అర్థమవుతుంది.

ప్రస్తుతం మన దేశంలో అటువంటి పరిస్థితులే వున్నాయి. అవినీతి విపరీతంగా పెరిగిపోయింది. ప్రధాని కార్యాలయానికే మసి అంటింది. శిక్షలు పడటం లేదు. లక్షల కోట్లు స్వాహా అయిపోతున్నాయి. ధరలు పెరిగిపోతున్నాయి, రూపాయి విలువ పడిపోతోంది. రాజకీయనాయకులందరికీ తమ పదవి తప్ప ప్రజల విషయం పట్టటం లేదు. ఇలాటి సమయంలోనే ప్రజలు 'మనకు డెమోక్రసీ పనికి రాదండి, ఓ పక్క మమతా బెనర్జీ అటు లాగుతుంది, మరో పక్క కరుణానిధి యిటు లాగుతాడు, మధ్యలో ములాయం మరోటంటాడు. వీళ్లను సముదాయించడానికే ఎక్కడి సమయమూ చాలటం లేదు. ఇంకేం పాలిస్తారు? మనకు సైనిక పాలన రావాలి. నోరెత్తితే కాల్చి పారేయడమే. ఆస్తంతా ప్రభుత్వానికి తరలించేసి మనలాటి వాళ్ల మీద పన్నులు ఎత్తిపడేయాలి' అని బస్‌స్టాపుల్లో, కాంటీన్లో ఆవేశంగా వాదిస్తూ వుంటారు. పాకిస్తాన్‌లో యిలాటి సందర్భాలు వచ్చాయి. ప్రజలు కోరుకున్నట్టు సైనిక పాలన వచ్చింది. మొదట్లో నాలుగు నెలలు వీళ్లు అనుకున్నట్టుగానే డిసిప్లిన్ వస్తుంది. తర్వాత? సైనికపాలకులు రాజకీయనాయకుల స్థానాన్ని ఆక్రమిస్తారు. అదే అవినీతి, అదే అసమర్థపాలన. గతంలో తప్పు జరిగితే పత్రికల్లో, ప్రజల్లో నిరసించగలిగేవి. ఇప్పుడు తీసుకెళ్లి జైల్లో పెట్టడం. ఎప్పుడో ఓ అర్ధరాత్రి ఉరి తీసేయడం. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అనేక ఆఫ్రికన్ దేశాలు, లాటిన్ అమెరికన్ దేశాలు... ఎక్కడైనా చూడండి, సైనిక తిరుగుబాటు ద్వారా అధికారంలోకి వచ్చినవారు ఎలా పాలించారో గమనించండి.

'ఎన్నయినా చెప్పండి, మనకు గట్టివాడు ఒకడు కావాలండి.' అంటారు మీలో చాలామంది. నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే నేనూ గతంలో అలా అనుకున్నవాణ్నే. నా చిన్నపుడు మా నాన్న, ఆయన ఫ్రెండ్స్ కాంగ్రెస్‌లోని సంజీవరెడ్డి వర్గం, బ్రహ్మానందరెడ్డి వర్గం గురించి హాట్‌హాట్‌గా వాదించుకుంటూ వుంటే విని కాంగ్రెసు రాజకీయాల పట్ల అసహ్యం పెంచుకున్నవాణ్ని. అందుకే పాత కాంగ్రెసువాదులైన మొరార్జీ దేశాయి, అతుల్య ఘోష్, ఎస్ కె పాటిల్, కామరాజ్, సంజీవరెడ్డి వంటి వాళ్లని చిత్తు చేసి ఇందిరా గాంధీ తరిమి కొడితే కేరింతలు కొట్టాను. 1971 నాటికి ఓటుహక్కు లేకపోయింది కానీ వుంటే ఇందిరకే ఓటు వేసేవాణ్ని. ఎందుకంటే ఎన్నో ప్రజాకర్షక, సోషలిస్టు పథకాలను అమలు చేసింది. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు.. వగైరా. పాకిస్తాన్‌ను రెండుగా విడగొట్టింది. అప్పటిదాకా వర్గాలుగా విడిపోయి కొట్టుకున్న నాయకులందరినీ తొక్కి పారేసినందుకు తెగ ఆనందించి 'ఇలాటి నియంత వుండాలి మన దేశానికి' అని మురిసిపోయాను. తర్వాత కొన్నాళ్లకు అర్థమైంది అదెంత పొరబాటో. తనకు, తన కుటుంబానికి భవిష్యత్తులో కూడా ఎవరూ పోటీ రాకూడదని ఆమె దేశం మొత్తం మీద నాయకుడన్నవాణ్ని లేకుండా చేసింది. రాష్ట్రాల్లో ఎవరైనా బలపడుతూంటే చాలు, తీసి పారేసి ఎవరో అనామకుణ్ని తీసుకుని వచ్చి గద్దె మీద కూర్చోపెట్టేది. 1970కు ముందు ఎందరో జాతీయనాయకులు వుండేవారు. ఈ రోజు దేశమంతా తెలిసిన నాయకుడు ఎవరూ లేకుండా చేశారు. ఎంతసేపూ ఇందిర వారసుల చుట్టూనే తిరగాల్సిన ఖర్మ మనకు పట్టింది. ఎందుకంటే మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు లీడరు కేరళ వాళ్లకు తెలియదు, కేరళ కాంగ్రెసు లీడరు హర్యాణాలో తెలియదు.

ఇదొక్కటే కాదు, ఇందిర నియంత ృత్వాన్ని రుచి చూపించి పుణ్యం కట్టుకుంది. ఎన్నికలలో అక్రమాలకు పాల్పడి, కోర్టులో ఓడిపోతే, తీర్పు అమలు కాకుండా ఎమర్జన్సీ విధించి, ప్రతిపక్ష నాయకులందరినీ జైల్లో కుక్కి, వాక్‌స్వాతంత్ర్యం హరించి, పత్రిక నోళ్లు నొక్కి, ప్రజాస్వామ్యాన్ని నేలరాసింది. 1975లో ఎమర్జన్సీ విధించేనాటికి నేను ఉద్యోగంలో వున్నాను. ఎంత అన్యాయమైన పాలన నడిచిందో పూర్తిగా తెలుసుకున్నాను. అప్పటితో నియంతృత్వం పట్ల నాకు భ్రమలు తొలగిపోయాయి. ఇందిరలో ప్రజాస్వామ్యవాది ఐన నెహ్రూ రక్తం ప్రవహించింది కాబట్టి తనే ఎమర్జన్సీ ఎత్తేసి ఎన్నికలు పెట్టింది కాబట్టి భారతదేశం బతికిపోయింది కానీ లేకపోతే మరో పాకిస్తాన్ అయి వుండేది. ప్రజాస్వామ్యంలో ఎన్నో లోపాలున్నాయి. కానీ వున్న సిస్టమ్స్‌లో అదే బెస్టు. ప్రజాస్వామ్యంలో ప్రజల బాధ్యత ఎక్కువగా వుంటుంది. నాయకులు తప్పుదారి పడుతూ వుంటే వాళ్లని ఎదిరించి సరిదిద్దవలసిన బాధ్యత ప్రజలదే. ఆ మేరకు వాళ్లకు హక్కులు వున్నాయి. అది విస్మరించి, ప్రభుత్వమే అన్నీ చేయాలని ఆశించిన ప్రజలు విమర్శించే హక్కు కోల్పోతారు.

నాయకుడిలో వుండవలసిన లక్షణం – పదిమందినీ కలుపుకుని పోవడం. విమర్శలు పట్టించుకోవడం, రాజకీయ ప్రత్యర్థులను గౌరవించి వారి సలహా వినడం, అందరి మాటా విని చివరకు తన వివేకాన్ని ఉపయోగించి ప్రవర్తించడం. తప్పు జరిగిందని గ్రహించినపుడు సరిదిద్దుకోవడం. నాయకుడు ఎదిగిన కొద్దీ వినయం పెరగాలి. మోదీలో యీ లక్షణాలు లేవు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా 'ఐ డోంట్ కేర్' అని అహాన్ని ప్రదర్శించడమే అతనికి వచ్చు. తన నియామకంపై యింత రగడ జరుగుతున్నపుడు

కాస్త ఓపిక పట్టి, గొడవ చల్లారాక తరువాతి అడుగు వేయవచ్చు కదా. అబ్బే, వెంటనే యుపికి యిన్‌చార్జిగా తన మనిషిని అర్జంటుగా నియమించాడు. అది కూడా ఎవరు? అత్యంత వివాదాస్పదుడైన అమిత్ షా! ముస్లిం జనాభా అత్యధికంగా వున్న యుపిలో అమిత్ షా పేరు మైనారిటీల్లో ఎంత ఆగ్రహాన్ని రగిలిస్తుందో మోదీ ఊహించలేడా? గలడు. అతనికి అదే కావాలి. ప్రతిపక్షులకు నచ్చచెప్పి కలదీసుకుపోవడం అతని పద్ధతి కాదు. నా మాట వినకపోతే మిమ్మల్ని నాశనం చేస్తాను జాగ్రత్త అని బెదిరించి 'వీడురా మొనగాడు' అని తీవ్రహిందూవాదుల మెప్పు పొందడమే అతని లక్ష్యం. అయితే దేశంలో తీవ్రహిందూవాదులు ఎంతమంది వున్నారన్నదే ప్రశ్న!

ఊహించినట్టుగానే మొదటిభాగం చదివి చాలా మంది మెయిల్స్ రాశారు. మెచ్చుకున్నవారికి ధన్యవాదాలు. విమర్శించినవారు ఎత్తి చూపిన అంశాల గురించి ప్రస్తావిస్తాను. చాలామంది విసుక్కున్నదేమిటంటే – 'ఇప్పుడున్న ప్రభుత్వం అధ్వాన్నంగా వుంది. మన్‌మోహన్ అన్ని విధాలా విఫలమయ్యాడు. దేశంలో నాయకుడన్నవాడు కనబడటం లేదు. ఏదో యీ మోదీ ఒకడు ఉద్ధరిస్తాడనుకుంటే మీరు అతనిలో సొట్టలు చెప్తారేమిటి? ఇలా అయితే ఎవడికి ఓటేయాలని మీ ఉద్దేశం?' అని.

నా సమాధానం ఏమిటంటే – అవును, యుపిఏ 2 పాలన ఏమీ బాగా లేదు. మన్‌మోహన్ పూర్తిగా నిరాశపరచారు. సోనియా చెప్తే మాత్రం, యింత అవినీతి అనుమతించడమా? అంతకంటె నా వల్లకాదు అని మర్యాదగా దిగిపోయి వుంటే గౌరవమైనా మిగిలేది. యుపిఏ 3 ఏర్పడుతుందో లేదో నాకూ తెలియదు. ఏర్పడి తీరాలన్న కోరికా లేదు. మూడో ఫ్రంట్, యిప్పుడు కొత్తగా వినబడుతున్న నాలుగో ఫ్రంట్ అధికారంలోకి వస్తాయో రావో నాకు తెలియదు. వీటికి ప్రత్యామ్నాయంగా ఎన్‌డిఏ అధికారంలోకి వస్తుందని గట్టిగా చెప్పలేను. దానికి చోదకంగా వుండే బిజెపికి – మోదీ నాయకత్వం వున్నా సరే – స్వయంగా 150 కంటె మించి వస్తాయనీ చెప్పలేను. 150 సీట్లు వచ్చినా ఎన్‌డిఏ ఏర్పడుతుందో లేదో కూడా చెప్పలేను. మోదీ మొహం చూసి తక్కినవాళ్లు పారిపోతారో, ప్రత్యామ్నాయం లేక ఖర్మ, ఖర్మ అంటూ అంగీకరిస్తారేమో కూడా తెలియదు.

ఎవరు అధికారంలోకి రావాలో నిర్ణయించేది నేను కాదు, దేశప్రజలు! మీరూ, నేనూ వారిలో భాగమే. ఓటరుగా అప్పటి పరిస్థితులు బట్టి మీరు కానీ, నేను కానీ ఓటేస్తాం. అది విజేతకు ఉపయోగపడుతుందో, పరాజితుడికి వుపయోగపడుతుందో దాని గురించి మనం పట్టించుకోనక్కరలేదు. మన అభిమతాన్ని ఓటు ద్వారా తెలుపుతున్నామంతే! (హిందీలో ఓటును మత్ అంటారు) ఎవరికి ఓటేయాలో, మానాలో చెప్పవలసినది నేను కాదు. భగవంతుడు మీకు ఆలోచన, వివేచన, విచక్షణ యిచ్చాడు. మీకు మరింత సమాచారాన్ని సేకరించి యిచ్చి, మీలో ఆలోచన రగిలించడమే నా పని. ఆ పైన మీ వివేకాన్ని మీరు ఉపయోగించాలి.

మీకు ఓటేయడానికి ఎవరూ దొరకలేదు కదాని, ప్రధానిగా కలలు కనడానికి ఎవరూ దొరకలేదు కదాని ఎదురుగా ఉన్న కాండిడేటును ఇంద్రుడు, చంద్రుడు అని వర్ణించడం నా తరం కాదు. 'మీరు చాలా దూరం వెళ్లాలి, మోటారు సైకిలు వుంటే మంచిదే, కానీ మీ ఎదురుగా వున్నది సైకిలు మాత్రమే, బ్రేకులు కూడా లేవు, అది మోటార్ సైకిల్నని మిమ్మల్ని బుకాయిస్తోంది, మోసపోకండి' అని చెప్పడం వరకే నా బాధ్యతగా భావిస్తాను. సైకిలు కుండే సుగుణాలు సైకిలు కున్నాయని కూడా చెప్తాను. భ్రమలు పెట్టుకోకుండా కళ్లు తెరుచుకుని వ్యవహరించండి అనే నా సలహా. ఇంతకు మించిన అజెండా నాకు లేదు. కొందరు నేను సూడో సెక్యులరిస్టునని, బిజెపి వ్యతిరేకినని, సొంత అజెండాతో తక్కిన పార్టీలను గొప్పగా చూపించడానికి మోదీని హీనంగా చూపిస్తున్నాననీ ఆరోపించారు. కొందరి లెక్క ప్రకారం నాకు జగన్ నుండి డబ్బు ముడుతోంది, వీళ్ల లెక్క ప్రకారం నాకు థర్డ్ ఫ్రంట్ నుండి, కాంగ్రెసు నుండి కూడా డబ్బు ముడుతోంది. ఈ ఆరోపణలు బాధాకరమే ఐనా, నాకు ఒకందుకు కిక్ వస్తోంది. పార్టీలు డబ్బు ఆశ చూపి వాళ్లకు అనుగుణంగా రాయించుకునే స్థాయి నాకుంది – వీళ్ల ద ృష్టిలో! నా రాతలు ప్రజాభిప్రాయాన్ని మార్చివేయగల శక్తి కలవన్నమాట! వార్నీ!

నేను ఆడ్వానీకి అనుకూలంగా రాసిన వాక్యాలు కూడా ఈ మోదీ అభిమానులు హర్షించలేదు. ఆడ్వానీ కూడా బిజెపి లీడరేగా, మొన్నటిదాకా మోదీకి గురువే కదా. బిజెపి యీ స్థితికి రావడానికి కారకుడేగా! అయినా వీళ్ల ద ృష్టిలో ఆయన భ్రష్టుడై పోయాడు. ఎందుకు? మోదీ ప్రధాని కావడానికి అడ్డు పడుతున్నాడు కాబట్టి! మోదీని కాదన్నవాడికి శాపనార్థాలు పెట్టేటంత మూఢభక్తి అనవసరం. వాడిని వెంటనే సూడో సెక్యులర్, ముస్లిం పక్షపాతి, హైందవద్రోహి అనడం శుద్ధఅనవసరం. వైయస్ తిరుపతిలో చర్చిలు పెట్టినపుడు ఏం చేశావ్, ఘజనీ మొహమ్మద్ సోమనాథ్‌ను కూల్చినపుడు ఏం చేశావ్ వంటి ప్రశ్నలు వేయడం హాస్యాస్పదం. మోదీకి ప్రధాని అయ్యే ఛాన్సు వుందా లేదా అన్న పొలిటికల్ పాయింటే నేను చర్చిస్తున్నాను. చర్చ అక్కడికే పరిమితం కావాలి. మోదీ వంటి వాడు వస్తేనే కానీ మైనారిటీలకు బుద్ధి రాదు, చైనాకు గగుర్పాటు కలగదు, పాకిస్తాన్ ఉలిక్కి పడదు – వంటి ఆశలను వ్యక్తం చేసే వేదిక కాదిది. మోదీ రావాలి, రావాలి అని మీరు వెయ్యి సార్లు అనుకోవచ్చు, రాకూడదు, రాకూడదు అని లక్షసార్లు మరొకరు అనుకోవచ్చు. నాకు దానితో పని లేదు. మోదీకి ఛాన్సుందా లేదా? అనేదే నా ఎదురుగా వున్న ప్రశ్న.

మోదీ స్వభావాన్ని విశ్లేషిస్తూ నేను 'నియంత' అనడం పలు రకాల స్పందనలను తెచ్చింది. అవును, నియంతే. మాకు నియంతే కావాలి. ఆ మాటకొస్తే ప్రతీ యింట్లో కూడా నాన్న నియంతగానే ప్రవర్తిస్తాడు అంటూ కొందరు రాశారు. నాన్నలు నియంతలుగా వుండే కాలం చెల్లిపోయింది. ఇప్పుడు నాన్నలు పిల్లలకు భయపడుతున్నారని గ్రహించాలి. జన్మనిచ్చి, పోషించే తలిదండ్రుల పెత్తనమే సహించలేని తరం యిది. రాజకీయంగా నియంతృత్వం చేస్తాం అంటే ఎన్నాళ్లు సాగుతుంది? మరి కొందరు 'హిట్లర్, ముస్సోలినీలతో ఎలా పోల్చారు? మనది ప్రజాస్వామ్యం కదా' అంటూ వాదించారు. హిట్లర్, ముస్సోలినీలు ప్రజాస్వామ్యంలో నుండే ఉద్భవించారు.

ఇప్పుడు సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వామ్య పక్షాలు కొట్టుకుంటూ బలహీనపడినట్లే అప్పట్లో ప్రజాస్వామ్య పక్షాలు అంతఃకలహాలతో ప్రజల్ని విసిగిస్తే వాళ్లను ఆకర్షణీయమైన వాగ్దానాలతో ముస్సోలినీ, హిట్లర్‌లు ఆకర్షించారు. క్రమేపీ నియంతలయ్యారు. రాత్రికి రాత్రి కాలేదు. అందుకే అప్పటి చరిత్ర తెలుసుకుని రాయమన్నాను. వీళ్లకు ఆ ఓపిక లేకపోయింది.

ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వం నడపడం అసాధ్యం కాదని ఇందిరా గాంధీ నిరూపించింది. అసలు ప్రజాస్వామ్యానికే 'మెజారిటీ ప్రజల నియంతృత్వం' అని పేరు. నూరుమంది వుంటే 51 మంది ఏమనుకుంటే అదే జరుగుతుంది. అలాటి ప్రజాస్వామ్యం ద్వారా ఇందిరా గాంధీ ప్రభవించింది. వస్తూనే నేను నియంతను అని చెప్పుకోలేదు. మెత్తగానే వుంది, క్రమేపీ అన్ని అధికారాలు తన చేతిలో పెట్టుకుంది. తన యిష్టం వచ్చినట్టు తక్కిన వ్యవస్థలను ఆడించింది. మోదీలో కూడా ఆ లక్షణాలు కనబడ్డాయని నేనన్నాను. ఇప్పుడే ఇందిరలా అయిపోయాడని చెప్పలేదు. ఎందుకలా కనబడ్డాయని అడిగితే అతని స్టోరీ మొత్తం చెప్పవలసి వస్తుంది. తీరిక దొరికినపుడు చెప్తాను. ఇందిరతో పోల్చడం కూడా నచ్చలేదు కొందరికి. మోదీ అంత నియంత కాదు కదా అన్నారు. అప్పుడేం ఏం చూశారు? అసలు మోదీ ఇందిర స్థానానికి ఎక్కడకు వెళ్లాడు? ప్రస్తుతానికి ఒక్క రాష్ట్రానికి ముఖ్యమంత్రి అతను. అలాటి పలు రాష్ట్రాలు కలిసిన దేశాన్ని దశాబ్దాల పాటు ఏలిన జాతీయనేత – ఇందిర! ఇందిర ప్రభావం పేరు ఆసేతుహిమాచలం తెలుసు. ప్రస్తుతానికి మోదీ పేరు చెపితే దక్షిణాదిన, తూర్పున అంబ పలకదు. అక్కడికే 40% సీట్లు ఔట్. తక్కిన 60%లో ఎన్ని గెలుచుకుని వస్తాడో వేచి చూడాలి. ఆ మాటకొస్తే దేవెగౌడ పేరు ఎంతమందికి తెలుసని ప్రధాని అయ్యాడు? మన్‌మోహన్? ఏదో ఒక సమీకరణం కుదిరి మోదీ ప్రధాని అయితే కావచ్చు. కానీ అతని పేరు దేశపు గ్రామగ్రామాల పాకాలంటే చాలా ఏళ్లు పడుతుంది.

మోదీ తన కాబినెట్ సహచరులను ఓవర్‌షాడో చేస్తాడు. అతని మంత్రివర్గంలో తక్కినవాళ్ల పేర్లు వినబడవు, మీకు ఎవరి పేర్లు తెలుసు చెప్పండి అని నేనంటే చాలామంది దాన్ని లిటరల్‌గా తీసుకుని 'మాకు గుజరాతే కాదు, అనేక రాష్ట్రాలలో మంత్రుల పేర్లు తెలియవు, అది మోదీ తప్పా?' అంటూ రాశారు. మీరు మంత్రుల దాకా పోయారు, నాకు ముఖ్యమంత్రుల పేర్లే తెలియవు. గబుక్కున అడిగితే దేశంలో ఎన్ని రాష్ట్రాలంటే చెప్పలేను. మన అజ్ఞానానికి మోదీని నిందించడం లేదు. ఇంకొందరు వైయస్ కాబినెట్‌లో మంత్రుల పేర్లు యితర రాష్ట్రాల వారికి తెలుసా? బాబు కాలంలో ఐటీ మినిస్టర్ ఎవరో తెలుసా? అంటూ ప్రశ్నలు గుప్పించారు.

వైయస్ పాలన కానీ, బాబు పాలన కానీ ఆదర్శవంతమైనది అని నేను చెప్పానా? కాబినెట్ సహచరులను ఖాతరు చేయకుండా పాలించారు యిద్దరూ. ఎక్కడ చూసినా వాళ్ల బొమ్మలే. వాళ్ల దగ్గర మంత్రులుగా, అధికారులుగా పని చేసినవాళ్లు ఏం చెప్తున్నారు? 'వైయస్ సంతకం పెట్టమంటే పెట్టాం, కాదనే దమ్ము మాకెక్కడిది?' అని! చివరకు కేసుల్లో యిరుక్కున్నారు. బాబు వద్ద పనిచేసిన వాళ్లపై యింకా కేసులు రాలేదు కానీ వాళ్లూ డూడూ బసవన్నలే కదా. ఐటీ బాగా వర్ధిల్లింది అంటే బాబు చలవ, రోడ్లు విస్తరింపచేశారు అంటే బాబు చలవ, రైతు బజారు పెట్టారు అంటే బాబు చలవ – యిలాగే చెప్పుకుని బతికారు కదా. 'ఇది నా ఐడియా, సిఎంకు చెప్తే – బాగుంది, బాధ్యత వహించి చేయమన్నారు. చేసి శభాషనిపించుకున్నాను' అని ఒక్క టిడిపి మంత్రి చెప్పుకోగలుగుతున్నాడా? భగవద్గీతలో అర్జునుడికి కృష్ణుడు చెప్పినట్టు – చేయించేది నేనే, నువ్వు నిమిత్తమాత్రుడివి మాత్రమే అనే పద్ధతిలోనే బాబు, వైయస్ పాలించారు. అదేమన్నా సత్ఫలితాలను యిచ్చిందా? సొంతపాలనలోనే బాబుపై మావోయిస్టుల దాడి జరిగి, చచ్చి బతికారు. సొంతపాలనలోనే వైయస్ హెలికాప్టర్ ప్రమాదంలో చిక్కుకుని మరణించారు. అడుగడుగునా భద్రతాలోపాలే. కారణభూతులైన వారందరూ ఆయన స్వయంగా ఏరికోరి వేసుకున్నవారే.

వైయస్ రాజులాగ పాలించారు. బ్రహ్మణి స్టీల్సుకి ఎయిర్‌పోర్టుకి అన్ని వందల ఎకరాలెందుకండీ? అని అడిగితే 'ఆట్టే మాట్లాడితే రెట్టింపు భూమి యిస్తా' అంటూ ప్రకటించారు. ఫైనల్‌గా చూస్తే మొత్తమంతా బోగస్సే. ఆలూ లేదు, చూలూ లేదు, స్టీలూ లేదు. అంతా 'గాలి'వాటం. ఆర్థికనేరాలు చేసి జనార్దనరెడ్డి జైలులో కూర్చున్నాడు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో అనేక కంపెనీలకు ఎడాపెడా భూములు కట్టబెట్టారు. వారిలో చాలామంది ఏ ప్రాజెక్టూ కట్టలేదు. తరతరాలుగా ప్రభుత్వం కాపాడుకుంటూ వస్తున్న భూములను వైయస్ తెగనమ్మారు. అంతా రాచరికపు పోకడలే. ప్రజాస్వామ్యంలోనే యిది నడిచింది. చట్టం ప్రకారం చూస్తే వీటిని తప్పులుగా నిరూపించడం చాలా కష్టం. నిజంగా పరిశ్రమలు వస్తాయనే భూములిచ్చాం అని చెప్పి తప్పుకుంటారు. సరైన పద్ధతులు, అనుమతులు గురించి ఎవరైనా మాట్లాడితే, విమర్శిస్తే కొట్టి పారేసి పనులు జరిపించారు. చంద్రబాబు కూడా మంత్రివర్గ సహచరుల మాట లక్ష్యపెట్టలేదు. విద్యుత్ చార్జీల పెంపుతో సహా అనేక సమస్యల గురించి ఆచితూచి వ్యవహరించమని నెత్తీనోరు కొట్టుకుని చెప్పినా వినలేదు. నేను చెప్పినది మీరు వినడమే తప్ప, మీరు చెప్పేది నాకు అక్కరలేదనే ధోరణి. ముఖ్యమంత్రీ ఆయనే, పార్టీ అధ్యక్షుడూ ఆయనే. ఇప్పటికీ 'నా పార్టీ తరఫున నేను చేసిన ప్రకటనే నికరం. ఎంత సీనియర్లయినా తక్కిన వాళ్లు చెప్తే లెక్కలోకి రాదు' అని స్పష్టంగా చాటిచెప్పే నేత.

ఈ పోకడలేమైనా అభిలషణీయమా? వీళ్లు యిలా వున్నారు కాబట్టి మోదీ కూడా యిలాగే వుండాలని మనం కోరుకోవాలా? మోదీలో యిలాటి లక్షణాలు వున్నాయని నేను అనుకుంటున్నాను. మీకు సమాచారం వుంటే కాదని వాదించండి, సంతోషిస్తాను. ఆ లక్షణాలు వుంటే తప్పేముందని వాదిస్తే మాత్రం నొచ్చుకుంటాను. ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటుంది. వైయస్, బాబు, జయలలిత వీళ్లంతా రాష్ట్రనాయకులు. తమ పార్టీల ప్రభుత్వాన్ని నడిపేవాళ్లు. మోదీ కేంద్రస్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుదామనుకుంటున్నవాడు. సంకీర్ణ ప్రభుత్వంలో సహచరులకు తగిన ప్రాముఖ్యత యివ్వకపోతే కొంప మునుగుతుంది. ఒకే పార్టీలో

వున్నవారికి ఒక రకమైన భావాలుండడం సహజం.

కానీ ఎన్‌డిఏ కూటమిలో పది రకాల పార్టీలు, పది రాష్ట్రాలతో, పది రకాల నేపథ్యాలతో, పది రకాల సిద్ధాంతాలతో వస్తారు. ఇగో క్లాషులు సహజం. వారికి తగిన ప్రాముఖ్యత యిస్తూ 'ఫస్ట్ ఎమాంగ్ యీక్వల్స్' (సమానుల్లో ప్రథముడు)గా వుంటేనే నెగ్గుకు రాగలడు. ఆ విద్య చేతకాకనే గతంలో జనతా పార్టీ, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాలు పూర్తికాలం పాలన చేయలేక కూలిపోయాయి. వాజపేయికి ఆ లక్షణం వుంది కాబట్టి ఎన్‌డిఏ పూర్తికాలం పాలించగలిగింది. వాజపేయి, ఆడ్వానీ, మోదీ ముగ్గురు ఆరెస్సెస్ నుండి వచ్చినవారే. కానీ హిందూత్వ విషయంలో తేడా వుంది. వాజపేయి ఉదారవాది అయితే, ఆడ్వానీ కఠినుడు, మోదీ మరీ కఠినుడు.

కఠినుడు అంటే ఎవరైనా ముస్లిము కనబడగానే కరిచేస్తాడని కాదు, రాజకీయంగా వాళ్లు మేన్‌టేన్ చేసే యిమేజి అలా వుందని భావం. టిడిపిలో వర్ల రామయ్య మాట్లాడినట్లు విజయరామారావు మాట్లాడరు. రాజేంద్రప్రసాద్ మాట్లాడినట్లు సీతారామారావు మాట్లాడరు. మళ్లీ అందరూ ఒకే పార్టీ వారే. ఇలా కట్టర్ హిందూవాది యిమేజియే మోదీకి గుర్తింపు తెచ్చి పెట్టింది కానీ దానితోబాటు ఒక పరిధి దాటి విస్తరించకుండా పరిమితులూ విధించింది. భవిష్యత్తులో మోదీ మారితే ఏమో గానీ, ప్రస్తుతానికి అతనంటే యితరులు భయపడే స్థితిలోనే వున్నాడు. అది సంకీర్ణప్రభుత్వాధినేతగా వుండడానికి అవరోధం అవుతుంది. ఇందిర కాలం నాటి ఏకచ్ఛత్ర పార్టీ పాలనలకు కాలం చెల్లింది. ఇది కలుపుగోరు రాజకీయాల కాలం. సమాజంలో అన్ని వర్గాలను, దేశంలోని అన్ని సమూహాలను, సిద్ధాంతాలను ఆదరిస్తున్నట్లు కనబడితేనే చెల్లుబాటు అవుతుంది.

జాతీయనాయకులకు ఎంతో లౌక్యం అవసరం. ఒకప్పుడు ములాయం యింటికి డిన్నర్‌కు వస్తే పలకరించకుండా అవమానించిన సోనియా మొన్న పార్లమెంటులో వెళ్లి అతని చేతులు పట్టుకుని కాళ్లనుకోమంది. అది హిపాక్రసీయే. కానీ ఆమె అలా చేయకపోతే ప్రభుత్వం పడిపోయి దేశం అరాచకమై పోయేది. పాలన కుంటుపడేది. జనతా పార్టీ నాయకులు విడిగా ఎంతో మహానుభావులు కానీ కలక్టివ్‌గా ఫెయిలయ్యారు. ఈ లౌక్యమే కొరవడింది. ఎవరికి వారు ఒక్కో కొమ్మెక్కి కూర్చున్నారు. ఏడాది పాటు దేశానికి పాలకుడు లేకుండా పోయాడు. పాలనంతా అస్తవ్యస్తమై పోయింది. విసిగిపోయిన ప్రజలు నియంత అయినా ఫర్వాలేదని ఇందిరను మళ్లీ భారీ మెజారిటీతో ఎన్నుకుని తీసుకుని కూర్చోబెట్టారు. అంతే అప్పణ్నుంచి ఆవిడ వంశం మన దేశాన్ని వదలటం లేదు.

మోదీ ఒక్క ముస్లింకు కూడా అసెంబ్లీ టిక్కెట్టు యివ్వలేదని నేను రాస్తే – తగిన కాండిడేట్స్ లేక యివ్వలేదేమో, అయినా మునిసిపల్ ఎన్నికల్లో ఓ మునిసిపాలిటీలో యిచ్చాడుగా అంటూ కొందరు రాశారు. ఎంత హాస్యాస్పదం. గుజరాతీ ముస్లిములలో ఎందరో విద్యావంతులు, ధనికులు వున్నారు. మోదీ దృష్టిలో వారికి కౌన్సిలర్ స్థాయి తప్ప ఎమ్మెల్యే స్థాయి లేదా? డిఎంకె ఒక్క బ్రాహ్మడికి కూడా టిక్కెట్టు యివ్వదు. అంటే వాళ్ల దృష్టిలో తమిళ బ్రాహ్మణులెవరూ ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి గలవారు కాదన్నమాట! నమ్మగలమా? ఉన్న విషయం ఏమిటంటే – నేను బ్రాహ్మణత్వానికి వ్యతిరేకిని తప్ప బ్రాహ్మలకు కాదు' అని చాటుకునే కరుణానిధి నిజానికి బ్రాహ్మణవ్యతిరేకి కూడా. అందుకే ఆయనకు ప్రతి బ్రాహ్మడిలోనూ బ్రాహ్మణత్వమే కనబడుతుంది. అందుకే టిక్కెట్టు యివ్వడు. జనాభాలో 3% వున్న బ్రాహ్మలు తన గురించి ఏమనుకున్నా ఖాతరు చేయడు. మొహమాటానికైనా ఒకటో రెండో విదల్చడు.

ముస్లిముల గురించి మోదీ యిలాటి వైఖరే కనబరుస్తున్నాడు. బిజెపి అధినాయకత్వం బాగుండదని కొందరు ముస్లిము నాయకులను తమ పార్టీలో చేర్చుకుని వారిని అధికార ప్రతినిధులుగా నియోగిస్తుంది. మోదీకి అలాటి శషభిషలేమీ లేవు. నాకు వాళ్లు పడరు అని ఓపెన్‌గా చెప్పినట్టు వుంటుంది వ్యవహారం. అది పెద్ద వర్చ్యూ అనుకునేవారితో నేను వాదనకు దిగను. నమస్కారం పెట్టి తప్పుకుంటాను. నా వరకు నేను 'యిన్‌క్లూజివ్ పాలిటిక్స్' నడిపేవాళ్లనే యిష్టపడతాను. అన్ని వర్గాలతో సర్దుకుపోవడమే సామర్థ్యం తప్ప కొందరిని 'నన్ను ముట్టుకోకు నామాల కాకి' అనడం పనికి రాదని నా దృఢవిశ్వాసం.

ఈ ఫ్యాక్టర్ వలననే కాంగ్రెస్ యిన్నేళ్లగా గెలుస్తూ వస్తోంది. ఎన్నికలలో కాంగ్రెసుకు దోహదపడే అత్యంత ముఖ్యమైన ఫ్యాక్టర్ – ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్ (ఎఫ్‌పిటిపి) అంశం. దేశం మొత్తం మీద బిజెపికి, కాంగ్రెసుకు ఒకే శాతం ఓట్లు వచ్చాయనుకోండి. కానీ సీట్ల దగ్గరకి వచ్చేసరికి కాంగ్రెసుకు సీట్లు ఎక్కువ వస్తాయి. ఎందుకంటే బిజెపి బలం కొన్ని ప్రాంతాల్లో గాఢంగా వుంటుంది. అక్కడ ఒక్కో సీటు లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తుంది. కానీ కాంగ్రెసు బలం కాస్తో కూస్తో దేశమంతటా వుంటుంది. చాలా చోట్ల వేల మెజారిటీతో కూడా గెలిచేస్తుంది. ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్ సిద్ధాంతం (సెకన్ల తేడాతోనైనా సరే ఎవరు ముందు దాటితే వారిదే గెలుపు) ప్రకారం ఒక్క ఓటుతో గెలిచినా గెలుపే. కాంగ్రెసు విస్తరించి వుండడం, అన్ని వర్గాలలోనూ కాస్త కాస్త ఆమోదయోగ్యత వుండడం దానికి ప్రయోజనకారిగా వుంది.

ఓట్లశాతాన్ని సీట్ల సంఖ్యతో ముడివేసిన నిష్పత్తి తెలుసుకుంటే యిది యింకా బాగా అర్థమవుతుంది. 2009 పార్లమెంటు ఎన్నికలలో 28.6% ఓట్లు తెచ్చుకుని 206 సీట్లు గెలుచుకుంది, అంటే 1% ఓట్లకు దానికి 7 సీట్లు దక్కాయి. 1999లో కూడా కాంగ్రెస్‌కు యింతే శాతం ఓట్లు వచ్చాయి. కానీ అప్పుడు 1% ఓట్లకు దానికి 4 సీట్లు వచ్చాయి. ఆ ఎన్నికలలో బిజెపికి 1% ఓట్లకు 7 సీట్లు వచ్చాయి – వాజపేయి ప్రధాని అభ్యర్థిగా చూపారు కాబట్టి! అప్పణ్నుంచి యీ కన్వర్షన్ మల్టిప్లయర్ బిజెపికి తగ్గుతూ రాగా, కాంగ్రెసుకు పెరుగుతూ వస్తోంది.

2009 ఎన్నికలలో కాంగ్రెసు బిజెపి ముఖాముఖీ తలపడిన 115 చోట్ల కాంగ్రెసుకు 3.1% ఓట్లు ఎక్కువ రాగా, బిజెపికి 5.1% తగ్గాయి. వీటి కారణంగా 26 సీట్లు బిజెపి నుండి కాంగ్రెసుకు వెళ్లిపోయాయి. ఆ విధంగా కాంగ్రెసు 52 సీట్ల మేరకు లాభపడింది.

2014 ఎన్నికలలో కాంగ్రెస్-బిజెపి ముఖాముఖీ తలపడే రాష్ట్రాలు – మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఢిల్లీ! కాంగ్రెసుకు ఓట్ల శాతం తగ్గితే బిజెపి లాభపడేందుకు అవకాశం వీటిల్లోనే వుంది. ఇక తక్కిన రాష్ట్రాలలో బహుముఖపోటీలే. అనేక పార్టీలు తలా కాస్తా పంచుకుంటాయి. అక్కడ ఎఫ్‌పిటిపి పనిచేస్తుంది. అది పనిచేసిన చోట కాంగ్రెసు లాభపడుతోందని గతచరిత్ర చెపుతోంది. దీనికి కారణం అది అన్ని కులాల, అన్ని మతాల ఓట్లను కాస్త కాస్త తెచ్చుకుంటోంది. ఒక ప్రత్యేకమైన గుర్తింపు, సిద్ధాంతం లేకపోవడమే దానికి వరంగా మారుతోంది. ఓటు ఎవరికి వేయాలో తోచక కాంగ్రెసుకు వేసి పడేద్దామనుకునే ఓటర్లు చాలామంది వుంటున్నారు. మోదీ అభిమానులు యీ ఫ్యాక్టర్‌ను విస్మరించకూడదు.

మోదీని సమర్థించే కొందరు మెచ్చుకున్న అంశం ఏమిటంటే – ఆయనకు పిల్లల్లేరు. అందువలన కుటుంబ పాలన రాదు అని ఆశ. అదొక పెద్ద పాయింటుగా నేను అనుకోను. సమర్థుడైన కొడుకో, కూతురో వుంటే అధికారంలోకి వస్తే నష్టం ఏముంది? వాళ్లకోసం అధికారం దుర్వినియోగం చేస్తేనే చిక్కు తప్ప అస్సలు పిల్లలుండకూడదు, పెళ్లి చేసుకోకూడదు అంటే ఎలా? ఆ మాటకొస్తే వాజపేయి బ్రహ్మచారే. అయితే ఆయన ప్రధాని అయ్యాక అల్లుడు రంజన్ భట్టాచార్య వెలుగులోకి వచ్చాడు, ఆరోపణలు వచ్చాయి. జయలలిత అవివాహితురాలే. అయినా అర్జంటుగా దినకరన్‌ను దత్తత తీసుకుని అతని పెళ్లి అంటూ బోల్డంత ప్రజాధనం ఖర్చు పెట్టింది. మోదీకి పిల్లలు లేకపోవచ్చు, కానీ తన వాళ్లనుకున్న అనుచరులు ఎంతటి ఘాతుకం చేసినా వెనకేసుకుని రావడం, పదవులు కట్టబెట్టడం వుంది. వాళ్లను దత్తపుత్రులని అనకపోవచ్చు కానీ జరుగుతున్నది అదే. బ్రహ్మచారి కదాని మార్కులు వేయడం మొదలుపెడితే రాహుల్ గాంధీకి కూడా మార్కులు పడతాయి. ఇందిర ఫ్యామిలీ పరంపర అంతటితో ఆగుతుందన్న సంతోషంతో మనం అందరం ఓట్లేసేస్తాం.

అవినీతి మరక లేకపోవడం మోదీకున్న అతి పెద్ద సుగుణం. ఆ విషయంలో అతను తన ప్రత్యర్థుల కంటె ఎంతో ఉన్నతస్థానంలో వున్నాడు. కానీ యిక్కడ ఒక పాయింటు అర్థం చేసుకోవాలి. జేబులో డబ్బులు పెట్టుకుంటేనే అవినీతా? తను రాజకీయంగా బలపడడానికి, తన ప్రచారానికి మోదీ పార్టీకి యింత డబ్బు ఎక్కణ్నుంచి పట్టుకుని వస్తున్నాడు? బడా వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చే పని చేసి కాదా? చట్టవిరుద్ధమైన వాళ్ల కార్యకలాపాలను చూసీ చూడనట్టు వదిలేయడం వలన కాదా? దానికి గాను వాళు „ మోదీకి నిధులు సమకూరుస్తున్నారు. అవి అతను తన ప్రచారానికి, పార్టీ ప్రచారానికి ఖర్చు పెడుతున్నాడు. రేపు పార్లమెంటు ఎన్నికల తర్వాత బిజెపి ఏ 150 వద్దో ఆగిపోతే, మోదీ ప్రధానిగా ప్రభుత్వం ఏర్పరచడానికి ఓ 50, 60 మంది ఎంపీలను కొనవలసి వస్తే యీ వ్యాపారసంస్థలు డబ్బు సమకూరుస్తాయి. దానికి గాను కొన్ని ప్రయోజనాలు పొందుతాయి. అది అవినీతి కింద వస్తుందా రాదా?

పివి నరసింహారావుగారి మీద కేసులు ఎలాటివి? ఆయన ముఖ్యమంత్రిగా కానీ, ప్రధానమంత్రిగా కానీ ఒక్క రూపాయి స్వంతానికి తిన్నాడా? లేదే! అయినా ఆయనపై అన్ని నిందలు, కేసులు ఎందుకు వచ్చాయి? ఆయన యింటి పేరును పాములపర్తి కాదు, స్కాములపర్తిగా పేపర్లు ఎందుకు రాశాయి? ఆయన నడిపినది మైనారిటీ ప్రభుత్వం. దాన్ని నిలబెట్టడానికి ఆయన పొలిటికల్ మేనేజర్లు కొందరు ఎంపీలను కొనుగోలు చేశారు. దాని కోసం కొందరికి ఫేవర్లు చేసి డబ్బు సంపాదించారు. అవన్నీ పివి నెత్తికి చుట్టుకున్నాయి. సోనియా గాంధీని వెలుగులోకి తేవడానికి పివిని అవమానకరంగా దింపేశారు. చనిపోయేవరకు ఆ కేసులు ఆయనే స్వయంగా పోరాడవలసి వచ్చింది. ఆస్తులు అమ్ముకుని కేసులు నెగ్గారు. పార్టీ సహాయపడలేదు.

ఇక అతి ముఖ్యమైన అంశం – గుజరాత్ అభివృద్ధి. ఇది చూసే అందరూ మురిసి మూర్ఛపోతున్నారు. దీనిలో రెండు అంశాలున్నాయి. మోదీ ప్రచారం చేస్తున్నంత అభివృద్ధి వుందా లేదా అన్న దానిపై నాకు సందేహాలు వున్నాయి. నా అనుభవాలు నావి. చంద్రబాబు హయాంలో బీభత్సంగా అభివృద్ధి జరిగిపోయిందని అప్పటి మీడియా తెగ రాసింది. ఐదేళ్ల తర్వాత స్టాటిస్టిక్స్ వచ్చి చూస్తే చాలావాటిల్లో హుళక్కి అని తెలిసింది. కారణాలు ఏవైనా కానీయండి, వాటిల్లో అభివృద్ధి ఆగిపోయింది, నెగటివ్ గ్రోత్ కూడా వుంది. అదే విధంగా లాలూ యాదవ్ రైల్వేలో అద్భుతాలు చేసేశాడని వూదరగొట్టారు. ఆయన ఐఐఎమ్‌కు, హార్వర్డ్‌కు కూడా వెళ్లి మేనేజ్‌మెంట్ పాఠాలు చెప్పేసి వచ్చాడు. మినిస్ట్రీ చేతులు మారేసరికి అంతా హంబగ్ అని తెలిసింది. రైల్వే నష్టాల్లో వుంది... భద్రతకు ఫండ్స్ యివ్వలేదు.. యాక్సిడెంట్లు పెరిగాయి.. టిక్కెట్ల రేట్లు పెంచకపోతే రైళ్లు ఆగిపోతాయి.. వగైరా కఠోరవాస్తవాలు బయటకు వచ్చాయి. అంటే ప్రభుత్వమే మనతో అంకెలతో ఆడుకుందన్నమాట.

అలాగే యీ మోదీ హంగామా కూడా ఐదేళ్ల పోయిన తర్వాతే కరక్టుగా తెలుస్తుంది. అప్పటిదాకా యీ స్టాటిస్టిక్స్ అన్నీ విత్ ఎ పించ్ ఆఫ్ సాల్ట్ తీసుకుంటాను. ఇప్పటికే అనేక రంగాల్లో గుజరాత్ వెనకబడి వుందని కొన్ని గణాంకాలు లభ్యమవుతున్నాయి. మోదీ రాజకీయ చరిత్ర గురించి సీరియల్ రాసినపుడు వాటి గురించి విపులంగా రాస్తాను. ప్రస్తుతానికి మాత్రం మోదీ 80% వృద్ధి జరిగిందని చెపితే ఏ 50%యో జరిగిందన్నమాట అని నమ్ముతాను. అంతిమంగా అది 70% కావచ్చు, 40% కావచ్చు, 80% మాత్రం కానేరదు అని నా 'గట్ ఫీలింగ్'.

రెండవ అంశం ఏమిటంటే – 40% వృద్ధి మాత్రమే అయినా అది కూడా గొప్పే అని ఒప్పుకుంటాను. దేశమంతా వెనక్కు నడుస్తూ వుంటే గుజరాత్‌ను ముందుకు నడిపించడం విశేషమే కదా! అయితే అది గుజరాత్ అన్న విషయం సర్వదా గుర్తు పెట్టుకోవాలి. గుజరాత్ ఎప్పటినుండో అభివృద్ధిపథంలో నడుస్తున్న రాష్ట్రం. దానికి వున్న ఎడ్వాంటేజిలు అన్నీ యిన్నీ కాదు. వాటి గురించి

ఎంతయినా రాయగలను. నేను 28 సంఎఎలు పనిచేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ సౌరాష్ట్ర, గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతానికి చెందినదే. ఆ ప్రాంతాల్లో నేను బాగా తిరిగాను. వందలాదిమంది గుజరాతీ స్నేహితులు, కొలీగ్స్. వాళ్ల స్వభావాలు, ఆలోచనారీతి అన్నీ నాకు కొట్టిన పిండి. అవన్నీ కలిపి ఎప్పుడైనా విపులంగా రాస్తాను. ప్రస్తుతానికి మాత్రం ఒక చిన్న ఉదాహరణ యిచ్చి వూరుకుంటాను.

గుజరాత్‌ను వృద్ధి చేయడం అంటే విజ్ఞాన్‌లోనో, వికాస్‌లోనో చదివే కుర్రాడికి డిస్టింక్షన్ రావడం వంటిది. బెంగాల్‌ను వృద్ధి చేయడం అంటే గవర్నమెంటు స్కూలులో చదివే కుర్రాడికి ఫస్ట్ క్లాస్ తెప్పించడం వంటిది. గుజరాత్‌ను కూడా తగలేయగలిగిన మహానుభావులు లేకపోలేదు. కానీ దాని కున్న సౌకర్యాల దృష్ట్యా బాగు చేయడం సులభం. దానికి గాను ఆకాశానికి ఎత్తేయడం అంటే ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు పండించినందుకు, కేరళలో కొబ్బరి పండించినందుకు, పంజాబ్‌లో గోధుమ పండించినందుకు మెచ్చుకోవడం వంటిదే. మన దేశంలో గవర్నమెంటు స్కూళ్ల వంటి రాష్ట్రాలే ఎక్కువ. గుజరాత్, పంజాబ్, హర్యాణాలు తక్కువ. అందుకే గుజరాత్‌లో మోదీ సాధించిన విజయం కంటె మధ్యప్రదేశ్‌లో చౌహాన్ సాధించిన విజయం గొప్పదని ఆడ్వానీ అన్నారు. బిహార్‌లో నితీశ్‌ది కూడా అలాటి విజయమే.

గుజరాత్‌లో విద్యుత్ నిరంతరంగా వస్తుందని, రోడ్లు బాగున్నాయని చెప్పేవాళ్లందరూ తక్కిన అంశాలను మర్చిపోకూడదు. మన రాష్ట్రంలో వున్నన్ని సంక్షేమ పథకాలు అక్కడ లేవు కదా. కార్మికోద్యమం లేదు. కార్మిక హక్కుల పరిరక్షణ లేదు. అలంగ్ వంటి రేవులో పర్యావరణ విధ్వంసం చేసేవారిపై అదుపు లేదు. క్వాలిటీ కంట్రోల్ లేదు. ఉన్నత విద్యాప్రమాణాలు లేవు. చట్టాల ఉల్లంఘన సర్వసామాన్యం. కాస్ట్ ఆఫ్ లివింగ్ చాలా ఎక్కువ. సరిగ్గా చెప్పాలంటే గుజరాత్ – ఆఫ్ ద ట్రేడర్స్ బై ద ట్రేడర్స్ అండ్ ఫర్ ద ట్రేడర్స్! మధ్య తరగతికే తప్ప దరిద్రులు బతకడం అతి కష్టం. అందుకే బిపియల్ (దారిద్ర్యరేఖ) కింద వున్నవారి శాతం మన రాష్ట్రంలో 29.9 అయితే గుజరాత్‌లో 31.8 ! చదవలేక స్కూలు మానేసే పిల్లల సంఖ్య శాతం బెంగాల్ కంటె ఎక్కువ. మోదీ గురించి సీరియల్‌గా రాసినపుడు యింకా ఎక్కువ చర్చించుకోవచ్చు. ప్రస్తుతానికి యిది చాలనుకుంటా.

నరేంద్ర మోదీ గురించి నేను రాసిన వ్యాసపరంపరకు తీవ్రంగా స్పందన వచ్చింది. అందరికీ విడివిడిగా సమాధానాలు యివ్వలే వ్యాసం ద్వారా ఒకేసారి యిస్తానని చెప్పాను. మెయిల్ రాద్దామనుకుని బద్ధకించినవారిని కూడా దృష్టిలో పెట్టుకుని అన్ని విషయాలూ దీనిలో చెప్పేస్తున్నాను.

నాకు మెయిల్స్ రాసినవారిలో కొందరు మోదీ ప్రధాని కాకుండా నేనేదో అడ్డుపడుతున్నానన్న ధోరణిలో రాయడం నాకు నవ్వు తెప్పించింది. ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్ది, పోతపోసే చేసే శక్తి నాకు ఉందని వాళ్లు అనుకోవడం వింత. ఒక కాలమిస్టు మహా అయితే ఒక ఆలోచనను రేకెత్తించగలడు. ఇలా వందలాది మంది రాస్తూన్నవి గమనించిన పాఠకుడు వాటిలో న్యాయంగా తోచినవాటిపై తను తీవ్రంగా ఆలోచించి అప్పుడు అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటాడు. మోదీ మంచివాడా కాదా, గోధ్రా అల్లర్లలో అతని పాత్ర ఎంత, దానికై ఎన్నేళ్లపాటు అతన్ని శిక్షించాలి, తక్కిన సుగుణాలతో తూకం వేసి దీన్ని విస్మరించాలా – యిలాటి అంశాలపై నేను యింకా వెళ్లనే లేదు. అయినా కొందరు పాఠకులు 'గోధ్రాను చూపించి అతన్ని ఉరేస్తారా?' అంటూ ఆవేశపడిపోయారు. ఆరెస్సెస్ భావజాలం గురించి, వారి 'హిందూత్వ' ప్రచారం గురించి, అవి భారత రాజకీయాల్లో వహించిన పాత్ర గురించి నాకున్న అభిప్రాయాలను, నేను సేకరించిన సమాచారాన్ని ఎప్పుడైనా విపులంగా చెప్తాను. ఇప్పటి వరకు మోదీ ప్రధాని అవుతాడా లేడా అన్న అంశంపైనే దృష్టి కేంద్రీకరించాను. చర్చ దానికే పరిమితం కావాలి.

నెటిజన్లు మోదీ నామజపం తీవ్రంగా చేస్తున్నారు. అమెరికా తరహాలో అధ్యక్షుణ్ని నేరుగా ఎన్నుకునే పద్ధతి వుంటే, ఓటర్లలో యువకులు మాత్రమే వుంటే మోదీ దేశాధినేత అవుతారు. కానీ మనవి పరోక్ష ఎన్నికలు. మోదీ నాయకత్వం వహిస్తున్న పార్టీకి మొదటినుండీ వున్న యిమేజి, బలం, బలహీనత, వారికి యితర పార్టీలతో వుండే సఖ్యత – యివన్నీ పరిగణనలోకి తీసుకుంటే తప్ప అతను ప్రధాని పదవికి చేరుకోలేడు. ఇంత సింపుల్ విషయం నా పాఠకులకు అర్థం కాలేదంటే నేను నమ్మను. కానీ వారు ఆవేశంలో వున్నారు. దేశపాలకుల అవినీతితో, అసమర్థతతో విసిగిపోయి వున్నారు. మోదీ వస్తే యీ అవినీతి, అసమర్థత పోతాయని, గుజరాత్ తరహాలో యావద్భారతం వెలిగిపోతుందని ఆశ పెట్టుకున్నారు. మధ్యంతర ఎన్నికలు ఎంత త్వరగా వస్తాయా, మోదీ ఎంత త్వరగా ప్రధాని అయి తమను ఉద్ధరిస్తాడా అని కలలు కంటున్నారు. మోదీ ప్రధాని కాలేడేమో అని నేను శంకలు చెపుతూంటే నేను వాళ్లకు అపశకునపక్షిగా కనబడుతున్నాను. తిరోగమనవాదిగా, అవినీతిని సమర్థించే, ..కనీసం సహించే దుర్మార్గుడిగా కనబడుతున్నాను.

నా పట్ల వాళ్లు ఎంత కోపం ప్రదర్శించినా, నేను వాళ్లను చూసి నవ్వుకుంటాను. ఎందుకంటే అవినీతి నిర్మూలన అనేది ఎవరో వచ్చి రాత్రికి రాత్రి చేసేది కాదు. మనం అవినీతిలో పొర్లాడుతూ (లంచాలు పుచ్చుకోవడమే కాదు, యివ్వడం కూడా అవినీతే) నిరంతరం అడ్డుదార్లు వెతుకుతూన్న మనం ఎవరో ఎక్కణ్నుంచో దిగివచ్చి అవినీతి భూతాన్ని పారద్రోలాలని చూడడం చైల్డిష్‌నెస్! 2009 ఎన్నికల సమయంలో లోకసత్తా జెపి గారికి గొప్ప యిమేజే వుండేది. ఆయన సంస్థకు విరాళాలు పంపిస్తే, ఆయనను మెచ్చుకుంటూ మెయిల్స్ రాసి ఫార్వార్డ్ చేస్తే రాష్ట్రంలో అవినీతి మాయమైపోతుందని కొందరు కలలు కన్నారు. అవన్నీ జరిగేవి కావని నేను వ్యాసాలు రాస్తే నన్ను ఎంత తిట్టారో చెప్పలేను. 2009 ఎన్నికలు రిహార్సల్స్ మాత్రమే, 2014 నాటికి లోకసత్తా అభ్యర్థియే ముఖ్యమంత్రి అని నినాదాలు యిచ్చారు. చెప్పండి, యీ ఎన్నికలలో లోకసత్తా అభ్యర్థికి ముఖ్యమంత్రి అయ్యే సీను వుందా? ఆ పార్టీ టిక్కెట్టుపై ఒక చేతిపై లెక్కించదగినంత మందయినా ఎమ్మెల్యేలు నెగ్గుతారా? ఈ ముక్క నేను 2009లో రాసి ఆ

పార్టీకి 1–2% ఓట్లు మాత్రమే వస్తాయని చెపితే శాపనార్థాలు పెట్టారు. చివరకు అదే జరిగింది.

అలాగే అన్నా హజారే ఉద్యమం గురించి నేను ఏం రాశానో గుర్తుండి వుంటుంది. అన్నా హజారే పేరు చెప్పగానే నెటిజన్లకు పూనకం వచ్చేసి వూగిపోయారు. నేను నిరాశాపూరితంగా వ్యాసాలు రాస్తే నేను అవినీతిపరుణ్నంటూ ఆరోపణలు. ఈ రోజు అన్నా ఉద్యమం ఎక్కడుంది చెప్పండి. ఈ మోదీ పొంగు కూడా అలాటిదే అవుతుందని నా సందేహం. ఇలా పొంగిపోయేవాళ్లను చూస్తే నన్ను నేనే చూసుకున్నట్టు వుంటుంది. నేనూ యిలాగే కలలు కన్నానని అనేకసార్లు చెప్పాను. ఇందిరా గాంధీని చూసి ఉత్తేజం పొందాను, రాజీవ్ గాంధీ మిస్టర్ క్లీన్‌గా వెలసినపుడు, ఆధునిక విజ్ఞానం గురించి మాట్లాడినపుడు పులకించిపోయాను. రాజీవ్ అవినీతిపరుడని, అధికారంలో వచ్చిన వారం రోజుల్లో బోఫోర్స్ భోక్తల పేర్లు బయటపెడతానని విపి సింగ్ మాట యిచ్చినపుడు అప్పుడూ బోల్తా పడ్డాను. ఒకప్పటి యంగ్ టర్క్ చంద్రశేఖర్ ప్రధాని అయితే దేశానికి మంచి రోజులు వచ్చాయని ఆశించాను. నిష్కళంక మేధావి పి.వి. ప్రధాని అయినపుడు, మన్‌మోహన్ సింగ్ ఆర్థికమంత్రి అయినపుడు – యిక ఢోకా లేదు అనుకున్నాను. గుజ్రాల్ వంటి అవినీతి ఎరుగని లెఫ్టిస్టు మేధావి ప్రధాని అయినపుడు గంతులేశాను.

చివరకు 2004లో సోనియా పక్కకు తప్పుకుని మన్‌మోహన్ వంటి ఎకడమీషియన్‌ను ప్రధానిని చేసినపుడు స్వీట్స్ పంచాను. వీళ్లందరూ నన్ను నిరాశ పరిచారు. మన్‌మోహన్ అయితే మరీనూ. సోనియా ఆయన చేత అన్ని అవినీతి పనులు చేయిస్తూ వుంటే 'నాకొద్దు తల్లీ' అని దిగిపోయి దణ్నం పెడితే బాగుండేది కదా అని పదేపదే అనిపిస్తుంది. ఇంతమంది యిన్ని దెబ్బలు కొట్టాక నాకు కలలు కనే ఓపిక పోయింది. సంకీర్ణప్రభుత్వ శకం వచ్చి పడ్డాక అరడజను ఎంపీలున్న ప్రతీ పార్టీ తోక ఝాడిస్తూ వుండడం, వారి అవినీతిని పాలకులు చూసీచూడనట్టు వదిలేయడం – యివన్నీ చూశాక ఎవరొచ్చినా యింతే అనే నిరాశలో పడ్డాను. మంచికో, చెడుకో సుస్థిరప్రభుత్వం వుంటే చాలనుకుంటున్నాను.

ఆ విధంగా చూసినపుడు మోదీ సుస్థిరప్రభుత్వాన్ని అందించగలడా లేదా అన్న ఆలోచనను పాఠకులతో పంచుకున్నాను. ఆ విధంగా చేసి యుపిఏకు ప్రత్యామ్నాయం లేదనే సంకేతాన్ని పంపుతున్నానని నాపై ఆరోపణ. యుపిఏ 3 ఏర్పడితే బాగుండునన్న ఊహ నాకెంతమాత్రం లేదు. మూడో ఫ్రంట్ ఏర్పడుతుందన్న ఆశా లేదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కారణంగా ఎన్‌డిఏకే ప్రభుత్వాన్ని ఏర్పరచే ఛాన్సుంది. కానీ అది మోదీ కారణంగా చెడిపోతుంది – యిదీ నా భయం, నా వూహ. 'అదేం కాదు, మోదీ నాయకత్వంలో బిజెపికి బ్రహ్మాండమైన ఛాన్సుంది, ఆంధ్రలోనే 10 స్థానాలు వస్తాయి' అంటూ కొందరు నాతో వాదనకు దిగారు. నా లెక్కలు యిలా సాగాయి. మీకూ గుర్తుండడానికి అంకెలు రౌండ్ ఆఫ్ చేస్తున్నాను. –

పార్లమెంటులో వున్న 540 సీట్లుంటే వాటిలో మూడో వంతు సీట్లు అంటే 180 సీట్లలో బిజెపికి సింగిల్ డిజిట్ ఛాన్సే. ఈ 180 ఏవంటే తమిళనాడు, కేరళ, బెంగాల్, ఆంధ్ర, ఈశాన్య రాష్ట్రాలు (అసాంలో కాస్త వుంది), కశ్మీర్, పాండిచ్చేరి, లక్షద్వీప్. తక్కిన 360 స్థానాల్లో బిజెపితో పోటీ పడే పార్టీలు – జెడి (యు), జెడి(యస్), ఆర్‌జెడి, బిజెడి, ఎస్పీ, బియస్పీ, ఎజిపి, ఎన్‌సి.. ప్లస్ కాంగ్రెస్. ఇన్ని పార్టీలు పంచుకోగా బిజెపికి దక్కేవి ఓ మూడోవంతో వుండాలి. అంటే 120. ఎందుకంటే బిజెపికి వస్తున్న ఓట్ల శాతం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. 1991, 1996 ఎన్నికల్లో దానికి 20% దరిదాపుల్లో ఓట్లు వచ్చేవి. 1998లో ఎన్‌డిఏ ఏర్పడ్డాక 5% పెరిగింది. అప్పణ్నుంచి తగ్గుతూ రాసాగింది. 2004 నాటికి 22%, 2009 నాటికి 19%.

ఇలాటి పరిస్థితుల్లో బిజెపికి 120 కంటె ఎక్కువ సీట్లు ఎలా లెక్కవేయగలం? అయితే మోదీ నాయకత్వ పటిమ వలన మరో 25% సీట్లు పెరుగుతాయని అనుకుందాం. అప్పుడు 150 అవుతుంది. ప్రభుత్వం ఏర్పరచాలంటే యింకో 120 మంది కలిసి రావాలి. ఇక్కడే వుంది క్యాచ్. 1999లో ఎన్‌డిఏ 23 పార్టీలతో ఏర్పడింది. ఇప్పుడు ఆ పరిస్థితి వుందా? ప్రస్తుతం ఎన్‌డిఏలో బిజెపి, అకాలీదళ్, శివసేన వున్నాయి. శివసేన అప్పుడే సణుగుతోంది. మోదీ రాజ్ థాకరే ఎమ్‌ఎన్‌ఎస్‌తో పొత్తు పెట్టుకుంటాడని ఉద్ధవ్ అనుమానంట. కారణం ఏమైతేనేం, మోదీకి వ్యతిరేకంగా సంపాదకీయాలే రాస్తున్నాడు. కాపురం ఎంతకాలం వుంటుందో తెలియదు. ఈ విషయాలు వూహించే ఆడ్వాణీ మోదీని ముందుకు తేవద్దని అడ్డుపడ్డాడు. నేను ఆడ్వాణీ చరిత్ర మొదలుపెట్టగానే అదీ తప్పుపట్టారు. ఆయన మాత్రం ఏమైనా పవిత్రుడా? రథయాత్ర చేయలేదా? అంటూ. ఆడ్వాణీని ఆలంబనగా చేసుకుని నేను ఆరెస్సెస్ మూలాల గురించి, జనసంఘ్, జనతా పార్టీలో వారి పాత్ర, బిజెపి ఆవిర్భావం, ఉత్థానపతనాలు – యివన్నీ చెప్దామని మొదలుపెట్టాను. ఆయన్ని ప్రధానిగా కాన్వాస్ చేద్దామని కాను. అయినా తనకు ప్రధాని పదవి దక్కదని ఆయనకు ఎప్పుడో తెలిసిపోయి వుంటుంది. తన అనుయాయి ఎవరినైనా చేసి వుంటే సంతోషించి వుండేవాడనుకుంటా.

నా దృష్టిలో ఆడ్వాణీ పొరపాట్లు చాలా వున్నాయి. ఆయన సమర్థుడే కానీ తీవ్రభావాలు కలవాడు. (ఇంగ్లీషులో హాక్) అందుకే తక్కిన పార్టీల వారికి ఆమోదయోగ్యుడు కాలేకపోయాడు. వాజపేయి ఉదారవాది కాబట్టి, రామజన్మభూమి వివాదానికి దూరంగా వున్నాడు కాబట్టి ప్రత్యర్థులందరూ గౌరవించారు, ఆమోదించారు. తీవ్రభావాల వలన, రథయాత్ర వలన, బాబ్రీ మసీదు కూల్చివేతలో భాగస్వామ్యం చేత ఆడ్వాణీ దేశంలోని ఉదారవాదుల (దేశంలో వీళ్లదే మెజారిటీ) ఆదరణ పోగొట్టుకున్నారు. జిన్నా ప్రసంగాన్ని ఉటంకించడం చేత తన అనుయాయుల గౌరవాన్ని పోగొట్టుకున్నారు. జిన్నా మొదట్లో ఉదారవాది. రాజకీయ కారణాల చేత మతవాది అయ్యారు. దేశవిభజన సందర్భంగా జరిగిన కల్లోలాన్ని చూసి చలించి పాకిస్తాన్‌ను సెక్యులర్ రాజ్యంగా చేద్దామనుకుని ఆ ప్రసంగం చేశారు. అయితే అలా జరగలేదు. పాకిస్తాన్ మతరాజ్యంగానే తయారైంది. జిన్నా మాటలు గాలికి పోయాయి. అవి ప్రస్తావించి

ఆద్వానీ రాజకీయంగా దెబ్బ తిన్నారు. ఇదీ ఆద్వానీ గురించి నా అభిప్రాయం. ఆయనవి తీవ్రభావాలైతే మోదీవి మరీ తీవ్రభావాలని నా భావన. అటువంటివాళ్లు భారత రాజకీయాల్లో ప్రస్తుత పరిస్థితుల్లో ముందుకు రావడం కష్టమని, ఈ సంకీర్ణయుగంలో మరీ కష్టమని నా వాదన.

సంకీర్ణం ఏర్పరచాలంటే పొత్తు కోసం ఎవరిమీద ఆధారపడాలి? జయలలిత, మమతా బెనర్జీ, మాయావతి.. యీ తిక్క మనుషులు ఎప్పుడు వుంటారో, ఎప్పుడు వెళ్లిపోతారో తెలియదు. వీళ్లను భాగస్వాములుగా పెట్టుకుని 'అవినీతిరహిత ప్రభుత్వాన్ని నడుపుతాను, మీమీద సిబిఐ కేసులు మరింత ముమ్మరంగా నడుపుతాను' అంటే వూరుకుంటారా? గతంలో జయలలిత వాజపేయి ప్రభుత్వాన్ని అన్యాయంగా కూల్చేసిన మనిషి. వీళ్లందరినీ సంతృప్తి పరచడానికే రాజీ పడాల్సి వస్తుంది. పివి చేసినదీ అదే. స్వతహాగా ఆయనకంటూ ఆయన ఏమీ చేసుకోలేదు. కానీ ప్రభుత్వసుస్థిరత కోసం చేయాల్సి వచ్చింది. ఈ రోజు లక్షల కోట్ల రూ.ల అవినీతి జరుగుతోంది. ఇదంతా మన్‌మోహన్ తన కోసం చేస్తున్నారని అనగలమా? పోనీ సోనియాయే మొత్తం అంతా తీసుకుంటున్నారని అనగలమా? తమకోసం, ఎన్నికల కోసం, భాగస్వాముల కోసం... యిలా తడిసి మోపెడు అవుతోంది. మోదీ రాగానే యీ వ్యవస్థ మారిపోతుందా? ఆయన పత్తిత్తుగానే వుందామనుకున్నా, ఆయన పార్టీ పెద్దల సంగతేమిటి? భాగస్వాముల సంగతేమిటి? ఎన్నికల సంగతేమిటి? ఇవన్నీ ఆలోచించకుండా మోదీ వచ్చి అన్నీ అరికట్టేస్తాడు అనుకుంటే భ్రమ కాదా? సంకీర్ణ ప్రభుత్వపు పరిమితులు, దిగజారుతున్న నైతిక ప్రమాణాలు గుర్తెరిగి ఆశ పెట్టుకోవడం మంచిది.

నాకు మెయిల్స్ రాసిన మోదీ అభిమానులు నితిశ్‌పై విషం కక్కారు. తను ప్రధాని అయిపోదామనుకున్నాడు, మోదీ రంగంపై రావడంతో కుళ్లిపోయాడు అన్నారు. నితిశ్‌కు తన స్థాయి తెలియకపోదు. బిజెపికి వచ్చే స్థానాల్లో 10-15% స్థానాలు సంపాదించుకున్న వ్యక్తికి పగ్గాలు ఎందుకు అప్పగిస్తారు? ఎవరో బిజెపి వ్యక్తికే నాయకత్వం వస్తుందని అందరికీ తెలుసు. అది ఎవరు అనేదే ప్రశ్న. కాస్త పెద్దమనిషి తరహాగా వుంటే యశ్వంత్, జశ్వంత్, సుష్మా అయి వుంటే నిలిచేవాడేమో. మోదీ అనగానే అతని కున్న యిమేజి చూసి భయపడి పారిపోయాడు. ఆ యిమేజి ఏమిటి? మైనారిటీ వ్యతిరేకి అని, మొండివాడని, శత్రువుల పట్ల కఠినంగా వుంటాడనీ.. వగైరా! ఇవి ఎంతవరకు నిజం అనేది మోదీ కథ చెప్పినపుడు డిస్కస్ చేద్దాం. ఇప్పటికైతే యిమేజి యిలాగే వుంది.

మోదీది నియంత స్వభావం అని రాస్తే – జయలలితది కాదా, మమతది కాదా, వైయస్‌ది కాదా అని అడిగారు. అవును, వాళ్లూ యిదే బాపతు. అదేమీ హర్షించదగిన లక్షణం కాదు. కిరణ్ కుమార్ రెడ్డి ఎవర్నీ కలుపుకుపోడు, ఎవరినీ సంప్రదించడు అనే కదా ముఖ్యమైన ఫిర్యాదు. మోదీ కూడా అలాగే వుంటే అదేం గొప్ప? సోనియా దిగమంటే మరుక్షణం కిరణ్ దిగిపోతాడు. మోదీకి అలాగ చెప్పగలిగేవాళ్లు లేరు. అందుకని మరీ డేంజర్.

గుజరాత్‌లో ఏ మేరకు అభివృద్ధి జరిగింది అన్నదానిపై వివాదాలున్నాయి. మొన్న చార్‌ధామ్ విషయంలోనే చూశాం. మోదీ చేసిన హంగామా. తనేదో రాంబో స్టయిల్లో వరదల్లో చిక్కుకున్న 15 వేల గుజరాతీలను రక్షించేశానని బిల్డప్ యిప్పించాడు. అందరూ విరుచుకుపడేసరికి అబ్బే మోదీ తను స్వయంగా అలా అనలేదు అంటూ రాజ్‌నాథ్ వెనకేసుకుని వచ్చాడు. అసలు ఏ ఒక్క రాష్ట్రం నుండీ 15 వేల మంది యాత్రికులు వెళ్లినట్టు లేదు. వరదల్లో నుండి యాత్రికులు రక్షించినది సైన్యం మాత్రమే. వాళ్లను డెహ్రాడూన్‌కి చేర్చిన తర్వాత ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రులు తమ అధికారులను పంపి తమ యాత్రికులను తీసుకుని వెళ్లే ప్రయత్నాలు చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు ముఖ్యమంత్రులు ఏం చేశారో మోదీ కూడా అదే చేశారు. ఎటొచ్చీ వాళ్లు డప్పు కొట్టుకోలేదు. ఈయన కొట్టుకున్నాడు.

సహాయకార్యక్రమాలకు యుపి రూ. 25 కోట్లు యిచ్చింది. మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాణా తలా రూ. 10 కోట్లు యిచ్చాయి. ప్రగతిపథంలో దూసుకుపోతున్న గుజరాత్ యిచ్చినది రూ. 2 కోట్లు! "నేను 25 హెలికాప్టర్లు పంపిస్తానంటే ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి వద్దన్నాడు" అని మోదీ మండిపడ్డాడు. "ఇలాటి ఆఫర్లు యిచ్చిన వాళ్లకు థాంక్స్. కానీ వున్న హెలికాప్టర్లే వాడలేక పోతున్నాం. వాతావరణం బాగా లేదు. మీరు పంపి ప్రయోజనం లేదు." అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి మొత్తుకున్నాడు. మోదీకి కావలసినది పబ్లిసిటీ. దానికోసం ఎవరినైనా బలి వేయగలడు.

ఆదివారం సాయంత్రం మోదీ ఓ ప్రకటన చేశాడు – "కశ్మీరు సరిహద్దు కాపాడుతున్న యిద్దరు సైనికులను పాకిస్తాన్ తల నరికేస్తే యీ ప్రభుత్వం ఏమీ చేయలేదు. మన్‌మోహన్ దీనికి సంజాయిషీ చెప్పాలి" అని. అది జరిగినది 5 నెలల క్రితం. సహాయకచర్యల్లో ప్రాణాలొడ్డి పనిచేస్తున్న సైన్యానికి యిప్పుడీ విషయం గుర్తు చేయాలా? 'ఈ ప్రభుత్వం మీకేమీ చేయడం లేదు' అని గుచ్చి చెప్పి వాళ్లను డీమోరలైజ్ చేయడం కాకపోతే!? గతంలో బిజెపి సారథ్యంలో ఎన్‌డిఏ కూడా కేంద్రంలో వుంది. అప్పుడూ పాకిస్తాన్ యిలాటి పనులు అనేకం చేసింది. కనీసం దావూద్ ఇబ్రహీంను అప్పగించలేదు. అయినా పాకిస్తాన్‌కు భారత్ బస్సులు వేయలేదా? తాలిబన్లు విమానం హైజాక్ చేసినపుడు బిజెపి నాయకులు రాజీ పడి వాళ్ల కోరికలు తీర్చలేదా? ఉగ్రవాదులను విడిచి పెట్టలేదా? ప్రతిపక్షంలో వుండగా ఎన్నయినా చెప్పవచ్చు. అధికారంలోకి వెళితే పరిమితులు తెలుస్తాయి. మోదీ స్టేట్స్‌మన్ కాదనీ, ఒట్టి పొలిటీషియనే అని యిలాటివి నిరూపిస్తాయి.

తనను గొప్పగా చూపించుకోవడానికి ఎపిసిఓ పబ్లిక్ రిలేషన్స్ ఏజన్సీని నియమించుకున్నాడని ఒక పాఠకుడు రాశారు. ఈ ఏజన్సీ ఇరాక్ యుద్ధసమయంలో బ్రిటన్ ప్రధాని టోనీ బ్లయర్‌కు మద్దతు కూడగట్టడానికి పని చేసి అప్రతిష్ట మూటగట్టుకుందని

ఆయన రాశారు. రాజీవ్ హయాం నుండి రాజకీయనాయకులు యాడ్ ఏజన్సీలను, సర్వే సంస్థలను నియమించుకోవడం ఎక్కువైంది. జుట్టు నెరిసినా కాలేజీ పిల్లల్లాగానే కనబడతామన్న మాయమాటలు చెప్పి సబ్బులు అంటగట్టిన అనుభవంతో వాళ్లు మనకు నాయకుల్ని కూడా అంటగడుతున్నారు. గుజరాత్‌లో ఎదుగుదల గురించి గణాంకాలు దొరికాక రాస్తానన్నాను కదా. ఆంధ్రభూమి సంపాదకులు ఎమ్వీయార్ శాస్త్రి ఆరెస్సెస్ భావాలున్నవారు. ఆయన్ని ఓ పాఠకుడు గుజరాత్ అభివృద్ధి గురించి పత్రికాముఖంగా అడిగారు. ''గుజరాత్ బాగా ముందుకు వెళ్లిన మాట నిజం. కానీ 'అంత' లేదు. ప్రచారపు అతి కాస్త వుంటుంది'' అని జవాబిచ్చారాయన. 'అంత' లేదన్న మాట గ్రహిస్తూ ఎంత వుందో తెలుసుకోవాలి మనం. అది వెంటనే తెలియదు. ఓపిక అవసరం. ఈలోగా గుజరాత్‌లో నివసిస్తున్న పాఠకులు కొందరు నాకు మెయిల్స్ రాశారు – ''ఇక్కడ పరిస్థితులు ఏమీ బాగా లేవు. అంతా పబ్లిసిటీ స్టంట్'' అని.

ఇక మోదీ ఆరాధకులు, సమర్థకులు పదేపదే ప్రస్తావించిన అంశం గురించి చెప్తాను. ''మోదీ వస్తే యీ మైనారిటీల బుజ్జగింపు పోతుంది, కనీసం తగ్గుతుంది..'' అని. 'బుజ్జగింపు' అని నేను చాలా మర్యాదగా రాశాను. వాళ్లలో చాలామంది ఘాటైన పదాలు వాడారు. సాధారణంగా మైనారిటీలు అనగానే మనకు ముస్లిములే తడతారు. ఆరెస్సెస్, బిజెపి వారికైతే మరీనూ. కానీ క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు.. వీళ్లంతా మైనారిటీలే. కాంగ్రెస్ ముస్లిములను బుజ్జగిస్తూ పోయిందని, అందుకే వాళ్లు కొమ్మెక్కి కూర్చుని హిందువులపై పెత్తనం చలాయిస్తున్నారనీ, రాజకీయాల్లో మార్పు తెచ్చి వాళ్లను కిందకు దింపి, బుద్ధి చెప్పాలని ఆరెస్సెస్ వారు వాదిస్తారు.

'ఆ లెక్క ప్రకారం ముస్లిములు స్థితిగతులు హిందువుల కంటె బాగుండాలి కదా, వాళ్ల జనాభా దామాషా కంటె ఎక్కువ వుద్యోగాలు వచ్చి వుండాలి కదా, హిందువుల కంటె వాళ్లకే ఎక్కువ వ్యాపారాలు, వ్యవహారాలు, ఆస్తిపాస్తులు వుండాలి కదా, మరి అలా లేదేం?' అని అడిగితే 'అదంతా వాళ్ల స్వయంకృతం. ఛాందసత్వం కారణంగా వెనకబడి వున్నారు.' అనేసి తప్పించుకుంటారు. మైనారిటీలు గంపగుత్తగా ఓట్లు వేస్తారన్న అంచనాతోనే వాళ్లను అన్ని పార్టీలూ బుజ్జగిస్తున్నాయన్నది కఠోర వాస్తవం. అందుకే ఇఫ్తార్ విందులు, స్కల్ కాప్స్, ఉర్దూ వ్యాప్తికి కృషి చేస్తామన్న వాగ్దానాలూ.. (భాషకూ, మతానికీ లింకేమిటో వాళ్లకే తెలియాలి).

అయితే మీ ఆలోచనను కాస్త విస్తరింపచేసి చూడండి. ఈ నాయకులు ముస్లిములను మాత్రమే బుజ్జగిస్తున్నారా? క్రైస్తవులను వదిలిపెడుతున్నారా? హిందూ పుణ్యస్థలాల్లో వాళ్లు చట్టవిరుద్ధంగా మతప్రచారం చేస్తూ వుంటే ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదు? దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఎందుకు హామీలు గుప్పిస్తున్నారు? దళిత క్రైస్తవుడు అనే మాటకే అర్థం లేదు. హిందూమతంలోనే వుంటే కులం గొడవ... అగ్రవర్ణం అనీ, నీచవర్ణం అనీ. క్రైస్తవుడయ్యాక అతడికి కులం ఎక్కడ? దాని కారణంగా చిన్నచూపు ఎక్కడ? మైనారిటీలను మాత్రమే బుజ్జగిస్తున్నారా వీళ్లు? ఎస్సీ, ఎస్టీల మాటేమిటి?

'రాజ్యాంగం ఏర్పరచినపుడు ఎన్నేళ్ల వరకు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అని చెప్పారు మీరు? ఆ తర్వాత ఎన్నిసార్లు పొడిగిస్తూ పోయారు? పొడిగిస్తే పొడిగించారు, రిజర్వేషన్ల శాతం తగ్గించారా? 1947 నుండి 65 ఏళ్లగా హరిజనుల స్థితిగతుల్లో కొంచెమైనా మెరుగుపడలేదా? పడకపోతే మీరేమీ చేయనట్టు లెక్క ! ... పడితే ఆ మేరకు రిజర్వేషన్ శాతం తగ్గించండి.' ఇలా ఎవరైనా అడిగారా? ఏ పార్టీ అయినా..? పార్లమెంటులో రిజర్వేషన్ కొనసాగింపు గురించి బిల్లు పెడితే నూటికి నూరు శాతం చేతులెత్తేస్తారు. ఒక తరం రిజర్వేషన్ సౌకర్యం అనుభవించాక, వాళ్లను జనరల్‌గా చేసేయవచ్చు. తక్కిన కుటుంబాల వాళ్లకు మేలు కలుగుతుంది. కోటీశ్వరులు, లక్షాధికారులు అయిన హరిజనుల పిల్లలకు కూడా రిజర్వేషన్లు ఏమిటి అన్యాయంగా? 'డబ్బు గురించి కాదు, మాకు సాంఘిక స్థాయి లేదు' అంటున్నారు వాళ్లు. ఉన్నతోద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు.. అయ్యి అందరి చేతా సాష్టాంగ ప్రణామాలు చేయించుకుంటూ కూడా మాకు యిది చాలటం లేదంటే ఏం చెప్తాం? కాలేజీ సీట్లలో, ప్రజాప్రాతినిథ్యంలో కోటాలే కాదు, ఉద్యోగ నియామకాల్లోనే కాదు, ప్రమోషన్లలో కూడా వాళ్లకు కోటాయే! ఇది బుజ్జగింపు కాదా!

వీళ్లను చూసి మరి కొన్ని కులాలు 'మేం బిసిలం' అంటూ బయలుదేరారు. మళ్లీ వాళ్లకూ రిజర్వేషన్లు. ఎస్సీ, ఎస్టీల విషయంలో జనాభా యింత తెలుస్తుంది. వీళ్ల విషయంలో అంతా ఉజ్జాయింపు లెక్క. ఎంత అనుకుంటే అంత. కులపరంగా జనగణన జరగనప్పుడు రిజర్వేషన్ యివ్వవచ్చా? గట్టిగా ఎవరూ అడగరు. అడిగితే ఓట్లు పోతాయి. వాళ్లకి ఆర్థిక పరిమితి పెడదామంటే తర్జనభర్జన. ఈ బిసిలలో మళ్లీ వర్గీకరణ. ప్రతీ ఏడాదీ యింకొన్ని కులాలు మమ్మల్నీ వెనకబడినవాళ్లల్లో చేర్చండి అంటూ ఆందోళన. స్థానిక ఎన్నికలలో బిసి రిజర్వేషన్ల రగడ. రాష్ట్రస్థాయి అంకెలతో రిజర్వేషన్ యిస్తే పొరబాటు అంటూ జిల్లా స్థాయిలో వేశారు. తూర్పు గోదావరి జిల్లాలో గతంలో 452 వుంటే యీ లెక్క ప్రకారం 294 అయ్యాయి. అంటే ఇన్నాళ్లూ 35% ఎక్కువ అనుభవించారన్నమాట. పశ్చిమ గోదావరిలో 337 వుంటే 248 అయ్యాయి. కర్నూలులో 406 వుంటే 337 అయ్యాయి. కొన్ని జిల్లాలలో ఎక్కువ చేసి మొత్తం రాష్ట్రం మీద సర్దేశారు.

ఇది ఆపాలని, ఎస్సీ ఎస్టీలకు రాష్ట్రస్థాయిలో యిచ్చినపుడు మాకు మాత్రం ఎందుకివ్వరు అంటూ బిసి నాయకులు కోర్టుకి వెళ్లారు. ఇలా ఒకర్ని చూసి మరొకరు. సామాజికపరమైన వెనుకబాటుతనం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు యిచ్చి బుజ్జగిస్తున్నారనడానికి యీ వుదాహరణలు. రాజకీయలబ్ధి కోసం చేసే బుజ్జగింపులు మాటేమిటి? రెడ్లు జగన్ వెంట వెళ్లిపోతున్నారు కాబట్టి.. అంటూ కిరణ్ కాబినెట్‌ను రెడ్లతో నింపివేయడాన్ని ఏమనాలి? ఈ రోజు కమ్మలు టిడిపి వెళ్లకుండా చేయడానికి అంటూ కావూరి సాంబశివరావుకి కాబినెట్ హోదా యిస్తే ఏమనాలి? ఆయనకు అర్హత లేదని నేననను. అది ఒక్కటే ప్రాతిపదిక అయితే ఎప్పుడో రావాలి. ఇంతకాలం

ఆగారు కాబట్టే యీ వూహాగానాలు బయలుదేరాయి. కాబినెట్ విస్తరణపై రాహుల్ ముద్ర, యువతరానికే ప్రాధాన్యం అంటూ దప్పుకొట్టి పదవులు యిచ్చినవాళ్లలో అందరి కంటె చిన్నవాడు జెడి శీలం – షష్టిపూర్తి చేసుకున్నవాడు! పెద్దవాడు – కూచుంటే లేవలేని ఓలా! ఎందుకిచ్చారు? అంటే రాజస్థాన్‌లో ఎన్నికలున్నాయి. జాట్‌లను బుజ్జగించాలి అని సమాధానం. ఇలా అడుగడుగునా బుజ్జగింపులు కనబడుతూ వుంటే కేవలం ముస్లిముల మీదే పడి ఏడవడం దేనికి? ప్రతిభకే పట్టం కడతాం, యీ రిజర్వేషన్లు బంద్ చేస్తాం అని ఏ రాజకీయ పార్టీ అయినా అంటుందా? ఆరెస్సెస్...? బిజెపి...? మోదీ...?

అందరికీ ఓట్లు కావాలి. నేను మద్రాసులో వుండే రోజుల్లో మా యింటి పక్కావిడ అయ్యంగార్లు. ఎమ్జీయార్ మరణానంతరం జయలలిత పోటీ చేస్తున్న రోజులు. ''నేను జయలలితకే ఓటు వేస్తాను. తనూ అయ్యంగారే. బ్రాహ్మణులకు ఏమైనా చేస్తుందేమో'' అందావిడ. తమిళనాడులో బీసీ కోటా చాలా ఎక్కువ కాబట్టి వాళ్లబ్బాయికి యింజనీరింగు సీటు దొరక్క బెంగుళూరులో చదువుతున్నాడు. అదీ ఆవిడ బాధ. ''జయలలిత కాదు, పార్థసారథి కోయిల్‌లోని పూజారి ముఖ్యమంత్రి అయినా బ్రాహ్మణులకు ఏమీ ఒరగబెట్టరు – గుత్తగా ఓట్లేస్తామని బ్రాహ్మణులు బెదిరిస్తే తప్ప! ఆ బిసి రిజర్వేషన్లు ఎవరూ తగ్గించరు.'' అన్నాను. ఆ సారి కాదు కానీ, తర్వాతి రోజుల్లో జయలలిత సిఎం అయింది. బిసి రిజర్వేషన్లు ఏమీ తగ్గలేదు. బ్రాహ్మలకు ఏమీ కలిసి రాలేదు.

ఈ ఓటు రాజకీయాల్లో, యీ కోటా రాజకీయాల్లో మోదీ వచ్చి ముస్లింలకు యిప్పుడున్న సౌకర్యాలు తీసేస్తాడని అనుకుంటే అంతకంటె అవివేకం లేదు. బిజెపికి సొంతంగా ఏ 300 సీట్లో వచ్చినపుడే కామన్ సివిల్ కోడ్, ఆర్టికల్ 370 రద్దు, రామమందిరం లాటివి జరగవచ్చు. అలా 300 సీట్లు రావడం యిప్పట్లో జరగదు. (సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)

జూన్ 13 వీక్లీకై ఎమ్బీయస్ : న్యూస్..వ్యూస్.. రివ్యూస్

వయసుతో పని ఏముంది?

కర్ణాటక మంత్రివర్గంలో ఐటి శాఖను ఎస్ ఆర్ పాటిల్ అనే 65 ఏళ్ల నాయకుడికి అప్పగించడంపై బయోకాన్ అధినేత్రి కిరణ్ షా, ఇన్ఫోసిస్‌కి సిఎఫ్ఓగా పని చేసిన మోహన్‌దాస్ పయ్ అభ్యంతరం తెలిపారు. ''ఐటీ సెక్టార్‌కు చురుకైన యువకుడు కావాలి తప్ప యిలాటి వృద్ధుణ్ని పెడితే ఎలా?'' అని వారి అభ్యంతరం. పాటిల్‌కు ఒళ్లు మండింది. ''ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఐటీ విప్లవం తెచ్చినపుడు ఎస్.ఎమ్.కృష్ణ షష్టిపూర్తి చేసుకున్నవాడే. అయినా మొన్నటిదాకా నడిచిన బిజెపి ప్రభుత్వంలో ఐటీ శాఖ నిర్వహించిన కట్టా సుబ్రమణ్య నాయుడు కూడా యించుమించు నా వయసు వాడే కదా, అప్పుడు లేని అభ్యంతరం యిప్పుడు ఎందుకు వచ్చింది?'' అని అడిగాడు. తన కంటె చిన్న వాళ్లకు ఇన్ఫోసిస్‌కు అప్పగించి తప్పుకున్న నారాయణమూర్తిని 'మా వల్ల కావటం లేదు, నువ్వు రిటైరు కావడానికి వీలు లేదు. మళ్లీ రా' అని పిల్చుకుని వెళ్లిన ఉదంతం చూస్తూ కూడా ఇన్ఫోసిస్‌లో పని చేసిన మోహనదాస్ యిలా ఎలా అన్నాడో తెలియదు. కిరణ్ షా కు 60 ఏళ్ల వయసు. బయోకాన్ తన కంటె చిన్నవాళ్లకు అప్పగించే ఉద్దేశమే లేదు. అలాటప్పుడు యిలా వయసు గురించి మాట్లాడడమేమిటి, అయినా ఐటీ మంత్రి అన్నవాడు పాలసీలు నిర్ణయిస్తాడు తప్ప ప్రోగ్రాములు రాస్తూ కూర్చుంటాడా అని మండిపడిన శాసనమండలి సభ్యులు వీళ్లిద్దరి మీద హక్కుల కమిటీకి ఫిర్యాదు చేస్తామన్నారు. దెబ్బకు దడిసిన షా, పయ్ 'క్షమించండి బాబోయ్' అన్నారు. కిరణ్ షా మంత్రి గారిని స్వయంగా కలిసి క్షమాపణ చెపుదామని అనుకుంటున్నారట.

---

**మంత్రాలయం చింతకాయలు రాల్చవచ్చు...**

మహారాష్ట్ర బిజెపికి అధ్యక్షుడిగా పని చేసిన సుధీర్ ముంగాటివార్ వాస్తు మంత్రం తమకు చింతకాయలు రాల్చవచ్చని నమ్ముతున్నారు. ''పార్టీ ఆఫీసులో మార్పులు చేర్పులు చేస్తే అరిష్టం చుట్టుముడుతోంది. మా పార్టీ అధ్యక్షుడిగా వున్న నితిన్ గడ్కరీ ఢిల్లీ ఆఫీసు పాతబడిపోయింది అంటూ మార్పులు చేయించి తీర్చిదిద్దితే రెండు నెలలు తిరక్కుండా ఆయన అధ్యక్షపదవి నుండి దిగిపోవాల్సి వచ్చింది. అది గ్రహించకుండా రాష్ట్ర అధ్యక్షుడిగా వున్న నేను తీరి కూర్చుని ముంబయిలో వున్న పార్టీ ఆఫీసుని బాగు చేయించి హంగులు దిద్దడం మొదలుపెట్టాను. అంతే నా ఖర్మా కాలింది. దేవేంద్ర ఫడ్నవీస్‌కు పదవి అప్పగించి యింట్లో కూర్చున్నాను. ఇప్పుడు కాంగ్రెసు–ఎన్‌సిపి ప్రభుత్వం మంత్రాలయం (సెక్రటేరియట్) మరమ్మత్తులు మొదలుపెట్టారు. గత ఏడాది చాలాభాగం కాలిపోయింది కదా, పునర్నిర్మిద్దామని వాళ్ల ప్రయత్నం. మంత్రాలయం బాగుపడవచ్చేమో కానీ మంత్రులకు మాత్రం ఉద్వాసన తప్పదు. వచ్చేసారి మా పార్టీకి విజయం తథ్యం.'' అంటున్నారాయన.

---

**ఇద్దరూ చెరో మెట్టూ దిగారు...**

పంచాయితీ ఎన్నికలు జరపాలంటే మూడు విడతల్లో జరిగి తీరాలనీ, కేంద్రప్రభుత్వ బలగాలు వుండి తీరాలనీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్టుబట్టింది. ఈ రాష్ట్రంలోని 70% పోలింగు బూతుల్లో 70% ఎన్నికల నిర్వహణ కష్టం. గొడవలు జరగడానికి ఆస్కారం వుంది. రాష్ట్ర పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తే కష్టం అని ఎన్నికల కమిషన్ భావన. రెండు విడతల్లోనే చేసి తీరతాం, కేంద్రబలగాలను అడుగు పెట్టనీయం అని మమతా బెనర్జీ ప్రభుత్వం మొండికేసింది. కోర్టు కెళ్లారు. హైకోర్టు సింగిల్ బెంచ్ మే 10 న తీర్పు చెపుతూ మూడు విడతల్లో చేయాల్సిందే, కేంద్రబలగాలు కావాలంటే తీసుకోవచ్చు అని చెప్పింది. ఠక్ వల్లకాదు అంది మమత. డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసింది. మే 14 చీఫ్ జస్టిస్ తీర్పు చెపుతూ "మూడు విడతలు తప్పవు కానీ, కేంద్ర బలగాలు అక్కరలేదు. రాష్ట్ర పోలీసుల పట్ల కఠిన నిబంధనలు విధించండి. తగినంత సిబ్బంది వినియోగించండి. ఏ మాత్రం పక్షపాతం చూపినా చర్య తీసుకోండి." అన్నారు. ఇరుపక్షాలూ సరే అన్నాయి. అందువలన జులై 2, 6, 10 తారీకుల్లో బెంగాల్‌లో పంచాయితీ ఎన్నికలు జరుగుతాయి. శారదా చిట్ ఫండ్స్ కారణంగా నష్టపోయిన పల్లె ప్రజలు త ృణమూల్ పట్ల ఆగ్రహంగా వున్నారు కాబట్టి పంచాయితీ ఎన్నికలలో ఆ పార్టీ ఓడిపోతుందని మొదట్లో అనుకున్నారు కానీ, అసెంబ్లీకి జరిగిన ఉపయెన్నికలలో ఆ పార్టీ మంచి విజయాలను సాధించింది. అందువలన ఎన్నికల ఫలితం ఎలా వుంటుందో ఎవరూ ఊహించలేరు.

---

**సెల్ నుండి సెల్ ద్వారా ప్రచారం ...**

జైలు సెల్లు నుండి సెల్‌ఫోన్ ద్వారా ఎన్నికల ప్రచారం చేసి విజయం ఎలా సాధించవచ్చో హర్యాణాలో లోకదళ్ పార్టీ నిరూపించింది. ఆ పార్టీకి చాలాకాలంగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. 1999 నుండి అది ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేదు. 2005లో రాష్ట్రప్రభుత్వంలో అధికారం పోగొట్టుకున్నాక ప్రతిపక్షంలోనే మగ్గుతోంది. ఈ కష్టాలు చాలనట్టు పార్టీ అధ్యక్షుడైన ఓం ప్రకాశ్ చౌటాలా, అతని కుమారుడు పార్టీ ప్రముఖుడు అయిన అజయ్ యిద్దరికీ టీచర్ల నియామకం స్కామ్‌లో పదేళ్ల శిక్ష పడింది. ఈ జనవరిలో జైలుకి వెళ్లి కూర్చుని మే నెలలో జరగబోయే మునిసిపల్ ఎన్నికలకు ప్రచారం ఎలా అని బెంగ పెట్టుకున్నారు. అజయ్ యిద్దరు కొడుకులు – దుష్యంత్ (24 ఏళ్లు), దిగ్విజయ్ (22 ఏళ్లు) – ప్రచారభారం నెత్తిన వేసుకుని తిరగసాగారు. దిగ్విజయ్ ఫిబ్రవరిలో సోనేపట్‌లో ఓ సభ పెట్టి 'తీహార్ జైల్లో వున్న మా నాన్న మిమ్మల్ని ఉద్దేశించి ప్రసంగిస్తాడు వినండి' అన్నాడు. సెల్‌లో తండ్రికి కాల్ చేసి స్పీకర్ ఆన్ చేశాడు. అంతే అజయ్ ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించాడు. 'అలా ఎలా ఒప్పుకున్నారు?' అని తీహార్ జైలు అధికారులను పాత్రికేయులు ప్రశ్నిస్తే 'రూలు ప్రకారం కుటుంబసభ్యులతో 5 ని॥ల పాటు ఫోన్లో మాట్లాడవచ్చు." అన్నారు వారు. అజయ్ మాట్లాడినది కుటుంబసభ్యులతో కాదు కదా అని అడగలేదు కానీ అడిగి వుంటే 'జగమంత కుటుంబం ఆయనది' అని సమాధానం యిచ్చేవారేమో!

ఇది చాలనట్లు ఓం ప్రకాశ్ చౌటాలా సరిగ్గా ఎన్నికలకు ముందు "నాకు హ ృద్రోగం వుంది. పేస్‌మేకర్ పెట్టించుకోవాలి. ఆరువారాల బెయిల్ యిప్పించండి" అని అర్జీ పెట్టుకున్నాడు. సరేనన్నారు కోర్టువారు. చౌటాలా గుడ్‌గావ్‌లోని మేదాంతా మెడిసిటీలో చేరి, సర్జరీకి ముందు వారాల తరబడి తిష్ట వేసి అనేక పార్టీల వాళ్లను తన రూముకి రప్పించుకుని మంతనాలు సాగించాడు. గతంలో (1987–89లో, మళ్లీ 2000–05 లో) లోకదళ్‌కు బిజెపికి పొత్తు వుండేది. 2009 ఎన్నికలకు ముందు ఎన్‌డిఏ నుండి లోకదళ్ తప్పుకుంది. తనను కలసిన కొంతమంది దగ్గర వచ్చే ఎన్నికలలో మేం మూడో ఫ్రంట్‌తో కలుస్తాం అనసాగాడు. అది విని రాజ్‌నాథ్ సింగ్ వచ్చి కలిశాడు. బిజెపిని యిప్పుడు ఏలుతున్న మోదీ చౌటాలాకు మిత్రుడే. అతనే కాదు, పొరుగున వున్న పంజాబ్‌లో రాజ్యం చేస్తూ ఎన్‌డిఏలో భాగస్వాములుగా వున్న ప్రకాష్ సింగ్ బాదల్ కూడా చౌటాలాకు స్నేహితుడే. వాళ్లు చెప్పి పంపించారేమో తెలియదు కానీ రాజ్‌నాథ్ వచ్చి ఎన్‌డిఏలో మళ్లీ చేరమని ఆహ్వానించాడు. అదీ ఆలోచిస్తా అన్నాడు చౌటాలా.

ఎన్నికలలో ఏ తెరచాటు పొత్తులు కుదిరాయో తెలియదు కానీ జూన్ 2 న వెలువడిన ఫలితాలు లోకదళ్‌కు మరీ నిరాశ కలిగించలేదు. 7 మునిసిపాలిటీలలో గెలిచిన 144 మందిలో 103 మంది కాంగ్రెసు మద్దతుదారులైన యిండిపెండెంట్లు కాగా, 16 మంది లోకదళ్ వాళ్లే! సెల్ ప్రచారం పని చేసినట్టే మరి! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 14 వీక్లీకై** **ఎమ్బీయస్ : అల్లుడా మజాకా అనిపించిన గురునాథ్**

బిసిసిఐ అధ్యక్షుడిగా ఎంతో అధికారం చలాయించిన శ్రీనివాసన్ తన అల్లుడు గురునాథ్ మెయ్యప్పన్ ఒత్తిడికి లొంగి ఆ కారణంగా వివాదాలలో యిరుక్కున్నారు. తాత్కాలికంగానైనా పదవి పోగొట్టుకున్నాడు. సోనియాకే తప్పలేదు, శ్రీనివాసన్ అనగా

ఎంత? బిజెపి నాయకుడు ప్రకాశ్ జవదేకర్ చమత్కరించారు –

'హర్ దామాద్‌కా ఏక్‌హీ ఆస్ (ప్రతీ అల్లుడికీ ఒక్కటే ఆశ)

శ్రీనివాసన్ జైసా ససుర్, సోనియా జైసీ సాస్' (శ్రీనివాసన్ లాటి మామ, సోనియా వంటి అత్త)

మెయ్యప్పన్ పేరు వినగానే మన తెలుగువాళ్లకు గుర్తుకు వచ్చేది ఎవిఎమ్ బ్యానర్‌పై కనబడే ఎవి మెయ్యప్పన్ చెట్టియార్. ప్రస్తుతం క్రికెట్ బెట్టింగు కుంభకోణంలో పేరు చెడగొట్టుకుని అరెస్టయిన గురునాథ్ మెయ్యప్పన్ ఆయన మనుమడే. 1948లో ఎవియం బ్యానర్, స్టూడియో స్థాపించి అనేక ఆరోగ్యకరమైన, కుటుంబగాథా చిత్రాలు తీసి సమాజంలో విలువలు కాపాడిన మెయ్యప్పన్‌కు నలుగురు కొడుకులు – మురుగన్, కుమరన్, శరవణన్, బాలసుబ్రమణియన్. మెయ్యప్పన్ మరణానంతరం మురుగన్ 1978లో విడిగా వెళ్లిపోయాడు. ఇంకో ఆరేళ్లకు కుమరన్ కూడా వెళ్లిపోయాడు. ఎవియం ప్రొడక్షన్స్, స్టూడియో, టీవీ నిర్మాణం వగైరా అనేక వ్యాపారాలను తక్కిన యిద్దరూ నిర్వహించసాగారు. కొద్ది రోజులకు శరవణన్ కుమారుడైన ఎమ్ఎస్ గుహన్, బాలసుబ్రమణియన్ కుమారుడైన గురునాథ్ కూడా భాగస్వాములుగా చేరారు. విభేదాలు వచ్చి 2005లో కంపెనీ నిట్టనిలువుగా చీలిపోయింది. బాలసుబ్రమణియన్, గురునాథ్ కలిసి తమను మోసం చేసి కంపెనీలో డబ్బులొచ్చే విభాగాలన్నీ తమ కింద పెట్టుకున్నారని శరవణన్ బాధ. ఆయన రజనీకాంత్‌తో "శివాజీ" సినిమా తీశాడు. గురునాథ్ కూడా సినిమారంగంలో ప్రవేశించి విజయ్ హీరోగా "వేట్టయ్‌కారన్" అనే భారీ సినిమా తీశాడు. తర్వాత ఆ రంగంలోకి పెద్దగా వెళ్లలేదు కానీ తన ట్విట్టర్ ఎక్కవుంటులో తనను ఎవియం ఎంటర్‌టైన్‌మెంట్, ఎవియం స్టూడియోస్, ఎవిఎం కనస్ట్రక్షన్స్‌కు ఎండీగా చూపుకుంటాడు.

గురునాథ్‌కి నిజంగా ఆసక్తి వున్న రంగం – క్రీడలు! అతని తల్లి లలిత గోల్ఫ్ క్రీడాకారిణి. ఇతనికీ బాగా నేర్పించింది. ఇతను పళని హిల్స్ ఓపెన్ ఎమెచ్యూర్ గోల్ఫ్ టూర్నమెంట్‌లో అనేక సార్లు అవార్డులు గెలుచుకున్నాడు. అక్కడే అతనికి రూపా పరిచయమైంది. రూపా తండ్రి శ్రీనివాసన్ బిసిసిఐకు ప్రెసిడెంటు. ఐదేళ్లపాటు ప్రేమించుకుని, అడ్డంకులు దాటుకుని, చివరకు 2001లో వాళ్లు పెళ్లాడారు. గురునాథ్‌కు క్రికెట్‌పై ప్రేమ లేదు. అతని వన్నీ ఎడ్వెంచర్ స్పోర్ట్స్. ఫార్ములా ఏసియా కారు రేసుల్లో పాల్గొన్నాడు. సెయిలింగ్ క్లబ్బులో మెంబరు, ఏరో మోడలర్. ఒకప్పుడు ఫెరారీ వుండేది. కితం ఏడాది 5 కోట్ల రూ.లు పెట్టి యాచ్ కొన్నాడు. అలాటిది అతను 2008లో హఠాత్తుగా చెన్నయ్ సూపర్ కింగ్స్ (సిఎస్‌కె)కు టీమ్ ప్రిన్సిపాల్ అయిపోయాడు. ఆ టీము మావగారు శ్రీనివాసన్‌దే. కుమారుడు అశ్విన్ తను 'గే' అని ప్రకటించుకున్నాక కుటుంబం నుండి వెలివేసిన శ్రీనివాసన్ అల్లుణ్ని చేరదీశాడు. బిసిసిఐ బోర్డు సభ్యుడిగా వున్న శ్రీనివాసన్ సిఎస్‌కెలో భాగస్వామ్యం తీసుకోవడంపై యితర సభ్యులు అభ్యంతరం చెప్పారు. శరద్ పవార్ అదేమీ తప్పు కాదన్నాడు. అందుకు అనుగుణంగా బోర్డు నిబంధనలు సవరించారు. అభ్యంతరం చెప్పిన లలిత్ మోదీని తప్పించారు. లలిత్‌ను తీసేయడానికి గల యితర కారణాలకు యిది తోడైంది. ఆ విధంగా అనుమతి సంపాదించుకున్న తన టీముకి శ్రీనివాసన్‌ను అల్లుణ్ని అధిపతిని చేశాడు.

గురునాథ్ స్వభావరీత్యా కలుపుగోరు వ్యక్తి కాదు. ఐపియల్‌లో యితర టీము ఓనర్లతో అతను కలవడు. తన టీము వాళ్లతో కూడా కలిసి ప్రయాణం చేయడు. మావగారి ప్రత్యేక విమానంలో వెళతాడు. చెన్నయ్‌లో గత ఏడాది ఐపియల్ ఓపెనింగ్ పార్టీకి అతను రానే లేదు. కుటుంబంతో ఎక్కువ సేపు గడపడానికి యిష్టపడతాడు. అతనికి యిద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. అబ్బాయికి పది నెలలే. చాదస్తాలు ఎక్కువేట. తన టీము ఫీల్డింగ్ చేస్తూంటే ఆడిటోరియంలో వుంటాడు తప్ప, బాటింగ్ చేస్తూంటే వుండడు. వికెట్లు త్వరగా పడిపోతాయని నమ్మకంట. సినిమారంగంలో తనకున్న పరిచయాలను క్రికెట్‌కు ముడివేశాడు. తన తండ్రికి మిత్రుడైన దారా సింగ్ ద్వారా అతని కుమారుడు విందూను పరిచయం చేసుకున్నాడు. అతన్నీ బెట్టింగులోకి దింపాడు. ఇప్పుడు అతనితో బాటు తనూ అరెస్టయ్యాడు. ఈ రకంగా చూస్తే ప్రమాదకరమైన స్పోర్ట్స్‌లో కంటె డబ్బులో మునిగి తేలుతున్న క్రికెట్‌లోనే ఎక్కువ రిస్కున్నట్టుంది. – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)

జూన్ 15 వీక్లీకై ఎమ్బీయస్ : అజిత్ జోగికి నష్టం – కాంగ్రెసుకు లాభం

విద్యా చరణ్ శుక్లా మరణంతో ఛత్తీస్ గఢ్ మారణహోమంలో మరణించిన వారి సంఖ్య 29కు చేరింది. నిజానికి ఆయన మే 25 నాడే పోవలసినవాడు. కానీ మరి కొన్ని రోజులు ఆయుర్దాయం వుండటం చేత మావోయిస్టులు ఆ రోజు కాల్పుల్లో చనిపోయాడని పొరబడి కారులోనే వదిలేశారు. తర్వాత పోలీసులు వచ్చి చూస్తే యింకా నాడి కొట్టుకుంటోంది. ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అంతిమంగా చావు తప్పలేదు. ఆనాటి ఘటనలో చాలామంది కాంగ్రెసు నాయకులు మరణించారు. దాని వలన రాజకీయంగా లాభపడేదెవరు అన్న విషయం కొద్దికాలంలోనే తేలుతుంది.

నవంబరులో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బిజెపి ముఖ్యమంత్రి వికాస్ యాత్ర జరపగా కాంగ్రెసు వాళ్లు 'పరివర్తన యాత్ర' చేపట్టారు. ఆ యాత్ర కోసం అసాం నుండి ఒక 'లక్కీ' బస్సు తెప్పించారు. దాన్ని ప్రచారంలో వుపయోగించడం చేతనే అసాం, హిమాచల్ ప్రదేశ్ ఎసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసు విజయం సాధించిందని ఎవరో చెపితే పిసిసి అధ్యక్షుడు నందకుమార్ పటేల్ దాన్ని పట్టుకుని రమ్మన్నారు. మావోయిస్టులు ఎటాక్ చేసినపుడు ఆ బస్సు వాహనశ్రేణిలో ముందే వుంది. కానీ ఏం లాభం?

పటేల్, ఆయన కుమారుడు దినేష్, సల్వాజుడుం నాయకుడు మహేంద్ర కర్మ, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముదలియార్ – అందరూ చనిపోయారు. సుక్మా వద్ద ఒక ర్యాలీకి హాజరయ్యా మధ్యాహ్న భోజనాలు చేసి, ప్రెస్ కాన్ఫరెన్సులో పాల్గొని నాయకులందరూ మధ్యాహ్నం 3.30కు 30 కార్లలో బయలుదేరారు. దర్భావద్ద జీరం కొండ వద్ద మూడో వాహనం పేలిపోయింది. నాలుగేళ్ల క్రితం భూమిలో పాతిపెట్టిన 25 కిలోల ఆర్‌డిఎక్స్‌యే ఆ పేలుడుకి కారణమని తర్వాత తెలిసింది. ఆ శబ్దం వినగానే వాహనాలన్నీ ఆగిపోయాయి. అంతే బుల్లెట్ల వర్షం కురవసాగింది.

దుర్ఘటన జరగగానే స్థానిక కాంగ్రెసు నాయకులు సరైన సెక్యూరిటీ యివ్వలేదంటూ బిజెపి ప్రభుత్వాన్ని తప్పు పట్టారు. అజిత్ జోగి గవర్నరు శేఖర్ దత్‌ను కలిసి రాష్ట్రంలోని కాంగ్రెసు నాయకత్వాన్ని తుడిచిపెట్టి వేసే కుట్ర జరిగిందని, దానికి బిజెపి ప్రభుత్వం సహకరించిందని ఆరోపించారు. వెంటనే 'దీని వెనక వున్నది కాంగ్రెసు వారి హస్తమే, మరీ ముఖ్యంగా అజిత్ జోగీది. తన రాజకీయ ప్రత్యర్థులందరినీ ఒక్క దెబ్బతో చంపి పారేయడానికి మావోయిస్టులతో కలిపి జోగి కుట్ర పన్నాడు' అని బిజెపి నాయకులు అన్నారు. 'అజిత్ జోగి సుక్మా నుండి యితరులతో బాటు కారులో రాకుండా హెలికాప్టరులో రావడమేం?' అని అడిగారు. 'అనారోగ్య కారణాల వలన జోగి హెలికాప్టర్ ఉపయోగించడం ఎప్పణ్నుంచో వున్నదే కదా, యివాళ ప్రత్యేకంగా చేసినది కాదు కదా' అన్నారు జోగి అనుచరులు.

అయితే జోగికి కుడిభుజంగా వున్న ఎమ్మెల్యే కవాశీ లక్మా నిరపాయంగా బయటపడడం మాత్రం మిస్టీరియస్‌గా తయారైంది. మావోయిస్టులు కొందర్ని చంపివేసి, మరికొందర్ని బందీలుగా పట్టుకెళ్లారు కానీ యితన్ని వదిలేశారు. ఇతను దర్భా పోలీసు స్టేషన్‌కు వచ్చి సంఘటన గురించి చెప్పాడు. 'మరి మీరు యింతదూరం ఎలా వచ్చారు?' అని అడిగితే 'మోటార్ సైకిలు మీద వచ్చాను. రోడ్డు మీద ఓ పక్కగా కనబడింది. తాళం చెవి కూడా పెట్టి వుంది.' అన్నాడు. ఇది బొత్తిగా 'సినేమా కత'గా కనబడుతోందని అందరూ అన్నారు. అయితే లక్మా మావోయిస్టు సానుభూతిపరుడని అందరికీ తెలుసు. ఇతనితో బాటు మరొక గిరిజన నాయకురాలు ఫూలోదేవి నేతమ్‌ను కూడా మావోయిస్టులు వదిలి వేశారు. ఏ కారణం చేత వదిలేసినా లక్మా అజిత్ జోగికి సన్నిహితుడు కావడం జోగి కొంప ముంచింది. సోషల్ నెట్‌వర్క్‌ల్లో జోగియే యీ హత్యలకు కారకుడు అని రాయసాగారు. ఆ రాతల వలన తన పరువు పోతోందంటూ వాళ్లపై జోగి పోలీసు కంప్లయింట్ యిచ్చాడు.

నిజానిజాలు తెలుసుకోవడానికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్‌ఐఏ) అనేకమంది కాంగ్రెసు నాయకులను ప్రశ్నించింది. యాత్రతో సంబంధం వున్న 150 మందిని లోతుగా విచారించింది. ఆ విచారణలో నలుగురు కాంగ్రెసు నాయకులు యాత్ర సమయంలో మావోయిస్టులతో నిరంతరం టచ్‌లో వున్నారని తెలిసిందని రాష్ట్ర పోలీసువర్గాలు అంటున్నాయి. ఎన్‌ఐఏ దీనిపై యూనియన్ హెూం మంత్రిత్వ శాఖకు మధ్యంతర నివేదిక సమర్పించిందని కూడా అంటున్నారు. హెూం మంత్రిని అడిగితే అలాటిదేమీ యివ్వలేదన్నారు. ఎన్‌ఐఏ కూడా మా విచారణ యింకా ప్రాథమిక దశలోనే వుంది అంటోంది. వాహనాలు వెళ్లే దారిని స్థానిక నాయకుడి సలహా మేరకు ఆఖరి నిమిషంలో మార్చారని మొదట్లో పుకార్లు వచ్చాయి. అదేమీ కాదని, ఎన్నడో నిర్ణయించిన ప్రకారమే వెళ్లారని కాంగ్రెసు స్పష్టం చేసింది.

ఎన్‌ఐఏ రిపోర్టు వెళ్లిందో లేక ఎన్‌ఐఏ అధికారులు నోటిమాటగా చెప్పారో తెలియదు కానీ కాంగ్రెసు అధిష్టానం జోగిని అనుమానిస్తోందని అనిపిస్తోంది. జోగి వ్యతిరేకులైన నాయకులను ముఖ్యమైన పదవుల్లో నియమించడం ద్వారా ఒక సంకేతాన్ని బలంగా యిచ్చింది. దివంగత పిసిసి అధ్యక్షుడు నందకుమార్ పటేల్ స్థానంలో చరణ్ దాస్ మహంత్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా, పరివర్తన యాత్ర కన్వీనర్‌గా భూపేష్ బాఘేల్‌ను నియమించారు. ఈ యిద్దరూ అజిత్ జోగికి విరోధులు. ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్‌లో భాగంగా వుండగా దిగ్విజయ్ సింగ్ మంత్రివర్గంలో సభ్యులు. ప్రస్తుతం మహంత్ కేంద్ర వ్యవసాయ శాఖలో సహాయమంత్రిగా వున్నారు. దిగ్విజయ్ సింగ్ మూడు రోజుల పాటు ఛత్తీస్ గఢ్‌లో పర్యటించడానికి వచ్చిన సమయంలోనే యీ నియామకాల వార్త వెలువడింది.

ఈ మరణాల వలన కలిగే సానుభూతి పవనాలు ఎన్నికలలో వుపయోగపడతాయని కాంగ్రెసు ఆశిస్తోంది. అందుకని ఘటన జరిగిన అదే కేస్లూరు గ్రామం నుండి అతి త్వరలో పరివర్తన యాత్రను పునఃప్రారంభిస్తామని ప్రకటించింది. ఈ ఘటనకు బిజెపిని దోషిగా నిలబెట్టాలనే ప్రయత్నాన్నీ మానలేదు. "ముఖ్యమంత్రి తన వికాసయాత్రకు 3000 మంది సెక్యూరిటీని తీసుకెళ్లారు. ఈ యాత్ర విషయంలో మహేంద్ర కర్మకు జెడ్ క్యాటగిరీ వున్నా బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా యివ్వలేదు... అవేళ వచ్చిన మావోయిస్టులు పటేల్ కోసమే ప్రత్యేకంగా అడిగారు. వాళ్లకు అనుకోకుండా మహేంద్ర కర్మ దొరికాడు. వాళ్లు అతన్ని గుర్తు పట్టలేదు. తనకోసం మిగతావాళ్లను చంపుతారన్న ఆదుర్దాతో కర్మయే స్థానిక బోండి యాసలో 'వాళ్లను చంపకండి. నేను మహేంద్ర కర్మను. కావాలంటే నన్ను తీసుకెళ్లండి.' అన్నాడు. స్థానిక కాంగ్రెసు నాయకత్వాన్ని నిర్మూలించడానికే యిదంతా జరిగిందని స్పష్టం కావటం లేదా?" అంటున్నారు కాంగ్రెసు వాళ్లు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రమణ్ సింగ్ ఏర్పాటు చేసిన అఖిలపక్షసమావేశానికి వెళ్లలేదు. శాసనసభ ప్రత్యేకసమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆఫర్ చేస్తే మేం బహిష్కరిస్తాం అంటున్నారు. ఈ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతిపాలన పెట్టాలన్న డిమాండ్‌తో కాంగ్రెసు శాసనసభ్యులందరూ మూకుమ్మడి రాజీనామా చేసినా ఆశ్చర్యం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

భారతసైన్యం యిటీవల కొత్త వివాదాల్లో చిక్కుకుంది. ఇది అవినీతికి, గూఢచర్యంకు సంబంధించిన విషయం కాదు. సిబ్బందిలోనే సెక్స్‌కు సంబంధించిన రకరకాల గొడవలివి. సైన్యాధికారుల గురి శత్రువుల మీద నుండి సహచరుల భార్యల అందచందాలపైకి మరలడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవి రచ్చకెక్కడంతో రక్షణమంత్రి ఆంటోనీ వీటిపై ప్రత్యేకద ృష్టి సారించారు. ఢిల్లీలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ట్రైబ్యునల్‌లో సెక్సువల్ హెరాస్‌మెంట్ (వేధింపులు) కేసుల విచారణ నిరంతరంగా సాగుతోంది. ఢిల్లీ కంటోన్మెంట్‌లో ఒక మేజర్ భార్యను ఒక సోల్జర్ చెరిచాడని ఒక కేసు. లెఫ్టినెంట్ జనరల్‌గా పనిచేసే ఎ.కె. నందా అనే వ్యక్తి ఇజ్రాయేలుకి అధికార పర్యటనలో వెళ్లినపుడు తన టెక్నికల్ సెక్రటరీ భార్యను చెరచబోయాడని మరో కేసు. ఆర్మీ ఆఫీసర్ల భార్యలు సంక్షేమ సమితిగా ఏర్పడి యిలాటి విషయాలపై ఫిర్యాదు చేసి విచారణ జరిగేట్లు చూస్తున్నారు.

ఒక కల్నల్ తన కింద పనిచేసే మహిళా అధికారిని ఆఫీసు పని నెపంతో యింటికి పిలిపించి తనతో శ ృంగారంలో పాల్గొనమని బలవంతం చేసిన కేసులో కోర్టు మార్షల్ జరిగి చివరకు ఆ కల్నల్ సర్వీసును ఆరేళ్లు తగ్గించి వేశారు. తన ఉన్నతాధికారి భార్యతో అక్రమసంబంధం పెట్టుకున్న లెఫ్టినెంట్ కమాండర్‌ను కితం నెలే ఉద్యోగంలోంచి తీసేశారు. ముంబయిలో వున్న నావల్ కమాండ్ అధీనంలో వున్న ఐయన్ఎస్ విరాట్‌పై పని చేస్తున్న కమాండర్ సెల్‌ఫోన్‌ద్వారా మహిళలకు అశ్లీల సందేశాలు పంపిస్తూంటే అతని ఉద్యోగానికీ ఉద్వాసన పలికారు.

మిలటరీలో మహిళలు తక్కువ సంఖ్యలోనే వున్నారు. ఆర్మీలో 7 వేల మంది, ఎయిర్ ఫోర్సులో 2 వేల మంది, నేవీలో 1500 మంది వున్నారు. ప్రమోషన్ల విషయంలో అసంతృప్తి కలిగినపుడు సహోద్యోగి, లేదా పై అధికారి తనను వేధించాడంటూ మహిళలు అకారణంగా కూడా కేసులు పెట్టవచ్చే ప్రమాదం వుంది. ఎయిర్ ఫోర్సులో స్క్వాడ్రన్ లీడర్ గా పనిచేసిన అంజలీ గుప్తా బెంగుళూరులో పని చేస్తూండగా తనపై ముగ్గురు సహోద్యోగులు అత్యాచారం చేశారని ఫిర్యాదు చేసింది. విచారణ జరిపి అవి నిరాధారమైన ఆరోపణలుగా తేల్చారు. ఆ తర్వాత 'విధినిర్వహణలో అవిధేయత చూపుతున్నావు, క్రమశిక్షణ లేదు.' అంటూ ఆమెను అర్థాంతరంగా డిస్మిస్ చేశారు ఉన్నతాధికారులు. ఆమె 2011లో ఆత్మహత్య చేసుకుంది. నిజానిజాలేమిటో ఎప్పటికీ పైకి రావు.

మిలటరీ సర్వీసెస్‌లో లేట్ నైట్ పార్టీలు సర్వసాధారణం. ముఖ్యంగా నేవీలో వారంలో చాలా రోజులు రాత్రి పొద్దు పోయేదాకా పార్టీలు జరగడం, ఆడా మగా అందరూ మద్యం సేవించడం, కలిసి న ృత్యాలు చేయడం జరుగుతూ వుంటుంది. వీటికి డ్రెస్ కోడ్ వుంటుంది. మహిళలు ఒక రోజు పొట్టి పొట్టి స్కర్టులు వేసుకోవాలని, మరో రోజు బ్యాక్‌లెస్ బ్లౌజులు వేసుకోవాలని యిలా నిబంధనలు పెడతారట. ఇలాటి పార్టీల్లో తమ తోటి ఉద్యోగులు తమతో అసభ్యంగా ప్రవర్తించారని మహిళా ఆఫీసర్లు ఫిర్యాదులు చేస్తూ వుంటారు. మరో పక్క 'ఈ మహిళా ఆఫీసర్లే మా భర్తలను లోబరుచుకుని మాకు దూరం చేస్తున్నారు. ఈ పార్టీల్లో హద్దు మీరి ప్రవర్తిస్తున్నారు' అంటూ కొందరు ఆఫీసర్ల భార్యలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ పార్టీల గురించి మాట్లాడుతూ ఒక రిటైర్డ్ కమొడోర్ "నేవీ కంటూ ఒక ప్రత్యేకమైన కల్చర్ వుంది. మేమంతా ఫ్యామిలీస్‌తో కలిసి తాగుతాం. సరదాగా వుంటాం. ఓ ఆఫీసరు భార్య పల్లెటూరి నుండి వచ్చిందనుకోండి, ఆమెకు యిదంతా వింతగా, ఎబ్బెట్టుగా వుంటుంది. అంతమాత్రం చేత మేమంతా చెడిపోయినవాళ్లమని కాదు. మనం చాలా నయం. అమెరికన్ మిలటరీలో 2012లో 26 వేల సెక్సువల్ హెరాస్‌మెంట్ కేసులు నమోదయ్యాయి. దానితో పోలిస్తే మన దగ్గర 1% కూడా వుండవు." అన్నాడు.

ఇటీవలి కాలంలో నేవీలో ఆరు కేసుల్లో చాలా కఠినంగా వ్యవహరించింది. కమొడోర్ సుఖ్‌జిందర్ సింగ్ ఓ యుద్ధనౌక పునర్నిర్మాణానికై రష్యా వెళ్లాడు. అక్కడ ఒక రష్యన్ యువతితో అక్రమసంబంధం పెట్టుకుని తమ రతికలాపాలను కెమెరాతో చిత్రీకరించాడు. వాటిని యింటర్‌నెట్‌లో అందరికీ పంపసాగాడు. అతన్ని గత ఏడాది నేవీ నుండి తొలగించారు. ఒక మేజర్ జనరల్‌కు కూడా అదే గతి పట్టింది. లేహ్‌లో పని చేస్తూండగా తన కంటె జూనియర్‌గా పనిచేస్తున్న మహిళా ఆఫీసరును బలవంతంగా అనుభవించినందుకు ఆ శిక్ష! నేవీలో గత రెండు నెలల్లో ఐదుగురు ఆఫీసర్లను తీసేశారు. ఇలా డిస్మిస్ చేసేందుకు ఆర్మీకు చట్టప్రకారం హక్కు వుంది. వాళ్లకు పెన్షన్ సౌకర్యం కూడా పోతుంది. ఆంటోనీ యీ విషయంలో చాలా పట్టుదలగా వున్నారు. "ఇది భారతదేశపు సంస్క ృతికి సంబంధించిన విషయం. నిందితుల పట్ల జీరో-టోలరెన్స్ చూపండి. పోనీ పాపం అని విడిచి పెట్టవద్దు." అని చెప్తున్నారు.

ఇది కొందరు నేవీ అధికారుల భార్యలకు మంచి అవకాశంగా అంది వచ్చింది. ఏవేవో కారణాల వలన భర్తలతో గొడవ పడినవాళ్లు "నా భర్త తన ప్రమోషన్ కోసం తన పై అధికారితో పడుక్కోమని, లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. వైఫ్ స్వాపింగ్‌కు (భార్యల మార్పిడి) ఒప్పుకోమని నన్ను బలవంతం చేశాడు... తను సహోద్యోగి భార్యను అనుభవిస్తూ, నన్ను ఆమె భర్త వద్ద శయనించమని ఒత్తిడి చేశాడు..." అంటూ బహిరంగంగా ఫిర్యాదులు చేశారు. మే నెలలో ఒక మలయాళం ఛానెల్‌లో ఒక 25 సంఎఎల యువతి (మొహం కనబడకుండా చేశారు) కనబడి "నా భర్త మెరైన్ కమాండోగా పనిచేస్తున్నాడు. అతను విశాఖపట్టణం వద్ద భీమిలిలో ఐయన్ఎస్ కళింగాలో పని చేస్తూన్నపుడు కాపురానికి వెళ్లాను. అక్కడ జరిగే పార్టీలు చూసి నేను దడుసుకున్నాను. అందరూ తాగేవాళ్లే, యితరుల భార్యలతో, భర్తలతో తిరిగేవాళ్లే. నేను పార్టీలకు వెళ్లడం మానేశాను. ఆయన్నీ వెళ్లవద్దన్నాను. ఇదంతా యిక్కడ సహజం అన్నాడతను. ఓ రోజు అతని పై అధికారి భార్యతో శ ృంగారంలో వుండగా పట్టుకున్నాను. నన్ను నోరు

మూసుకోమన్నాడు. పై అధికార్లకు చెప్తే వాళ్లు ఏమీ చేయలేదు. ఓ నెల పోయాక నా భర్తతో పనిచేసేవాళ్లు వచ్చి సామూహికంగా నన్ను చెరిచారు, కొట్టారు. నా భర్త నాకు సహాయపడలేదు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే నేవీ వాళ్లు సర్ది చెప్పి పంపేశారు. నా భర్త నన్ను వదిలేశాడు. నేను న్యాయం కోసం పోరాడుతున్నాను." అంది.

కార్వార్‌లో నావల్ లెఫ్టినెంట్‌ని పెళ్లాడిన మరో యువతి కూడా యిలాటి ఫిర్యాదులే చేసింది. 'నా భర్త తన కొలీగ్స్‌తో పడుక్కోకపోతే నా నగ్నచిత్రాలు యింటర్నెట్‌లో పెడతానని బెదిరిస్తున్నాడు' అని చెప్పింది. ఆంటోనీ వెంటనే యిద్దర్నీ పిలిపించి మాట్లాడారు. విచారణకు ఆదేశిస్తే భర్తలు వచ్చి పూర్తిగా భిన్నమైన కథనాలను వినిపించారు. భీమిలి కేసులో 'పెళ్లికి ముందు ఆమెతో సన్నిహితంగా తిరిగితే కేసు పెట్టి బెదిరించి పెళ్లాడింది. పెళ్లయిన దగ్గర్నుంచీ యిప్పటికి 5 కేసులు పెట్టింది. భరించలేక విడాకులు అడిగితే యిలాటి నీచమైన ఆరోపణలు చేస్తోంది' అని చెప్పాడు. కార్వార్ కేసులోని భర్త 'మేం యిద్దరం గొడవలు పడి ఏప్రిల్ 18 న విడాకుల కోసం అప్లయి చేశాం. 8 రోజుల తర్వాత 'నా భర్త నన్ను భార్యల మార్పిడి క్రీడకు ఒప్పుకోమని బలవంతం చేశాడు' అంటూ కేసు పెట్టింది నా భార్య. అదెలా సాధ్యం? విడిపోదామనుకుని అప్లికేషన్ పడేశాక నా దగ్గర ఎందుకు వుంటుంది? ఇలాటి ఒత్తిడికి ఎలా గురవుతుంది? అంతా అబద్ధం. పైగా మా మావగారు మాకు 65 లక్షల కట్నం యిచ్చాననీ, మేం యింకా యివ్వమని వేధిస్తున్నామనీ కూడా కలిపి కేసును మరింత జటిలం చేశాడు.' అని వాపోయాడు.

ఈ భార్యాభర్తల కీచులాటల్లో నిజానిజాల మాట ఎలాగున్నా సైన్యం పరువు పోతోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 23,24, వీక్లీకై** **ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, ..రివ్యూస్**

## మమతాకు బిజెపి చేసిన సాయం

మే 2013లో హౌరా (హవుడా)లో జరిగిన లోకసభ ఉపయెన్నికలో తృణమూల్ కాంగ్రెస్ సాధించిన విజయం ఆ పార్టీకి నైతిక స్థయిర్యానికి ఎంతో దోహదపడింది. హవుడా కలకత్తాలో భాగమే కాబట్టి, నగరవాసులు శారదా చిట్స్ రగడ గురించి బాగా చదివి వుంటారు కాబట్టి తృణమూల్‌ను ఓడిస్తారని అందరూ అనుకున్నారు. కానీ ఆశ్చర్యపకరంగా ఆ పార్టీ అభ్యర్థి, మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు ప్రసూన్ బెనర్జీ (బెంగాలీలకు ఫుట్‌బాల్ ఆటగాళ్లంటే మహా పిచ్చి) సిపిఎంకు చెందిన శ్రీదీప్ భట్టాచార్జీని 27 వేల ఓట్ల మెజారిటీతో ఓడించాడు. 2009 ఎన్నికలలో తృణమూల్–కాంగ్రెస్ కలిసి పోటీ చేసినపుడు 38 వేలు వస్తే యీ సారి విడిగా పోటీ చేస్తే 11 వేలు మాత్రం తగ్గాయి. అంటే పొత్తు వలన కాంగ్రెస్‌కే ఎక్కువ లాభం అన్నమాట. ఈ సారి సిపిఎం, తృణమూల్, కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేశాయి. సిపిఎంకు 41.85% ఓట్లు పడ్డాయి. 2011 అసెంబ్లీ ఎన్నికలలో చావు దెబ్బ తిన్నపుడు తెచ్చుకున్న 37% కంటె యిది 5% ఎక్కువ. అంటే ఓటర్లకు సిపిఎంపై కోపం కాస్త తగ్గిందన్నమాట. తృణమూల్‌కు ఓట్లలో 44.5% వచ్చాయి. కాంగ్రెసుకు 10%. ఆ నియోజకవర్గంలో బిజెపికి 50 వేల సాలిడ్ ఓట్లున్నాయి. వాళ్లు సిపిఎం, కాంగ్రెసులకు వేసే ప్రశ్నే లేదు. బిజెపి వాళ్లు పోటీ చేసి వుంటే అవి వాళ్లకే పడి తృణమూల్ ఓడిపోయేది. కానీ ఏ కారణం చేతనో బిజెపి ఎన్నికలలో పోటీ చేయకుండా మమతను గట్టెక్కించింది. తృణమూల్‌ను నెగ్గించడం ద్వారా, బెంగాల్‌లో కాంగ్రెసు ప్రభావాన్ని తగ్గిస్తే కనీసం ఒక శత్రువైనా తగ్గుతాడు కదాన్న ఆలోచనేమో బిజెపిది!

## మ్యారేజి రిజిస్టర్ చేసుకుంటే చాలా?

ప్రేమ వివాహాల్లో గుళ్లో పెళ్లి చేసేసుకుని ఆ ఫోటోలు చూపించి, రిజిస్టర్ ఆఫీసులో చూపించి రిజిస్టర్ మేరేజి చేసుకుంటే పెళ్లి నికరంగా అయిపోయినట్టే అనుకునే వారు యీ కేసు వినాలి. రోజీ అనే క్రైస్తవయువతి, సతీశ్ అనే హిందూయువకుడు ప్రేమించుకున్నారు. పెద్దలకు చెప్పకుండా రిజిస్టర్ మ్యారేజి చేసుకుందామనుకుని ఓ బ్రోకరును పట్టుకున్నారు. "మామూలుగా అయితే 30 రోజుల నోటీసు యిచ్చి నెల్లాళ్ల తర్వాత వెళ్లి పెళ్లి చేసుకోవాలి. కానీ యీ లోపున మీ పెద్దవాళ్లకు ఉప్పందిందంటే పెళ్లి కాకుండా పోతుంది. అందువలన మీ యిద్దరూ గుట్టు చప్పుడు కాకుండా ఏదైనా గుళ్లో పెళ్లి చేసుకుని ఫోటోలు తీసుకుని రిజిస్టరాఫీసుకి వచ్చేయండి. వెనకాల ఎవర్నీ తీసుకెళ్లనక్కరలేదు. గుళ్లో పెళ్లికి మేం సాక్ష్యం అంటూ సాక్షి సంతకాలు కూడా నేను మ్యానేజి చేస్తాను. నేను ఫార్మ్స్ అవీ నింపేసి రెడీగా వుంటాను. ఒకసారి రిజిస్టర్ అయిపోయిందంటే మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు." అన్నాడు. అనుకున్నట్టుగానే అన్నీ జరిగిపోయి కొన్ని నెలలు గడిచాక గొడవలు వచ్చి రోజీ యింట్లోంచి వెళ్లిపోతానంది. "నేను విడాకులకు ఒప్పుకోను" అన్నాడు సతీశ్. "మనకు పెళ్లయితే కదా, విడాకుల మాట వచ్చేది!" అంది రోజీ. అదేమిటి అంటూ నిర్ఘాంతపోయి సతీశ్ లాయరు చేత నోటీసు యిప్పించాడు – మ్యేరేజి రిజిస్టర్ అయింది కూడా అంటూ!

దానికి సమాధానంగా రోజీ లాయరు సమాధానం చూసి దిమ్మ తిరిగింది. మేరేజి రిజిస్టర్‌లో బ్రోకరు ఏదో గుడి ఎడ్రసు రాసి పారేశాడు. పెళ్లి జరిగిన గుడి వేరే. పెళ్లికి సాక్ష్యంగా వున్నామన్న సాక్షులు ఆ రోజు అక్కడ లేరని కూడా రోజీ సాక్ష్యాలు చూపగలదు. అన్నిటి కన్నా ముఖ్యమైనది – ఇద్దరూ హిందువులైతేనే గుళ్లో పెళ్లి అంగీకరించబడుతుంది. హిందువులు కాని వాళ్లతో గుళ్లో జరిగినది

పెళ్లే కాదు. దాన్ని ఆధారంగా చేసుకుని రిజిస్టర్ ఆఫీసులో చేసుకున్నదీ పెళ్లి కాదు. పోనీ గుళ్లో పెళ్లితో బాటు 30 రోజుల నోటీసు యిచ్చి రిజిస్టర్ మారేజి చేసుకున్నా అది చెల్లేది. నోటీసు యివ్వలేదు కాబట్టి అదీ చెల్లదు.

ప్రస్తుతం సతీశ్ లబోదిబో మంటున్నాడు.

ఈస్ట్ ఆర్ వెస్ట్ – ఉమన్ ఈజ్ బెస్ట్

అంతరిక్షయాత్రల్లో వ్యోమగాములు కొంతకాలం పాటు నివాసిస్తూ పని చేసుకునేందుకు అనువుగా అంతరిక్షంలోనే ఒక స్పేస్ స్టేషన్ నిర్మించాలనే ప్రాజెక్టులో భాగంగా చైనా కితం వారం షెన్‌జౌవ్ – 10 అనే నౌకను పంపించింది. 15 రోజుల పాటు సాగే ఆ యాత్రలో వాంగ్ యాపింగ్ అనే 33 ఏళ్ల ఒక యువతి కూడా పాల్గొంటోంది. చైనీస్ విమెన్ ఆస్ట్రోనాట్స్‌లో యీమె రెండవది. తొలి మహిళ కితం ఏడాది వెళ్లింది. ఈమె పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో మేజర్. పశ్చిమాన అమెరికాలో కూడా ఏవ్రిల్ హెయిన్స్ అనే 43 ఏళ్ల వనిత వారి గూఢచారి సంస్థ సిఐఏకు డిప్యూటీ డైరక్టరుగా నియమితురాలైంది. ఇలా సిఐఏ నెంబరు 2 స్థానం ఒక మహిళకు దక్కడం యిదే తొలిసారి. ఈమె ఒబామాకు డిప్యూటీ అసిస్టెంటుగా పని చేసింది. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌కు లీగల్ అడ్వయిజర్‌గా పనిచేసింది. మేధోసంపత్తిలో ఆమెకు సాటి వచ్చేవాళ్లు అతి తక్కువట.

టర్కీలో ప్రస్తుతం జరుగుతున్న ప్రభుత్వవ్యతిరేక ప్రదర్శనల్లో పాల్గొనేవారిలో సగానికి సగం మంది మహిళలే. దీనికి కారణం వుంది. ప్రస్తుత టర్కీ ప్రధాని ఎర్డోగాన్ తన ముస్లిం ఛాందసవాదానికి అనుగుణంగా చట్టాలు ప్రతిపాదిస్తున్నాడు. అతని ప్రతిపాదనల్లో కొన్ని – అబార్షన్ హక్కులు కుదించాలి, మార్నింగ్ – ఆఫ్టర్ పిల్ (రతిలో పాల్గొన్న మర్నాడు వేసుకునే గర్భనిరోధక మాత్ర) వాడకాన్ని నియంత్రించాలి, ప్రతీ స్త్రీ కనీసం ముగ్గురు పిల్లల్ని కనాలి...! టర్కీ ముస్లిము దేశమే కానీ ఉదారవాదమే అక్కడ నడుస్తుంది. సెక్యులర్ విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రధానిని అందరూ వ్యతిరేకిస్తున్నారు, అందరి కంటె ఎక్కువ ప్రభావం తమపై వుంటుంది కాబట్టి మహిళలు మరీ ఉద్యమిస్తున్నారు. భారతదేశంలో కూడా ఒక గుర్తించదగిన పరిణామం జరిగింది. అందరూ మహిళలే సభ్యులుగా వున్న సిఆర్‌పిఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్) కమెండో దళం తొలిసారిగా తయారైంది. దృఢచిత్తం కలిగిన 30 మంది మహిళలను ఏరుకుని వారికి టెర్రరిస్టు చర్యలు జరిగినపుడు పౌరులను కాపాడడం, హైజాకింగ్ కి గురైన ప్రయాణికులను రక్షించడం, మహిళా డిగ్నిటరీస్‌కు అంగరక్షకులుగా వ్యవహరించడం, కౌంటర్–టెర్రరిస్టు పోరాటాలు – యిలాటి వాటిల్లో రాజస్థాన్‌లో శిక్షణ గరపారు.

స్త్రీలు తమ శక్తిసామర్థ్యాలను యింతలా చూపుతున్నా వారిని శృంగారపరంగా చూడడం మగవాళ్లు మానుకోవడం లేదు. ఆస్ట్రేలియాలో ప్రతిపక్ష పార్టీకి చెందిన మాల్ బ్రఫ్ నిధుల సేకరణకు ఒక విందు ఏర్పాటు చేశాడు. వాటిని పొలిటికల్ డిన్నర్ అంటారు. దానిలో కౌజు పిట్టతో తయారుచేసిన ఒక వంటకానికి ఆస్ట్రేలియా మహిళా ప్రధాని జూలియా గిలార్డ్ పేరు పెట్టారు. ఆ డిష్‌ను వర్ణిస్తూ 'మేం వండే ఆ కౌజు పిట్టకు మన ప్రధానిలాగే పెద్ద ఛాతీ, సన్నని తొడలు వున్నాయి.' అని వర్ణించారు. జూలియాకు ఒళ్లు మండిపోయింది. ఈ వర్ణన మహిళావ్యతిరేకంగా వుందంటూ కేసు పెట్టింది. దెబ్బకి మాల్ క్షమాపణ చెప్పుకున్నాడు.

## విదేశీ విద్యార్థులతో కాలేజీ కలహాలు

మే 2013లో నోయిడా లోని శారదా యూనివర్శిటీలో ఆఫ్ఘన్, ఇండియన్ స్టూడెంట్స్ మధ్య పార్కింగ్ విషయమైన ప్రారంభమైన చిన్న తగాదా చూస్తూండగానే పెద్దదై పోయి ఎనిమిదిమంది గాయపడడంతో అందరి దృష్టీ విదేశీ విద్యార్థులపై పడింది. విద్యార్థుల మధ్య కొట్లాటలు రావడం సహజం. కులాల వారీగా, ప్రాంతాల వారీగా, విడిపోయి గ్రూపులుగా చేరి తన్నుకుంటూ వుంటారు. ర్యాగింగ్, అమ్మాయిలు, మద్యం, పార్టీలు – కారణాలు ఏమైనా కావచ్చు. వీటన్నిటికీ తోడు అవతలివాళ్లు వేరే దేశం వాళ్లయితే అంతకంటె పెద్ద కారణం యింకేం కావాలి? సొంతదేశంలో రాజకీయ అశాంతి వున్నపుడు తమ పిల్లల్ని మన దేశానికి పంపి చదివించడం ఆఫ్రికన్, ఆసియన్ దేశాల వారికి కద్దు. గతంలో ఇరాన్‌లో గొడవలుండేటప్పుడు హైదరాబాదులో కూడా ఎందరో ఇరానియన్ విద్యార్థులు కనబడేవారు. ప్రస్తుతం ఆఫ్గనిస్తాన్ నుండి 7 వేల మంది, ఆఫ్రికన్ దేశాల నుండి 2500 మంది భారత్‌లోని అనేక విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్నారు. ఆ యా దేశాలతో సంబంధ బాంధవ్యాలు నెరపడానికి ఐసిసిఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్) విదేశీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు యిస్తోంది. మొత్తం 2325 మందికి యిస్తూ వుంటే వారిలో 500 మంది ఆఫ్రికన్ విద్యార్థులు, 675 మంది ఆఫ్గన్ విద్యార్థులు.

ఇలా వచ్చిన వాళ్ల దగ్గర భారీగా ఫీజు వసూలు చేయవచ్చనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్లు ప్రకటనలిచ్చి మరీ వాళ్లను ఆకర్షిస్తున్నాయి. చేరిన తర్వాత చదువుల గురించి ఇండక్షన్ కోర్సులు నిర్వహిస్తున్నారు తప్ప, ఇండియన్ స్టూడెంట్స్‌తో ఎలా కలిసిపోవాలి అన్నదానిపై ప్రత్యేకమైన కోర్సులు నిర్వహించడం లేదు. దాని వలన వారూ, వీరూ నూనె–నీళ్లలాగే వుండిపోతున్నారు. అడపాదడపా యిలాటి సంఘటనలు జరుగుతున్నాయి. 2007 అక్టోబరులో లక్నో యూనివర్శిటీలో ఒక తాజిక్ అమ్మాయిని ఓ ఇండియన్ స్టూడెంటు అసభ్యంగా కామెంట్ చేయడంతో ఆఫ్గన్ విద్యార్థులు వచ్చి బాగా కొట్టారు. ఇలాటివి మళ్లీ జరగకూడదనే ఉద్దేశంతో ఒక ప్రొఫెసరు 2008లో యిరుదేశాల విద్యార్థుల మధ్య సమావేశం ఏర్పాటు చేసి అవగాహన ఏర్పరచేందుకు ప్రయత్నించారు. ఆఫ్గన్‌లు తాలిబన్లకు,

తమకు గల తేడా గురించి చెప్పారు, హిందీ సినిమాలపై తమకున్న యిష్టం గురించి చెప్పారు.

ఇలాటి ప్రయత్నాలు యింకా జరగాలి. ఎందుకంటే ఇక్కడకు వచ్చే విదేశీ విద్యార్థులు డబ్బున్న భూస్వామి కుటుంబాల నుండి వస్తారు. అహంకారం వుంటుంది, పైగా తమ మతం గురించి సెన్సిటివ్‌గా వుంటారు. వాళ్ల రూపం గురించి వ్యాఖ్యలు చేస్తే సహించలేరు. 2011 ఏప్రిల్‌లో జలంధర్‌లోని లవ్‌లీ యూనివర్శిటీలో ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఇండియన్, ఆఫ్రికన్ విద్యార్థులు తగవు పడ్డారు. ఆ తర్వాత జరిగిన కొట్లాటల్లో ఓ మిజో స్టూడెంటు చనిపోయాడు. 2011 జనవరిలో కటక్‌లోని రావెన్‌షా యూనివర్శిటీలో జరిగిన గొడవకు భయపడి 59 మంది ఆఫ్గన్ విద్యార్థులు పారిపోయారు. అధికారులు చాలా హామీలు గుప్పించి తీసుకుని వచ్చారు. అక్టోబరులో మళ్లీ గొడవలయ్యాయి. 2013 ఫిబ్రవరిలో రౌర్కేలాలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుకునే కొందరు ఆఫ్గన్ విద్యార్థులు ఒక ఆటోలో వెళుతూంటే ఇండియన్ విద్యార్థులు ఆటో ఆపి వాళ్లను దింపేసి ''మాకు ఆటో కావాలి, కావాలంటే మీరు నడిచి పొండి.'' అన్నారు, దాంతో గొడవలయ్యాయి. 5గురు గాయపడ్డారు. ఇలాటి చిన్నా చితకా గొడవలే వార్తల్లోకి ఎక్కి మన దేశ ప్రతిష్టను దెబ్బ తీస్తాయి. విదేశాల్లో ఎవరైనా భారతీయవిద్యార్థులు కష్టపడితే హైలైట్ చేసే మనవాళ్లు ఏదైనా ఫ్రెండ్‌షిప్ సొసైటీలు పెట్టి మన దేశంలో వున్న విదేశీ విద్యార్థులకు మన విద్యార్థులకు మధ్య అవగాహన పెంపొందించడానికి ఒకరి ఆచారాలు మరొకరు తెలుసుకునేట్లు చేయడానికి కృషి చేయాలి.

**జూన్ 21** **ఎమ్బీయస్ : దేనికి సంకేతం?**

కాంగ్రెసు హై కమాండులో హఠాత్తుగా చురుకుదనం వచ్చింది. మన రాష్ట్రాన్ని ప్రభావితం చేసే అంశాలు ఎన్నో జరిగాయి. సిపిఐ నారాయణగారు తరచుగా అంటూ వుంటారు – హై కమాండ్ గునపం నానబెట్టిందని. పెట్టగా పెట్టగా నానినట్టుంది. చకచకా చర్యలు తీసేసుకున్నారు. మొదటిది 'చలో అసెంబ్లీ'ని విఫలం చేయడానికి కిరణ్‌కు ఫుల్ పవర్స్ యిచ్చేశారు. ఆయన ఫుల్లున్నరగా వాడేశాడు. 'కిరణ్, ద టఫ్'గా చరిత్రలో నిలిచిపోవాలని ఆయన ఆకాంక్ష. ఒక్కసారి అలా అనుకోగానే చలో అసెంబ్లీ కూడా చాలా సులభమైన ప్రశ్నలా అనిపించేసింది. కళ్లు మూసుకుని జవాబు రాసేయవచ్చు అనుకున్నాడు, అధిష్టానానికి చెప్పేశాడు. అదేమిటో యిదే చలో అసెంబ్లీ 2009 డిసెంబరులో పెద్ద కఠినమైన ప్రశ్నలా తోచింది – అప్పటి ముఖ్యమంత్రికి, అధిష్టానంకీ (అప్పటికీ, యిప్పటికీ అదే అధిష్టానం, కానీ ధోరణిలో మార్పు వచ్చింది). ఆ నాటి చలో అసెంబ్లీ కార్యక్రమంలో విద్యార్థులు తప్ప వేరెవరూ లేరు. తెరాస తప్ప వేరే వాళ్లెవరూ దానికి దన్నుగా మాట్లాడినవారు లేరు. తెరాసకే పెద్దగా పట్టు లేదు. కెసియార్‌ను ఖమ్మం ఆసుపత్రిలో పెడితే పోయి పలకరించే దిక్కు లేకపోయింది. తెలంగాణ యిస్తారా, ఛస్తారా అన్న మూడ్‌లోనే వున్నాయి రాజకీయపక్షాలూ, ఉద్యోగసంఘాలూ. జాక్ పేర పోగడి ఏదో చేసేద్దాం అన్న ఆలోచనే లేదు. అయినా అధిష్టానం అదలి పోయింది. అర్జంటుగా తెలంగాణ ప్రకటించకపోతే ఆకాశం కూలిపోతుంది, భూకంపం వచ్చేస్తుంది అని భయపడి, సొంత ముఖ్యమంత్రికి కూడా చెప్పకుండా, విధివిధానాల గురించి భాగస్వామ్యపక్షాలతో కూడా చర్చించకుండా, రాష్ట్రంలోని పార్టీలకు మాటమాత్రం అడక్కుండా తెలంగాణ గురించి ప్రకటన చేసేసింది.

ఆ రోజు చలో అసెంబ్లీ బూచిని చూపించి అధిష్టానాన్ని తప్పుదోవ పట్టించిన ప్రముఖుల్లో ఒకరైన కేకే యిప్పుడు తెరాసలో వున్నారు. ఆయనా, ఆయన మిత్రబృందం తెరాసలో చేరిన దగ్గర్నుంచి మీడియా కెక్కడం తగ్గింది. మనకూ హాయనిపించింది, ఆ మేరకు వేరే న్యూస్ కవరవుతుంది కదాని. చెప్పినదే పదేపదే చెప్పడానికి వాళ్లకు విసుగు లేదేమో కానీ, వినడానికి మనకు విసుగు పుట్టింది. కేకే, ఆయన కుమారుడు కెసియార్ ఫామ్‌హౌస్‌కి వెళ్లి ఆయనను కలిసి రెండు, మూడు గంటలు మాట్లాడారు. తెరాసలో చేరండి, మిమ్మల్ని వర్కింగ్ ప్రెసిడెంటు చేస్తాం అని కెసియార్ మాట యిచ్చి యిప్పుడు మొండి చేయి చూపించారేం? అని. మీరు నాకంటె సీనియర్, నా కింద పని చేస్తే ఏం బాగుంటుంది అన్నారట. మరి ఆలె నరేంద్ర కూడా కెసియార్ కంటె సీనియరేగా, అప్పుడు పని చేయించుకున్నారుగా. ఆ మాట కేకే అడిగారో లేదో. కాంగ్రెసు ఫక్కీలో వర్కింగ్ కమిటీ వేసి దానికి చైర్మన్‌గా చేస్తాం అని నచ్చచెప్పి పంపించారని వార్తలు వచ్చాయి కానీ ఫైనల్‌గా జాతీయ వ్యవహారాల కమిటీకి చైర్మన్ చేసి ఢిల్లీ తోలేస్తున్నారు. ఆయనకు నేను పదవులు యిచ్చేటంత వాణ్నా? అన్నారు కెసియార్ చమత్కారంగా. కికింగ్ అప్‌స్టయిర్స్ అంటే యిదే. ఎందుకంటే కేకే వూరికే కూర్చోబెడితే కూర్చునే రకం కాదు! మీడియా కనబడగానే ఏదో ఒకటి మాట్లాడి చిక్కులు తెచ్చిపెడతారు. ఢిల్లీలో తెలుగు మీడియా లేదని కాదు, అక్కడ చేయడానికి పనేం లేదు. ఒక ఉపప్రాంతీయ పార్టీకి జాతీయ రాజకీయాలతో పనేముంటుంది చెప్పండి. 'మా తెలంగాణకు మద్దతివ్వండి' అంటూ అసాం పార్టీని, మేఘాలయ పార్టీని అడగడం తప్ప!

చలో అసెంబ్లీలో మావోయిస్టులు చొరబడతారని అప్పుడూ అన్నారు, యిప్పుడూ అన్నారు. ఆ పేరుతో అప్పుడు తెలంగాణ ప్రకటన చేశారు, యిప్పుడు అనుమతి యివ్వం పొమ్మన్నారు. ఎంత తేడా? అనుమతి సంపాదించడానికి తెలంగాణ మంత్రులు యథావిధిగా కష్టపడ్డారు. సాగరహారం సమయంలో కాస్తయినా సాధించారు. ఈసారి అదీ లేదు. ఇందిరా పార్కుకు కూడా పర్మిషన్ రాలేదు. లక్షలాది మంది తరలి వస్తారన్నది ప్రచారంగానే మిగిలింది. అనుకున్నదానిలో పదోవంతు కూడా వచ్చి వుండరు. ఈ కార్యక్రమాన్ని విఫలం చేసి, మారణకాండ లేకుండా శాంతిభద్రతలు కాపాడినందుకు కిరణ్‌ను హై కమాండ్ అభినందించిందని

వార్తలు వచ్చాయి. ఈ 'విజయా'నికి క్రెడిట్ కిరణ్ ఒక్కడికే యివ్వకూడదు. సగం కంటె ఎక్కువ భాగం కెసియార్‌కు పోతుంది. చలో అసెంబ్లీ కార్యక్రమానికి ఎంచుకున్న సమయమే పొరబాటు. వర్షాలు వచ్చి విత్తనాలు, ఎరువుల వేటలో రైతులు బిజీగా వున్నారు, స్కూళ్లు తిరిగి తెరిచే హడావుడిలో విద్యార్థులు, తలిదండ్రులు వున్నారు. టోటల్‌గా ప్రజలందరూ తెలంగాణ విషయంలో 'ప్రస్తుతానికి చేసేదేమీ లేదు, 2014 ఎన్నికల వరకూ తేల్చరు, తర్వాతే చూసుకుందాం' అనే మూడ్‌లో వున్నారు. ఇలాటప్పుడు పెద్ద కార్యక్రమం తలపెట్టి తుస్సుమనిపించడం ఉద్యమానికి దెబ్బ కాదా? ప్రభుత్వం అనుమతి యివ్వదు, అరెస్టులు చేస్తుంది అని అందరికీ తెలుసు. దాన్ని ఎదుర్కొనేందుకు వేలాది, లక్షలాదిమందిని పోగు చేయగల సత్తా వుంటేనే కార్యక్రమం తలపెట్టాలి.

ప్రోగ్రాం రాజధానిలో పెట్టారు. జిల్లాల్లో పెడితే వేలాదిమంది రోడ్ల మీదకు వచ్చి ప్రభుత్వాన్ని ధిక్కరించేవారు. రాజధాని అనగానే జిల్లాల జనం రాకుండా ముందస్తు అరెస్టులు జరిగిపోయాయి. రాజధానిలో ఆందోళన కారులు వందల సంఖ్యలో కూడా కనబడలేదు. కోటి జనాభా వున్న నగరంలో రెండు వేల మందిని కూడా సమీకరించలేక పోయారట. స్నేహితుల యిళ్లల్లో రాత్రి పడుక్కుని పొద్దున్న అరెస్టయిపోయిన ముఖ్యనాయకుల వెంట జనమే లేరు. పేలవంగా ముగిసింది. ప్రభుత్వమే బస్సులు, రైళ్లు ఆపు చేసి కార్యక్రమాన్ని ఓ మేరకు సక్సెస్ చేసింది కానీ లేకపోతే వీళ్ల ప్రజ్ఞ ఏమీ లేదు. ఇంతోటి దాని నాయకత్వానికి తెరాస జాక్‌తో పోటీ పడడం తమాషాగా లేదా? మేం పెడితే పుట్టింది జాక్. వాళ్లకు నాయకత్వం పోవడమేమిటి? మేమే నడుపుతాం అన్న తెరాస విడిగా ఏం చేయగలిగింది? జరిగినదేమైనా వుందంటే ఉస్మానియా క్యాంపస్‌లో జరిగింది. ఆ ఘనత ఏదైనా వుందంటే విద్యార్థులకే పోతుంది.

ఈ కార్యక్రమం యింత చప్పగా జరిగిన తర్వాత కెసియార్ వూరుకోవలసినది. అరెస్టులు జరిగినందుకు, చలో అసెంబ్లీని అడ్డుకున్నందుకు నిరసన తెలపాలనుకున్నారు. ఇలాటి కార్యక్రమాలు ప్రభుత్వాలు ఎప్పుడూ ప్రోత్సహించవు. రేపు తెలంగాణ ఏర్పడి, దక్షిణ తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ ఎవరైనా యిలాటి కార్యక్రమాన్ని చేపడితే అప్పుడూ యిలాటి అరెస్టులే జరుగుతాయి. అప్పుడు ప్రతిపక్షంలో వున్నవాళ్లు ఖండిస్తారు. ఇప్పుడూ ఖండించి వుంటే సరిపోయేది. మధ్యాహ్నం పాటికే ఎవరికీ చెప్పకుండా ఏకపక్షంగా బంద్ ప్రకటించారు. అలా జాక్‌లోని బిజెపి, సిపిఐలతో వైరం కొని తెచ్చుకున్నారు. పోనీ ఆ బంద్ సక్సెసయిందా? ఒకటి రెండు జిల్లాల్లో ఓ మాదిరిగా షాపులు మూశారు. ఉద్యమం పని ఖళాస్ అనే మెసేజిని తానే పంపించారు.

ఇదేమైనా న్యాయంగా వుందా? ఉద్యమసారథియే యిలా ప్రవర్తిస్తే ఎలా? తను ప్రత్యక్షంగా పాల్గొనకపోవడమే వింత. మిలియన్ మార్చ్ టైములో ఢిల్లీలో వుంటే, యిప్పుడు ఫామ్‌హౌస్‌లో వున్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా వ్యవహరిస్తున్నవారందరూ – తెరాస వారు తప్పిస్తే – కెసియార్‌ను తిట్టిపోశారు. హై కమాండ్‌తో కుమ్మక్కయ్యారన్నారు. ఇది ఉద్యమానికి హాని కలిగించే విషయమే కదా. ఈ కార్యక్రమం ఫెయిల్ చేసినందుకు అధిష్టానం కిరణ్‌ను మెచ్చుకుంది అనే న్యూస్ ఉద్యమకారుల స్థయిర్యాన్ని మరింత దిగజారుస్తుంది.

ఆ వెంటనే దిగ్విజయ్ నియామకం మాట బయటకు వచ్చింది. దిగ్విజయ్ రాష్ట్రవిభజనకు వ్యతిరేకం అనే మాట లోకవిదితం. 'నా హయాంలోనే రాష్ట్రాన్ని విడగొట్టారు. దెబ్బకి రాష్ట్రంలో నా ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డిఏ ఓడిపోయాయి.' అని చెప్తూ వుంటారు. విడగొట్టిన పార్టీకి అపజయం తప్పదు అనే సెంటిమెంటు బలంగా నాయకుల్లో నాటేశారు. రెండో ఎస్సార్సీ ఒక్కటే పరిష్కారం అంటూ వచ్చిన యీయన్ని మళ్లీ తెచ్చారంటే అర్థం – విడిపోయే ప్రక్రియపై చర్చలు జరపమని కాదు. కెసియార్, జగన్ .. ఎవరితోనైనా సరే జాగ్రత్తగా మాట్లాడి ఒప్పించగల సమర్థుడనే దిగ్విజయ్‌ను దింపారు. కెసియార్‌కి నచ్చచెప్పడం అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు జవాబుగా అంతకుముందు రోజే ప్యాకేజి గురించి లీక్ విడుదల చేశారు.

ఇంతలోనే కేంద్ర కాబినెట్‌లోకి కొత్త మంత్రులను తీసుకున్నారు. పచ్చి సమైక్యవాది కావూరికి, సమైక్యవాది కావచ్చు అనిపించుకున్న జెడి శీలంకు మంత్రిపదవులు దక్కాయి. తెలంగాణ నుండి ఎవర్నీ తీసుకోలేదు కాబట్టి దానికి బదులుగా రాష్ట్రవిభజనే ప్రకటిస్తారు అని కొందరు టీవీ చర్చల్లో ఆశాభావం వ్యక్తం చేశారు. గతసారి తెలంగాణ వాళ్లకే ఎక్కువ యిచ్చారు కదా. జైరాం రమేష్‌ను పక్కన బెట్టి చూస్తే 12 మందిలో జనాభా ప్రకారం 2 :1 నిష్పత్తిలో యిచ్చినట్టే తోస్తోంది. కావూరి సమైక్యవాది అన్న అంశం కంటె కులం ఫ్యాక్టరే గట్టిగా పని చేసినట్టుంది. అయినా కాంగ్రెసు హై కమాండ్ కోస్తా, సీమ, తెలంగాణ సమతౌల్యాన్ని పట్టించుకున్నట్టు తోచదు. ముఖ్యమంత్రిని సీమ నుండి, పిసిసి అధ్యక్షుణ్ని కోస్తా నుండి తీసుకుని తెలంగాణకు ఏ పెద్ద పోస్టూ యివ్వలేదు. అలాగే నెట్టుకుని వచ్చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పదవి తెలంగాణ కోటా కింద యిస్తే అది నానారకాల తలకాయనొప్పులకు దారి తీసింది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఎడమొగం పెడమొగంగా వుంటే పరిపాలన ఎలా సాగుతుంది? సాగకపోతే ప్రభుత్వానికి పేరెలా వస్తుంది? అందుకని యీ ప్రాంతాల వారీ కోటా సిస్టమ్ పట్టించుకోకుండా ప్రయోగం చేద్దామని అనుకున్నారు లాగుంది.

ఇంతకీ ప్యాకేజీకి ఒప్పుకుంటారా? లేదా? ఛస్తే ఒప్పుకోం, హైదరాబాదుతో కూడిన పది జిల్లాల తెలంగాణ తప్ప వేరే ఏదీ అక్కరలేదు అనే అంటారు ఉద్యమకారులు. అలా అంటారనే అధిష్టానమూ అనుకుంటుంది. వేరేలా అంటే ఎబ్బెట్టుగా వుంటుంది. కానీ ఎన్నాళ్లు యీ బింకం వుంటుంది? 'ఇదిగో ప్యాకేజీ యిస్తాం, దీని వలన నిధులు మీ ఏరియాలో ఏరులై పారతాయి, కొత్త స్కీములు, కొత్త ప్రాజెక్టులు, కొత్త ఉపాధి అవకాశాలు, కొత్త వుద్యోగాలు.. నిరుద్యోగులకు సంపాదించుకునే వీలు' అని వూరిస్తూ వుంటే ఎంతమంది నిలదొక్కుకుని వుంటారో చూడాలి. పైకి చెప్పేవి యివే అయినా రోడ్లువేయిస్తాం, చెరువులు తవ్విస్తాం, వంతెనలు బాగు చేయిస్తాం అంటూ కాంట్రాక్టర్లను వూరిస్తే వాళ్లు నిగ్రహం పాటించగలరా? ప్రజలకు వెళ్లి ఏం చెప్తారు?

'మనం ప్యాకేజీ యిస్తే చాలని మొదట అని నిధులు తీసుకుందాం. వాటితో మన ప్రాంతం బాగుచేసుకుని, అప్పుడు ప్రత్యేక రాష్ట్రం అందాం. రాష్ట్రం అడిగేది దేనికోసం? ఉద్యోగాల కోసం, ఉపాధికోసం, అవకాశాల కోసం.. అవి యీ ప్యాకేజీలో దక్కినపుడు మనం వద్దని త్యాగం చేయడం దేనికి? రాష్ట్రం వస్తే నాయకులకు పదవులు వస్తాయి. మనకేం వస్తాయి? నిధులు వస్తాయో రాదో ఎవరు చూడవచ్చారు? రాష్ట్రం రాకుండానే మనకు ఉద్యోగాలు వస్తే యింకేం కావాలి?' అన్న ఆలోచన జనంలో ప్రవేశపెట్టగలరు. దీని కారణంగా జిల్లాల్లో చీలిక వచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు. డబ్బు వచ్చి పడుతూ వుంటే వద్దనడానికి చాలా దిటవు కావాలి. చీలిక అంటూ వస్తే విభజన నాయకులపై విమర్శల దాడి పెరుగుతుంది. ఇప్పటికే తెరాస నాయకుల యిమేజి ఖరాబైంది. రఘునందన్ రావు బహిష్కరణకు ముందు తెరాస నాయకులే కొంత బయటపెట్టారు – అప్పటిదాకా తెరాసలో వున్న రఘునందన్ పార్టీ పేరుతో పెట్టుబడిదారుల వద్ద వసూళ్లు చేశారని! ఇక రఘునందన్ చాలా చెప్పబోయారు. ఓ రెండు రోజులు అడావుడి చేశాక మళ్లీ చప్పబడ్డారు. కారణాలు తెలియవు. ఆంధ్రజ్యోతి తాజా కథనం మళ్లీ దుమ్ము రేపుతోంది. తెలంగాణ తెచ్చేందుకు కెసియార్ సీరియస్‌గా లేరన్న ప్రచారం ఒక పక్క, ఆ లోగా ఆయన సన్నిహితులు ఉద్యమాన్ని స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారన్న ఆరోపణలు మరో పక్క చుట్టుముడుతున్నాయి. 'ప్యాకేజీ వంటి తాయిలాలు వద్దు, విభజన జరిగేవరకూ ఆగుదాం' అని వాళ్లు అంటే జనాలు సహకరించాలని ఏముంది?

ప్యాకేజీల పేరు చెప్పి కొన్నాళ్లు కన్‌ఫ్యూజన్ సాగించి, ఆ తర్వాత మేం మేలు చేద్దామన్నా తెరాస అడ్డుపడుతోందన్న ప్రచారంతో కాంగ్రెసు 2014 ఎన్నికలలో  ప్రచారం చేసినా ఆశ్చర్యపడనక్కరలేదు. హైదరాబాదు-కర్ణాటక ప్రాంతానికి ప్యాకేజీ యిచ్చినా కర్ణాటక ఎసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసుకు అక్కడ పెద్దగా ఓట్లు రాలేదు. అందువలన తెలంగాణకు ప్యాకేజీ యివ్వడానికి కాంగ్రెసు మరీ ఉత్సాహంగా వుండకపోవచ్చు. ఏదో యీ పేరు చెప్పి తెలంగాణవాదుల్లో వాదనలు రేకెత్తించి, తెలంగాణ అంశాన్ని ఎన్నికల దాకా నాన్చవచ్చు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 25, 26, 27 వీక్లీకై ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, ..రివ్యూస్ – 3**

**అతని రక్తంలోనే వీరత్వం వుంది...**

నటుడు, నిర్మాత టామ్ క్రూస్ నటించిన "ఆబ్లివియన్" సినిమా విడుదలై హిట్ అయింది. గ్రహాంతరవాసుల దాడితో భూమి నాశనం కాగా 2077లో ఒక ధీరోదాత్తుడు మిగిలిన మానవజాతిని ఉద్ధరించడానికి ఉద్యమించి గ్రహాంతరవాసులతో పోరాడతాడని దాని కథాంశం. ఆ సినిమా ప్రమోషన్‌కోసం టామ్ ఐర్లండ్ వెళ్లాడు.  విప్లవాలకు పురుటిగడ్డ ఐన ఐర్లండ్ నుండి తన పూర్వీకులు అమెరికాకు తరలి వచ్చారని అతనికి చూచాయగా తెలుసు తప్ప అంతకంటె వివరాలు తెలియవు. జీన్స్ సహాయంతో అతని వంశచరిత్రను తవ్వి తీయడానికి ఐర్లండ్ టూరిజం శాఖ ఒక రిసెర్చి టీమును నియమించింది. వాళ్లు 800 ఏళ్ల చరిత్ర తవ్వి తీశారు. ఆ వంశంలో 12 వ శతాబ్దిలో 'నైట్స్' (యుద్ధవీరులు) వున్నారు, 17 వ శతాబ్దిలో తిరుగుబాటుదార్లు వున్నారు, 19 వ శతాబ్దిలో పాట్రిక్ రస్సెల్ క్రూస్ అనే హీరో వున్నాడు. భూస్వాముల వలన భూమి హక్కులు పోగొట్టుకున్న కౌలుదారుల తరపున పోట్లాడి, వారికి మళ్లీ భూములు దక్కేట్లు చేశాడు యీ పాట్రిక్. టామ్ అతనికి అయిదో తరంలో వాడు.

క్రూస్ వంశానికి చెందిన నైట్స్ ఆంగ్లో-నార్మన్ జాతికి చెందినవారు. 1169-1176 మధ్య ఐర్లండ్‌పై దాడి చేశారు. పెమ్‌బ్రోక్ పాలకుడైన రిచర్డ్ డి క్లేర్ డబ్లిన్‌లోని భూములను యితరులకు దానం యిచ్చినపుడు ఆగస్టినో డి క్రూస్ అనే టామ్ పూర్వీకుడు దానికి సాక్షిగా వున్నాడు. క్రూస్ కుటుంబానికి డబ్లిన్, యితర ప్రాంతాల్లో భూములుండేవి. ఇవన్నీ వెలికి తీశాక "ఆబ్లివియన్" ప్రీమియర్ సందర్భంగా ఐర్లండ్ ఉప ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి కలసి టామ్‌కు ఐరిష్ హెరిటేజ్ సర్టిఫికెట్టు ప్రదానం చేశారు. "నా అసలు పేరు థామస్ క్రూస్ మెపోతెయిర్ 4. ఐరిష్ వాడిగా పుట్టడానికి గర్విస్తున్నాను. 20 సంవత్సరాల క్రితం "ఫార్ అండ్ ఎవే" సినిమాలో నా ఉచ్చారణలో ఐరిష్ యాస వుందని వెక్కిరించారు. (దానిలో అతను ఐరిష్ వాడిగానే వేశాడు) దానికి కారణం ఏమిటో యిప్పుడు తేటతెల్లమైంది." అన్నాడు టామ్.

**ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా విద్యాబాలన్ వేస్తున్నట్లా? లేదా?...**

ఫోటోగ్రాఫర్‌గా, దర్శకునిగా పేరు గాంచిన రాజీవ్ మీనన్ మహా గాయని ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి జీవితంపై ఒక సినిమా (బయోపిక్) తీయబోతున్నారని, సుబ్బులక్ష్మిగా విద్యాబాలన్ నటిస్తారని గతంలో వార్తలు వచ్చాయి. కానీ ఆ సినిమా యిప్పుడు తయారయ్యేట్లు లేదు. టిజెయస్ జార్జి అనే ఆయన సుబ్బులక్ష్మి జీవితంపై "ఎ లైఫ్ యిన్ మ్యూజిక్" అనే పుస్తకం రాశారు. "అగ్నిసాక్షి" (1999) అనే మలయాళ సినిమా తీసి జాతీయ ఎవార్డు గెలుచుకున్న డా౹౹ఎమ్.పి.సోమప్రసాద్ అనే ఆయన దాన్ని సినిమాగా మలచడానికి హక్కులు తీసుకున్నాడు. "నేను 10 నెలల క్రితం రాజీవ్ మీనన్‌కి ఆ పుస్తకాన్ని యిచ్చి  'నీకు శాస్త్రీయసంగీతంపై మంచి అవగాహన వుంది కదా, దీన్ని సినిమాగా మలచి డైరక్టు చేసి పెట్టు, గిరీశ్ కర్నాడ్ స్క్రిప్టు రాస్తారు,' అని ప్రాజెక్టు అప్పచెప్పాను" అంటాడు

సోమప్రసాద్.

"గిరీశ్ ఎందుకు, నేనే రాస్తాను" అంటూ రాజీవ్ అంటే సరేనన్నాడు సోమప్రసాద్. ఆ తర్వాత కొన్నాళ్లకు 'ప్రొడ్యూసర్ కూడా నేనే. విద్యాబాలన్ పెట్టి నేనే సినిమా తీస్తా' అన్నాట్ట రాజీవ్. "అలా ఎలా చేయగలడు? సుబ్బులక్ష్మి కుటుంబం నుండి అనుమతి తీసుకున్నది నేను. పుస్తకం హక్కులు తీసుకున్నది నేను" అంటాడు సోమప్రసాద్. ఆ మేరకు బెంగుళూరు సిటీ సివిల్ కోర్టులో కేసు పడేశాడు. వాళ్లు చిత్రనిర్మాణంపై 90 రోజుల స్టే యిచ్చారు. "ఈ సినిమా నేనే తీయాలి. ఇంకోణ్ని తీయనివ్వను. మీనన్ రాసిచ్చిన స్క్రిప్టు రెడీగా వుంది కానీ దానిలో కొన్ని మార్పులు చేసి, తారాగణాన్ని, మరో దర్శకుణ్ని సమకూర్చుకుని సినిమా తీస్తాను. సుబ్బులక్ష్మిగా విద్యా బాలన్ గురించి ఏమీ అనుకోలేదు. ఆమెను యింకా సంప్రదించలేదు." అన్నాడాయన. ఈ పరిణామాలపై వ్యాఖ్యానించడానికి రాజీవ్ మీనన్ యిష్టపడలేదు.

**ఆర్థిక కష్టాల కడలి...**

"కడలి" సినిమా తెలుగు, తమిళంలో తీసి భారీ నష్టాలు మూటకట్టుకోవడంతో మణిరత్నం కష్టాలు ఆగలేదు. సినిమా పంపిణీ చేసి నష్టపోయాం కాబట్టి మాకు డబ్బు తిరిగి యివ్వండి అంటూ మన్నన్ అనే ఒక డిస్ట్రిబ్యూటర్, మరి కొందరు కలిసి మణిరత్నం నిర్మాణ సంస్థ "మద్రాసు టాకీస్" ఆఫీసుకి వచ్చి అక్కడున్న స్టాఫ్‌ను బెదిరించారు. మణిరత్నం, సుహాసినికి ఏం చేయాలో పాలుపోక హైకోర్టుకి వెళ్లారు. డిస్ట్రిబ్యూటర్సు యిలా మా ఆఫీసుపై దండయాత్ర చేయకుండా చూడండి అని కోరారు. హై కోర్టు సరే అని ఆ విధంగా నిషేధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు వేసింది. మణిరత్నం అంతటితో ఆగలేదు. "ఇలా వచ్చి మా పరువు తీసినందుకు రూ. 5 కోట్లు నష్టపరిహారం యివ్వాలి" అంటూ పిటిషన్ వేశాడు. దానిపై కోర్టు యింకా ఏమీ చెప్పలేదు. వరసగా ఫెయిల్యూర్స్ తీసినవాళ్లకు పరువు ఆట్టే మిగలదని కోర్టు తాత్పర్యమేమో!

**విస్తరిస్తున్న విదేశీ మార్కెట్**

చాలా దశాబ్దాలుగా హిందీ సినిమాలు అమెరికా, ఇంగ్లండ్ దేశాలలోని మార్కెట్ కోసమే ఎక్కువగా తపిస్తూ వచ్చాయి. ఇటీవలి కాలంలో తూర్పు దేశాలవైపు చూపు తిప్పాయి. హాంగ్‌కాంగ్, జపాన్, చైనా, కొరియాలలో విడుదల చేసి లాభాలు ఆర్జిస్తున్నాయి. ఇవే కాకుండా తరతరాలుగా ప్రవాసభారతీయులున్న ఆఫ్రికా దేశాలతో బాటు బ్రెజిల్ వంటి దేశాల్లో కూడా విడుదల చేసి చూస్తున్నారు. "ఆవారా" (1951) చైనాలో బాగా ప్రజాదరణ పొందినా మనవాళ్లు చైనా మార్కెట్‌ను సరిగ్గా పట్టించుకోలేదు. చాలా దశాబ్దాల తర్వాత "లగాన్" రిలీజ్ చేసి చూస్తే బ్రహ్మాండంగా ఆడింది. అప్పణ్నుంచి ఉత్సాహం పెరిగింది. ఇక్కడ బాగా ఆడినవన్నీ ఆ దేశాలలో బాగా ఆడతాయన్న నమ్మకం లేదు. కొరియాలో "బ్లాక్" సినిమా 9 లక్షలమంది ప్రేక్షకులను ఆకర్షిస్తే, "3 ఇడియట్స్" అందులో సగం మందినే ఆకట్టుకుంది. "గుజారిష్"కి లక్షకి మించి రాలేదు. డిస్నీ యుటివి వారు "గుజారిష్"ను పెరు దేశంలో విడుదల చేస్తే బాగానే ఆడింది. అదే సంస్థ "దోభీ ఘాట్", "పీప్లీ లైవ్" తైవాన్‌లో, "ఢిల్లీ బెల్లీ"ను హాంగ్‌కాంగ్‌లో రిలీజ్ చేసింది.

జర్మనీలో మన ఫ్యామిలీ డ్రామాలను బాగా ఆదరిస్తారు. యాక్షన్ సినిమాలను పట్టించుకోరు. "ఇంగ్లీష్ వింగ్లీష్"ను అక్కడ రిలీజ్ చేయబోతున్నారు. (వాళ్లకూ మనవాళ్లలాగే ఇంగ్లీషు రాదుగా, నచ్చుతుంది లెండి) జపాన్‌లో పరిస్థితి వేరు. వాళ్లకు యాక్షన్ సినిమాలంటే మోజు. ప్రస్తుతం రజనీకాంత్ సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నారు. గతంలో సత్యజిత్ రాయ్ "పథేర్ పాంచాలీ"నీ ఆదరించారు. జపాన్‌లో మన మార్కెట్ బాగా వుంది కాబట్టి రకరకాల సినిమాలను రుచి చూపాలని మనవాళ్ల ఉబలాటం. ఇటీవలే టోక్యోలో "ఓం శాంతి ఓం", ఒసాకాలో "ఏక్ థా టైగర్" విడుదలయ్యాయి.

తక్కినవాటి మాట ఎలా వున్నా "ఓం శాంతి ఓం" ఒక పాత వివాదాన్ని మళ్లీ రేపింది. ఆ సినిమాలో తనను హాస్యాస్పదంగా చూపించారంటూ నటుడు, దర్శకనిర్మాత మనోజ్ కుమార్ 2007లో సినిమా రిలీజ్ కాగానే షారుఖ్ ఖాన్ మీద, నిర్మాతల మీద కేసు పడేశాడు. అప్పుడు వాళ్లు ఆ సీన్లు తీసేస్తామని కోర్టుకి హామీ యిచ్చి తప్పించుకున్నారు. ఇప్పుడు జపాన్‌లో విడుదల చేసిన వెర్షన్‌లో ఆ సీన్లు అలాగే వుండడంతో మనోజ్‌కు మండింది. "నన్నూ, కోర్టును కూడా దగా చేశారు వీళ్లు. షారుఖ్‌ను వ్రాతపూర్వకంగా క్షమాపణ అడిగితే యివ్వలేదు. ఇప్పుడింక వదిలిపెట్టను. కేసు పడేస్తాను." అంటున్నాడు. పరువునష్టం కింద మనోజ్ రూ.100 కోట్లు అడిగాడన్న వార్త గురించి అడిగితే "ఈ పుకారు ఎక్కణ్నుంచి వచ్చిందో నాకు తెలియదు. నేను డబ్బు గురించి ఎప్పుడూ వెంపర్లాడలేదు. నేను యీ పరిశ్రమలో 56 ఏళ్లగా వున్నాను. నాతో పాటు చేరిన ధర్మేంద్ర, శశి పూర్ వంటి వాళ్లు వందలాది సినిమాలు చేస్తే నేను చేసినవి – కేవలం 56! నాకు డబ్బు కాదు, ప్రతిష్ట ముఖ్యం" అన్నాడు మనోజ్. వివాదాల మాట ఎలా వున్నా జపాన్‌లో ఆ సినిమా హిట్ అయింది.

**పాత వెర్సస్ కొత్త...**

"దేవదాసు" సినిమా రిలీజై 60 ఏళ్లయిన సందర్భంగా అక్కినేని ఒక కొత్త విషయం చెప్పారు. పాత సినిమాను మళ్లీ రీమేక్ చేసినపుడు పాత సినిమాను కొని మళ్లీ రిలీజ్ చేస్తూ వుంటారు. దానితో పోల్చి చూసిన ప్రేక్షకులు కొత్త సినిమాను నిరాకరిస్తారు. కృష్ణ "దేవదాసు" రిలీజైనపుడు అక్కినేని తను నటించిన "దేవదాసు"ను రిలీజు చేయించారు. పాతది వంద రోజులు ఆడి పండుగలు చేసుకోగా కొత్తది ఫ్లాపయింది. దేవదాసు పాత్రను వేసినందుకు కృష్ణపై నాగేశ్వరరావు భలేగా పగ తీర్చుకున్నాడని అందరూ అనుకున్నారు. దానిపై యిన్నాళ్లూ మౌనంగా వున్న అక్కినేని యిప్పుడు వివరణ యిచ్చారు – "పాత "దేవదాసు" నైజాం డిస్ట్రిబ్యూషన్ హక్కులు అమ్మకానికి వస్తే బోల్డంత డబ్బు పోసి కొనుక్కుని ఓ పక్కన పెట్టాను. కొత్త "దేవదాసు" విడుదల సమయంలో నేను ఆర్థికంగా చాలా బాధల్లో వున్నాను. కొత్త దాని రిలీజుకు ఓ వారం ముందు పాతది రిలీజు చేస్తే కొత్తదాని మోజులో పాతదీ చూస్తారు, నాలుగు డబ్బులు వస్తాయి, అప్పులు తగ్గుతాయి అనే వుద్దేశంలో రిలీజు చేయమన్నాను. ప్రజలు పాతదాన్నే ఆదరించారు. కొందరు దాన్ని అపార్థం చేసుకున్నారు." అని.

హిందీలో "చష్మే బద్దూర్" సినిమా అనే సినిమా 1981లో తయారైంది. సయీ పరాంజపే దర్శకత్వం వహించిన యీ సినిమాలో వాషింగ్ పౌడర్ సేల్స్ గరల్‌గా పనిచేసే ఒక మధ్యతరగతి యువతిగా దీప్తి నావల్, ఆమెను వరించిన ముగ్గురు యువకులుగా ఫరూఖ్ షైక్, రవి బస్వానీ, రాకేశ్ బేదీలు నటించారు. సున్నితమైన హాస్యంతో ఆ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. మోటు కామెడీ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకనిర్మాత డేవిడ్ ధావన్ కన్ను యీ సినిమాపై పడింది. దాన్ని సిద్ధార్థ్, ఆలీ జాఫ్రీ, దివ్యేందు శర్మలు హీరోలుగా, తాప్సీ హీరోయిన్‌గా మళ్లీ తీశాడు. కథ చాలా మార్చి, యీనాటి పరిస్థితులకు అనుగుణంగా పాత్రల స్వభావాలను కూడా మార్చాడు. షరా మామూలుగా పాత సినిమాను రిలీజుకి తయారై పోయింది. నిర్మాత గుల్ ఆనంద్ సోదరి జయశ్రీ మఖీజా వద్ద ఆ సినిమా హక్కులుంటే పివిఆర్ గ్రూపు వాళ్లు దాన్ని తీసుకుని డిజిటల్ వెర్షన్ తయారుచేసి మార్కెట్లోకి వదిలారు. దాని రీ-రిలీజ్‌కై ఫంక్షన్ కూడా చేశారు. ఏం చేసినా కొత్త సినిమా హిట్ అయింది.

ఆ తరం నటీనటులకు, యీ తరం వారికి వున్న తేడా గురించి చెప్పాలంటే – పాత "చష్మే బద్దూర్"లో 'ఆప్ జైసా కోయీ ఆయే' పాటను దీప్తి నావల్‌తో ప్యారడీ చేయించినపుడు ఆమె 'అలా ఒళ్లు కనబడే దుస్తులు వేసుకోను' అని అభ్యంతర పెడితే, కాస్ట్యూమ్‌లో మార్పులు చేశారు. కొత్త సినిమాలో హీరోయిన్‌గా వేసిన తాప్సీ దుస్తుల విషయంలో ఎలా వుంటుందో చెప్పనక్కరలేదు. అలాగే పాతదానిలో హీరోగా వేసిన ఫరూఖ్‌కి సిగరెట్టు తాగడం రాదు. ఓ సీనులో సిగరెట్టు వెలిగించడం రాక అవస్థ పడుతూంటే దర్శకురాలు సయీ పరాంజపే సిగరెట్టు వెలిగించి, తాగి చూపించింది. ఇప్పుడు హీరోలకు యివి నేర్పనక్కరలేదు.

**బెంగాల్‌లో దళిత కోణం**

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వాళ్లు 2012లో దేశంలో జరిగిన నేరాల గణాంకాలు విడుదల చేశారు. ఇతర వివరాల మాట ఎలా వున్నా బెంగాల్‌లో దళితుల పట్ల జరిగిన నేరాల విషయంలో గందరగోళం నెలకొంది. మన దేశంలో నేరాలను విశ్లేషించడంలో దళితకోణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. మన రాష్ట్రంలాటి వాటిల్లో అయితే మరీనూ. బస్సులతో పాటు ప్రయాణీకులను తగలబెట్టేసినా నేరస్తులు దళితులు కాబట్టి చూసీ చూడనట్టు పోవాలని వాదించే మేధావులు మనకు చాలామంది వున్నారు. అలాగే యిద్దరు కొట్టుకున్నపుడు వారిలో ఒకరు దళితులైతే, దళితుడు కాబట్టి అవతలివాడు కొట్టాడని, ఆ నేరాన్ని దళిత అత్యాచారం చట్టం కింద నమోదు చేయాలని వాదిస్తారు. ఈ బ్యూరో పశ్చిమ బెంగాల్‌లో 2012లో జరిగిన నేరాలను విశ్లేషించినపుడు దళితులకు వ్యతిరేకంగా జరిగిన కేసులు 85 మాత్రమే తేలాయి. నిజానికి దళిత జనాభాలో బెంగాల్ దేశంలో రెండవ స్థానంలో వుంది. అక్కడ 2.14 కోట్లమంది దళితులు వున్నారు. వారిపై యిన్ని తక్కువ అత్యాచారాలు జరగడమేమిటి? అని ప్రశ్నించసాగారు యీ మేధావులు. పైగా ఆ 85 కేసుల్లో హత్య, దోపిడీ, దొంగతనం, అల్లరి ఏమీ లేవు.

ఇదెలా అని అడిగితే పార్థా చటర్జీ అనే సోషల్ సైంటిస్టు "బెంగాల్ సమాజంలో కులానికి పెద్ద ప్రాధాన్యత లేదు. ఎవరూ కులం గురించి ప్రత్యేకంగా అడగరు. అంటరానితనం కూడా చాలా చాలా తక్కువ. ఏదైనా గొడవ జరిగినపుడు పోలీసులు దాన్ని యిద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణగానే చూస్తారు తప్ప వారివారి కులాలు నమోదు చేసి కులపరంగా రిజిస్టర్ చేయరు. అందువలననే యీ అంకె యింత తక్కువగా వచ్చింది." అన్నాడు. బెంగాల్‌లో దళితోద్యమం పెద్దగా లేదు. అది వున్న రాష్ట్రాలలో ప్రతీదానికీ దళిత ప్రస్తావన తేవడం జరుగుతుంది.

మన కంచె ఐలయ్యగారు యిలాటి విషయాల్లో వూరికే వుండలేరు కదా, ఏదైనా గొడవ జరగ్గానే పోలీసులు గొడవలో యిరుక్కున్న వారి కులాలు నమోదు చేసి తీరాలని షెడ్యూల్ కాస్ట్ కమిషన్ వారు ఉత్తర్వులు జారీ చేయాలని హుంకరించారు. బెంగాల్‌లో దళితోద్యమం బలహీనంగా వుండడానికి కారణం కమ్యూనిస్టులే అని వారిపై విరుచుకుపడ్డారు. వర్గపోరాటాలంటూ వారు దళితుల దృష్టి మరల్చేశారనీ, కులపోరాటాలు జరపనీయలేదనీ వాపోయారు. దానికి సమాధానం చెపుతూ సిపిఎం నాయకురాలు బృందా కారాట్ 'వామపక్షాల పోరాటం వలన దళితుల స్థితిగతులు మెరుగుపడి, దళితులపై అత్యాచారాలు చేయడానికి ఎవరూ సాహసించలేదని, అందుకే గణాంకాలు అలా వచ్చాయ'ని సమాధానమిచ్చారు. ఇది విని ఐలయ్యగారు పళ్లు పటపటలాడించి వుంటారు.

**జూన్ 27,28 వీక్షిత్రై ఎమ్బీయస్ : అదరగొట్టిన చంద్రబాబు**

ప్రతిపక్షనాయకుడి పాత్రలో చంద్రబాబు యిన్నాళ్లకు రాణించారు. తొమ్మిదేళ్లగా రాజకీయంగా ఆయనకు ఏదీ కలిసి రావటం లేదు. చార్‌ధామ్ వరదలు, కాంగ్రెసు ప్రభుత్వము కలిసి ఆయనకు సువర్ణావకాశాన్ని బంగరు పళ్లెరంలో అందించాయి. మీడియా దన్నుగా నిలిచింది. ఆయన బ్రహ్మాండంగా సద్వినియోగం చేసుకున్నారు. 'చంద్రబాబు లేకపోతే తిండీతిప్పలూ లేక చచ్చిపోయేం వాళ్లం, ఆయనే మా ప్రాణదాత' అని ఆర్తులు మెచ్చుకున్నారన్న విషయాన్ని పత్రికలు, టీవీ ఛానెల్సూ విపరీతంగా హైలైట్ చేశాయి. చంద్రబాబు కాస్త ముందే వచ్చివుంటే వరదలు రాకుండా కూడా ఏమైనా చేసేవారేమో అన్నంత ఫీలింగు కలిగింది. ఆ విధమైన ధైర్యాన్ని కలగజేసినందుకు బాబును ఎంతైనా మెచ్చుకోవాలి. దీనిలో వ్యంగ్యం ఏమీ లేదు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఒక్క కుదుపు కుదిపారాయన. ప్రభుత్వానికి వున్న అనేకానేక పనుల్లో యిది కూడా ఒకటి అన్నట్టు ప్రవర్తిస్తున్న కాంగ్రెసు నాయకులు ఒక్కసారి కకావికలై హిమాలయాలకు పరుగులు పెట్టారు. పబ్లిసిటీకోసం టిడిపితో పోటీ పడ్డారు. ఇద్దరూ కలిసి బజార్న పడ్డారు.

చంద్రబాబు వెళ్లేవరకూ కాంగ్రెసు ప్రభుత్వం ఏమీ చేయలేదా? చేయకుండా ఎందుకుంది? చేస్తూనే వుంది. ఆ చేసినది తగినంత అవునా కాదా అన్నదానిపై భిన్నాభిప్రాయాలు ఎప్పుడూ వుంటాయి. ప్రజలకు ఏ కష్టం వచ్చినా మొట్టమొదటగా అనే మాట – 'అధికారులు ఏమీ పట్టించుకోవటం లేదు' ! టీవీ కెమెరాలు వచ్చాక మరీ పట్టుకోలేకపోతున్నాం. ఏ అధికారిని ఉద్దేశించి అంటారో వారికీ తెలియదు. ఆ శాఖకు సంబంధించిన వారైతే జవాబు చెప్పుకోగలరు. వేరే శాఖల నుండి అప్పటికప్పుడు సహాయకార్యక్రమాలకు పంపితే వారి మీద కూడా విరుచుకుపడతారు. టీవీలు, పత్రికలు 'నిలదీశారు' అంటూ కవరేజి యిచ్చి, మరింత ఎగదోస్తారు.

ఉదాహరణకి చెప్తాను – ఒక నదీతీరంలో అనుమతి లేకుండా కొందరు యిళ్లు కట్టేసుకుంటారు. నది పొంగింది. ఇళ్లు కొట్టుకుపోయాయి. 'అనుమతి లేకుండా ఎవరు కట్టుకోమన్నారు? ఇలా అవుతుందనే వద్దన్నాం' అని ప్రభుత్వం లోపల అనుకున్నా పైకి అనదు. పునరావాస చర్యలంటూ 'స్థానికంగా వున్న ప్రభుత్వాఫీసుల్లో పనిచేసే క్లర్కులను, ఆఫీసర్లను అందర్నీ అక్కడికి తోలుతుంది. అలా వెళ్లగానే వాళ్లకు ఎదురయ్యేవి బాధితుల తిట్లు, చివాట్లు, కొట్టబోవడాలు. కలక్టరాఫీసులో టైపిస్టుగా పని చేసే వ్యక్తికి యీత రావాలని లేదు కదా! వరదలో కొట్టుకుపోతున్న పిల్లాణ్ని ఏం రక్షిస్తాడు? ఏ పనికైనా ట్రెయినింగ్ కావాలి. సహాయ కార్యక్రమాలకోసం అంటూ వీళ్లకు తర్ఫీదు యివ్వరు. వీళ్లుకూడా ఏదో కలక్టరుగారు ఆర్డరు వేశారు, వెళ్లకతప్పదు అన్నట్టు వస్తారు.

అయినా ఏదైనా ఉపద్రవం రాగానే, అసాధారణ పరిస్థితులు ఏర్పడగానే అప్పటికప్పుడు మనుషులు పుట్టుకుని రారు. మా బ్యాంకుల్లో చూస్తాను కదా, ఫలానా చలాను కట్టడానికి ఆఖరి రోజు అనగానే వందలాది మంది ఒక్కుమ్మడిగా వచ్చిపడతారు. ఉన్న సిబ్బంది సరిపోరు. కట్టడానికి వచ్చినవాళ్లు మేనేజరు వద్దకు వచ్చి 'చలాను కౌంటరు చాలా యింపార్టెంటండి, ఓ యిద్దరు క్లర్కులను అక్కడా, యింకో ముగ్గుర్ని క్యాష్‌లోనూ వేయండి' అంటూ గోల చేస్తారు. అప్పటికప్పుడు సిబ్బంది ఎక్కణ్నుంచి పుట్టుకుని వస్తారు? 'చలాను కట్టడానికి యివాళే ఆఖరి రోజు. కట్టకపోతే మా పిల్లాడు పరీక్ష రాయడానికి వుండదు. బాంకులన్నీ చెత్త. ఈ స్టాఫంతా కబుర్లు చెప్పుకోవడం తప్ప వేరే ఏ పనీ చేయరు. మేనేజరు చవట. ఎవరికీ పని చెప్పలేదు. అసలు దేశంలో మిలటరీ రూలు వచ్చి వీళ్లందర్నీ కాల్చేయాలి.' అని పెద్ద గొంతేసుకుని అరిచేస్తారు. వీళ్లు మాకు రెగ్యులర్ కస్టమర్లయినా కారు. మర్నాడు మా బాంక్ ముఖం చూడరు. అయినా యివన్నీ భరించాలి. బ్యాంకుకి ఎప్పుడూ వుండే కస్టమర్లు భరించరు. 'ఏమిటీ కేకలూ, న్యూసెన్సూ' అని విసుక్కుంటారు.

సహాయకార్యక్రమాలకు వెళ్లిన ప్రభుత్వోద్యోగులు ఎందరో చెప్పారు – వరదబాధితులకు, లేదా అగ్నిప్రమాదబాధితులకు ఏదైనా స్కూలులో ఆవాసం కల్పించి వీళ్లను అజమాయిషీకి పంపినపుడు వీళ్లు పొద్దున్న టిఫెను కూడా తినకుండా వెళ్లి కూర్చోవాలి. బాధితులకు లారీల్లో టిఫెన్లు వచ్చి పడిపోతూ వుంటే వీళ్లకు నోరూరుతుంది. కానీ తినలేరు. వాళ్లు టిఫెన్లు అవీ కానిచ్చాక ఏ సినిమాకో పోతారు. వాళ్ల చెంబూ, తప్పాలా కాపలా కాస్తూ వీళ్లు కూర్చోవాలి. అటువంటి ప్రదేశాల్లో అన్నేసి గంటలు పడిగాపులు పడుతూ కూర్చోవడం వీళ్లకు అలవాటు లేని పని కదా. ఇన్ని రోజుల పనీ ఆఫీసులో పెండింగు పడిపోతుంది కదాన్న బెంగ. ఇవి చాలనట్టు పై అధికారుల తిట్లు, బాధితుల తిట్లు, పరామర్శకు వచ్చిన రాజకీయనాయకుల తిట్లు. మీడియాకూడా వీళ్లు చేసిన సేవ గురించి రాయదు – అధికారుల నిర్లక్ష్యం అంటూనే రాస్తుంది తప్ప!

ఇటువంటి పరిస్థితుల్లో పనిచేసే ప్రభుత్వాధికారుల కష్టాల పట్ల మనకు కాస్త అవగాహన, జాలి వుండాలి. వాళ్ల యిబ్బందులేమిటో తెలుసుకుని యాంత్రాంగం డీమోరలైజ్ కాకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఎటుతిరిగి మనం ఆధారపడవలసినది వాళ్లపైనే. కానీ మన నాయకులకు కావలసినది – పబ్లిసిటీ. వెళ్లి ఉద్యోగులను తిట్టేసి వచ్చినట్టు వార్తలు రావాలి. ఎందుకు అజాగ్రత్తగా వున్నారు? వాతావరణ శాఖ హెచ్చరించగానే ఎందుకు తరలి పోలేదు? అని బాధితులను తిట్టే దమ్ము లేదు కదా. వాళ్లకు ఓట్లున్నాయి. తిట్టించుకుని తిట్టించుకుని ఉద్యోగులు యిమ్యూన్ అయిపోతారు. ఎంత చేసినా యీ చివాట్లు తప్పవు, ఒళ్లు విరుచుకుని చేయడం దేనికి అనుకుంటారు. చంద్రబాబు అధికారంలో వుండగా యిలా తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఎప్పుడు చూడు, తర్జని (చూపుడువేలు) ఊపుతూ బెదిరిస్తూనే కనబడ్డారు. మొన్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రికి కూడా తర్జని చూపుతూనే ఫోటో వచ్చింది. తన ఫోటోగ్రాఫర్‌ను వెంటపెట్టుకుని వెళ్లి ఆ పోజులో ఫోటో తీయించుకుని రిలీజ్ చేసి వుంటారు. బాబు అనగానే నాకు ఎప్పుడూ ఆ తర్జనే గుర్తుకు

వస్తుంది. అందువలనే బాబుకి అధికారగణం ఎదురు తిరిగింది. చేసేవాళ్లూ, చేయనివాళ్లూ అందరూ ఆయనకు సమానమే. పార్టీలో కానీ, ప్రభుత్వంలో కానీ తను తప్ప తక్కినవారందరూ పడి నిద్రపోతున్నారని ఆయనకు గట్టి నమ్మకం.

వేలాది యాత్రికుల ప్రాణాలు అధికారగణం కమిట్‌మెంట్‌పై పూర్తిగా ఆధారపడి వున్నాయి అని గ్రహించిన నేతలు వారితో జాగ్రత్తగా వ్యవహరిస్తారు. మరీ పుష్ చేస్తే మొదటికే మోసం అని వారి భయం. వారినీ గట్టిగా తిట్టకుండానే 'వి ఆర్ సీరియస్ ఎబౌట్ దిస్' అనే సంకేతాన్ని వారికి పంపాలి. దురదృష్టవశాత్తూ మన రాష్ట్రం విషయంలో యిది కొరవడింది. మన ప్రభుత్వం ఫోకస్ ఎంతసేపూ తెలంగాణకు ప్యాకేజీ, రాయల్ తెలంగాణా, పంచాయితీ ఎన్నికలలో బిసిల వాటా, బంగారుతల్లి చట్టబద్ధత, బొత్సకు జోడు పదవులు, డియస్‌కు పదవి యివ్వాలావద్దా, దిగ్విజయ్ మనసులో మాట, తెలంగాణలో కిరణ్ ఎన్ని సీట్లు తేగలడు – యిలాటి విషయాల చుట్టూనే పరిభ్రమించింది. ముఖ్యమంత్రిని అధిష్టానం యిదే సమయంలో ఢిల్లీ రమ్మంది. కిరణ్ దృష్టి అటే వుంది తప్ప, యీ బాధితులపై లేదు అనే అభిప్రాయం బాధితుల్లోనే కాక, ప్రజల్లో కూడా వ్యాపించింది.

ఇటువంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినపుడు ప్రజలు ఎలా రియాక్టవుతారన్న దానిపై ఒక ఉదంతం గుర్తుకు వస్తోంది. "ఎస్ మినిస్టర్" అనే వ్యంగ్య రచనలో బ్రిటన్ ప్రధానమంత్రి డైరీ రాస్తూంటాడు – 'నేను యింత ముఖ్యమైన ప్రకటన చేస్తే దాన్ని మీడియా సరిగ్గా ప్రొజెక్ట్ చేయలేదు. దానిపై స్పందనే లేదు. నా ఖర్మానికి సరిగ్గా అదే సమయానికి ఓ పల్లెటూళ్లో ఓ పిల్లాడు బావిలో పడిపోయాడు. వాణ్ని బయటకు తీయగలరా లేదా అన్నదానిపైనే ప్రజలు ఆసక్తిగా వున్నారు. టీవీలు గంటగంటకూ ఆ పిల్లాడి గురించే విజువల్స్ చూపిస్తున్నాయి. నా ప్రకటన గురించి పట్టించుకునే వాడే లేడు.." అని వాపోతాడు.

బ్రిటన్ అయినా, భారత్ అయినా ప్రజలందరూ ఓ మోస్తరు వాళ్లే. ఈ తెలంగాణ, ముఖ్యమంత్రి మార్పు.. ఎప్పుడూ వున్నవే అనుకుంటూ హిమాలయాల్లో చిక్కుకున్నవారి బాధల పట్లనే దృష్టి పెట్టారు. వాళ్ల ఆసక్తి గమనించిన మన తెలుగు టీవీ టీములు ప్రమాదాల నెదుర్కుంటూ కొండల్లోకి వెళ్లి కవరేజి యిచ్చి, బాధితుల దుస్థితిని కళ్లక్కట్టినట్టు చూపించారు. వారి ఆర్తనాదాలు వినిపించారు. 'ప్రభుత్వం ఏమీ చేయడం లేదు, తెలుగువాళ్లను నిర్లక్ష్యం చేస్తున్నారు, మన ప్రభుత్వం మాకోసం ఏమీ చేయటం లేదు' అనే ప్రజల ఘోషయే మనకు నాటుకుంది. అది విన్నాక మన రాష్ట్రప్రభుత్వం ఏమీ చేయటం లేదు అనే అభిప్రాయం  కలిగింది. వెంటనే కాంగ్రెసు నాయకులు పార్టీ తరఫునో, ప్రభుత్వం తరఫునో క్యాంపులు నిర్వహించి, వాటికి ప్రచారం కల్పించి 'యాత్రికుల జాడ తెలుసుకోవాలంటే స్థానిక కాంగ్రెసు కార్యాలయాన్ని సంప్రదించండి' వంట టీవీ స్క్రోలింగుల ద్వారా యిచ్చి వుండాల్సింది.

అవేమీ జరగకపోవడంతో వాక్యూమ్ ఏర్పడింది. ఆ వాక్యూమ్‌లో చంద్రబాబు అదను చూసుకుని చొరబడిపోయారు. లోపాలు ఎక్కడున్నాయో చూసుకుని అక్కడ వాలారు. ప్రభుత్వాన్ని ఏకి పారేశారు. దానికి మంచి పబ్లిసిటీ వచ్చేట్టు చేసుకున్నారు. సాధారణంగా యిలాటి విపత్తులు సంభవించినపుడు ఎన్నో ప్రభుత్వ, ప్రభుత్వేతర, రాజకీయసంస్థలు రిలీఫ్ క్యాంపులు నిర్వహిస్తాయి. రామకృష్ణ మిషన్, ఆరెస్సెస్, కొన్ని క్రైస్తవ సంస్థలు, కమ్యూనిస్టులు, రెడ్ క్రాస్... యిలా అనేకమంది క్యాంపులు నిర్వహిస్తారు. వీరందరినీ ప్రభుత్వం సమన్వయం చేస్తుంది. ఫలానావారు ఫలానా చోటకు వెళ్లాలని చెప్పి అందరూ ఒకే చోట పోగుపడకుండా చూస్తుంది. పని విభజించి అప్పగిస్తుంది. ఎవరికి వాళ్లు విడిగా క్యాంపులు పెట్టేయరు.

కానీ బాబు ఉద్దేశం, లక్ష్యం వేరు. 'ప్రస్తుతం వున్న ప్రభుత్వం చెత్త, బాబే అయితే యీ పరిస్థితి రానిచ్చేవారు కారు. అసలు ఎడ్మినిస్ట్రేటర్ అంటే బాబు తప్ప వేరెవ్వరూ కారు'  అనే సంకేతం ప్రజల(అనగా ఓటర్ల)లోకి చొచ్చుకుపోవాలి. అది జరగాలంటే ప్రభుత్వం ఏమీ చేయడం లేదు అన్న విషయం బాగా ఎస్టాబ్లిష్ అవాలి. మరెలా? అంటే 'ఇదిగో ఉన్నాడు ఆపద్బాంధవుడు' అన్నట్టు తను ప్రొజెక్టు కావాలి. ఇలా స్కెచ్ వేయడం అన్యాయం అని అనవద్దు. రేపు బాబు అధికారంలోకి వచ్చినా యిలాటి విపత్తులు వస్తాయి. అధికారులు రాత్రికి రాత్రి మారిపోరు. ప్రభుత్వాన్ని బట్టి వారి సామర్థ్యంలో ఓ 10% మార్పు వుండవచ్చు. అప్పుడూ లోపాలుంటాయి. ప్రతిపక్షంలో వున్న పార్టీ యిలాగే యాగీ చేస్తుంది. పాత పేపర్లు తిరగవేస్తే అవన్నీ కనబడతాయి. పోనుపోను రాజకీయాల్లో విలువలు మరీ తగ్గిపోతున్నాయి కాబట్టి అంతకుముందు జరగనివన్నీ యిప్పుడు జరుగుతున్నాయి.

ఇలాటి సందర్భాల్లో ప్రతిపక్షం వాళ్లు ముఖ్యమంత్రి వద్దకు డెలిగేషన్ తీసుకుని వెళతారు. పత్రికల వారి ముందు నిలదీస్తారు. బాబు అలాటిదేమీ చేయలేదు. అసలు ముఖ్యమంత్రికే ఫోను చేయలేదు. తనే డైరక్టుగా డైరక్టు యాక్షన్‌లోకి దిగిపోయారు. ఆంధ్రా భవన్‌లోని బాధితులను ఓదార్చారు, అధికారులను దండించారు, ధర్నాలు చేశారు. ఆయన అమెరికాలో వుండగానే పరిస్థితి గ్రహించి తన పార్టీ నాయకులను ఎవరినైనా పంపించి, యిదంతా చేయించవచ్చు. కానీ ఎవరు చేస్తే వాళ్లకే పబ్లిసిటీ వస్తుందని ఆయనకు తెలుసు. ఏ మోత్కుపల్లినో పంపితే యింకా రెచ్చిపోయి నాటకీయంగా రక్తి కట్టించేవారు. కానీ తనకేం లాభం? అందుకే ఎవర్నీ పంపలేదు. తనే స్వయంగా వచ్చి ఊగిపోయారు. జేజేలు పలికించుకున్నారు. మీరు వచ్చి వుండకపోతే మేం చచ్చిపోయి వుండేవారం అని బాధితులు వాపోయినట్టు మీడియా కవరేజి యిచ్చింది. హిమాలయాల నుండి ఢిల్లీ దాకా తీసుకుని వచ్చినదెవరు? వాళ్లను రైళ్లలో యిళ్లకు పంపుతూ వున్నదెవరు? అక్కడ వున్న మంత్రులు ఏదో ఒకటి చేస్తూనే వుంటారు కదా... యివన్నీ మనకెవరికీ తోచకుండా చేశారు. బాబు వచ్చి "ఏమిటీ మిమ్మల్ని రైల్లో పంపుతున్నారా? నేను విమానంలో పంపుతాను, ఏమిటీ మీకు 2 వేలిస్తున్నారా? పదివేలిస్తా.. ఏమిటీ మీకు యిడ్లీ మాత్రం పెడుతున్నారా? నేను పచ్చడి కూడా వేయిస్తా.." అనగానే 'జై బాబు' అనేశారు.

ఇక్కడ నాకు ఓ పోలిక గుర్తుకు వస్తోంది. ఓ జంట విడిపోయారు. పిల్లలు తల్లితో వుండాలని, తండ్రి వారానికి ఓ సారి వచ్చి చూడవచ్చనీ కోర్టు ఆదేశించింది. తనకు వచ్చే పరిమితాదాయంతో తల్లి పిల్లల్ని సాకేది. క్రమశిక్షణలో పెట్టి, వాళ్ల సరదాలకు పగ్గాలు వేస్తూ, సంసారం నడిపేది. వారానికి ఓ సారి వచ్చే తండ్రి మాత్రం పిల్లలు ఏమడిగినా కొని పెట్టేవాడు. సినిమాలకు, షికార్లకు తిప్పేవాడు. వాళ్లను పెంచే బాధ్యత లేదుగా! క్రమేపీ పిల్లలకు తల్లి చెడ్డదానిగా, తండ్రి మంచివాడిగా కనిపించసాగారు. ఇక్కడ ప్రభుత్వాన్ని తల్లిగా, ప్రతిపక్షాన్ని తండ్రిగా అనుకోవాలి. ప్రభుత్వానికి ప్రజల పట్ల ఎన్నో బాధ్యతలున్నాయి. ప్రతిపక్షానికి ఏముంది? బాధితుల వద్దకు వెళ్లి "ఏమిటీ నష్టపరిహారం లక్ష మాత్రమే యిచ్చారా? మీ తరపున 5 లక్షలు డిమాండ్ చేస్తున్నా" అంటే చాలు చప్పట్లు పడతాయి. ఇవాళ్టి అధికారపక్షం రేపు ప్రతిపక్షం అయినపుడు యిలాగే ప్రవర్తిస్తుంది. ఆనాటి అధికారపక్షమూ డిటోడిటో. చంద్రబాబు అధికారంలో వున్నపుడు అప్పోజిషన్‌ను నిందించేవారు – 'ప్రతీదీ రాజకీయం చేస్తున్నారు' అని. ఇవాళ వివిచ్ చంద్రబాబును అదే మాట అన్నారు.

మొత్తానికి చంద్రబాబు వలన మంచే జరిగింది. ఆంధ్రా భవన్ నిర్వాహకుల్లో కదలిక వచ్చింది. అక్కడున్న శశాంక్ గోయల్ ప్రవర్తన గురించి ముందే ఫిర్యాదులున్నాయి. అక్కడ టిడిపి మెడికల్ క్యాంప్ పెడితే తీయించేయడం ఘోరం. ఇవన్నీ హైలైట్ కావడంతో కాంగ్రెసు వాళ్లు మేలుకొన్నారు. పనుల్లో వేగం పెంచారు. తాము యిప్పటిదాకా ఏం చేశామో పబ్లిసిటీ యిచ్చుకోసాగారు. ఆ పబ్లిసిటీ వలన ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది, కష్టాల్లో వున్నవారికి ధైర్యం వస్తుంది. అయితే చూస్తూండగానే మంచి చెడుగా పరిణమించింది. కాంగ్రెసు, టిడిపి రోడ్డున పడి కొట్టేసుకున్నాయి. వీళ్లు చేస్తున్నదంతా పబ్లిసిటీ కోసమేరా అని అందరూ అనుకునేట్లా జరిగింది. విమానంలో ఎక్కడానికి సరిపడా జనమే లేరు. అయినా ఒకటికి రెండు తెచ్చి 'మా దాంట్లో ఎక్కు, మా దాంట్లో ఎక్కు' అని చంపుకుతిన్నారు. ఈ గొడవల్లో బాధితులకు అడంగు చేరడం ఆలస్యమైంది. 'ఈ బాధితులు టీడిపి బాధితులు, మీరెలా తీసుకెళ్తారు?' అని టిడిపి వాళ్లు, 'ఇది ప్రభుత్వం పని, మీరెందుకు వచ్చారు?' అని కాంగ్రెసు వాళ్లూ ఎయిర్‌పోర్టులో కొట్టుకుని అక్కడి ఉద్యోగులకు వినోదం కలిగించారు. వీళ్లంతా పార్టీల తరపున శిబిరాలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ సహాయకచర్యలు పర్యవేక్షించేవారికి సహకారం అందిస్తే సరిపోయేది. అది మానేసి, యిలా కొట్టుకోవడం వలన యిప్పటిదాకా వచ్చి చేరిన గుడ్‌విల్ హరించుకుపోతోంది.

అయినా వూరికే వీళ్ల ఆదుర్దా తప్ప విపత్తులు యింకా బోల్డు వస్తాయి. ప్రకృతితో మనం ఆడుకుంటున్నాం, అది మనతో ఆడుకుంటోంది. నాలుగు చుక్కలు వర్షాలు పడగానే వరదలు వచ్చిపడతాయి. అప్పుడు చూపించమనండి వీళ్ల ప్రతాపం. ఇప్పుడు బాధితులు వందల్లో వుంటే అప్పుడు లక్షల్లో వుంటారు. ఎంత సాయం చేస్తారో గమనిద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)**

**జూన్ 29 వీక్లీకి** **ఎమ్బీయస్ : ఇదీ మన పార్టీల చిత్తశుద్ధి...**

హిమాలయాల్లో వరదలు వచ్చాక ఇదంతా మానవచేష్టల వలన జరిగిన ప్రళయమని, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వలననే యింత అనర్థం జరిగిందని అందరూ వాపోతున్నారు. ప్రభుత్వంలో నిపుణులకు కొరత లేదు, ప్రణాళికలకు కొదవ లేదు. ఆచరణలో చిత్తశుద్ధి కరువవుతోందని, ప్రధాన రాజకీయపక్షాలు రెండూ దోషులేననీ చాటి చెప్పడానికి ఇఎస్‌జెడ్ గెజిట్ నోటిఫికేషనే సాక్ష్యం. ఉత్తరాఖండ్‌లో డ్యాములు విచ్చలవిడిగా కడుతున్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం సొరంగాలు యిష్టం వచ్చినట్టు తవ్వుతున్నారు. వాతావరణ విధ్వంసం జరుగుతోంది – అని పర్యావరణవేత్తలు ఎప్పటినుండో హెచ్చరిస్తున్నారు. వీటిపై జి.డి.అగర్వాల్ అనే ఆయన ఆమరణనిరాహార దీక్షకు కూర్చున్నపుడు కేంద్రం కదలివచ్చి 'నేషనల్ గంగా రివర్ బేసిన్ అథారిటీ'ని ఏర్పరచింది. దానితో బాటు గోముఖ్ నుండి ఉత్తరకాశి వరకు 100 కి.మీ.ల పొడవునా 'ఇకో సెన్సిటివ్ జోన్' (ఇఎస్‌జెడ్)గా ప్రకటించింది.

దీని ప్రకారం 2 మెగావాట్ల కంటె ఎక్కువ వున్న హైడ్రో ఎలక్ట్రిసిటీ ప్రాజెక్టులు కట్టకూడదు. పారిశ్రామిక అవసరాల కోసం నదీజలాలను ఉపయోగించకూడదు. వాణిజ్య అవసరాల కోసం క్వారీయింగ్ చేయకూడదు, చెట్లు నరికివేయకూడదు. కాలుష్యాన్ని కలగజేసే పరిశ్రమలు పెట్టి వ్యర్థజలాలను నదిలో వదిలిపెట్టకూడదు. ఈ ప్రాంతం మొత్తంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడడానికి వీలులేదు. ఈ నిషేధాలకు తోడుగా, దేశరక్షణకు సంబంధించిన కట్టడాల నిర్మాణం, దేవదారు చెట్లు, జంతురక్షణ, హోటళ్లు, రిసార్టులు, ఎలక్ట్రిక్ కేబుళ్లు, సైను బోర్డులు, నదీజలాలను వెలికిదీసి బాటిళ్లలో అమ్ముకోవడం వంటి కొన్ని కార్యకలాపాలను నియమనిబంధనలకు లోబడి అనుమతించవచ్చు అన్నారు. వీటిపై నియంత్రణ వుంటుంది అన్నారు. ఈ జోన్ విస్తీర్ణం 4179 చ.కి.మీ.లు కాగా దీనిలో 88 గ్రామాలు వున్నాయి. రాష్ట్రప్రభుత్వం రెండేళ్ల లోగా యీ ప్రాంతపు అభివృద్ధికై మాస్టర్ ప్లాను తయారు చేయాలి. దాని ప్రకారమే కట్టడాలను అనుమతించాలి. దానిని 10 సభ్యుల కమిటీ పర్యవేక్షిస్తుంది. ఒక నిజాయితీ పరుడైన, సమర్థుడైన అధికారి దానికి చైర్మన్‌గా వుంటాడు. ఆ కమిటీలో పర్యావరణ, అరణ్యాల శాఖ నుండి ఒక ప్రతినిధి వుంటాడు.

ఈ నోటిఫికేషన్ యొక్క చిత్తుప్రతి (డ్రాఫ్ట్)ని 2011 జులైలో ప్రజలముందు పెట్టారు. సలహాలు, ఫిర్యాదులు చేయవచ్చన్నారు. స్థానికులు దీనికి వ్యతిరేకం. తమ చిత్తం వచ్చినట్లు దుకాణాలు పెట్టుకోవడానికి, ప్రకృతిని నాశనం చేయడానికి వీలులేకుండా పోతుందని వారి భయం. దీన్ని గెజిట్ చేయకూడదంటూ లాబీయింగ్ మొదలుపెట్టారు. దీని అవసరాన్ని అక్కడి ప్రజలకు వివరించి నచ్చచెప్పవలసిన రాజకీయపక్షాలు, వాళ్లకు ఎక్కడ ఆగ్రహం వస్తుందోనన్న భయంతో ఆ నోటిఫికేషన్‌ను గెజిట్ చేయకుండా వాయిదా

వేయిస్తూ వచ్చారు. ఎట్టకేలకు దాదాపు రెండేళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం 2013 ఏప్రిల్‌లో నోటిఫికేషన్‌ను గెజిట్‌లో ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని అమలు చేస్తుందేమోనన్న భయంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందారు. దాన్ని రాజకీయప్రయోజనాలకు వాడుకోవడానికి ప్రతిపక్షంలో వున్న బిజెపి వెంటనే ఉత్తర కాశిలో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించసాగింది. ప్రజలు దానికి మద్దతుగా నిలిచారు. దానితో నోటిఫికేషన్‌ను సమర్థిస్తే స్థానికులు తమకు వ్యతిరేకం అవుతారని రాష్ట్ర కాంగ్రెసు నాయకులకు భయం పట్టుకుంది. నోటిఫికేషన్ విరమించుకోవాలని వారు కూడా డిమాండ్ చేయసాగారు.

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి విజయ్ బహుగుణ మే 6 న ప్రధానిని ఆ ప్రాంతపు ఎమ్మెల్యేలతో, ఎంపీలతో సహా కలిసి ''డ్రాఫ్టుకి మేం సూచించిన సవరణలు చేయకుండా నోటిఫై చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం'' అంటూ మూడు పేజీల ఉత్తరం అందించారు. ''డ్రాఫ్ట్ ప్రకారం 40 చ.కి.మీ.లు మాత్రమే ప్రభావితం కావాలి. కానీ ఫైనల్ నోటిఫికేషన్‌లో 4179 చ.కి.మీ.లకు దీన్ని వర్తింపచేశారు. డ్రాఫ్టులో 25 మెగావాట్ల హైడల్ ప్రాజెక్టు వరకు ఫరవాలేదన్నారు. నోటిఫికేషన్ వచ్చేసరికి దాన్ని 2 మెగావాట్లకు తగ్గించేశారు. ఇలా అయితే రాష్ట్రానికి ఆదాయం ఎలా? 1743 మెగావాట్ల సామర్థ్యం కల వివిధ హైడల్ ప్రాజెక్టులు వివిధ దశల్లో వున్నాయి. వాటిపై రూ. 1061 కోట్లు ఖర్చు పెట్టారు. వాటిని పూర్తి చేయకూడదంటే అదంతా వృథాగా పోతుంది.'' అని వాదించారు.

ఇప్పుడు చార్‌ధామ్ యాత్రలో వేలాది మంది చనిపోయిన తర్వాత 'అసలు యింతమందిని రానీయకుండా వుండాల్సింది' అంటున్నారు. ఆ సమస్యను కేంద్రం ఎప్పుడో గుర్తించి యీ నోటిఫికేషన్‌లో యాత్రికుల సంఖ్యను పరిమితం చేశారు, కొత్తగా రోడ్లు వేయకూడదన్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి వీటిని ఆ లేఖలో విమర్శించారు ''ఇలా యాత్రికుల సంఖ్యపై పరిమితులు విధించడం, కొత్త రోడ్లు వేయకూడదనడం యాత్రికులకు, స్థానికులకు కోపం తెప్పిస్తుంది. మాది దేశసరిహద్దుల్లో వున్న రాష్ట్రం. స్థానికులకు కోపం తెప్పిస్తే దేశరక్షణకే ప్రమాదం'' అని వాదించాడు.

''రాజకీయావసరాలతో ఇదంతా జరుగుతోంది. ఇలా లేఖ రాయకపోతే ఓటర్లకు కోపం వస్తుందేమో, బిజెపితో పోటీ పడలేమోనన్న భయం కాంగ్రెసు వారికి. ఈ 41 పేజీల నోటిఫికేషన్‌లో అన్యాయంగా వున్నది ఏమీ లేదు.'' అంటారు గంగా ఆహ్వాన్ అనే సామాజిక సంస్థ. వాళ్లు యీ ప్రాంతాన్ని దోచుకుంటున్న ఇసుక మాఫియాకు, మైనింగ్ మాఫియాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ సంస్థ సభ్యులపై జరిగిన అనేక దాడుల వెనుక కాంట్రాక్టర్లు, బిల్డర్లు వున్నారని వినికిడి. నోటిఫికేషన్ ఆపించడానికి ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలపై తమకు నమ్మకం లేదని, తాము ఆందోళన కొనసాగించి తీరతామని రాష్ట్ర బిజెపి నాయకత్వం స్పష్టంగా చెప్పింది. మాజీ బిజెపి ముఖ్యమంత్రి రమేష్ పొఖ్రియాల్ నిశాంక్ నోటిఫికేషన్ వెలువడగానే అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ప్రధానికి ఉత్తరం రాశారు. ''ఇక్కడ 60% అరణ్యప్రాంతమే. ప్రజలు బతకాలంటే ఉద్యోగవకాశాలుండాలి, వ్యాపారం చేసుకునేందుకు వెసులుబాటు వుండాలి. ఏవేవో రూల్సు పెట్టి జీవనాధారాన్ని దెబ్బ తీస్తే ప్రజలు వూరుకోరు. మాకై వేరే రకమైన నియమాలుండాలి.'' అని వాదించాడాయన.

వీళ్ల వాదనలు యిలా నడుస్తూండగానే ప్రకృతి ఒక్క చెంపదెబ్బతో వీళ్ల నోళ్లు మూయించింది. ఉత్తరాఖండ్ ఎప్పటికి కోలుకుంటుందో తెలియదు. దీన్నే కాబోలు పొయెటిక్ జస్టిస్ అంటారు. – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2013)

• • •